


# ఈనాడు




కరీంనగర్ 22-6-2019 శనివారం సిటీ సంపుటి 45 సంచిక 313

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50. పేజీలు 16+16 www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

# తెలంగాణ జలకేతనం



మేడిగడ్డ బ్యారేజీ నుంచి కన్నెపల్లి పంప్‌హౌస్‌కు వచ్చిన గోదావరి జలాలకు ముఖ్యమంత్రి కేసీఆర్ పుష్పాంజలి

## కాళేశ్వరం మహోజ్వల ఘట్టం ఆవిష్కృతం

### మహా ప్రాజెక్టుకు ఘనంగా ప్రారంభోత్సవం

**11.23 గం.** జాతికి అంకితం చేసిన సీఎం కేసీఆర్

**1.07 గం.** కన్నెపల్లి పంపుహౌస్ ప్రారంభం

- విశిష్ట అతిథిగా గవర్నర్ నరసింహన్
- ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర సీఎంలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, దేవేంద్ర ఫడణవీస్
- రాష్ట్రవ్యాప్తంగా మిన్నంటిన సంబురాలు

తెలంగాణ దుస్థితిని దూరం చేస్తూ..
బీడువారిన పొలాలకు ప్రాణం పోస్తూ..
మోడువారిన బతుకుల్లో జీవం నింపుతూ..
గోదారమ్మ వెనుదిరిగి వచ్చింది..

బీడు భూములను తడిపి కర్షకుల కష్టాలు తీర్చడానికి కరవు నేల వైపు తొంగిచూడడానికి కదిలింది. యావత్తు తెలంగాణ ప్రజానీకం కోటి కళ్లతో ఎదురుచూస్తున్న స్వప్నం సాకారమైంది. ముఖ్యమంత్రి కేసీఆర్ మానస పుత్రిక కాళేశ్వరం ప్రాజెక్టు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమైంది. వేద మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా హోమం, పూజలు నిర్వహించిన అనంతరం మేడిగడ్డ బ్యారేజీకి ప్రారంభోత్సవం చేసి.. కన్నెపల్లి పంపుహౌస్ వద్ద మోటారు స్విచాన్ చేయగానే గోదావరి జలాలు ఉరకలెత్తుతూ కాలువలోకి ప్రవహించాయి. గవర్నర్ నరసింహన్, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రల ముఖ్యమంత్రులు జగన్‌మోహన్‌రెడ్డి, దేవేంద్ర ఫడణవీస్‌ల సమక్షంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ భారీ పథకాన్ని జాతికి అంకితం చేశారు. అటు బ్యారేజీ వద్ద, ఇటు పంపుహౌస్ వద్ద ప్రారంభోత్సవ కార్యక్రమం పండుగ వాతావరణాన్ని తలపించింది. గోదావరి పరీవాహకం లోని మూడు రాష్ట్రాలకు చెందిన ముఖ్యమంత్రులు.. తెలుగు రాష్ట్రాల గవర్నర్ ఒకే వేదికను పంచుకుని.. ఒకే వాహనంలో ప్రయాణించడం ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలోని మరో ఆకర్షణీయ సన్నివేశం.

...పూర్తి వివరాలు 2, 5, 6 పేజీల్లో

**తెలంగాణ ముఖచిత్రం మారుతుంది**

కాళేశ్వరం ప్రాజెక్టుతో తెలంగాణ ముఖచిత్రమే మారిపోతుంది. మహారాష్ట్ర ప్రజలు తెలంగాణ ప్రజలకు అందించిన కానుక ఇది. రికార్డు వేగంతో ప్రభుత్వం ఈ ప్రాజెక్ట్‌ను పూర్తి చేసింది. కాళేశ్వరం వల్ల మేం నష్టపోయేదేం లేదు. మాకూ నీళ్లు వస్తాయి.

–మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్



మేడిగడ్డ బ్యారేజీని ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు. చిత్రంలో మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులు దేవేంద్ర ఫడణవీస్, జగన్‌మోహన్‌రెడ్డి, గవర్నర్ నరసింహన్




## విలీనానికి ఆమోదం

రాజ్యసభ వెబ్‌సైట్‌లో.. భాజపా జాబితా కింద సుజనా, టీజీ, రమేష్, గరికపాటిల పేర్లు

రెండుకు తగ్గిన తెదేపా సభ్యుల సంఖ్య 11లో

## జల వివాదాలపై 27న కేసీఆర్, జగన్‌ల భేటీ! 3లో

కాళేశ్వరం ప్రాజెక్టుకు

## జాతీయ హోదా ఇవ్వాలి

- 32 జిల్లాలను వెనకబడిన ప్రాంతాల జాబితాలో చేర్చండి 11లో
- కేంద్ర బడ్జెట్ సన్నాహక సమావేశంలో సీఎం కేసీఆర్ ప్రసంగ పాఠం

## పెళ్లింట పెనువిషాదం

- వివాహమైన రెండో రోజే విద్యుదాఘాతం
- పెళ్లి కుమారుడు సహా తల్లిదండ్రులు, మేనత్త మృతి 3లో




మేడిగడ్డ ప్రాజెక్టు వద్ద తెలుగు రాష్ట్రాల గవర్నర్ నరసింహన్, తెలంగాణ, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులు కేసీఆర్, ఫడణవీస్, జగన్

# తెలంగాణ జలకేతనం

ఈనాడు యంత్రాంగం

ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసిన కాళేశ్వర ప్రారంభ మహోజ్వల ఘట్టం ఆవిష్కృతమైంది. కాళేశ్వరం ప్రాజెక్టును ప్రారంభించి రైతుల మోము మెరిసేలా.. సాగు, తాగు నీటితో తెలంగాణ సస్యశ్యామలం అయ్యేలా సంకల్పిస్తూ జాతికి అంకితం చేశారు. శుక్రవారం గవర్నర్ నరసింహన్, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర ముఖ్యమంత్రులు వైఎస్ జగన్, దేవేంద్ర ఫడణవీస్‌ల సమక్షంలో మేడిగడ్డ ఆనకట్ట (బ్యారేజీ)ని ప్రారంభించారు. వేదిక ప్రాంగణం వద్ద గోదావరి మాత విగ్రహాన్ని ప్రతిష్ఠించిన అనంతరం వేదపండితులు పూజలు ప్రారంభించారు. శృంగేరి పీఠం అర్చకుల ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చారణల మధ్య ముఖ్యమంత్రి కేసీఆర్, ఆయన సతీమణి శోభ జలాశయ ప్రతిష్ఠాంగ యాగం, జల సంకల్ప మహోత్సవ యాగం నిర్వహించారు. నరసింహన్, జగన్‌మోహన్‌రెడ్డి, ఫడణవీస్‌లు పూర్ణాహుతిలో పాల్గొన్నారు. యాగకర్తలైన సీఎం దంపతులు, అతిథులకు పండితులు ఆశీర్వాదాలు అందజేశారు. యాగం ముగిసిన వెంటనే సీఎం కేసీఆర్ అతిథులకు కాళేశ్వరం ప్రాజెక్టు ఛాయాచిత్ర ప్రదర్శనను చూపించారు. నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ ప్రతినిధులు, ప్రాజెక్టు ఇంజినీర్లు బ్యారేజీ నిర్మాణ ప్రాధాన్యతను వివరించారు. ఆ తర్వాత కాళేశ్వరం ప్రాజెక్టు సమగ్ర స్వరూపాన్ని ప్రదర్శించిన డాక్యుమెంటరీని అతిథులు తిలకించారు. ఈ కార్యక్రమం ముగిసిన తర్వాత బ్యారేజీ శిలాఫలకం వద్దకు చేరుకున్నారు. నరసింహన్, సీఎంలు జగన్, ఫడణవీస్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు చెందిన మంత్రులు కొబ్బరికాయలు కొట్టారు. కేసీఆర్ గుమ్మడికాయను పగులగొట్టారు. ముందుగా శిలాఫలకాన్ని ఏపీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించారు. తదనంతరం సీఎం కేసీఆర్ రిబ్బన్ కత్తిరించి మేడిగడ్డ ఆనకట్టను ప్రారంభించారు. 85 గేట్లు గల ఈ బ్యారేజీలో ఆరో గేటు ఎత్తడం ద్వారా ప్రారంభం జరిగింది. ఆనకట్టకు అనుబంధంగా గోదావరి నదిపై తెలంగాణ-మహారాష్ట్రల మధ్య నిర్మించిన వంతెనను కూడా ప్రారంభించారు.


మేడిగడ్డ వద్ద పూజల్లో పాల్గొన్న ముఖ్యమంత్రి కేసీఆర్ దంపతులు. చిత్రంలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడణవీస్, గవర్నర్ నరసింహన్, ఏపీ సీఎం జగన్‌తో పాటు తెలంగాణ మంత్రులు ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఇంద్రకరణ్‌రెడ్డి, ఈటల రాజేందర్

తర్వాత మేడిగడ్డ ఆనకట్ట వద్ద అతిథులంతా పసుపు, కుంకుమ చల్లి, గోదావరి మాతకు పూజలు చేశారు. నాణేలను, పట్టువస్త్రాలను నదీమతల్లికి సమర్పించారు.

### ఆసక్తిగా వివరాలు తెలుసుకున్న జగన్

అక్కడి నుంచి కన్నెపల్లి పంపుహౌస్ వద్దకు చేరిన తర్వాత కేసీఆర్, నరసింహన్, జగన్ ప్రత్యేక పూజలు చేశారు. పంపుహౌస్‌ను నరసింహన్ ప్రారంభించగా, శిలాఫలకాన్ని కేసీఆర్ ఆవిష్కరించారు. మధ్యాహ్నం 1.07 గంటలకు కేసీఆర్ పంపుహౌస్‌ను ప్రారంభించారు. 1.25 నుంచి అక్కడ నీటి పంపింగు మొదలైంది. ఈ పంపుహౌస్ ప్రత్యేకతలు, నిర్మాణం గురించి నిర్మాణ సంస్థ మేఘా ఇంజినీరింగ్ మేనేజింగ్ డైరెక్టర్ కృష్ణారెడ్డి వివరించారు. నీటిని మళ్లించే విధానం, పంపుహౌస్ ఎలా పని చేస్తుందో తెలిపారు. తక్కువ సమయంలో చాలా బాగా చేశారంటూ.. నిర్మాణానికి ఎంత సమయం పట్టింది వంటి వివరాలను జగన్ అడిగి తెలుసుకున్నారు. తక్కువ సమయంలో జరిగిన నిర్మాణం, భారీ పంపులు, మోటార్లు విదేశాల నుంచి దిగుమతి చేసుకోవడం, ఇతర ప్రత్యేకతల గురించి కేసీఆర్.. నరసింహన్, జగన్‌లకు సమగ్రంగా వివరించారు. నీటిని గరిష్ఠంగా ఎలా వినియోగించుకోవాలో చెప్పడంతోపాటు ప్రజలు తమకు నీళ్లందాయా లేదా అన్నదే చూస్తారని, నీటిని అందించేలా పనులు పూర్తి చేయగలిగితేనే ఫలితం ఉంటుందన్నారు. తర్వాత లిఫ్టు ద్వారా పంపుహౌస్ లోపలకు వెళ్లి పరిశీలించారు. లిఫ్టులో నలుగురు మాత్రమే పట్టే సామర్థ్యం ఉండటంతో నరసింహన్, కేసీఆర్, జగన్, మేఘా కృష్ణారెడ్డి వెళ్లి పంపులు, మోటార్లు, కాడా వ్యవస్థలను పరిశీలించారు. తర్వాత ఒక్కొక్కటి 40 మెగావాట్ల సామర్థ్యంతో 11 మోటార్లు, పంపులు గల పంపుహౌస్‌లోని ఆరో మోటారును ముఖ్యమంత్రి కేసీఆర్ స్విచాన్ చేసి నీటిని బయటకు వదిలారు. ఒక పంపు ద్వారా వదిలిన నీటిని కాలువలోకి రెండు పైపుల ద్వారా వచ్చేలా నిర్మాణం చేపట్టారు. ఈ పైపుల ద్వారా గోదావరి నీరు ఉరకలెత్తుతూ కాలువలోకి దూకగానే అక్కడికి చేరుకున్న ముఖ్యమంత్రి, ఇతర అతిథులు కాలువలో పూలు చల్లి పూజలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని వివిధ బ్యారేజీలు, పంప్‌హౌస్‌లను తెలంగాణ మంత్రులు ప్రారంభించారు.

### ఒకే వాహనంలో నలుగురు ప్రముఖులు

గవర్నర్, ముగ్గురు ముఖ్యమంత్రులు ఒకే కారులో తెలంగాణ సరిహద్దు నుంచి ఆనకట్ట మీదుగా మహారాష్ట్ర సరిహద్దు వరకు ప్రయాణించారు. ఆనకట్ట వద్ద లోపలికి నీరు నిలువ ఉంచే చోటుకు వెళ్లి పరిశీలించారు. కేసీఆర్ అతిథులకు ప్రాజెక్టు పూర్వాపరాలను వివరించారు. గోదావరి నీటి వినియోగానికి ప్రాజెక్టుల అవసరాన్ని ఎలా గుర్తించింది, ప్రాజెక్టును ఎలా పునరాకృతి చేసింది. మేడిగడ్డ ఆనకట్ట ద్వారా తెలంగాణ ప్రాంతానికి ఏ విధంగా నీరు అందిస్తున్నది విడమరిచి చెప్పారు. కాళేశ్వరం నిర్మాణానికి మహారాష్ట్రతో చేసుకున్న ఒప్పందమే కీలకమని, ఆ రాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్ అన్నివిధాలుగా సహకరించారని ఈ సందర్భంగా కేసీఆర్ కృతజ్ఞతలు తెలిపారు. ఫడణవీస్ మాట్లాడుతూ, మీ సంకల్పం గొప్పదని, ఒక గొప్ప లక్ష్యాన్ని విజయవంతం చేశారని, అభినందనీయమని అన్నారు.


నిజామాబాద్ జిల్లా కేంద్రంలో తెరాస కార్యకర్తల సంబురాలు

### ఆత్మశక్తితో సాధ్యమే!

ఆత్మశక్తి ఉంటే కొండరాళ్లను పిండి చేసి, తిండి గింజలు పుట్టించటం సాధ్యమేగానీ ఇప్పటికీ మన సమాజం ఈ వాస్తవాన్ని గుర్తించకుండా దాన్నో అద్భుతంగానో, మాంత్రికశక్తిగానో భావిస్తుండటమే చిత్రం! ఆత్మశక్తి ముందు కండ బలం ఎందుకూ కొరగాదు.

– మహాత్మా గాంధీ

# నిర్వాసితుల కష్టాలు కేసీఆర్‌కే తెలుసు

- ఆయన సొంత గ్రామం, అత్తగారి ఊరూ గతంలో ముంపునకు గురయ్యాయి
- కాళేశ్వరం ప్రారంభంతో పల్లెల్లో పండుగ వాతావరణం
- తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్

ఈనాడు డిజిటల్, సిరిసిల్ల: భూ నిర్వాసితుల కష్టాలు సీఎం కేసీఆర్‌కు తెలిసినంతగా మరెవరికీ తెలియదని తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ చెప్పారు. కాళేశ్వరం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలోని ఎగువ మానేరు జలాశయంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు.

"ఎగువ మానేరు నిర్మాణంలో ముఖ్యమంత్రి కేసీఆర్ సొంత గ్రామం దోమకొండ మండలం పోసాన్‌పల్లి ముంపునకు గురైంది. అనంతరం అప్పటి ప్రభుత్వం ఇచ్చిన పరిహారంతో సిద్దిపేట మండలం చింతమడకలో స్థిరపడ్డారు. ఇక మధ్యమానేరు జలాశయం ముంపు ప్రాంతాల్లో కేసీఆర్ అత్తగారి గ్రామం కొదురుపాక కూడా ఉంది. నిర్వాసితుల పరిస్థితిని ఆయన స్వయంగా అనుభవించారు. నీటి విలువ, రైతులు సాగునీటి కోసం పడే తపన కేసీఆర్‌కు తెలిసినంతగా దేశంలో మరే ముఖ్యమంత్రికి తెలియదు. కాళేశ్వరం ప్రారంభోత్సవం సందర్భంగా పల్లెల్లో పండుగ వాతావరణం నెలకొంది.

### ఒక్కో అడుగు ముందుకు వేస్తూ..

నీళ్లు.. నిధులు.. నియామకాలు అనే నినాదంతో తెలంగాణను సాధించుకున్నాం.. అందులో భాగంగా ఒక్కో అడుగు ముందుకు వేసుకుంటూ వెళ్తున్నాం. సమైక్య రాష్ట్రంలో ఒక్కో ప్రాజెక్టు నిర్మాణానికి ఏళ్లు పట్టేది. 60 ఏళ్ల కిందట శ్రీరాంసాగర్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తే.. నేటికీ ఎస్సారెస్పీ స్టేజ్-2 పనులు, నల్గొండ, వరంగల్ జిల్లాల్లో కాల్వలు తవ్వకాల్లోనే ఉన్నాయి. 500-600 ఫీట్ల లోతు వరకు బోర్లు వేసి, ఆర్థికంగా నష్టపోయిన రైతుల కష్టాలు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు తెలుసు. సాగు, తాగునీటి కష్టాల నుంచి వారిని గట్టెక్కించేందుకు కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారు. మహాకవి దాశరథి 'నా తెలంగాణ - కోటి రతనాల వీణ' అని చెప్పారు.. నా తెలంగాణ కోటి రతనాల వీణ మాత్రమే కాదు.. కోటి ఎకరాల మాగాణం కావాలని పట్టుదలతో ముఖ్యమంత్రి గోదావరి, కృష్ణా నదులపై ప్రాజెక్టులకు రూపకల్పన చేశారు.

'నిజం దేవుడెరుగు.. నీరు పల్లమెరుగు' అంటారు పెద్దలు. . కానీ పల్లానికి వెళ్లే నీటిని గురుత్వాకర్షణ శక్తికి విరుద్ధంగా అర కిలోమీటరుపైకి తీసుకొని రావడమంటే ఎంత కష్టతరమైన పనో ప్రజలు అర్థం చేసుకోవాలి. మొదటి దశలో 13 జిల్లాల పరిధిలోని 40 లక్షల ఎకరాల్లో ఏడాదికి రెండు పంటలకు సాగు నీరందించి, తెలంగాణ రైతుల పాదాలు కడిగే పథకం కాళేశ్వరం. ప్రాజెక్టు ప్రారంభోత్సవాన్ని ఆచార్య జయశంకర్ వర్ధంతి రోజు జరుపుకోవడం ఆయనకిచ్చే నిజమైన నివాళి. కాళేశ్వరం నిర్మాణంలో ఆర్.విద్యాసాగర్‌రావు కృషి కూడా గొప్పది" అని కేటీఆర్ పేర్కొన్నారు.


ఎగువ మానేరు జలాశయంలో పూజలు చేస్తున్న కేటీఆర్

### గ్రహం అనుగ్రహం

22–6–2019 శనివారం

శ్రీ వికారి నామ సం॥రం॥ ఉత్తరాయణం
గ్రీష్మ రుతువు; జ్యేష్ఠ మాసం; బహుళ పక్షం
పంచమి: రా. 7.00 తదుపరి షష్ఠి
ధనిష్ఠ నక్షత్రం: రా. 7.29 తదుపరి శతభిషం
అమృత ఘడియలు: ఉ. 8.30 నుంచి 9.49 వరకు
వర్జ్యం: తె. 3.30 నుంచి 5.16 వరకు
దుర్ముహూర్తం: ఉ. 5.30 నుంచి 7.14 వరకు
రాహుకాలం: ఉ. 9.00 నుంచి 10.30 వరకు
సూర్యోదయం: ఉ.5-30; సూర్యాస్తమయం: సా.6.32
ఆరుద్ర కార్తె ప్రారంభం

### కాళేశ్వరం భూసేకరణలో రెవెన్యూదే కీలక పాత్ర: ట్రెసా

ఈనాడు, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణపనులకు తమ శాఖ సిబ్బంది అహర్నిశలూ కృషిచేశారని రెవెన్యూ ఉద్యోగుల సంక్షేమ సంఘం (ట్రెసా) రాష్ట్ర అధ్యక్షుడు వంగ రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. మొక్కవోని దీక్షతో లక్ష్యం సాధించిన సీఎం కేసీఆర్ స్ఫూర్తిగా.. అందరూ రాత్రింబవళ్లూ శ్రమించి అనతి కాలంలోనే వేలాది ఎకరాల భూసేకరణ ప్రక్రియను పూర్తిచేశారన్నారు. ముఖ్యమంత్రి ముందుచూపు కారణంగానే అంతటా సాగునీటి కష్టాలు తొలుగుతున్నాయని శుక్రవారం ఆయన ఓ ప్రకటనలో తెలిపారు.

# పుడమి పులకింత

- రాష్ట్రంలో ప్రవేశించిన రుతుపవనాలు
- ఖరీఫ్ పంటల సాగు పనులిక ముమ్మరం
- 1.12 కోట్ల ఎకరాల సాగు లక్ష్యం
- వ్యవసాయశాఖ కార్యాచరణ ప్రణాళిక

ఈనాడు, హైదరాబాద్: మండుటెండల సెగలతో అల్లాడిన పుడమి శుక్రవారం నాటి వర్షంతో పులకించింది. నైరుతి రుతుపవనాలు ఎట్టకేలకు రాష్ట్రంలో ప్రవేశించాయి. దక్షిణ తెలంగాణతో పాటు తూర్పు ప్రాంతంలో ఎల్లారెడ్డి, రామగుండం వరకూ విస్తరించినట్లు వాతావరణశాఖ సంచాలకుడు వై.కె.రెడ్డి మీడియాకు తెలిపారు. మిగిలిన ప్రాంతాలకు శని, ఆదివారాల్లో విస్తరిస్తాయన్నారు. గతేడాదికన్నా 11 రోజులు ఆలస్యంగా రాష్ట్రంలోకి వచ్చినా ఈ వానాకాలం(జూన్-సెప్టెంబరు)లో సాధారణ వర్షాలు కురుస్తాయన్నారు. ఈ నెలలో సాధారణంకన్నా తక్కువ వర్షపాతం నమోదువుతుందన్నారు. వచ్చే నెలలో అధిక వర్షాలు కురుస్తాయని స్పష్టం చేశారు. ఈ వర్షాలతో వ్యవసాయ పనులు ముమ్మరం కానున్నాయని వ్యవసాయశాఖ పేర్కొంది. ప్రస్తుత ఖరీఫ్‌లో రాష్ట్రవ్యాప్తంగా 1.12 కోట్ల ఎకరాల్లో పంటలు సాగవుతాయని ఈ శాఖ రూపొందించిన కార్యాచరణ ప్రణాళిక అంచనా. ఈ ఏడాది ఖరీఫ్, యాసంగి(రబీ)ల్లో కలిపి 1.28 కోట్ల టన్నుల ఆహార ధాన్యాలను పండించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపింది. ఇందుకో ఖరీఫ్‌లో 78.7, యాసంగిలో 49.30 లక్షల టన్నులు పండుతాయని అంచనా. గతేడాది 16 జిల్లాల్లో వర్షపాతం లోటు 20 నుంచి 46 శాతం దాకా ఉండటంతో ఆహార ధాన్యాల దిగుబడి లక్ష్యం 1.26 కోట్ల టన్నులుండగా.. 35 లక్షల టన్నులు తగ్గింది. ఈసారి ఆలస్యంగానైనా సాధారణ వర్షాలు కురుస్తాయని, దీనికితోడు గోదావరి జలాలతో వరి సాగు విస్తీర్ణం, ఆహార ధాన్యాల దిగుబడి పెరగవచ్చని వ్యవసాయశాఖ భావిస్తోంది.

### రైతుబంధుతో పెట్టుబడి

పంటల సాగు పనుల ప్రారంభానికి వ్యవసాయశాఖ ఇప్పటికే రైతుల ఖాతాల్లో 'రైతుబంధు' పథకం కింద సొమ్మును జమ చేస్తోంది. మొత్తం 54.40 లక్షల మంది రైతులకు గాను 33.70 లక్షల మంది ఖాతాల్లో రూ. 3430 కోట్లు జమ చేసినట్లు వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి సి.పార్థసారథి చెప్పారు. మిగతా రైతుల ఖాతాల్లో జమ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. విత్తనాలు, ఎరువులకు కూడా కొరత లేదన్నారు.


ఆదిలాబాద్ జిల్లా జైనథ్‌లో దుక్కి దున్నుతూ విత్తనాలు వేస్తున్న రైతులు

**రాష్ట్రంలో ఆహార ధాన్యాల దిగుబడుల తీరు(లక్షల టన్నులు)**

| సంవత్సరం | లక్ష్యం | పండింది |
|---|---|---|
| 2014-15 | 110 | 68.63 |
| 2015-16 | 110.2 | 50.18 |
| 2016-17 | 97.41 | 96.36 |
| 2017-18 | 90.89 | 96.20 |
| 2018-19 | 126.21 | 91.87 |
| 2019-20 | 128 | - |

**ఎండాకాలం**

| ప్రాంతం | గరిష్ఠ | కనిష్ఠ |
|---|---|---|
| ఆదిలాబాద్ | 39.8 | 25.8 |
| నిజామాబాద్ | 38.9 | 25.9 |
| మహబూబ్‌నగర్ | 38.4 | 27.1 |
| కరీంనగర్ | 38.0 | 26.0 |
| నల్గొండ | 38.0 | 23.4 |
| తిరుపతి | 37.0 | 26.9 |
| సూర్యాపేట | 37.0 | 26.0 |
| హైదరాబాద్ | 36.9 | 26.4 |
| విజయవాడ | 35.5 | 26.5 |
| హన్మకొండ | 34.8 | 24.0 |
| విశాఖపట్నం | 34.2 | 25.8 |
| ఖమ్మం | 34.0 | 29.0 |
| రామగుండం | 33.6 | 24.0 |
| గుంటూరు | 30.6 | 27.2 |

GATE
Govt. Jobs Coaching
Attend 40 Hours Free Networks & Aptitude Classes and get upto 100% Fee Concession in GATE
Contact @ 9848485698
SPACE Engg. Academy GATE ESE PSUs
Koti, Hyd : 9849713451

### దీర్ఘకాలిక వంగడాలు వద్దు

–డాక్టర్ జగదీశ్వర్, పరిశోధన సంచాలకుడు, జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం

వర్షాలు ఆలస్యమైందున ఏ పంట కాలమైనా 130 నుంచి 140 రోజుల్లో ముగిసేలా వంగడాలను ఎంపిక చేసుకోవాలి. వరిలో సాంబ మసూరి, స్వర్ణ, జైశ్రీరామ్ వంగడాలను ఇప్పుడిక నారు పోయవద్దు. వీటి సాగు కాలం ఎక్కువగా ఉంటుంది. తీరా పంట కోతకు వచ్చే సమయంలో తుపాను, వర్షాల వల్ల పంట నష్టపోతారు.

### తొలిరోజు 330 చోట్ల వానలు

రుతుపవనాలు ప్రవేశించిన తొలిరోజున శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు 330 ప్రాంతాల్లో వర్షాలు కురిశాయి. అత్యధికంగా హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో 82.5 మిల్లీమీటర్లు(మి.మీ.), వైదేహీనగర్ 60, కల్వంచ 54.8, పెద్ద అంబర్‌పేట 52.8, గుర్రంగూడ 51, ప్రశాంత్‌నగర్ 49.8, భవానీనగర్ 49.3, హయత్‌నగర్ 46.8, కొండాపూర్ 44.8, రాయదుర్గం, షేక్‌పేట 42.5, బండ్లగూడ 41.8, మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర 41.3, తాంసీ(ఆదిలాబాద్) 42, సంగారెడ్డి ఝరాసంగంలో 40 మి.మీ.ల వర్షం కురిసింది.

Dr. NTR UNIVERSITY OF HEALTH SCIENCES: A.P: VIJAYAWADA-8.
NOTIFICATION
Application forms are invited through online from the candidates who have secured the cutoff score and more in NEET UG – 2019 and fulfilled the eligibility criteria for admission into MBBS, BDS BAMS, BHMS, BNYS & BUMS Courses available under Competent Authority Quota in Medical, Dental, ISM & H Colleges affiliated to Dr. NTR UHS, Vijayawada and also for MBBS course under SVIMS, Tirupati for the Academic Year 2019-20 from 11.00 A.M on 22-06-2019 upto 05.00 P.M on 28-06-2019 from https://apmedadm.ntruhs.ap.gov.in.
For Details Visit http://ntruhs.ap.nic.in and https://apmedadm.ntruhs.ap.gov.in
VIJAYAWADA. Date: 21.06.2019 Sd/- REGISTRAR

Professor Jayashankar Telangana State Agricultural University
AINP on Pesticide Residues, EEI Premises, Rajendranagar, Hyderabad - 500 030.
TENDER NOTICE
Sealed tenders are invited for the supply of GC-MS/MS. The details of the tender schedules can be downloaded from the website www.pjtsau.edu.in
sd/-
Principal Scientist & Head,
AINP on Pesticide Residues

# జల వివాదాలపై 27న కేసీఆర్, జగన్‌ల భేటీ!

**ఈనాడు, హైదరాబాద్:** జల వివాదాలపై చర్చించేందుకు రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కేసీఆర్, జగన్‌లు ఈ నెల 27న సమావేశం కావాలని సూత్రప్రాయంగా నిర్ణయించినట్లు తెలిసింది. ఈ సమావేశం అమరావతిలో ఏర్పాటు చేయాలని అనుకొన్నా, ఎక్కడ, ఎన్ని గంటలకనేది ఖరారు కావాల్సి ఉందని నీటిపారుదల శాఖ ఉన్నతస్థాయి వర్గాలు తెలిపాయి. సమావేశ సమయం, చర్చించాల్సిన అంశాలపై త్వరలోనే స్పష్టత వస్తుంది. ఇరు రాష్ట్రాల నీటిపారుదల శాఖ అధికారులు ఇప్పటికే కసరత్తు ప్రారంభించారు. బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్, కృష్ణా, గోదావరి బోర్డులకు సంబంధించిన అంశాలపై చర్చించే అవకాశం ఉంది. ఇద్దరు ముఖ్యమంత్రులు ఇచ్చి పుచ్చుకొనే ధోరణిలో జల వివాదాలు పరిష్కరించుకుంటే రెండు రాష్ట్రాలూ ప్రయోజనం పొందుతాయనే అభిప్రాయంతో ఉన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు బచావత్ ట్రైబ్యునల్ 811 టీఎంసీలు కేటాయించింది. ఇందులో ఆంధ్రప్రదేశ్ 512 టీఎంసీలు, తెలంగాణ 299 టీఎంసీలు వాడుకొంటున్నాయి. పునర్విభజన సమయంలో రెండు రాష్ట్రాల్లో ఉన్న ప్రాజెక్టుల వినియోగాన్ని పరిగణనలోకి తీసుకొని ఈ లెక్కను నిర్ధరించారు. ప్రస్తుతం ప్రాజెక్టుల వారీగా నీటి కేటాయింపు, తక్కువ నీటి లభ్యత ఉన్నప్పుడు వినియోగం ఎలా అన్నది ట్రైబ్యునల్ నిర్ధరించాల్సి ఉంది. ట్రైబ్యునల్ ఎదుట వాదనలకు భారీగా ఖర్చవుతుంది. తెలంగాణ కంటే ఆంధ్రప్రదేశ్ రెండున్నర రెట్లు ఎక్కువగా ఖర్చు చేసింది. బచావత్ ట్రైబ్యునల్‌లోనే అన్యాయం జరిగిందని, దీనిని సవరించాలని కోరుతూ తెలంగాణ సుప్రీంకోర్టులో కేసు కూడా వేసింది. వీటన్నిటిపై చర్చించుకొని రెండు రాష్ట్రాలు ఓ అంగీకారానికి వచ్చి విషయాన్ని రాతపూర్వకంగా తెలియజేస్తే అదే ట్రైబ్యునల్ తీర్పులో వచ్చే అవకాశం ఉంది. కృష్ణా, గోదావరి బోర్డుల పనితీరు, అసలు ఈ బోర్డుల అవసరం ఉందా అనే అంశాలపై కూడా చర్చ ఉండొచ్చు.

# ఎదురొచ్చిన మృత్యువు!

- ఆటోను ఢీకొన్న లారీ
- ఒక్కరు మినహా అన్నదమ్ముల కుటుంబాల్లో ఆరుగురి మృతి
- శుభకార్యానికి వెళ్లి వస్తుండగా ఘటన
- మృతులంతా మహబూబాబాద్ జిల్లా వాసులు
- సూర్యాపేట జిల్లా చిలుకూరు సమీపంలో దుర్ఘటన




ఘటనాస్థలిలో చెల్లాచెదురుగా పడి ఉన్న మృతదేహాలు. (అంతర చిత్రంలో) మరణించిన అఫ్జల్‌పాషా, గౌసియాబేగం దంపతులు ✦ మృతిచెందిన మహబూబ్‌పాషా కుటుంబ సభ్యులు (పాత చిత్రం)

**ఈనాడు డిజిటల్, సూర్యాపేట, చిలుకూరు అర్బన్, కురవి, న్యూస్‌టుడే:** ఆగాలా వెళ్లాలా? కుడివైపు తిప్పాలా..ఎడమవైపు వెళ్లాలా. ఈ నిర్ణయం తీసుకోవడానికి ఒక్క క్షణ కాలమే పట్టింది. ఆటో డ్రైవర్ కుడివైపే వెళ్లాలనే నిర్ణయం తీసుకున్నాడు. ఆ నిర్ణయమే అన్నదమ్ముల కుటుంబాలకు మరణ శాసనం రాసింది. ఐకమత్యంతో జీవిస్తున్న సోదరులను..వారి పిల్లలను మొత్తంగా ఆరుగుర్ని మృత్యువు రూపంలో కబళించింది. ఆ కుటుంబాల్లో ఒక్కరు మాత్రమే ప్రాణాలతో బయటపడ్డారు. సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం సీతారామపురం సమీపంలో శుక్రవారం ఉదయం ఈ ఘటన జరిగింది.

మహబూబాబాద్ జిల్లా కురవి మండలం చింతపల్లికి చెందిన షేక్ అఫ్జల్ పాషా, మహబూబ్ పాషా, హుజూర్‌నగర్ వాసి యాకూబ్ పాషా సోదరులు. చింతపల్లిలో ఉండే సోదరులిద్దరూ కుటుంబ సభ్యులతో కలిసి నాలుగు రోజుల క్రితం కోదాడలోని తోబుట్టువు అక్తర్ బేగం మనవరాలి బారసాల వేడుకకు హాజరయ్యారు. అనంతరం అందరూ హుజూర్‌నగర్ వెళ్లారు. అక్కణ్నుంచి మూడు కుటుంబాల సభ్యులు పాలకవీడు మండలం జాన్‌పహాడ్ దర్గాకు వెళ్లారు. గురువారం దర్గాను దర్శించుకుని హుజూర్‌నగర్‌కు వచ్చి, రాత్రి అక్కడే బస చేశారు.

### ఆటోలోనే ఆఖరి క్షణాలు

పాషా సోదరులు తమ కుటుంబాలతో కలిసి శుక్రవారం ఉదయం చింతపల్లికి తిరుగు ప్రయాణమయ్యారు. అద్దెకు ఆటో మాట్లాడుకుని కోదాడ బస్టాండుకు బయల్దేరారు. ఏడుగురు ఒకే ఆటోలో ప్రయాణిస్తుండగా సీతారాంపురం వద్ద ముందు వెళ్తున్న లారీ నెమ్మదించింది. లారీని తప్పించే క్రమంలో చోదకుడు ఆటోను కుడి వైపునకు తిప్పగా..అదే సమయంలో ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. ఢీకొన్న వేగానికి ఆటోలోని వాళ్లంతా రహదారిపై చెల్లాచెదురుగా ఎగిరిపడ్డారు. మహబూబ్ పాషా భార్య మహముదా బేగం (40), కుమార్తె మహీన్ (13) అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన మహబూబ్ పాషా(45) చికిత్స పొందుతూ ఖమ్మం వైద్యశాలలో, ఆయన మరో కుమార్తె ముస్కాన్ (09) నార్కట్‌పల్లి కామినేని ఆసుపత్రికి తరలిస్తుండగా మరణించారు. అఫ్జల్ పాషా (50), ఆయన భార్య గౌసియా బేగం(45) ఘటనాస్థలంలోనే మరణించగా..వారి కుమారుడు జాకీర్ పాషా తీవ్ర గాయాలతో ఖమ్మంలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. ఆటో చోదకుడు నాగుల్‌మీరా కూడా తీవ్రంగా గాయపడ్డాడు. ఘటనాస్థలిని ఎస్పీ వెంకటేశ్వర్లు పరిశీలించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

### తల్లడిల్లిన చింతపల్లి

రోడ్డు ప్రమాద సమాచారం తెలుసుకుని చింతపల్లి తల్లడిల్లింది. అన్నదమ్ముల కుటుంబంలో ఒక్కరు మినహా ఆరుగుర్నీ మృత్యువు కబళించిందని తెలిసి శోకసంద్రంలో మునిగిపోయింది. ఎంతో సంతోషంగా బారసాలకు వెళ్లిన వారి శరీర భాగాలు ముక్కలవడంతో ఊరంతా కన్నీటిపర్యంతమైంది. కళ్ల ముందే ఇద్దరు బిడ్డల కుటుంబాలూ మృత్యుఒడికి చేరడంతో పాషా సోదరుల తల్లి అమీనా బేగం కుప్పకూలింది.

## నెలాఖరుకు ఐఏఎస్, ఐపీఎస్‌ల బదిలీ

**ఈనాడు, హైదరాబాద్:** రాష్ట్రంలో ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల బదిలీలు ఈ నెలాఖరుకు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటికే బదిలీల జాబితా సిద్ధమయినా... కాళేశ్వరం ప్రారంభోత్సవం తదితర కార్యక్రమాల వల్ల ఆగాయి. తెలంగాణలో పురపాలక ఎన్నికల నిర్వహణపై ఒకటి, రెండురోజుల్లో సీఎం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిసింది. ఎన్నికల తేదీలపై చర్చించి, సంబంధిత ప్రతిపాదనలను ప్రభుత్వం తరఫున రాష్ట్ర ఎన్నికల సంఘానికి పంపించనున్నారు. జులైలో ఎన్నికలు నిర్వహిస్తామని ఇప్పటికే సీఎం వెల్లడించారు.

## ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో కంపించిన భూమి

**భీంపూర్, న్యూస్‌టుడే:** ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో శుక్రవారం రాత్రి కొద్ది సెకన్లపాటు స్వల్పంగా భూమి కంపించింది. ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలంలోని కరంజి-టి; బోథ్ మండల కేంద్రంతోపాటు దేవుల్‌నాయక్ తండా, పుణ్యానాయక్‌తండా, ఘనపూర్, సాయినగర్ గ్రామాల్లో; నిర్మల్ జిల్లాలోని భైంసా, సారంగాపూర్ మండలాల్లోని గ్రామాల్లో రాత్రి 9గంటల సమయంలో భూమి కంపించిందని గ్రామస్థులు తెలిపారు.

## భారత్‌కు సభ్యత్వ అంశం ఎన్ఎస్‌జీ అజెండాలో లేదు: చైనా

**బీజింగ్:** కజకిస్థాన్‌లోని అస్తానాలో జరిగే అణు సరఫరాదారుల బృందం(ఎన్ఎస్‌జీ) సమావేశం అజెండాలో భారత్‌కు సభ్యత్వాన్ని ఇచ్చే అంశం లేదని చైనా స్పష్టం చేసింది. 2016 మేలో ఎన్ఎస్‌జీలో సభ్యత్వం కోసం భారత్ దరఖాస్తు చేసుకున్నప్పటి నుంచి చైనా అడ్డుపడుతోంది. ఎన్‌పీటీపై సంతకం చేసిన వారికే సభ్యత్వం ఇవ్వాలని వాదిస్తోంది. ఎన్‌పీటీపై భారత్, పాకిస్థాన్ సంతకాలు చేయలేదు. జూన్ 20, 21 తేదీల్లో ఎన్ఎస్‌జీ ప్లీనరీ సమావేశం సందర్భంగా చైనా విదేశాంగ అధికార ప్రతినిధి లూకాంగ్ పాత్రికేయ సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా భారత్‌కు సభ్యత్వం కల్పించే విషయంలో చైనా వైఖరి మారిందా అనే ప్రశ్నకు స్పందిస్తూ.. ఎన్‌పీటీపై సంతకం చేయని దేశాలకు సభ్యత్వం కల్పించే అంశంపై ఎన్ఎస్‌జీ చర్చించబోదన్నారు. భారత్ భాగస్వామ్యంపై ఎలాంటి చర్చ జరగదని స్పష్టం చేశారు.



పెళ్లికుమారుడు ప్రవీణ్



పెళ్లికుమారుడి తల్లిదండ్రులు సాయిలు, గంగమ్మ

# పెళ్లింట పెను విషాదం

**భూదాన్‌పోచంపల్లి, న్యూస్‌టుడే:** పెళ్లింట పెనువిషాదం నెలకొంది. పెళ్లయిన రెండో రోజే పెళ్లికుమారుడు, ఆయన తల్లిదండ్రులు, మేనత్త.. మొత్తం నలుగురు విద్యుదాఘాతానికి బలయ్యారు. ఈ విషాదకర ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి పురపాలిక కేంద్రం పరిధి ముక్తాపూర్‌లో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. చిందం ప్రవీణ్‌కు ఈనెల 19న వివాహం జరిగింది. వేడుక కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం పెళ్లి కుమార్తె ఇంట్లో శుభకార్యం ముగించుకొని వారు తిరిగి ముక్తాపూర్ చేరుకున్నారు. ఇంటి ముందు వేసిన పందిరి అలంకరణ కోసం సీరియల్ లైట్లు ఏర్పాటు చేశారు. వాటికి బిగించిన జీఐ తీగను పందిరి ఏర్పాటు కోసం పాతిన ఓ ఇనుప స్తంభానికి కట్టారు. అదే స్తంభానికి దుస్తులు ఆరేయడానికి ఇనుప తీగను కట్టారు. వర్షం పడటంతో ఈ తీగకు సీరియల్ బల్బుల జీఐ తీగ ద్వారా విద్యుత్ సరఫరా జరిగింది. పెళ్లికుమారుడి తల్లి అదే తీగపై దుస్తులు ఆరేస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యారు. ఆమెకు ఏమైందోననే కంగారులో దగ్గరికి వెళ్లిన ఈ ముగ్గురూ విద్యుదాఘాతానికి గురయ్యారు. పెళ్లికుమారుడు చిందం ప్రవీణ్(22), ఆయన తల్లిదండ్రులు సాయిలు(55), గంగమ్మ(50), వలిగొండ మండలం తుమ్మలగూడేనికి చెందిన పెళ్లి కుమారుడి మేనత్త గంగమ్మ(48) అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారు. వెంటనే వారిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. అప్పటికే వారు మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారని గ్రామస్థులు, కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ నలుగురి పక్కనే ఉన్న మరో ఇద్దరు స్వల్పగాయాలతో బయటపడ్డారు.

# వ్యాధి తగ్గించిన వైద్యుడికే కుచ్చుటోపీ

- రాయితీ విత్తనాల విక్రయం పేరుతో మోసం
- రూ.1.40 కోట్లు వసూలు చేసిన నిందితులు

**ఈనాడు, హైదరాబాద్:** వ్యాధి నయం చేసిన వైద్యనిపుణుడినే ఇద్దరు ఘరానా నేరగాళ్లు మోసం చేశారు. రాయితీ విత్తనాల విక్రయంలో పెట్టుబడులు పెడితే రెట్టింపు లాభాలొస్తాయంటూ వైద్యుడిని నమ్మించారు. ఏడాది వ్యవధిలో ఆయన్నుంచి దశల వారీగా రూ.1.40 కోట్లు రాబట్టారు. రాయితీ విత్తనాలు విక్రయించామని, లాభాలొచ్చాయని నమ్మించి డబ్బు మాత్రం తిరిగి ఇవ్వలేదు. దీంతో బాధిత వైద్యుడు హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

హైదరాబాద్ నగరం బంజారాహిల్స్‌లోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో వైద్యనిపుణుడి వద్దకు జూబ్లీహిల్స్‌లో ఉంటున్న పట్టాభి, పాండలు మూడేళ్ల క్రితం గుండె సంబంధ జబ్బుతో చికిత్సకు వచ్చారు. తరచూ రావడంతో వారితో వైద్యనిపుణుడికి పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో ఏదైనా వ్యాపారంలో పెట్టుబడులు పెడితే స్థిరాస్తులు కొనేందుకు అవకాశం ఉంటుందని ఆయనకు చెప్పారు. ఆసక్తి ఉన్నా.. సమయం లేదని వైద్యుడు చెప్పడంతో.. తాము కేంద్ర ప్రభుత్వ అనుమతితో రాయితీ విత్తనాలను కొంటున్నామని వాటిని తమ నుంచి పశ్చిమబెంగాల్ రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటోందని, ఇందుకు ఒప్పందం కుదుర్చుకున్నామని చెప్పారు. తమ సంస్థలో పెట్టుబడులు పెడితే రెట్టింపు లాభాలొస్తాయని నమ్మించారు. విత్తనాలు కొనేందుకు ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నామని పత్రాలు చూపారు. దీంతో వైద్యుడు వారిని నమ్మి పెట్టుబడి కింద 12 నెలల్లో రూ.1.40 కోట్లు వారి ఖాతాలో జమ చేశారు.

### డబ్బులిస్తామంటూ దాటవేత

వైద్యనిపుణుడి నుంచి తమ ఖాతాల్లో నగదు జమ కాగానే పట్టాభి, పాండలు ముఖం చాటేశారు. 2017 అక్టోబరులో వైద్యనిపుణుడు వారికి ఫోన్ చేయగా జనవరి, 2018లో డబ్బులు ఇస్తామన్నారు. మరోమారు ఫోన్ చేయగా స్పందించలేదు. దీంతో ఆయన జూన్, 2018లో వారిద్దరి వద్దకు వెళ్లారు. డబ్బులివ్వాలని అడగ్గా ఆర్నెల్ల గడువు కోరారు. ఈ ఏడాది జనవరిలో ఫోన్ చేయగా.. పశ్చిమబెంగాల్ ప్రభుత్వం నుంచి ఇంకా నిధులు విడుదల కాలేదన్నారు. అనుమానం వచ్చి వారు చూపించిన ఒప్పంద పత్రాలు పరిశీలించగా అవి నకిలీవని తేలింది. దీంతో పెట్టుబడి డబ్బులు ఇవ్వకపోతే పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు. 15 రోజుల్లో ఇస్తామంటూ చెప్పిన పట్టాభి, పాండలు 4 నెలలైనా నగదు చెల్లించలేదు. దీంతో బాధిత వైద్యుడు వీరిద్దరితో పాటు నగదు బదిలీ చేయించిన మరో ముగ్గురు చామర్తి, భావన, అజయ్‌లపై గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసుకుని నిందితుల కోసం గాలిస్తున్నారు.

## ఐదేళ్ల కూతురిపై తండ్రి అఘాయిత్యం

**నేరేడ్‌మెట్, న్యూస్‌టుడే:** తప్పతాగిన స్థితిలో కన్నూమిన్నూ కానని ఓ వ్యక్తి (36)ఐదేళ్ల కూతురిపైనే అత్యాచారానికి పాల్పడి ఇప్పుడు ఊచలు లెక్కపెడుతున్నాడు. నేరేడ్‌మెట్ ఠాణా పరిధిలోని ద్వారకామయి కాలనీలో ఉంటున్న అతడికి భార్య, ముగ్గురు కుమారులు, కూతురు ఉన్నారు. తొమ్మిదేళ్ల క్రితం మహారాష్ట్ర నుంచి హైదరాబాద్‌కు కుటుంబంతో సహా ఉపాధి కోసం వచ్చాడు. పీకల దాకా మద్యం తాగి ఇంటికి చేరి దారుణానికి దిగిన ఆ నేరగాడిపై భార్య ఫిర్యాదు చేయడంతో పోలీసులు రంగంలోకి దిగారు. పరారీలో ఉన్న అతడిని గాలించి పట్టుకొని, న్యాయస్థానం ఉత్తర్వుల మేరకు శుక్రవారం రిమాండుకు తరలించారు.

## ఆరేళ్ల పాపపై అత్యాచార యత్నం

**జగద్గిరిగుట్ట, న్యూస్‌టుడే:** పేద కుటుంబానికి చెందిన ఓ బాలికకు పండ్లు ఇస్తానని ఇంటికి పిలిచి అత్యాచారానికి యత్నించాడో వ్యక్తి. ఈ సంఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సమీపంలోని కాలనీలో నివసించే దంపతులు కూలీపనులతో పొట్టపోసుకుంటున్నారు. వారు పనికి వెళ్లగా, కుమార్తె (6) ఇంటి వద్దనే ఉంది. అదే బస్తీలో నివసించే ఎల్లయ్య (55) ఇదంతా పసిగట్టి, గురువారం సాయంత్రం ఆమెకు మాయమాటలు చెప్పి తన ఇంటికి తీసుకెళ్లాడు. బాలిక కేకలు విని ఇరుగుపొరుగులు పరుగున వచ్చేసరికే నిందితుడు పరారయ్యాడు. బాధితురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదుతో పోలీసులు అతడిని పట్టుకున్నారు.



## కలో గంజో... కలిసి 'సాగు'దాం

ఈ చిత్రంలో కనిపిస్తున్న మహిళలు మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండల కేంద్రానికి చెందిన వారు. వీరంతా ఓ రైతు పొలంలో వరినాట్లు వేసి వస్తున్నారు. అయితే నాట్లు వేసినందుకు ఒక్కొక్కరికి వచ్చిన కూలీ రూ. 20లు. ఆశ్చర్యంగా ఉంది కదూ. కానీ ఇది నిజం. ప్రస్తుతం వర్షాలు లేకపోవడంతో పంటల సాగు ప్రారంభం కాలేదు. దీంతో కూలీలకు పనులు దొరకడం లేదు. కొద్దిమంది రైతులు మాత్రమే బోర్ల కింద అరెకరం, ఎకరా విస్తీర్ణంలో వరిని సాగు చేస్తున్నారు. అరెకరాలో నాట్లు వేయడానికి ఓ అన్నదాత కొందరు మహిళలను మాత్రమే పిలిచినప్పటికీ ఎక్కడా పనులు లేకపోవడంతో మూకుమ్మడిగా 30 మంది వరకు వచ్చారు. చేసేది లేక మొత్తం పనికి రూ. 600 ఇస్తాను... మీరు ఏమన్నా చేసుకోండని రైతు సమాధానమిచ్చాడు. చివరికి వారంతా నాట్లు వేసి వచ్చిన కూలీని పంచుకోగా ఒక్కొక్కరికి రూ. 20 వచ్చాయి.

– ఈనాడు, మహబూబ్‌నగర్

# పక్కాగా ఎరువు లెక్క

- తప్పనిసరిగా పీవోఎస్ యంత్రాలపైనే అమ్మాలి
- వ్యాపారులకే కాదు.. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకూ వర్తింపు
- వ్యవసాయశాఖ కొత్త మార్గదర్శకాలు జారీ

**ఈనాడు, హైదరాబాద్:** ఎరువుల అక్రమ అమ్మకాలు, అక్రమ నిల్వలను నిరోధించేందుకు వ్యవసాయశాఖ కఠిన చర్యలకు ఉపక్రమించింది. ప్రతి చిల్లర, టోకు వ్యాపారిపైనే కాకుండా, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు(ప్యాక్స్), రాష్ట్ర సహకార మార్కెటింగ్ సమాఖ్య(మార్క్‌ఫెడ్)లపైనా నిఘా పెట్టాలని అధికారులను ఆదేశించింది. రాష్ట్రంలో ఏ రైతుకైనా సరే తప్పనిసరిగా పాయింట్ ఆఫ్ సేల్- పీవోఎస్ యంత్రంపైనే ఎరువులు విక్రయించాలని స్పష్టం చేసింది. ఇది ఈ ఖరీఫ్ సీజన్ నుంచి తప్పనిసరి చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. ఈ యంత్రాలపై అమ్మితేనే కేంద్రం నేరుగా నగదు బదిలీ(డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్- డీబీటీ) విధానంలో కంపెనీలకు రాయితీలను పంపుతుంది.

### మార్గదర్శకాల్లో ముఖ్యాంశాలు...

- ✦ వరుసగా 3 నెలలు ఎరువులు అమ్మని చిల్లర వ్యాపారిపై విచారణ చేయాలి.
- ✦ చిల్లర వ్యాపారి.. నెలకోమారు ఎన్ని అమ్మారో తెలియజేస్తూ నివేదిక ఇవ్వాలి.
- ✦ వ్యవసాయాధికారి తనిఖీ చేసినప్పుడు అక్కడ ఉన్న నిల్వలు, పీవోఎస్ యంత్రంలో కనిపించే నిల్వల లెక్కలు సరిపోవాలి. తేడాలుంటే వెంటనే లైసెన్సు రద్దు చేయాలి.
- ✦ టోకు వ్యాపారులు అధిక నిల్వలు పెట్టుకోకుండా ఎప్పటికప్పుడు చిల్లర వ్యాపారులకు పంపాలి. వారి వద్ద ఉండే నిల్వలన్నీ ఆన్‌లైన్‌లో కనిపించాలి.
- ✦ ప్రతి జిల్లాలో అత్యధికంగా ఎరువులు కొనేవారి జాబితాలు తయారుచేసి అందులో టాప్ 20 మంది వివరాలు సేకరించాలి. వారు వాటిని ఎక్కడ వినియోగిస్తున్నారో పరిశీలించాలి. ప్రతి ఎరువుల వ్యాపారి, మార్క్‌ఫెడ్, ప్యాక్స్ సిబ్బంది సాగించే విక్రయాలపై నిఘా పెట్టి ఎక్కడ లొసుగులున్నా వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలి.
- ✦ రాష్ట్రానికి ఒక రైలులో వచ్చే యూరియాలో కంపెనీలు 50 శాతం తప్పనిసరిగా మార్క్‌ఫెడ్‌కే ఇవ్వాలి. మార్క్‌ఫెడ్ వీటిని అత్యవసర సమయంలో ప్యాక్స్‌ల ద్వారా రైతులకు అమ్మేందుకు నిల్వ చేయాలి.
- ✦ ఎరువు కొన్న రైతుకు తప్పనిసరిగా వెంటనే రశీదు ఇవ్వాలి.



## ఎముక క్యాన్సర్‌కు పసుపుతో అడ్డుకట్ట

### అమెరికా శాస్త్రవేత్తల కొత్త విధానం

**వాషింగ్టన్:** పసుపులోని ప్రధాన పదార్థమైన కర్క్యుమిన్‌తో రూపొందించిన కొత్త ఔషధ బట్వాడా వ్యవస్థ ఎముక క్యాన్సర్ కణాల వృద్ధికి అడ్డుకట్ట వేస్తుందని అమెరికా శాస్త్రవేత్తలు గుర్తించారు. ఆరోగ్యకరమైన ఎముక కణాల వృద్ధిని ఇది పెంపొందిస్తుందని వివరించారు. పరిశోధక బృందంలో భారత సంతతికి చెందిన శాస్త్రవేత్త సుస్మితా బోస్, నవనీత సర్కార్ ఉన్నారు. చిన్నారుల్లో చోటుచేసుకునే క్యాన్సర్ మరణాల్లో రెండో అతిపెద్ద కారకంగా ఎముక క్యాన్సర్ (ఆస్టియోసర్కోమా) ఉంది. శస్త్రచికిత్సకు ముందు, అనంతరం రోగులకు అధిక మోతాదులో కీమోథెరపీ ఇస్తున్నారు. దీనివల్ల అనేకమందిలో దుష్ప్రభావాలు తలెత్తుతున్నాయి. పసుపును శతాబ్దాలుగా ఆసియా దేశాల్లో వంటలో, వైద్యంలో ఉపయోగిస్తున్నారు. అందులోని కర్క్యుమిన్‌కు యాంటీ యాక్సిడెంట్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలతోపాటు, ఎముక నిర్మాణ సామర్థ్యాలు ఉన్నాయి.

# రాష్ట్రం నుంచే బూజుపై యుద్ధం

- ఎన్ఐఎన్- అబెర్డీన్ వర్సిటీ భాగస్వామ్యం
- హైదరాబాద్‌లో ముగిసిన అంతర్జాతీయ సదస్సు

**ఈనాడు, హైదరాబాద్:** బూజు పట్టిన తిండి గింజలను, మసాలా దినుసులను తింటే ఎలాంటి రుగ్మతలు వస్తాయనే అంశంపై లోతైన అధ్యయనానికి తెలంగాణ వేదిక అవుతోంది. హైదరాబాద్‌లోని జాతీయ పోషకాహార సంస్థ(ఎన్ఐఎన్), బ్రిటన్‌కు చెందిన అబెర్డీన్ విశ్వవిద్యాలయం ఈ క్రతువులో పాలుపంచుకుంటున్నాయి. ఏయే ఆహార పదార్థాల్లో బూజు అధికంగా ఏర్పడుతోంది.. దాన్ని ఎలా గుర్తించాలి.. ఏ ప్రాంతాల్లో దీని ప్రభావం ఎక్కువనే విషయాలపై తార్నాకలోని ఎన్ఐఎన్‌లో మూడు రోజుల పాటు నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు శుక్రవారం ముగిసింది. ఆహారంలోని బూజుపై పరిశోధనను తెలంగాణతోనే ప్రారంభించాలని సదస్సు తీర్మానించింది. తెలంగాణలో ఐదేళ్లలోపు చిన్నారుల ఎదుగుదలపై ఇప్పటికే నిర్వహించిన పలు అధ్యయనాల ప్రకారం వయసుకు తగ్గ ఎత్తు పెరగని వారి శాతం 28.1 శాతం ఉందని ఎన్ఐఎన్ తేల్చి చెప్పింది. బూజులో ఉండే అఫ్లాటాక్సిన్ విష పదార్థం బుజ్జాయిల ఎదుగుదలపై తీవ్ర ప్రభావం చూపుతున్న వేళ.. తెలంగాణలోనే ఈ పరిశోధనను నిర్వహించడం ప్రయోజనకరమని సదస్సు తీర్మానించింది. 3 నుంచి 4 ఏళ్లలో దీనిపై పరిశోధన చేసి యావత్ ప్రపంచానికి ఫలితాలు అందేలా చూడాలనే లక్ష్యంతో పని చేస్తున్నామని ఎన్ఐఎన్ సంచాలకురాలు డాక్టర్ హేమలత పేర్కొన్నారు.

## ఉన్నత విద్యపై సహకరించుకుందాం

**ఈనాడు, హైదరాబాద్:** ఉన్నత విద్యపై రెండు రాష్ట్రాల్లోని ఉన్నత విద్యామండళ్లు సహకరించుకుంటూ నాణ్యత పెంచేందుకు కృషి చేయాలని కేరళ విద్యాశాఖ మంత్రి కేటీ జలీల్ కోరారు. తెలంగాణలోని ఉన్నత విద్యలో అమలు చేస్తున్న ఉత్తమ విధానాలను వివరించాలని కేరళ ప్రభుత్వం ఆహ్వానం మేరకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ తుమ్మల పాపిరెడ్డి, ఉపాధ్యక్షులు ఆర్.లింబాద్రి, వెంకటరమణ, కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు శుక్రవారం తిరువనంతపురం వెళ్లారు. ఆ రాష్ట్ర విద్యాశాఖ మంత్రిని కలిశారు. అనంతరం కేరళ ఉన్నత విద్యామండలి ఉపాధ్యక్షుడు రాజన్ గురుక్కల్, సభ్య కార్యదర్శి రాజన్ వర్గీస్ తదితరులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఉన్నత విద్యపై రెండు మండళ్లు కార్యశాల నిర్వహించాలని నిర్ణయించాయి.

# ఇంటీరియర్ డెకరేషన్ వాణిజ్య పరిధిలోకి రాదు

- వినియోగదారుగానే పరిగణించి విచారించండి
- జిల్లా ఫోరానికి రాష్ట్ర వినియోగదారుల కమిషన్ ఆదేశం

**ఈనాడు, హైదరాబాద్:** ఒక కంపెనీ ఇంటీరియర్ డెకరేషన్ నిమిత్తం మరో కంపెనీతో కుదుర్చుకున్న ఒప్పందం వాణిజ్య కార్యకలాపాల పరిధిలోకి రాదని రాష్ట్ర వినియోగదారుల కమిషన్ స్పష్టం చేసింది. రెండు కంపెనీల మధ్య జరిగిన ఈ ఒప్పందాన్ని వినియోగదారుల సేవా పరిధిలోనే విచారించి నిర్ణయం వెలువరించాలంటూ జిల్లా వినియోగదారుల ఫోరాన్ని ఆదేశించింది. హైదరాబాద్‌కు చెందిన మోర్ విసాస్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ తన కార్యాలయాన్ని జూబ్లీహిల్స్‌లో ఏర్పాటు చేయడానికి నిర్ణయించింది. వినియోగదారులకు వీసాలు మంజూరు చేయించడానికిగాను ఏర్పాటు చేసిన ఈ కార్యాలయం ఇంటీరియర్ పనులను పుణెకు చెందిన డిజైన్ ఎడ్జ్ ఆర్కిటెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు అప్పగించింది. 2013 అక్టోబరు 31లోగా అప్పగిస్తామంటూ అక్టోబరు 11న ఒప్పందం కుదుర్చుకున్నప్పటికీ నవంబరు 18న అప్పగిస్తామని హామీ ఇచ్చింది.

అయితే పనులు పూర్తిచేయకపోగా, నాణ్యమైన సామగ్రిని కూడా వినియోగించలేదని, రూ.16 లక్షలు చెల్లించామని, రూ.13 లక్షల వరకే పనులు పూర్తి చేసిందని, మిగిలిన రూ.3 లక్షలు, పరిహారంగా రూ.4.20 లక్షలు ఇప్పించాలంటూ మోర్ వీసాస్ హైదరాబాద్ జిల్లా వినియోగదారుల ఫోరం-2ను ఆశ్రయించింది. ఇది వాణిజ్య కార్యకలాపాల పరిధిలోకి వస్తుందని, వినియోగదారుల ఫోరం పరిధిలో లేదని డిజైన్ ఎడ్జ్ ఆర్కిటెక్ట్స్ వాదించింది. అంతేగాక డిసెంబరు 27న పనులు పూర్తి చేశామని, ఇంకా రూ.8 లక్షలు బకాయిలు రావాల్సి ఉందని పేర్కొంది. వాదనలను విన్న జిల్లా ఫోరం ఇది వాణిజ్య కార్యకలాపాల పరిధిలోకి వస్తుందన్న వాదనతో ఏకీభవిస్తూ పిటిషన్‌ను కొట్టివేసింది.

దీనిపై మోర్ వీసాస్ రాష్ట్ర వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించింది. దీనిపై విచారించిన కమిషన్ అధ్యక్షుడు జస్టిస్ ఎంఎస్‌కే జైశ్వాల్ ఇంటీరియర్ డెకరేషన్ వాణిజ్య కార్యకలాపాల పరిధిలోకి రాదని, పూర్తిస్థాయిలో విచారించి నిర్ణయం వెలువరించాలని జిల్లా ఫోరాన్ని ఆదేశిస్తూ ఫిర్యాదును వెనక్కి పంపుతూ అప్పీలును పరిష్కరించారు.




## పైశాచికత్వంపై సైకత శిల్పం

తెలంగాణ రాష్ట్రం వరంగల్ జిల్లాలో తొమ్మిది నెలల పాపపై అత్యాచారం చేసి చంపేసిన ఘటనను ఖండిస్తూ ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా రంగంపేటలో దేవిన శ్రీనివాస్ సైకత శిల్పాన్ని రూపొందించారు. మృగాడి చేతిలో చిన్నారి చిక్కుకొని విలపిస్తున్నట్లు దీన్ని తయారుచేశారు. చిన్నారులపై పైశాచికత్వం పెరిగిపోవటంపై తీవ్ర ఆందోళన వ్యక్తంచేశారు.

– న్యూస్‌టుడే, రంగంపేట

# జూడాలు వెంటనే విధుల్లో చేరాలి

- వైద్యవిద్య సంచాలకులు కె.రమేష్‌రెడ్డి

**ఈనాడు, హైదరాబాద్:** రాష్ట్రంలో జూనియర్ డాక్టర్లు సమ్మెను విరమించి, వెంటనే విధుల్లో చేరాలని వైద్యవిద్య సంచాలకులు డాక్టర్ కె.రమేష్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. కొందరు సీనియర్ డాక్టర్లు స్వార్థ ప్రయోజనాల కోసం జూడాలను తప్పుదోవ పట్టిస్తున్నారని, దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉండటంతో పీజీ, యూజీ సీట్లు కోల్పోవాల్సిన పరిస్థితి ఎదురవుతోందని, ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకుని వయసు పెంపు ప్రతిపాదనలు చేశామన్నారు. పదవీవిరమణ వయసు పెంపుపై ఏమైనా సందేహాలు ఉంటే వాస్తవాలు వివరించేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సీట్లు పరిరక్షించేందుకే పదవీ విరమణ వయసు పెంపు ప్రతిపాదన చేశామని, ఈ మేరకు పది నెలల క్రితమే మంత్రి మండలి నిర్ణయం తీసుకున్నా ఎన్నికల కోడ్ కారణంగా అమలులో జాప్యం జరిగిందని పేర్కొన్నారు.

**డిమాండ్లు పరిష్కరించాలి:** "మా డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలి. ప్రతిపాదిత పదవీ విరమణ వయసు పెంపు కమిటీలో జూడాలకు ప్రాతినిధ్యం కల్పించాలి. సహాయ ప్రొఫెసర్ల పోస్టుల్లో ఒప్పంద విధానాన్ని రద్దుచేసి, వెంటనే ప్రత్యక్ష నియామకాలు చేపట్టాలి. పదవీ విరమణ వయసు పెంపును ప్రత్యక్షంగా వ్యతిరేకించడం లేదు. అయితే పెంపు నిర్ణయం అమలుకు ముందే మా డిమాండ్లు పరిష్కరించాలి." అని జూడా ఐకాస ఛైర్మన్ విజయేందర్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం చర్చలకు పిలిచి, పరిస్థితిని చక్కదిద్దాలని జూడాల సలహాదారు శ్రీనివాస్ కోరారు.

## కన్నడనాట మధ్యంతరం తప్పదేమో!

### అలాంటిదేమి లేదు.. గంటల వ్యవధిలో దేవేగౌడ విభిన్న వ్యాఖ్యలు

**ఈనాడు డిజిటల్, బెంగళూరు:** కర్ణాటకలో జనతాదళ్- కాంగ్రెస్ సంకీర్ణ ప్రభుత్వం ఎన్ని రోజులు ఉంటుందో తెలియదు, మధ్యంతర ఎన్నికలు తప్పవేమోనని జేడీ(ఎస్) జాతీయ అధ్యక్షుడు, మాజీ ప్రధానమంత్రి హెచ్‌డీ దేవేగౌడ వ్యాఖ్యానించారు. తన కుమారుడు కుమారస్వామి నేతృత్వంలోని ప్రభుత్వం మరిన్ని రోజులు కొనసాగాలంటే అది కాంగ్రెస్ చేతుల్లోనే ఉందంటూ మిత్రపక్షంపై అసహనం వ్యక్తం చేశారు. శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని తన నివాసంలో దేవేగౌడ ఆసనాలు వేశారు. విలేకరులతో మాట్లాడుతూ, 'లోక్‌సభ ఎన్నికల్లో నా ఓటమికి కాంగ్రెస్‌వారే కారణం. కాంగ్రెస్ పెత్తనం ఇలానే కొనసాగితే మధ్యంతర ఎన్నికలు వచ్చినా ఆశ్చర్యం లేదు' అంటూ నిప్పులు చెరిగారు. రాజకీయ దుమారం రేగడంతో.. మధ్యాహ్నం జరిగిన పార్టీ సమావేశంలో మాట మార్చారు. సంకీర్ణ సర్కారు నాలుగేళ్లూ భద్రంగా ఉంటుందని చెప్పారు.

Eenadu epaper

# ఈనాడు

## నిరుద్యోగంపై రామబాణం!

దేశంలో వ్యవసాయ రంగం తరవాత అత్యధికంగా సుమారు 12 కోట్లమందికి బతుకు తెరువు కల్పిస్తున్న ఘనత లఘు పరిశ్రమలది. పేరుకు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమ (ఎమ్ఎస్ఎమ్ఈ)లైనా పరిమిత పెట్టుబడులతో స్వయం ఉపాధికి రెక్కలు తొడగడంలో, వైవిధ్యభరిత వస్తూత్పాదనలతో దేశార్థికానికి ఊపిరులూదడంలో వాటి పాత్ర ఎన్నదగింది. అయినా దినదినగండంగా నెట్టుకొస్తున్న వాటి నెత్తిన- 'సెబీ' మాజీ సారథి యూకే సిన్హా నేతృత్వాన రిజర్వ్ బ్యాంక్ ఏర్పరచిన కమిటీ తాజాగా పాలుపోసింది. ఆర్థిక సుస్థిరతను లక్షించి దీర్ఘకాలిక చర్యలు చేపట్టే క్రమంలో, తాకట్టు లేని రుణాల పరిమితిని ప్రస్తుతమున్న రూ.10 లక్షల నుంచి రెండింతలు చేయాలన్న సిఫార్సు- ఆరు కోట్ల 30 లక్షలకు పైగా ఎమ్ఎస్ఎమ్ఈలకు తీపి కబురు. ఆర్థిక మాంద్యం ఉరుముతున్న వేళ, దేశీయంగా నిరుద్యోగ రేటు నాలుగు దశాబ్దాల గరిష్ఠానికి చేరి ఆందోళన పరుస్తున్న నేపథ్యంలో- లఘు పరిశ్రమలకు ఇటువంటి ఉపశమన చికిత్స అత్యావశ్యకం. రుణాల పరిమితి పెంపును 'ముద్ర' పథకం కింద అప్పు తీసుకున్నవారికి, స్వయం సహాయక బృందాలకు సైతం వర్తింపజేయగల వీలుందంటున్నారు. ఈ ఔదార్యం చేతల్లో ప్రతిఫలిస్తుందా అన్న సందేహాలూ వ్యక్తమవుతున్నాయి. నాలుగేళ్ల క్రితం ఆరంభమైన 'ముద్ర' రుణమేళాల పేరిట ఇంకో సంక్షోభం పురుడు పోసుకుంటోందని ఆర్‌బీఐ మాజీ గవర్నరు రఘురాం రాజన్ హెచ్చరించడం తెలిసిందే. దాన్ని తోసిపుచ్చి రిజర్వ్ బ్యాంక్ పచ్చజెండా ఊపినా కడకు వాస్తవిక కార్యాచరణ ఎలా నిగ్గుతేలుతుందో మరి! ఉదారంగా వ్యవహరించాలని కేంద్రీయ బ్యాంక్ సూచిస్తున్నా ఎమ్ఎస్ఎమ్ఈలకు బ్యాంకుల నుంచి రుణలభ్యతలో పెంపుదల అంతంత మాత్రమేనని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. 2017-18 ఆర్థిక సంవత్సరంలో లఘు పరిశ్రమలకు మంజూరైన బ్యాంకు రుణాలు రూ.14,731 కోట్లు; ఈ ఏడాది మార్చి నెలాఖరునాటికి రూ.15,491 కోట్లు. వృద్ధి సుమారు అయిదు శాతమేనన్న యథార్థం, తమ తలరాత ఎన్నటికి మారుతుందోనన్న నిర్వేదాన్ని చిన్న పరిశ్రమల్లో రగిలిస్తోంది!

భారత తయారీ రంగంలో 45 శాతం, ఎగుమతుల్లో 40 శాతం వాటా చిన్న పరిశ్రమలదే. ఉన్న స్థితి నుంచి ఉన్నత దశకు ఎదగనివ్వకుండా వాటిని కునారిల్లజేస్తున్న ప్రధాన సమస్య- సహేతుక వడ్డీరేట్లకు సకాలంలో తగినంత రుణవసతి కొరవడటమే. బ్యాంకులు విదుపుతున్న అరకొర రుణాలకు, వాస్తవిక అవసరాలకు మధ్య 230 బిలియన్ డాలర్ల (రమారమి రూ.16 లక్షల కోట్ల) మేర లోటు వెక్కిరిస్తున్నట్లు అంతర్జాతీయ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఎఫ్‌సీ) గతంలో మదింపు వేసింది. వ్యవస్థాగతంగా సరైన రుణవసతి కరవై సతమతమవుతున్న ఎమ్ఎస్ఎమ్ఈలకు ఇటీవలి కాలంలో దెబ్బ మీద దెబ్బ తగిలిన పర్యవసానంగా వాటి కళాకాంతులు మరింత క్షీణించాయి. పెద్దనోట్ల రద్దు మూలాన చెల్లింపుల సంక్షోభం తలెత్తి లఘు పరిశ్రమలు విలవిల్లాడతాయన్న 'మూడీస్' సంస్థ జోస్యం అక్షరాలా నిజమైంది. జీఎస్‌టీ శకారంభం, సాంకేతికంగా సన్నద్ధంకాని చిన్న పరిశ్రమల్ని అవస్థలపాలు చేయడమే కాదు- రాయితీ పరిమితిని రూ.20 లక్షలకు కుదించడం, వాటికి పన్నుపోటు తాకిడినీ పెంచింది. మూలిగే నక్కమీద తాటిపండు పడిన చందంగా, చైనా నుంచి చౌక ఉత్పత్తుల వెల్లువ- అప్పులు దూసి తెచ్చి పంటిబిగువున రోజులు నెట్టుకొస్తున్న యూనిట్లను కోలుకోలేని దెబ్బతీసింది. లక్షల సంఖ్యలో ఎమ్ఎస్ఎమ్ఈలు రుజాగ్రస్తమయ్యాయి. ప్రత్యేక పోర్టల్ నెలకొల్పి, జీఎస్‌టీలో నమోదైన లఘు సంస్థలకు 59 నిమిషాల్లోనే కోటి రూపాయల దాకా రుణమంజూరుకు తోడ్పడతామన్న కేంద్ర ప్రకటన- నికరంగా ఎంత మేర లబ్ధి చేకూర్చిందో ఎక్కడా గణాంక వివరాలు అందుబాటులో లేవు. ఏటికి ఎదురీదుతున్న సూక్ష్మ చిన్న మధ్యతరహా పరిశ్రమల బాగుసేతకు రేపటి కేంద్ర బడ్జెట్‌లో ఏపాటి సముచిత చొరవ ప్రదర్శితం కానుందో చూడాలి!

ఆరు నెలల క్రితం యూకే సిన్హా కమిటీని కొలువుతీరుస్తూ, అంతర్జాతీయంగా చిన్న పరిశ్రమలకు సంబంధించి అత్యుత్తమ ప్రమాణాల సమగ్ర అధ్యయనం చురుగ్గా సాగాలని ఆర్‌బీఐ అభిలషించింది. దేశంలో కమిటీలపై కమిటీల నియామకం, అరకొర చర్యలు ఆనవాయితీగా స్థిరపడి చిన్న పరిశ్రమల ముఖచిత్రం ఛిద్రమవుతుంటే- వెలుపల ఎన్నో స్ఫూర్తిమంతమైన ఉదాహరణలు కాంతులీనుతున్నాయి. లఘు, భారీ పరిశ్రమల మధ్య అర్థవంతమైన అనుసంధానంతో చైనా, జపాన్, జర్మనీ, కొరియా ప్రభృత దేశాలు ప్రపంచ విపణుల్ని కొల్లగొడుతున్నాయి. జర్మనీలో 60శాతం ఉపాధి అవకాశాల్ని స్థానిక సూక్ష్మ చిన్నతరహా పరిశ్రమలే కల్పిస్తున్నాయి. లఘు పరిశ్రమల నుంచి నిర్దిష్ట పరిమాణంలో సర్కారీ కొనుగోళ్లు నిర్విఘ్నంగా జరిగేలా థాయ్‌లాండ్, కెనడా, బ్రెజిల్, ఆస్ట్రేలియా వంటివి పకడ్బందీ చర్యలు చేపడుతున్నాయి. అందుకు విరుద్ధంగా ఇక్కడ రుణవసతి, నిపుణ కార్మికులు, మౌలిక సదుపాయాలు, నవీన పరిజ్ఞానం, వ్యవస్థాగత తోడ్పాటు... అన్నింటా అనేకానేక లోటుపాట్లు ఎమ్ఎస్ఎమ్ఈల భవితకు తూట్లు పొడుస్తున్నాయి; ఉనికినే ప్రశ్నార్థకం చేస్తున్నాయి. చైనా నుంచి ఆటబొమ్మలు, జౌళి ఉత్పత్తులు, బల్క్ ఔషధాలు, సైకిళ్లు పెద్దయెత్తున దిగుమతి అవుతుండటం దేశీయంగా చిన్న పరిశ్రమల్ని ఛిన్నాభిన్నం చేస్తున్న తరుణంలో- ఇక్కడే వాటి తయారీ ఇనుమడించేలా నైపుణ్య శిక్షణ, ఇతరత్రా తోడ్పాటు సమకూర్చడంపై ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించాలి. సూక్ష్మ, చిన్నతరహా సంస్థల్లో 60 శాతం దాకా గ్రామీణ భారతంలో నెలకొన్న దృష్ట్యా- వాటికి రుణాలు, విపణి వసతులు ఇనుమడింపజేస్తే పల్లెలు తేరుకుని వలసలు తగ్గుముఖం పడతాయి. 'మిటిల్ స్టాండ్' (ఎమ్ఎస్ఎమ్ఈ) సంస్థలకు జర్మనీ ఇస్తున్న విశేష ప్రాధాన్యమే అక్కడ నిరుద్యోగాన్ని కనిష్ఠ స్థాయికి పరిమితం చేస్తోంది. ఇక్కడా అలా చిరుదివ్వెలు దేదీప్యమానమైతే కోట్లాది యువత జీవితాల్లో వెలుగులు ప్రసరిస్తాయి!

# విత్తు కాదు... విపత్తు!

కొత్త ఖరీఫ్ సీజన్ మొదలైంది. నిండు వర్షాలు పడాల్సిన తొలకరి వేళలో వేసవిని తలపించేలా మండుటెండలు అన్నదాతలను నిరాశకు గురిచేశాయి. దాదాపు రెండు వారాలు ఆలస్యంగా ఎట్టకేలకు రుతుపవనాలు తెలుగు రాష్ట్రాలను పలకరించాయి. అడపా దడపా పడుతున్న తేలికపాటి వర్షాల తరవాత ఏదోలా దుక్కి దున్నుదామంటే, నాణ్యమైన విత్తుపై రైతులకు భరోసా కరవైంది. భారతదేశంలో సాగుకు అనుమతి లేని జన్యుమార్పిడి(జీఎం) హెచ్‌టీ పత్తి విత్తనాలను రైతులకు యథేచ్ఛగా అమ్మేస్తున్నారు. వాటిని కొని రైతులు సాగుచేయడం అక్రమమని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పదేపదే చెబుతున్నా ఎవరూ వినడం లేదు. వీటిని ఎందుకు అనుమతించరని తాజాగా మహారాష్ట్రలోని అకోట్‌లో రైతులు ఏకంగా నిరసనలకు దిగారు. జన్యుమార్పిడి వంగ విత్తనాలకు దేశంలో అనుమతి లేకున్నా హరియాణాలో సాగైనట్లు ఇటీవల బయటపడింది. అనుమతి లేకుండా పండిస్తున్న వంకాయలు మన ఆహారంలో భాగమవుతున్నాయి. ఇలాగే జీఎం సోయాచిక్కుడునూ అనుమతి లేకున్నా, రహస్యంగా సాగు చేయిస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. పంటల సాగులో కష్ట నష్టాలతో బలహీనపడుతున్న అన్నదాతలను ఆదుకోవాల్సిన భారత విత్తన చట్టం అత్యంత బలహీనంగా ఉంది.

### పుచ్చుపట్టిన వ్యవస్థలు

దేశంలో విత్తన పరిశ్రమ అభివృద్ధి చెందుతున్నంత వేగంగా రైతులుగాని, వ్యవసాయరంగం గాని ప్రగతి సాధిస్తున్న దాఖలాలు లేవు. దేశంలో మొత్తం విత్తన వ్యాపార విలువ 2010-17 మధ్యకాలంలో 17 శాతం వృద్ధిరేటుతో దాదాపు రూ.25 వేలకోట్లకు చేరింది. మరో అయిదేళ్ల(2018-23)లో ఇది ఏకంగా రూ.55 వేలకోట్లకు చేరుతుందని, సంచిత వార్షిక వృద్ధిరేటు 14 శాతానికి పైగా ఉండవచ్చని ఓ అధ్యయనంలో తేలింది. ఈ స్థాయి వృద్ధిరేటు వ్యవసాయంలో కనుచూపు మేరలో కానరావడం లేదు. ప్రపంచవ్యాప్తంగా జీఎం విత్తనాల వ్యాపారాన్ని విస్తరింపజేస్తున్న బహుళజాతి సంస్థలకు భారత రైతులు, ఇక్కడి వ్యవసాయం కాసులు కురిపించే కల్పవృక్షంలా మారాయి. ఇక్కడ చట్టాలేమీ పనిచేయవు, ఉన్నతస్థాయి నుంచి గ్రామస్థాయి దాకా లంచాలిస్తే అందరూ మిన్నకుండిపోతారు. తనిఖీ వ్యవస్థల్లో డొల్లతనం, అక్రమాలకు పాల్పడినా శిక్షలూ తక్కువే పడేలా విత్తన చట్టం సుతిమెత్తగా ఉండటంతో విత్తన విక్రయాల్లో అక్రమాలు రాజ్యమేలుతున్నాయి. యూపీఏ ప్రభుత్వ హయాములో పార్లమెంటు ఆమోదం పొందకుండా కొన్ని అదృశ్య శక్తులు కొత్త విత్తన చట్టాన్ని తొక్కిపెట్టాయి. తిరిగి ఎన్డీఏ ఏలుబడికొచ్చి అయిదేళ్లు దాటినా ఆ చట్టానికి మోక్షం లేకపోవడం గమనార్హం.

ప్రపంచ వాణిజ్య సంస్థ(డబ్ల్యూటీఓ)తో చేసుకున్న అరడజను ఒప్పందాల ప్రకారం మనదేశంలో మొక్కల రకాలు, వంగడాలు, రైతుల హక్కులకు పక్కా రక్షణ ఉంది. ఇందుకోసమే 2001లో 'మొక్కల రకాలు, రైతుల హక్కుల పరిరక్షణ'(పీపీవీఎఫ్ఆర్) చట్టాన్ని కేంద్రం తెచ్చింది. ఈ చట్టప్రకారమే పీపీవీఎఫ్ఆర్ మండలిని 2005 నవంబర్ 11న కేంద్రం ఏర్పాటు చేసింది. దేశంలో కొత్త వంగడాల అభివృద్ధిని ప్రోత్సహిస్తూ రైతుల హక్కులు, మొక్కల రకాలను కాపాడేందుకు పక్కా వ్యవస్థను ఏర్పాటు చేయాలనేది మండలి లక్ష్యం. కొత్త వంగడాలను అభివృద్ధి చేసేందుకు అవసరమైన మొక్కల జన్యువనరులను పరిరక్షించి అభివృద్ధి చేయడంలో రైతుల హక్కులను గుర్తించి వాటిని కాపాడాలనేది ఈ మండలికి అప్పగించిన మరో కీలక బాధ్యత. ఇది ఏర్పాటై ఒకటిన్నర దశాబ్దం అవుతున్నా వ్యవసాయాధికారులకే దీని గురించి సరిగ్గా తెలియకపోవడం మరో విషాదం. ఇతర దేశాల కంపెనీలు తెచ్చే కొత్త వంగడాలను మన దేశ రైతులకు వాణిజ్యపరంగా అమ్మాలంటే ఎంత సుంకం సదరు కంపెనీకి ఇవ్వాలనే అంశంలో పీపీవీఎఫ్ఆర్ మండలి నిర్ణయించాలి. ఈ అనుమతి ఇచ్చే సమయంలో రైతుల హక్కులను కాపాడేలా మండలి నిర్ణయం తీసుకోవాలి. పీపీవీఎఫ్ఆర్ మండలి అనుమతి పొందకుండా కేంద్ర ప్రభుత్వ అనుమతులతో పత్తి విత్తనాలను అమ్ముతున్నారు. ఇప్పుడిక బీటీ-3 పత్తి విత్తనాలను అక్రమంగా దేశంలో కొందరు వ్యాపారులు అమ్మేస్తున్నారు. వీటినే కలుపు మొక్కలను చంపే రసాయన మందు 'గ్లైఫోసెట్'ను తట్టుకునే(హెర్బిసైడ్ టాలరెంట్- హెచ్‌టీ) పత్తి విత్తనాలనీ పిలుస్తున్నారు. ఈ మందును పొలంలో చల్లితే

- నాణ్యమైన విత్తనాలకు లేదు భరోసా
- రైతు నష్టపోతే పరిహారం పూజ్యం
- జన్యుమార్పిడి విత్తనాల అక్రమ విక్రయాలు, సాగు
- చట్టుబండలవుతున్న చట్టాలు



### కొరగాని చట్టంతో రైతాంగానికి కష్టాలు

బీటీ-3 పత్తి మొక్కలు తప్ప మిగతావన్నీ మాడిపోతాయి. ఈ విషపూరిత రసాయనాన్ని చల్లినందుకు తనకు క్యాన్సర్ వచ్చిందని ఓ వ్యక్తి అమెరికాలో కోర్టుకెక్కితే అది నిజమేనని తేల్చి భారీగా పరిహారం ఇప్పించింది. అదే బీటీ-3 పత్తి విత్తనాలు నాటి, విచ్చలవిడిగా గ్లైఫోసెట్‌ను చల్లుతున్న భారత రైతులకు క్యాన్సర్ వస్తే కాపాడేదెవరనే ప్రశ్నలకు సమాధానం దొరకదు. ఈ విత్తనాలను వాణిజ్యపరంగా అమ్మేందుకు భారత ప్రభుత్వం ఏ కంపెనీకీ అనుమతి ఇవ్వలేదు. వీటిని అమ్మకుండా, సాగుచేయనీయకుండా అడ్డుకోవాలని కేంద్రం అన్ని రాష్ట్ర ప్రభుత్వాలను కోరుతున్నా క్షేత్రస్థాయిలో ఎక్కడా అవి ఆగడం లేదు. తెలంగాణ వ్యవసాయ, పోలీసు అధికారులతో కార్యదళం ఏర్పాటుచేసి గ్రామాల్లో అక్రమ విత్తనాల కోసం గాలిస్తుంటే కుప్పలు తెప్పలుగా అవి బయటపడుతున్నాయి. మిగతా పంటల వంగడాల్లో నాసిరకాల వల్ల రైతులు నష్టపోతున్నారు. సోయాచిక్కుడు విత్తనాలు తెలంగాణలో దొరక్క ఇతర రాష్ట్రాల ప్రైవేటు వ్యాపారులు విక్రయిస్తున్నవే దిక్కవుతున్నాయి. సదరు వ్యాపారులు నిజంగానే ఆ విత్తన పంటలను శాస్త్రీయ పద్ధతుల్లో ఉత్పత్తి చేశారా అనే దానిపై విచారణ చేయిస్తే గుట్టు రట్టవుతుంది. దేశంలో విత్తన వ్యాపారం ఎవరైనా చేయగలిగినంత సులువైపోయింది. కొందరు వ్యాపారులు విపణులకు వచ్చే సాధారణ వేరుసెనగ, సోయా వంటి పంటలను కొని 'నాణ్యమైన విత్తనం' అనే లేబుల్ అంటించి రైతులకు అమ్మేయడం సర్వసాధారణమైంది.

### వినియోగంపై నియంత్రణ కరవు



భారత్ వంటి పెద్ద దేశంలో ఏ గ్రామంలో ఏ రకం విత్తనాలను సాగుచేస్తున్నారు, వాటికి పర్యావరణ అనుమతి ఉందా, అవి నాణ్యమైనవేనా అని తనిఖీ చేసే వ్యవస్థలేవీ పక్కాగా లేకపోవడం బహుళజాతి సంస్థలకు వరంగా మారింది. విత్తన నాణ్యత పరీక్షలకు ప్రయోగశాలలు ఉండవు, నాణ్యత పరీక్షకు నిపుణులైన శాస్త్రవేత్తలు తగినంతమంది ప్రభుత్వ వ్యవస్థల్లో ఉండరు. నాసిరకం విత్తనాలు అమ్మే సంస్థలను పట్టుకునేందుకు పక్కా నియంత్రణ వ్యవస్థలు లేవు. ఒకవేళ పట్టుబడినా కంపెనీలను శిక్షించేందుకు బలమైన విత్తన చట్టం లేదు. ఈ సవాళ్లను ఎదుర్కోకుండా రైతులకు నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా సీజన్‌కు ముందు అధికారులకు ఆదేశాలిస్తుంటాయి.

### నిబంధనలకు పదును

విత్తన చట్టాన్ని తక్షణం పార్లమెంటుతో ఆమోదింపజేసి అమలులోకి తేవాలి. ఈ చట్టానికి పదును లేనంతకాలం నాసిరకం, అక్రమ విత్తనాలను అరికట్టడం అసాధ్యం. కొన్ని సంస్థల మేలు కోసం కోట్లాది మంది రైతుల జీవితాలతో చెలగాటమాటే విధానాలు ఇకనైనా మారాలి. వాస్తవానికి మన దేశంలో ప్రైవేటు విత్తన సంస్థలకన్నా ప్రభుత్వ వ్యవసాయ పరిశోధన సంస్థల్లోనే మేధావులైన వ్యవసాయ శాస్త్రవేత్తలున్నారు. పత్తి తప్ప మిగతా పంటల్లో అధికంగా సాగవుతున్న వంగడాల్లో అత్యధిక శాతం ప్రభుత్వ వ్యవసాయ పరిశోధన సంస్థల నుంచి బయటికి తెచ్చినవే. ఇంకా అనేక వందల కొత్త వంగడాలను ఈ సంస్థలు విడుదల చేసినా పొలాల్లోకి సాగులోకి రావడంలేదు. అవి బాగా పండుతాయని రైతులకు చెప్పే వ్యవసాయ విస్తరణ వ్యవస్థలు సరిగ్గా లేకపోవడమే అందుకు కారణం. అంతంతమాత్రంగా పండే తమ వంగడాల గురించి ప్రైవేటు విత్తన కంపెనీలు విస్తృతంగా ప్రచారం చేసుకుంటున్నాయి. వాటికన్నా బాగా పండే విత్తనాలు ప్రభుత్వ సంస్థల వద్ద ఉన్నా వాటికి ప్రచారం చేయడం గాని, రైతులతో సాగుచేయించే ప్రోత్సాహం గాని క్షేత్రస్థాయిలో లేదు. పరిశోధన సంస్థలకు, రైతులకు మధ్య విత్తన ధ్రువీకరణ సంస్థలు, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థలు, రాష్ట్ర వ్యవసాయశాఖలు వారధిలా ఉండాలి. కొత్త వంగడాలను విపణిలోకి విడుదల చేసేముందు ఇటీవలి కాలంలో కొందరు వ్యవసాయ శాస్త్రవేత్తలు పూర్తిస్థాయి సాంకేతిక నియమాలన్నీ పాటించడం లేదు. అరకొర పరిజ్ఞానంతో హడావుడిగా కొత్త వంగడాలు విడుదల చేస్తున్నారు. దీనివల్లనే వారు పరిశోధన సంస్థల్లో అద్భుతంగా పండాయని చెప్పి విడుదల చేసిన అనేక వంగడాలు సాధారణ రైతుల పొలాల్లో వెలవెలాబోతున్నాయి. వ్యవసాయ విశ్వవిద్యాలయాలు విడుదలచేసే కొత్త వంగడాలను రైతులు కొనకపోవడానికి అవి పొలాల్లో సరైన ఫలితాలను ఇవ్వకపోవడమే కారణం. దీనికి సమాధానం చెప్పేందుకు శాస్త్రవేత్తలు కొన్ని గ్రామాలను ఎంపిక చేసి అక్కడి రైతుల పొలాల్లో నేరుగా ఆ విత్తనాలనే సాగుచేయించాలి. వాటి గొప్పతనాన్ని రైతులకు ప్రత్యక్షంగా చూపాలి. విత్తన పరిశోధనల్లో అనేక అవినీతి, అక్రమాలు సాగుతున్నాయి. ప్రభుత్వ సంస్థల్లో ఏదైనా కొత్త వంగడం వస్తోందంటే ఆ సమాచారాన్ని కొందరు ముందే ప్రైవేటు సంస్థలకు చేరవేస్తున్నారు. ప్రతీ వ్యవసాయ శాస్త్రవేత్త జవాబుదారీతనంతో పనిచేయాలి. స్వల్పస్థాయిలో ఉండే సొంత లాభాలకు, స్వార్థంతో అమ్ముడుపోతే దేశ ఆహార భద్రతకు తూట్లు పొడిచినవారవుతారు. కరవు, వరదలు, అధిక ఉష్ణోగ్రతలు వంటి వాతావరణ మార్పులను తట్టుకుని పండే మేలైన వంగడాలు ఇప్పుడు దేశానికే కాదు- ప్రపంచ రైతాంగానికీ అవసరం. విపత్తులను తట్టుకుని పండే కొత్త వంగడాన్ని పరిశోధించి బయటకు తెస్తే కొనడానికి మన రైతులే కాదు, పలు దేశాలు బారులు తీరుతున్నాయి. కేవలం పచ్చపురుగును తట్టుకునే శక్తి ఉందనే గుణాన్ని చూపి బీటీ పత్తి విత్తనాలను ప్రపంచవ్యాప్తంగా అమ్ముతూ అమెరికా కంపెనీ వేల కోట్ల రూపాయలను పోగేసుకుంటోంది. ఆ స్థాయి వంగడాలను మన వ్యవసాయ పరిశోధకులు తెస్తేనే మన ఆహార భద్రతకు పూచీకత్తు లభిస్తుంది. లేకపోతే మన రైతుల కష్టమంతా బహుళజాతి కంపెనీల చేతుల్లో ధారపోయకతప్పదు. పంట సాగుకు కీలకమైన మేలైన బీజాన్ని అందించడంలో విఫలమైనంత కాలం రైతుల సంక్షేమం పేరిట ఎన్ని వేలకోట్ల రూపాయలను రాయితీలుగా గుమ్మరించినా ఒరిగేదేమీ ఉండదు!

– మంగమూరి శ్రీనివాస్

# పేదింటికి చేరని పెద్ద పథకాలు

దళితుల వెనకబాటు దశాబ్దాలుగా కొనసాగుతోంది. విద్యా ఉద్యోగ రంగాలతోపాటు ఆర్థిక, రాజకీయ రంగాల్లోనూ దళిత వర్గాలు దుర్విచక్షణను ఎదుర్కొంటున్నాయి. స్వాతంత్ర్యానంతరం బలహీన వర్గాల కోసం రాజ్యాంగంలో ప్రత్యేక నిబంధనలు పొందుపరచారు. పంచవర్ష ప్రణాళికల్లో బడుగుల పురోభివృద్ధికి ఏదో ఒక స్థాయిలో ప్రాధాన్యమివ్వడంతో దళితులు, ఇతర సామాజిక వర్గాల మధ్య అంతరాలు తగ్గుముఖం పట్టిన మాట కొంతమేరకు వాస్తవమే. వ్యక్తిగత అభివృద్ధితోపాటు పల్లెల్లో దళితవర్గాలు నివసించే ప్రాంతాలను పురోగతి బాట పట్టించేందుకు ప్రభుత్వాలు రచిస్తున్న ప్రణాళికలు ఇప్పటికీ కాగితాలకే పరిమితమవుతుండటం బాధాకరం. పాలకుల నిర్లక్ష్యం, అధికారుల ఉదాసీనత వల్ల గ్రామాల్లోని దళితవాడలు కనీస మౌలిక వసతులు కొరవడి కుములుతున్నాయి.

దేశంలోని దళితుల్లో 75 శాతానికిపైగా గ్రామీణ ప్రాంతాల్లోనే నివసిస్తున్నారు. కాలం మారినా దళితుల జీవన స్థితిగతుల్లో గుణాత్మక మార్పు పొడగట్టలేదు. దేశంలో సుమారు 31.5 శాతం దళిత కుటుంబాలు దారిద్ర్యరేఖకు దిగువనే ఉన్నాయి. మారుమూల పల్లెల్లో ఇంకా 55.3 శాతం కుటుంబాలు నీటివసతి కోసం చేతిపంపులు, బోరు బావులపైనే ఆధారపడుతున్నాయి. విద్యారంగంలో కొంతమేరకు పురోగతి ఉండటంవల్ల ప్రభుత్వరంగ సంస్థల్లో ఉద్యోగుల భాగస్వామ్యం ఏదోస్థాయిలోనైనా కనబడుతోంది. దళితాభివృద్ధిని ఆకాంక్షిస్తూ, వారి నివాస ప్రాంతాలను అభివృద్ధిపరచే సంకల్పంతో కేంద్రప్రభుత్వం 2009-10 మధ్యకాలంలో ప్రధానమంత్రి ఆదర్శ్ గ్రామ యోజన పథకాన్ని ప్రారంభించింది. యాభై శాతం పైబడిన దళిత జనాభాగల పల్లెలను లక్ష్యంగా చేసుకొని వాటిని సమగ్ర అభివృద్ధి బాట పట్టించాలన్నది పథకం ప్రాథమిక లక్ష్యం. ఆ ప్రాతిపదికన ఎంపిక చేసిన ప్రతి గ్రామానికీ కేంద్ర ప్రభుత్వం రూ.21 లక్షలు మంజూరు చేస్తుంది. తొలివిడతగా 50శాతం నిధులను ప్రత్యేక కేంద్ర సహాయ నిధులనుంచి షెడ్యూల్డ్ కులాల ఉప ప్రణాళికకు విడుదల చేస్తారు. ఆ నిధులతో పల్లెల్లో మౌలిక వసతుల కల్పనకు అడుగులు కదపాలి. తదుపరి 50 శాతం నిధులను సంబంధిత గ్రామంలో సాగుతున్న అభివృద్ధి పనుల పర్యవేక్షణ తరవాత సమర్పించే నివేదిక ఆధారంగా కేంద్ర కమిటీ చెల్లిస్తుంది. ఆ మొత్తాన్ని రెండేళ్లలో ఖర్చుచేసి ప్రజాసౌకర్యాలను అందుబాటులోకి తేవాలి. అప్పుడు అది ఆదర్శ గ్రామంగా పేరొందుతుంది. ముందస్తుగా 'పైలట్ ప్రాజెక్టు' కింద అయిదు రాష్ట్రాల్లోని వెయ్యి గ్రామాలను ఎంపిక చేశారు. ఈ పథకాన్ని పూర్తిస్థాయిలో అమలుపరచే ఉద్దేశంతో 2014-15 మధ్యకాలంలో ప్రభుత్వం గ్రామాల ఎంపికను మరింత విస్తరించింది. 2015 మార్చిలో మొదటిదశకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా 11 రాష్ట్రాల్లో



### అభివృద్ధి జాడలేని దళిత వాడలు

1,500 గ్రామాలను ఎంపిక చేశారు. 1,117 గ్రామాల్లో అభివృద్ధి ప్రణాళికలు రూపొందించగా- 6,793 పనులకు ఆమోదముద్ర లభించింది. అందులో కేవలం 564 పనులు మాత్రమే పూర్తికాగా- 4,451 పనులు వివిధ దశల్లో నిలిచిపోయాయి. ఆ గ్రామాల అభివృద్ధి కోసం రూ.329.35 కోట్ల నిధులు కేటాయించగా 63.57 శాతమే వ్యయమయ్యాయి. సరిపడా నిధులున్నా వాటిని ఖర్చు చేయడంలో నిర్లక్ష్యం కనిపిస్తోంది. ఇప్పటివరకు కేవలం 140 గ్రామాలను మాత్రమే ఆదర్శ గ్రామాలుగా ప్రకటించారు. అవన్నీ ఉత్తర్ ప్రదేశ్‌కు చెందిన గ్రామాలే కావడం గమనార్హం. మిగిలిన పది రాష్ట్రాల్లో ఏ ఒక్క గ్రామమూ 'ఆదర్శ్' లెక్కల్లో చోటు సంపాదించుకోలేకపోవడం బాధాకరం. ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లోనూ 13 గ్రామాలు ఎంపిక చేశారు. వాటిలో ఏ ఒక్క గ్రామానికి సంబంధించీ అభివృద్ధి ప్రణాళికలను అధికారులు రూపొందించలేకపోయారు. రెండోవిడతగా 2018, అక్టోబరునుంచి వివిధ మార్పులతో పథకాన్ని దేశవ్యాప్తంగా విస్తరించారు. యాభైశాతం దళితులు ఉన్న 4,484 గ్రామాలను ఎంపిక చేశారు. ఒక్కో గ్రామం అభివృద్ధికి రూ.89 లక్షలు అవసరమని అంచనా వేశారు. మొదటి విడతలో పనులు ప్రారంభించడానికి 3,725 గ్రామాలను ఎంపిక చేసి 2019 ఫిబ్రవరినాటికి ఒక్కో గ్రామానికి రూ.38,601 లక్షల వంతున విడుదల చేశారు. కానీ గ్రామ అభివృద్ధి ప్రణాళికలు ఏ దశలో ఉన్నాయన్న విషయంలో స్పష్టత కొరవడింది. అధికారులు, ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయ లోపంవల్ల పనుల్లో జాప్యం జరుగుతోంది. అభివృద్ధి పనులపై అధికారులు తగిన స్థాయిలో దృష్టి సారించకపోవడంతో పథకం స్ఫూర్తి నీరుగారుతోంది.

ప్రధానమంత్రి ఆదర్శ్ గ్రామ యోజన పథకం పూర్తి స్థాయిలో అమలై విజయం సాధిస్తే ప్రగతికి బాటలు పడినట్లే! ఎంపిక చేసిన గ్రామాలతో పాటు అక్కడ ఉండే దళిత వాడలు బ్రహ్మాండంగా అభివృద్ధి చెందుతాయి. ప్రభుత్వ యంత్రాంగం, ప్రజాప్రతినిధులు చిత్తశుద్ధితో పనిచేయడమే ఇప్పుడు కీలకావసరం. గ్రామ అభివృద్ధి ప్రణాళికల్లో సామాజిక భద్రత, రహదారులు, గృహసముదాయం, విద్యుత్తు, సాంకేతిక సదుపాయం, జీవనోపాధి, నైపుణాభివృద్ధి వంటి అంశాలపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాల్సి ఉంది. ఈ పథకం అమలు తీరును తరచిచూసేందుకు ప్రభుత్వం పర్యవేక్షణ- మూల్యాంకన కమిటీని నియమించాలి. ఆ కమిటీ సభ్యులకు ప్రత్యేక అధికారాలు అప్పజెప్పాలి. అవిరళ శ్రద్ధతో పనిచేస్తేనే నిర్దేశించుకున్న లక్ష్యాలు నెరవేరి- ఆదర్శ గ్రామాలు సాక్షాత్కరిస్తాయి. రాజ్యాంగ స్ఫూర్తిని అందిపుచ్చుకొని స్వశక్తితో దళితులు పురోగమించేందుకు వీలు కల్పించే పరిణామమది!

– డాక్టర్ సిలువేరు హరినాథ్

(రచయిత– 'సెస్'లో రీసెర్చ్ అసిస్టెంట్)

## ఈనాడు లేఖలు

### పాత బస్సులు వద్దు

తెలంగాణ రాష్ట్రంలో సామర్థ్యం లేని పాత ఆర్టీసీ బస్సులతో గ్రామీణ ప్రయాణికులు సతమతమవుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి బస్సులను తక్షణమే తొలగించి, కొత్త బస్సుల్ని ప్రవేశపెట్టాల్సిన అవసరం ఉంది. గతంలో రాష్ట్రంలో వరసగా జరిగిన ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని అధికారులు ఈ చర్యలకు ఉపక్రమించాలి. అనుభవం లేని డ్రైవర్లు కూడా ప్రమాదాలకు కారణమవుతున్నారు. ఒకవైపు గ్రామాల్లో బస్సులు లేక ప్రయాణికులు గంటల తరబడి నిరీక్షిస్తున్నారు. మరోపక్క ఆర్టీసీ నష్టాల్లో నడుస్తోందని అధికారులు చెబుతున్నారు. హైదరాబాద్ నగరంలో కొందరు డ్రైవర్లు సిటీ బస్సులను స్టాపులలో కాకుండా ఇష్టానుసారం ఆపుతూ ప్రయాణికుల భద్రతకు ముప్పు కలిగేలా వ్యవహరిస్తున్నారు. ఈ తీరును అరికట్టాల్సి ఉంది.

- బాబురావు, కొత్తపేట, హైదరాబాద్

### దివ్యాంగులను ఆదుకోండి

తెలంగాణ రాష్ట్రంలో దివ్యాంగుల పింఛన్ను ప్రభుత్వం ప్రస్తుతమున్న రూ.1,500 నుంచి రూ.3,016కు పెంచనుంది. ఈ తరుణంలో ఆ నిధులు మరింత సద్వినియోగమయ్యే చర్యలనూ చేపట్టాలి. జులై మాసం నుంచి పెంచిన పింఛన్లు అందనున్నాయి. దివ్యాంగులు ఆ సొమ్మును సమర్థంగా నిర్వహించుకునే అవకాశాలను కల్పించాలి. మహిళా పొదుపు సంఘాల తరహాలో దివ్యాంగులతోనూ పొదుపు సంఘాలను ఏర్పాటు చేయాలి. వారికి కూడా పావలా వడ్డీకే రుణాలు అందించాలి. అర్హులైన దివ్యాంగులకు స్వయం ఉపాధికి శిక్షణ ఇప్పించాలి. దీనిద్వారా వ్యాపార యూనిట్లు స్థాపించుకునేలా వారికి చేయూతనివ్వాలి. అవుట్‌సోర్సింగ్, ఒప్పంద, దినసరి వేతన కూలీల నియామకాల్లో దివ్యాంగులకు ప్రాధాన్యమివ్వాలి. వివిధ రకాల ప్రభుత్వ పథకాల్లో, రాజకీయాల్లో అవకాశాలివ్వాలి.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, నెక్కొండ, వరంగల్ రూరల్‌జిల్లా

## దైవబాంధవ్యం

బాంధవ్యాలు రెండు విధాలు. ఒకటి- జన్మ బాంధవ్యం. తల్లి, తండ్రి, సోదర సోదరీమణులు వంటివారితో. రెండు- వివాహ బాంధవ్యం. భార్య, అత్తగారు, మామగారు, బావమరుదులు, మరదళ్లు, వదినలు తదితరులతో.

బంధుత్వంలో ఆత్మీయతలకన్నా మర్యాదలకు ప్రాధాన్యం ఎక్కువ. దాయాదుల మనస్తత్వం ఎలా అసూయాద్వేషాలతో నిండి ఉంటుందో మహాభారత కథ చెబుతుంది. ద్వాపరయుగంలోనే అలాఉంటే, కలియుగం సంగతి వేరే చెప్పేదేముంది? మనతో ఎలాంటి సంబంధం లేనివారైనా మన ఎదుగుదల చూసి అసూయతో రగిలిపోతారు. అదను దొరికితే అపకారానికి సిద్ధపడతారు.

'మనం వాళ్లకేమీ అపకారం చెయ్యలేదే...' అని మధనపడటం మన వంతు అవుతుంది. అసూయకు ఎలాంటి కారణాలూ ఉండక్కర్లేదు. అది ఒక మానసిక జాడ్యం. 'ఏ కొరివి నిప్పు ఆ కొరివినే కాలుస్తుంది' అన్నట్లు ఎవరి అసూయాద్వేషాలు వారినే దహిస్తాయి.

తమ ధోరణి వల్ల తామే నష్టపోతున్నా అసూయాపరులు ఇసుమంతైనా మారరు. విషభాండంలో ఎంత అమృతం పోసినా, అది విషంగా ఉండిపోయినట్లే- దుష్టులకు ఎంత హితబోధ చేసినా వ్యర్థమే అవుతుంది. రావణుడికి భార్య మండోదరి, సోదరులు విభీషణుడు, కుంభకర్ణుడు సైతం హితబోధ చేస్తారు. రామదూత హనుమంతుడి సలహాలనూ రావణుడు పెడచెవిన పెడతాడు. చివరకు సర్వవిధాలా నాశనమయ్యాడు.

బలగర్వంతో వాలి తన భార్య తార మాటలు పట్టించుకోకుండా సుగ్రీవుడి పైకి మళ్ళీ యుద్ధానికి వెళ్లి నేలకూలతాడు. హితవచనాలు సౌమ్యంగా ఉన్నా, అంతర్గతంగా హెచ్చరికా ఉంటుంది. మృత్యుపాశ బద్ధుడికి వైద్యం నిష్ఫలమైనట్లు, పతనావస్థలో ఉన్న వారికి మంచిమాటలు రుచించవు.

బాంధవ్యం అనగానే మనం భరోసాగా ఉంటాం. కానీ, సాధారణంగా పైపైమాటలే తప్ప ఆచరణలో వారి నుంచి ఎలాంటి సాయమూ లభించదు. ఆపత్కాలంలోనూ ఏదో వంకతో తప్పించుకుంటారు.

కొందరు మనకు బంధువులు కాకపోయినా తొలిపరిచయం నుంచీ ఆత్మీయులైపోతారు. వరసలు కలుపుకొని కులమతాల పట్టింపుల్లేకుండా ఆత్మీయులైపోతారు. మనం అడగటం కోసం వేచిచూడకుండా అవసరానికి ఆదుకుంటారు. ఆపత్కాలంలో అండగా ఉంటారు. వీటినే భావబంధాలు అంటారు.



అంతర్యామి

కొందరు స్వభావరీత్యా సౌమ్యులు. ఉపకారబుద్ధితో అందరితో మంచిగా ఉండి ఎన్నో విధాల సాయం చేస్తారు. స్వపర భేదం చూపరు. కానీ, వారినుంచి సాయం పొందినవారు ఎక్కడ పలకరించాల్సి వస్తుందో అన్నట్లు మొహం చాటుచేసుకుంటారు. పొరపాటున ఏదైనా సాయం కోరితే తక్షణం లేదనేస్తారు. దానితో వారి మనసు చివుక్కుమంటుంది. అయినా పైకి తెలియనివ్వరు. ఏమీ లేనట్లే ప్రవర్తిస్తారు. కొందరు అలాంటి కృతఘ్నతా వైఖరిని భరించలేక, పదే పదే ఆ విషయాన్నే తలచుకుంటూ బాధపడతారు. మంచికి రోజులు కావని వాపోతారు.

మనం గ్రహించాల్సిన విషయం- బంధువులకు దూరం కావడం అంటే భగవంతుడికి దగ్గర అవుతున్నామని. కొంత కాలం వరకే మన బంధుత్వాలు. అటు తరవాత మన బంధుప్రీతి నుంచి దైవప్రీతికి మారిపోవాలి. ప్రాపంచిక బంధాలన్నీ తాత్కాలికమే. కేవలం దైవబాంధవ్యమే శాశ్వతం. లోకాలన్నీ నశించినా, ఆయన నశించడు. అందుకే అవ్యయుడు అంటారాయనను.

మనకు తల్లిని, తండ్రిని, గురువును, కుటుంబ పరివారాన్నీ సిరి సంపదల్నీ ఇచ్చింది ఆయనే. మన ఆయువును నిర్ణయించేదీ ఆయనే. ఈ సత్యం అర్థం కానంతవరకు మనం ప్రపంచభ్రాంతిలో కొట్టుమిట్టాడుతాం.

అర్థమయ్యాక మనం ఆయనతో అనుబంధానికి బాంధవ్యానికి అంకితమవుతాం. ఆ క్షణం నుంచి ఆయనే మనకు సమస్తం!

– కె.విజయలక్ష్మి

## ఒకే వేదికపై ముగ్గురు సీఎంలు

గోదావరి నది పరివాహక ప్రాంత రాష్ట్రాలకు చెందిన ముగ్గురు ముఖ్యమంత్రులు కాళేశ్వరం ప్రారంభోత్సవంలో పాల్గొనడం విశేష ఆకర్షణగా నిలిచింది. తెలంగాణ ఆవిర్భవించిన తరువాత మహారాష్ట్ర ప్రభుత్వంతో, ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల ఏర్పడిన జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వంతో ముఖ్యమంత్రి కేసీఆర్ స్నేహ పూర్వక దౌత్య సంబంధాలు నెరపుతున్న విషయం తెలిసిందే. గోదావరి జలాలను సమర్థంగా వాడుకునేందుకు ప్రాజెక్టులు నిర్మించుకోవాలంటూ కేసీఆర్ అన్యాపదేశంగా చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే పొరుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కాళేశ్వరం ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ప్రారంభోత్సవం అనంతరం కేసీఆర్ హెలిప్యాడ్ వద్దకు వెళ్లి ఇద్దరు సీఎంలు, గవర్నర్‌కు వీడ్కోలు పలికారు.



## కేసీఆర్ ఆనందం

కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభోత్సవం విజయవంతం కావడంపై ముఖ్యమంత్రి కేసీఆర్ ఆనందం వ్యక్తంచేశారు. కార్యక్రమం అనంతరం ఆయన మంత్రులు, అధికారులు, ఇంజినీర్లతో మాట్లాడుతూ సంతోషాన్ని పంచుకున్నారు. కార్యక్రమాన్ని చక్కటి సమన్వయంతో నిర్వహించారని అభినందించారు.



మేడిగడ్డ బ్యారేజీ వద్ద యాగశాలలో హోమం నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ దంపతులు

# జల సంకల్పం

## 40 మంది వేద పండితులతో యాగం



గవర్నర్ నరసింహన్, తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కేసీఆర్, జగన్‌మోహన్‌రెడ్డితో 'మేఘా' ఇంజినీరింగ్ సంస్థ ఎండీ పి.వి.కృష్ణారెడ్డి



కన్నెపల్లి పంప్‌హౌస్‌ను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్. చిత్రంలో పక్కన గవర్నర్ నరసింహన్



కాళేశ్వరం ప్రాజెక్టు చిత్రపటం చూపుతూ గవర్నర్ నరసింహన్, మహారాష్ట్ర, ఏపీ ముఖ్యమంత్రులకు వివరాలు వెల్లడిస్తున్న కేసీఆర్



కన్నెపల్లి వద్ద ఎయిర్ పైపు నుంచి ఎగిసిపడుతున్న జలం

**ఈనాడు - వరంగల్, ఈనాడు డిజిటల్ - జయశంకర్ భూపాలపల్లి:** తెలంగాణ వరప్రదాయని కాళేశ్వరం ప్రారంభోత్సవం సందర్భంగా మేడిగడ్డ వద్ద యాగశాలలో ముఖ్యమంత్రి కేసీఆర్ దంపతులు ఉదయం 8 గంటల నుంచి జలసంకల్ప మహాయాగం నిర్వహించారు. శృంగేరి పీఠానికి చెందిన ఫణిశశాంక శర్మ, గోపీకృష్ణ శర్మ ఆధ్వర్యంలో 40 మంది వేదపండితులతో యాగం జరిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ దంపతులు 9.12 గంటలకు యాగశాలలోకి ప్రవేశించారు. భక్తిశ్రద్ధలతో గణపతి పూజ చేసి గోదావరి మాతను పూర్ణ కలశాలలోకి ఆవాహనం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇలాంటి భారీ నిర్మాణంలో ఎలాంటి అడ్డంకులు, అపదలు కలగకుండా ప్రకృతి, నీరు ద్వారా ఎవరికి బాధ కలగకుండా ఈ క్రతువు సాగించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి గోదావరి నిండుగా ప్రవహించాలని కాంక్షిస్తూ వరుణ దేవుడిని ఆహ్వానించారు. రాష్ట్రంపై గోదావరి తల్లి చల్లని కరుణచూపాలని యాగంలో వేడుకున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ దంపతులు పట్టు వస్త్రాలు ధరించి యాగంలో పాల్గొన్నారు. నరసింహన్, జగన్, ఫడణవీస్, రాష్ట్ర మంత్రులు యాగక్షేత్రాన్ని దర్శించుకున్నారు. పూర్ణాహుతి కార్యక్రమంలో వీరంతా పాల్గొని, వేదపండితుల ఆశీర్వాదం తీసుకున్నారు. తెలంగాణ మంత్రులు ఈటల రాజేందర్, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఇంద్రకరణ్‌రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, ఆంధ్రప్రదేశ్ మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కె.జోషి, తెలంగాణ డీజీపీ మహేందర్‌రెడ్డి, మహారాష్ట్ర డీజీపీ జైస్వాల్, ఎంపీలు జోగినిపల్లి సంతోష్‌కుమార్, బి.వెంకటేష్ నేత, విప్ పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యేలు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, గండ్ర వెంకటరమణారెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, జడ్పీ ఛైర్‌పర్సన్ తుల ఉమ, నీటిపారుదల శాఖ ఈఎన్‌సీలు మురళీధర్‌రావు, హరిరాం, వెంకటేశ్వర్లు, ఎన్.పి.డి.సి.ఎల్. సీఎండీ గోపాలరావు, ట్రాన్స్ కో డైరెక్టర్ సూర్యప్రకాష్, ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి స్మితాసబర్వాల్, ఓఎస్డీ ప్రియాంక వర్గీస్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ వాసం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

### సీఎం కల సాకారం కానున్నది

– సీఎస్ ఎస్‌కే జోషి

అతిథులు, బ్యాంకర్లను సన్మానించే కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టును అతి స్వల్ప కాలంలోనే నిర్మించి ప్రారంభించుకోవడం తెలంగాణకు గర్వకారణమని అన్నారు. తెలంగాణ భూముల్లో బంగారు పంటలు పండించాలనే కేసీఆర్ కల సాకారం కాబోతుందని పేర్కొన్నారు. ప్రాజెక్టు నిర్మాణంలో పాలు పంచుకున్నవారందరికీ జోషి కృతజ్ఞతలు తెలిపారు.

## సినీ ప్రముఖుల శుభాకాంక్షలు

కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని సినీప్రముఖులు ప్రశంసలు కురిపించారు. తెలంగాణ రైతాంగంతోపాటు సీఎం కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులకు సామాజిక ట్విటర్ వేదికగా శుభాకాంక్షలు చెప్పారు.

'ప్రపంచంలో అతి పెద్ద లిఫ్ట్‌ఇరిగేషన్ ప్రాజెక్టు ప్రారంభించినందుకు శుభాకాంక్షలు. ఇంజినీర్ల ప్రతిభకు ఇది నిదర్శనం'

**- కథానాయకుడు నాగార్జున**

'అద్భుతాన్ని సాక్షాత్కరింపజేసినందుకు తెలంగాణ ప్రభుత్వానికి అభినందనలు'

**- హీరో రవితేజ**

'కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా లక్షలాది రైతుల కళ్లల్లో ఆనందబాష్పాలు చూస్తున్న ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుకి ధన్యవాదాలు. తెలంగాణ రైతులకి శుభాకాంక్షలు

**- రచయిత పరుచూరి గోపాలకృష్ణ**

'ముందుచూపుతో ఆలోచించిన కేసీఆర్‌కి ధన్యవాదాలు'

**- నటుడు ప్రకాష్‌రాజ్,**

''మనమంతా గర్వించదగ్గ సమయం. కాళేశ్వరం ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు''

**- యువ కథానాయకులు రామ్, రానా**

'సవాల్‌తో కూడిన ప్రాజెక్టుని పూర్తి చేసిన ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావుకి శుభాకాంక్షలు'

**హీరో రాజశేఖర్**





మేడిగడ్డ ప్రాజెక్టు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి. పక్కన తెలంగాణ, మహారాష్ట్ర సీఎంలు కేసీఆర్, ఫడణవీస్, తెలుగు రాష్ట్రాల గవర్నర్ నరసింహన్ తదితరులు

# మీ రాక మాకెంతో సంతోషం

● గవర్నర్, సీఎంలకు కేసీఆర్ సత్కారం ● బ్యాంకర్లకూ కృతజ్ఞతలు

**ఈనాడు, హైదరాబాద్ :** కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి వచ్చిన ముఖ్య అతిథులను, బ్యాంకర్లను ముఖ్యమంత్రి కేసీఆర్ ఘనంగా సత్కరించారు. గవర్నర్ నరసింహన్, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిలకు సీఎం శాలువాలు కప్పి, సన్మానం చేశారు. తమ ఆహ్వానాన్ని మన్నించి వచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. హెలిప్యాడ్ వద్దకు వెళ్లి వారికి ఘనంగా వీడ్కోలు పలికారు. అలాగే ఈ ప్రాజెక్టుకు ఆర్థిక సహకారం అందించిన వివిధ బ్యాంకుల ప్రతినిధులను కూడా ముఖ్యమంత్రి సన్మానించారు. ఆంధ్రా బ్యాంక్ ఎండీ, సీఈవో పకిరిసామి, ఇండియన్ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎంకే భట్టాచార్య, ఆర్.ఇ.సి. లిమిటెడ్ డైరెక్టర్ (టెక్నికల్) ఎస్.కె. గుప్తా, పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ (కమ్యూనికేషన్స్) పి.కె.సింగ్, అలహాబాద్ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.రామచంద్ర, ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బాలకృష్ణ అల్సె, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హేమంత్ కుమార్ తమ్టా, పంజాబ్ నేషనల్ బ్యాంక్ జనరల్ మేనేజర్ బినోద్‌కుమార్, నాబార్డ్ సీజీఎం విజయ్‌కుమార్, కార్పొరేషన్ బ్యాంక్ డీజీఎం, జోనల్ హెడ్ ఎంజే అశోక్, యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచి అధిపతి హైదరాబాద్ ఎస్.వి.రామకృష్ణ, ఆంధ్రా బ్యాంక్ జీఎం శ్యామల్ గోష్, పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఏజీఎం మహమ్మద్ మక్సూద్ అలీ, ఇండియన్ బ్యాంక్ జోనల్ మేనేజర్ ఆర్.మనోహర్ తదితరులు సన్మానం పొందినవారిలో ఉన్నారు.

### గవర్నర్, సీఎంలకు ఘనస్వాగతం

అమరావతి నుంచి హెలికాప్టర్‌లో మేడిగడ్డకు చేరుకున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మంత్రి ప్రశాంత్‌రెడ్డి, ఎంపీ సంతోష్‌కుమార్, విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డిలు ఘన స్వాగతం పలికారు. జగన్‌తో పాటు ఏపీ మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్‌లు వచ్చారు. వారిని తీసుకొని యాగశాల వద్దకు రాగా సీఎం కేసీఆర్ వారి వద్దకు వచ్చి స్వాగతం పలికారు. జగన్‌ను శాలువాతో సత్కరించారు. గవర్నర్ యోగా దినోత్సవంలో పాల్గొని నేరుగా బేగంపేట విమానాశ్రయానికి వచ్చారు. దేవేంద్ర ఫడణవీస్ ప్రత్యేక విమానంలో నాందేడ్ నుంచి బేగంపేటకు వచ్చారు. అక్కడ మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి స్వాగతం పలికారు. అక్కడి నుంచి వారు హెలికాప్టర్‌లో బయల్దేరారు. మేడిగడ్డకు చేరుకోగానే యాగశాలకు తీసుకువెళ్లారు. సీఎం కేసీఆర్ అక్కడికి వచ్చి వారిని సత్కరించారు.

### పది నిమిషాలు దృశ్యరూప ప్రదర్శన

కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభోత్సవం సందర్భంగా దాదాపు 10 నిమిషాల పాటు ప్రాజెక్టుపై దృశ్యరూప ప్రదర్శన ఇచ్చారు. ప్రాజెక్టు ఏ విధంగా రూపుదిద్దుకుంది, ఏ రకంగా సాంకేతికతను వినియోగించుకుంది, అధికారుల కృషి, మానవ వనరుల వినియోగం గురించి సీఎం వివరించారు.

## భాగస్వామినవడం పూర్వజన్మ సుకృతం: హరీశ్

"సీఎస్ ఎస్‌కే జోషి, కాళేశ్వరం ప్రాజెక్టు సీఈ హరిరాంతో కలిసి మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చించడానికి అక్కడికి వెళ్లాం. రాత్రికల్లా తిరిగి రావాల్సి ఉండగా.. పని పూర్తికాకపోవడంతో అక్కడే ఉండిపోయాం. దుస్తులు తీసుకెళ్లకపోవడంతో కొత్తవి కొనుక్కుని అక్కడే ఉండి, మర్నాడు పని పూర్తిచేసుకొని వచ్చాం. ఉన్నత స్థాయి అధికారులు కూడా ఏ రకంగా శ్రమించారో అనడానికి ఇది నిదర్శనం"

**- హరీశ్‌రావు**

**సిద్దిపేట, న్యూస్‌టుడే:** 'కాళేశ్వరం పథకం దేశానికి ఆదర్శ నమూనా. గతంలో ప్రాజెక్టుల నిర్మాణానికి దశాబ్దాలు పట్టేది. ముఖ్యమంత్రి కేసీఆర్ పట్టుదల, ఇంజినీర్లు, అధికారుల కృషితో మూడేళ్లలోనే పూర్తి చేసుకున్నాం. ఎంతటి భారీ ప్రాజెక్టునైనా వేగంగా పూర్తి చేయవచ్చనే భరోసా దీంతో దేశానికి కలిగింది' అని మాజీమంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో తాను కూడా భాగస్వామి అయినందుకు ఆనందంగా ఉందని.. ఏ జన్మలో చేసుకున్న పుణ్యమో, తల్లిదండ్రుల పుణ్యఫలమో.. తనకు ఈ అవకాశం దక్కిందని పేర్కొన్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా చంద్లాపూర్ రంగనాయకసాగర్ చెంతనే ఉన్న రంగనాయకగుట్టపై కాళేశ్వరం ప్రారంభోత్సవ సంబురాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పాటు కావడం ఎంత ముఖ్యమో.. ఈ ప్రాజెక్టు ప్రారంభం కావడమూ అంతే ముఖ్యమన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఇంజినీర్‌లా ఆలోచించి గోదావరి జలాల్ని మళ్లించి తెలంగాణలోని బీడు భూములను సస్యశ్యామలం చేయడానికి ప్రణాళిక రూపొందించారని కొనియాడారు.



రంగనాయకగుట్టపై కేక్ కట్ చేస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, సిద్దిపేట జడ్పీ ఛైర్‌పర్సన్ రోజాశర్మ తదితరులు

Eenadu epaper

# ఊరూరా ఉజ్వలోత్సవాలు

- దేవాలయాల్లో ప్రత్యేక పూజలు
- సీఎం కేసీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకాలు
- నియోజకవర్గ కేంద్రాల్లో వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యేలు
- మిఠాయిలు పంచి.. పటాకులు పేల్చి..
- తెరాస ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ధూంధాంగా కాళేశ్వరం సంబురాలు

ఈనాడు, హైదరాబాద్, వరంగల్ - న్యూస్ టుడే యంత్రాంగం: తెలంగాణ జీవధార కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా సంబురాలు మిన్నంటాయి. జిల్లా, మండల కేంద్రాలు, గ్రామాల్లో తెరాస ప్రజాప్రతినిధులు, నేతలు, కార్యకర్తలు, అభిమానుల ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఉత్సవాలు జరిగాయి. అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పార్టీ శ్రేణులు, అభిమానులు, రైతులు క్షీరాభిషేకం చేశారు. ప్రధాన దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రాజెక్టు కింద సాగునీటి సరఫరా, ఎత్తిపోతల విశిష్టతను రైతు సమన్వయ సమితుల సభ్యులు అన్నదాతలతో చర్చించారు.

- సిరిసిల్ల నియోజకవర్గంలోని ఎగువ మానేరు వద్ద జరిగిన కాళేశ్వరం ఉత్సవాల్లో తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పాల్గొన్నారు.
- సిద్దిపేట నియోజకవర్గంలోని చిన్నకోడూరు మండలం రంగనాయకసాగర్ ప్రాంతంలో జరిగిన సంబురాల్లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు పాల్గొన్నారు.
- తెలంగాణభవన్‌లో పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించారు. ఉదయం పది గంటలకే మంత్రి తలసాని, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇతర నేతలు తెలంగాణభవన్‌కు చేరుకున్నారు. తెలంగాణ తల్లి, తెరాస సిద్ధాంతకర్త ఆచార్య జయశంకర్ విగ్రహాలకు పూలమాలలు వేశారు. బాణసంచా కాల్చి, మిఠాయిలు పంపిణీ చేశారు.
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆధ్వర్యంలో పీపుల్స్‌ప్లాజా, నెక్లెస్‌రోడ్, ఖైరతాబాద్, ఇతర ప్రాంతాల్లో ఉత్సవాలను నిర్వహించారు.
- హైకోర్టులో న్యాయవాద ఐకాస ఆధ్వర్యంలో ఉత్సవాలు జరిపారు. న్యాయవాదులు మిఠాయిలు పంచుకున్నారు.
- టీజీవో భవన్‌లో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మమత, సత్యనారాయణల ఆధ్వర్యంలో కాళేశ్వరం వేడుకలు జరిపారు. కేక్ కోసి పంచి పెట్టారు.
- రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ అధ్యక్షుడు సయ్యద్ అక్బర్ హుస్సేన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో కాళేశ్వరం ఉత్సవాలను నిర్వహించారు. మైనారిటీ నేతలు నాంపల్లి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.
- కాళేశ్వరం ప్రాజెక్టు కింద అత్యధికంగా సాగు భూములకు నీరు అందనున్న నిజామాబాద్ జిల్లాలో సంబురాలు మిన్నంటాయి. కలెక్టరేట్ ఆవరణలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా బోనాలు ప్రదర్శించారు. ఎమ్మెల్యేలు గణేశ్‌గుప్తా, బాజిరెడ్డి గోవర్ధన్, ఎమ్మెల్సీ ఆకుల లలిత ర్యాలీలు, ఇతర కార్యక్రమాల్లో పాల్గొన్నారు.
- రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గద్వాలలో బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, జడ్చర్లలో లక్ష్మారెడ్డి, ఖమ్మంలో పువ్వాడ అజయ్‌కుమార్, ఇల్లెందులో హరిప్రియ, కొత్తగూడెంలో వనమా వెంకటేశ్వరరావు, పెద్దపల్లిలో దాసరి మనోహర్‌రెడ్డి, రామగుండంలో కోరుకంటి చందర్, ఆసిఫాబాద్‌లో ఆత్రం సక్కు, జడ్పీ ఛైర్మన్ కోవ లక్ష్మి, కాగజ్‌నగర్‌లో కోనేరు కోనప్ప, కోదాడలో బొల్లం మల్లయ్య, కరీంనగర్‌లో మాజీ ఎంపీ వినోద్‌కుమార్, వరంగల్ తూర్పులో ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఉత్సవాల్లో పాల్గొన్నారు.



## ఊరంతా విందు

కన్నెపల్లి గ్రామస్థులందరికీ శుక్రవారం ప్రాజెక్టు ప్రాంతంలో ప్రత్యేక విందు ఏర్పాటు చేశారు. కన్నెపల్లి పంపుహౌస్ కట్టేందుకు సుమారు 300 ఎకరాల భూసేకరణ జరిగింది. గ్రామనికి చెందిన 150 మంది రైతులు తమ భూములను ఇచ్చారు. వారికి ప్రభుత్వం పరిహారం అందజేసింది. అయితే, వారి త్యాగ ఫలితంగా ప్రాజెక్టు నిర్మాణం సాధ్యమైందని భావించిన ప్రభుత్వం శుక్రవారం పంపుహౌస్ వద్ద చికెన్ బిర్యానీ, కోడికూర, చేపల కూర, గులాబ్‌జామ్‌లతో రుచికరమైన భోజనాన్ని కన్నెపల్లి వాసులకు ఏర్పాటుచేసింది.

## ఉపరాష్ట్రపతి శుభాకాంక్షలు



కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభోత్సవం సందర్భంగా తెలంగాణ ప్రజలకు ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు శుభాకాంక్షలు తెలిపారు. "బహుళస్థాయి, బహుళ ఉపయోగాలున్న ప్రపంచంలోనే పెద్దదైన కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి అంకితభావంతో పనిచేసిన తెలంగాణ ప్రభుత్వం, సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావులకు హృదయపూర్వక శుభాకాంక్షలు" అని వెంకయ్యనాయుడు ట్విటర్‌లో పేర్కొన్నారు.



## దేశంలోనే గొప్ప ప్రాజెక్టు: తలసాని

తెలంగాణభవన్‌లో మంత్రి తలసాని మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టు చరిత్రలో నిలుస్తుందని చెప్పారు. 'నీళ్లు, నిధులు, నియామకాలు అనే నినాదంతో తెలంగాణ ఉద్యమం వచ్చింది. నీళ్ల కల సాకారం చేసుకున్నాం. ప్రాజెక్టుకు కర్త, కర్మ, క్రియ కేసీఆర్. ఇరుగు పొరుగు రాష్ట్రాలతో కలిసిమెలిసి ఉండాలని కేసీఆర్ భావించి ప్రారంభోత్సవానికి మహారాష్ట్ర, ఏపీ సీఎంలను ఆహ్వానించారు. కాళేశ్వరం నీటితో తెలంగాణకు అన్నీ శుభాలే జరగనున్నాయి" అని చెప్పారు. అనంతరం తలసాని, దానం నాగేందర్ బాణసంచా కాల్చారు.

## గన్‌పార్కు నుంచి రవీంద్రభారతి దాకా..

తెలంగాణ వికాస సమితి, తెలంగాణ రచయితల సంఘం, తెలంగాణ చైతన్య సాహితీ, జానపద కళాకారుల సంఘం, ఒగ్గువీర్ల సంఘం, టీవీ రచయితల సంఘం, వృత్తి కళాకారుల సంక్షేమ సంఘం, చిందు యక్షగాన సంఘాల ప్రతినిధులతో కలిసి రాష్ట్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో గన్‌పార్కులో తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద ఘనంగా నివాళులర్పించారు. కళాకారులు వివిధ సంప్రదాయ కళారూపాలను ప్రదర్శించి అమరులకు కళాంజలిని ఘటించారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి, ప్రముఖ కవి దేశపతి శ్రీనివాస్, గ్రంథాలయ పరిషత్ అధ్యక్షుడు అయాచితం శ్రీధర్, తెలంగాణ సాహిత్య అకాడమి అధ్యక్షుడు నందిని సిధారెడ్డి, కార్యదర్శి ఏనుగు నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం కళాకారులు, కవులు, సాహితీవేత్తలు భారీ ఊరేగింపుగా గన్‌పార్కు నుంచి అసెంబ్లీ మీదుగా రవీంద్రభారతికి చేరుకుని ప్రదర్శన, సాహిత్యసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సిధారెడ్డి మాట్లాడుతూ.. నాలుగు కోట్ల మంది హృదయాల్లో తడి ఉప్పొంగుతున్న పండుగ ఇదన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తవడం వెనుక ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు అప్పటి మంత్రి హరీశ్‌రావు కృషి కచ్చితంగా గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ.. కాళేశ్వరం సరికొత్త పరివర్తనకు కారణభూతమవుతుందని అన్నారు.



సిరిసిల్లలోని అంబేడ్కర్ చౌక్ వద్ద బతుకమ్మ ఆటలతో సంబురాలు



మహబూబాబాద్‌లో బతుకమ్మలతో పాల్గొన్న ఉద్యోగినులు, మహిళలతో కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య



గిరిజనుల నృత్యాలతో సందడిగా మారిన గన్‌పార్క్

## మంత్రులు ప్రారంభించారిలా..



పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నందిమేడారం వద్ద ఆరో ప్యాకేజీలోని పంప్‌హౌస్‌ను రాష్ట్ర కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి ప్రారంభించారు. స్థానిక ప్రజాప్రతినిధులు ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మోటార్లు ఆన్ చేశారు. నిర్మాణ శైలిని పరిశీలించిన మంత్రి ఇంజినీరింగ్ అధికారులను అభినందించారు.



పెద్దపల్లి జిల్లా మంథని మండలం కాసిపేట సమీపంలోని అన్నారం పంప్‌హౌస్‌ను రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్ అలీ ప్రారంభించారు. ఇక్కడ అమర్చిన 16 పంప్‌ల పనితీరు గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు.



జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ మండలంలో అన్నారం బ్యారేజీ గేట్ స్విచ్‌ను వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి ఆన్ చేశారు.



పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం గోలివాడలో పంప్‌హౌస్‌ను రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రారంభించారు. సమీపంలోని అప్రోచ్ కెనాల్‌లో గోదారమ్మకు పూలు సమర్పించి హారతిచ్చారు. ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, పెద్దపల్లి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఇదే జిల్లా మంథని మండలం సిరిపురం సమీపంలోని సుందిళ్ల బ్యారేజీ వద్ద కూడా మంత్రి ఈశ్వర్ పూజలు నిర్వహించారు. స్విచ్ ఆన్ చేయగానే గోదావరి జలాలు కిందకు పరవళ్లు తొక్కడంతో స్థానిక ప్రజాప్రతినిధులతో పాటు అధికారులు ఆనందంతో కేరింతలు కొట్టారు.



కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్ సమీపంలోని సొరంగంలో ఉన్న పంప్‌హౌస్ వద్ద రాష్ట్ర విద్యా శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి పూజా కార్యక్రమాల్ని నిర్వహించారు. మంత్రి సతీమణి, కుటుంబ సభ్యులు కూడా పాల్గొన్నారు. ఇది కాళేశ్వరంలో కీలకమైన ఎనిమిదో ప్యాకేజీలోనిది. భారీ మోటార్ల వద్ద గంటన్నరపాటు నిర్వహించిన ప్రారంభ కార్యక్రమంలో చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌తోపాటు తుంగతుర్తి, నకిరేకల్ ఎమ్మెల్యేలు గ్యాదరి కిశోర్, చిరుమర్తి లింగయ్య ఇతర అధికారులు పాల్గొన్నారు. - ఈనాడు డిజిటల్, కరీంనగర్

# తెలంగాణ నీళ్ల కల ఫలించింది

- కాళేశ్వరం ప్రారంభోత్సవం రాష్ట్రానికి పెద్ద పండుగ
- తెరాస ఎంపీలు కేశవరావు, నామా



దిల్లీలోని తెలంగాణ భవన్ ఆవరణలో ఉన్న కనకదుర్గ ఆలయంలో పూజలు చేస్తున్న తెరాస ఎంపీలు

ఈనాడు, దిల్లీ : దశాబ్దాల తెలంగాణ నీళ్ల కల ఫలించిందని.. కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభోత్సవం రాష్ట్రానికి పెద్ద పండుగని తెరాస పార్లమెంటు సభ్యులు పేర్కొన్నారు. దిల్లీలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. పార్లమెంటరీ పార్టీ నేత కె.కేశవరావు మాట్లాడుతూ కాళేశ్వరం ప్రపంచంలోనే పెద్ద ప్రాజెక్టుల్లో ఒకటని కొనియాడారు. ఇది కేసీఆర్ కలలుగన్న ప్రాజెక్టని వ్యాఖ్యానించారు. తెరాస లోక్‌సభా పక్ష నేత నామా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రాజెక్టుల నిర్మాణం 30.. 40 ఏళ్లుగా మాటలకే పరిమితమైతే.. మూడేళ్లలోనే సాకారం చేసి చూపిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా గోదావరి నదినే ఎత్తిపోస్తున్నామన్నారు. ఓ నదినే ఎత్తిపోయడం ప్రపంచంలోనే మొదటిసారని పేర్కొన్నారు. ప్రాజెక్టులపై విపక్ష నేతలు విమర్శలు మాని తెలంగాణ బిడ్డలుగా అభివృద్ధికి సహకరించాలని కోరారు. కాళేశ్వరాన్ని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించాలని ఆయన కోరారు. రాష్ట్రపతి ప్రసంగంలో కాళేశ్వరం ప్రస్తావన తెస్తే బాగుండేదని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రాజెక్టు నిర్మాణంలో మాజీ మంత్రి హరీశ్‌రావు పాత్ర ఉందని కేశవరావు ఓ ప్రశ్నకు బదులిచ్చారు. అనంతరం ఎంపీలు కేక్ కోశారు. తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేశారు. తెలంగాణ భవన్ ఆవరణలోని శ్రీవేంకటేశ్వర, కనకదుర్గ ఆలయాల్లో పూజలు చేశారు. సమావేశంలో తెరాస లోక్‌సభ సభ్యులు కొత్త ప్రభాకర్‌రెడ్డి (మెదక్), బీబీ పాటిల్ (జహీరాబాద్), పి.రాములు (నాగర్‌కర్నూల్), జి.రంజిత్‌రెడ్డి (చేవెళ్ల), పసునూరి దయాకర్ (వరంగల్), మాలోత్ కవిత (మహబూబాబాద్), రాజ్యసభ సభ్యులు కెప్టెన్ లక్ష్మీకాంతారావు, బండ ప్రకాశ్ ముదిరాజ్, లింగయ్య యాదవ్, దిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి మందా జగన్నాథం, మాజీ ఎంపీ సీతారాం నాయక్ పాల్గొన్నారు.



ఖమ్మం నగరంలో శుక్రవారం తెరాస ఆధ్వర్యంలో నిర్వహించిన ద్విచక్ర వాహన ప్రదర్శన



మెదక్‌లో ప్రారంభోత్సవ సంబరాల్లో డోలు వాయిస్తున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

## భక్తి శ్రద్ధలతో హోమాదులు

### యాదాద్రిలో..



కాళేశ్వరం ప్రాజెక్టు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి బాలాలయంలో హోమం నిర్వహించారు. దీనికి ఎమ్మెల్యే గొంగిడి సునీత దంపతులు హాజరయ్యారు.

### భద్రాద్రిలో..



కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభోత్సవం సందర్భంగా భద్రాచలం శ్రీరామచంద్రమూర్తి దివ్య సన్నిధిలో శుక్రవారం వైదిక పెద్దలు హోమాదులు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.



## మా ప్రపంచకప్‌నూ చూడండి

**ఒకవైపు ఇంగ్లాండ్ వేదికగా క్రికెట్ ప్రపంచకప్ జోరుగా నడుస్తోంది. ఇంగ్లాండ్‌కు 976 కి.మీ దూరంలో మరో కప్ నడుస్తోంది. అదేమీ చిన్న కప్ కాదు ఫిఫా ప్రపంచకప్.. కానీ మహిళల టోర్నీ.. క్రికెట్లో మునిగి తేలుతున్న అభిమానులకు ఈ కప్‌ను పెద్దగా పట్టించుకోవట్లేదు. మరి ఈ కప్ ఏమిటి.. ప్రస్తుత పరిస్థితి ఏంటో తెలుసుకుందామా..**

ఎనిమిదో మహిళల ఫుట్‌బాల్ ప్రపంచకప్‌కు ఫ్రాన్స్ ఆతిథ్యం ఇస్తోంది. 24 జట్లు తలపడుతున్న ఈ మెగా ఈవెంట్ ప్రస్తుతం ప్రిక్వార్టర్స్ వరకు వచ్చింది. గ్రూప్-ఎలో ఫ్రాన్స్, నార్వే, నైజీరియా, దక్షిణకొరియా, గ్రూప్-బిలో జర్మనీ, స్పెయిన్, చైనా, దక్షిణాఫ్రికా, గ్రూప్-సిలో ఇటలీ, ఆస్ట్రేలియా, బ్రెజిల్, జమైకా, గ్రూప్-డిలో ఇంగ్లాండ్, జపాన్, అర్జెంటీనా, స్కాట్లాండ్, గ్రూప్-ఇలో నెదర్లాండ్స్, కెనడా, కామెరూన్, న్యూజిలాండ్, గ్రూప్-ఎఫ్‌లో అమెరికా, స్వీడన్, చిలీ, థాయ్‌లాండ్ ఆడుతున్నాయి. జర్మనీ, నార్వే, ఇటలీ, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, స్పెయిన్ ఇప్పటికే ప్రిక్వార్టర్స్ చేరాయి. డిఫెండింగ్ ఛాంపియన్ అమెరికాతో పాటు బ్రెజిల్, జర్మనీ టైటిల్ ఫేవరెట్లుగా ఉన్నాయి.

- ఫార్మిగా (బ్రెజిల్, 41 ఏళ్లు) ప్రపంచకప్ ఆడిన పెద్ద వయస్కురాలిగా రికార్డు సృష్టించింది. ఆమె ఏడు ప్రపంచకప్‌లు ఆడడం మరో విశేషం.
- మార్టా (బ్రెజిల్) ఇప్పటికే 17 గోల్స్ కొట్టి ప్రపంచకప్ చరిత్రలో అత్యధిక గోల్స్ సాధించిన క్రీడాకారిణిగా నిలిచింది.
- కెనడా అమ్మాయి క్రిస్టీన్ సింక్లియర్ 16 ఏళ్లకే ఈ టోర్నీలో ఆడే అవకాశాన్ని సంపాదించింది.



### ఓ మంచి క్రికెటర్..!

ఐపీఎల్‌లో బ్యాటుతో పరుగుల వరద పారించడంతో పాటు.. దూకుడు తగ్గించుకోవడంతో.. టాంపరింగ్ వివాదాన్ని మరిచిపోయి హైదరాబాద్‌లో అభిమానులు అతడికి బ్రహ్మరథం పట్టారు. అందుకే ఆస్ట్రేలియాకు వెళ్తూ.. మీ మద్దతు మరువలేనంటూ అతడు తీవ్ర ఉద్వేగానికి గురయ్యాడు. అణకువగా ఉండడం, అభిమానుల ప్రేమను పొందడంలో ఉన్న సంతోషం తెలిసొచ్చిందేమో.. 'మంచి క్రికెటర్‌గా రిటైర్‌కావాలనుకుంటున్నా' అని వినయంగా ప్రకటించేశాడు వార్నర్. ప్రపంచకప్‌లో ఓ చిన్నారి అభిమానికి తన 'మ్యాచ్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు ట్రోఫీని ఇవ్వడం ద్వారా తన మంచి మనసును చాటుకున్న వార్నర్‌కు మనమూ బెస్టాఫ్ లక్ చెబుదామా!

## పోరాట యోధుడు

**అది టీ20 అయినా వన్డేలైనా..టెస్టులైనా ఓ వైపు పరుగుల వరద పారిస్తూనే ఉంటాడు. ప్రశంసలందుకుంటూనే ఉంటాడు. కానీ అతడు 'వీడు కాస్త తేడా' టైపు. అద్భుతంగా ఆడుతున్నా.. దుందుడుకు స్వభావంతో నిత్యం వివాదాల్లో నానుతూనే ఉంటాడు. విమర్శలతో తడిసిముద్దవుతూనే ఉంటాడు. క్రమశిక్షణ గల సైనికుడిలా మైదానంలో దూసుకుపోతాడు. అంతలోనే క్రమశిక్షణ చర్యలకు గురవుతాడు. వివాదాలు అతడి కెరీర్‌లో అంతర్భాగం. కానీ ఎన్నిసార్లు పడ్డా.. అన్నిసార్లూ బలంగా లేచాడు. టాంపరింగ్ అనంతరం తాజా పునరాగమనం అతడి కెరీర్‌లో అత్యంత ముఖ్యమైంది. ఎన్నో ఎత్తుపల్లాలను చవిచూసిన అతడికి ఈ ఏడాది ఐపీఎల్ మేలి మలుపు. తాజా ప్రపంచకప్ పెద్ద గెలుపు. పడిలేచిన ఆ పోరాట యోధుడే డేవిడ్ వార్నర్!**



### ఫస్ట్‌క్లాస్ క్రికెట్ ఆడకుండానే..

వార్నర్ అరంగేట్రమే ఓ సంచలనం. న్యూసౌత్‌వేల్స్ ఓపెనింగ్ బ్యాట్స్‌మన్ అయిన అతడు.. ఒక్క ఫస్ట్‌క్లాస్ మ్యాచ్ కూడా ఆడకుండానే జాతీయ జట్టులో చోటు సంపాదించాడు. 132 ఏళ్లలో ఆ ఘనత సాధించిన తొలి ఆస్ట్రేలియా క్రికెటర్‌గా అతడు చరిత్ర సృష్టించాడు. 2009లో తన తొలి టీ20 మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాపై కేవలం 43 బంతుల్లో 89 పరుగులు సాధించి తన రాకను ఘనంగా చాటాడు. అదే ఏడాది వన్డేల్లోనూ అరంగేట్రం చేశాడు. 2011లో టెస్టు అరంగేట్రం చేశాడు. అన్నింట్లోనూ అదే జోరు కొనసాగించాడు. ఆస్ట్రేలియా రెండు సార్లు ప్రతిష్ఠాత్మక యాషెస్ గెలవడంలో ముఖ్య పాత్ర పోషించిన వార్నర్... 345 పరుగులతో ఆసీస్ 2015 ప్రపంచకప్ గెలవడంలోనూ కీలకమయ్యాడు.

### ఎంత గొప్పగా ఆడినా..

దురదృష్టమో.. స్వయంకృతమో కానీ ఎంత గొప్పగా ఆడినా ఆ ప్రదర్శనను కూడా మరుగున పడేసేలా వార్నర్ ఎక్కువగా తప్పుడు కారణాలతోనే వార్తల్లో నిలిచాడు. దురుసు ప్రవర్తనతో అతడు వార్తల్లో నిలిచిన తొలి సందర్భం 2013 ఛాంపియన్స్ ట్రోఫీ. తొలి మ్యాచ్ తర్వాత పబ్‌లో ఇంగ్లాండ్ ఆటగాడు రూట్‌తో ఘర్షణకు దిగి, అతడిపై చేయిచేసుకున్న వార్నర్.. ఆ తర్వాత టోర్నీలో ఆడకుండా సస్పెండయ్యాడు. సస్పెన్షన్‌లో ఉండగా ఆస్ట్రేలియా 'ఎ' తరఫున దక్షిణాఫ్రికా పర్యటనకు వెళ్లిన అతడు.. అక్కడ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా వికెట్‌కీపర్ సొలెకైల్‌తో గొడవకు దిగాడు. ఇద్దరూ దాదాపుగా కొట్టుకున్నంత పనిచేశారు. ఆటగాళ్లు, అంపైర్లు జోక్యం చేసుకోకుంటే అదీ జరిగేదే. ఈ నేపథ్యంలో క్రికెట్ ఆస్ట్రేలియా వార్నర్ సస్పెన్షన్‌ను పొడిగించింది. దీంతో అతడు యాషెస్‌లో తొలి మూడు టెస్టులకూ దూరమయ్యాడు. 2014 దక్షిణాఫ్రికా పర్యటనలో ఆతిథ్య జట్టు బాల్ టాంపరింగ్ చేస్తోందంటూ ఆరోపించి వార్నర్ కలకలం రేపాడు. తోటి ఆటగాళ్లే వార్నర్‌తో ఏకీభవించని నేపథ్యంలో ఐసీసీ అతడి మ్యాచ్ ఫీజులో 15 శాతం కోత పెట్టింది. వార్నర్ అదే సిరీస్‌లో దక్షిణాఫ్రికా వికెట్‌కీపర్ డికాక్‌తోనూ గొడవపడ్డాడు. ఓ రోజూ మైదానం నుంచి పెవిలియన్‌కు వస్తూ ఓ అభిమానితోనూ ఘర్షణకు దిగాడు. అతడు వార్నర్‌ను కొరికాడు కూడా. ఇలా చెప్పుకుంటూ పోతే వార్నర్ వివాదాల జాబితా పెద్దదే.

### గుర్రపు స్వారీ కోసం..

వార్నర్ గొడవలన్నీ చూసే వాళ్లకు ఆశ్చర్యం కలిగించొచ్చేమో కానీ.. అతడికి మాత్రం మామూలే. అతడు మొదటి నుంచీ ఇంతే. క్లబ్ క్రికెట్ ఆడేటప్పుడు ఓసారి గుర్రపు స్వారీ కోసం మ్యాచ్‌కు దుమ్మాకొట్టి క్రమశిక్షణ చర్యలకు గురయ్యాడు. అయితే ఇవేమీ అతడి ఆటపై పెద్దగా ప్రభావం చూపలేదు. పరుగులు వరద పారిస్తూనే సాగాడు. కానీ మంచి పేరు సంపాదించలేకపోయాడు. ఐతే అతణ్ని దగ్గరగా చూసినవాళ్లు మాత్రం వార్నర్ మంచి మనిషి అంటారు.

### అన్నీ ఓ ఎత్తయితే..

వార్నర్ కెరీర్‌లో వివాదాలన్నీ ఓ ఎత్తయితే.. 2018లో బాల్ టాంపరింగ్ వివాదం ఓ ఎత్తు.. కాదు వంద ఎత్తులు. అది అతడి కెరీర్‌నే సంక్షోభంలో పడేసింది. అధముడిగా, ఆట ప్రతిష్ఠకే మచ్చ తెచ్చిన క్రికెటర్‌గా అతణ్ని అధఃపాతాళానికి నెట్టేసింది. దక్షిణాఫ్రికా పర్యటనలో మూడో టెస్టు సందర్భంగా ఆస్ట్రేలియా ఆటగాడు బాన్‌క్రాఫ్ట్ ఒక టేప్‌తో బాల్ టాంపరింగ్ చేస్తూ దొరికిపోయాడు. ఈ నేపథ్యంలో క్రికెట్ ఆస్ట్రేలియా వార్నర్‌పై ఏడాది నిషేధం విధించింది. అక్కడితో అతడి బాధలు తీరలేదు. స్వదేశంలోనే అభిమానులు ఈసడించుకోవడంతో వార్నర్ తీవ్ర క్షోభకు గురయ్యాడు. అతడి కుటుంబమంతా ఎంతో సతమతమైంది. ఇక అతడి కెరీర్ ముగిసినట్లే అనుకున్నారు అంతా..!

### మారిన మనిషి

నిషేధం వార్నర్‌లో సంకల్పాన్ని పెంచింది. ఆస్ట్రేలియా జట్టుకు దూరమయ్యాడే కానీ.. క్రికెట్‌కు కాదు. దేశవాళీలో ఆడుతూ, ఫిట్‌నెస్‌ను కాపాడుకుంటూ మళ్లీ ఆసీస్‌కు ఆడడమే లక్ష్యంగా సాగాడు. మనిషీ మారిపోయాడు. బ్యాటింగ్‌లో దూకుడు తగ్గకపోయినా.. వ్యక్తిగా దూకుడు తగ్గించుకున్నాడు. సౌమ్యుడిగా మారిన అతడు.. అందరితోనూ స్నేహపూర్వకంగా ఉండడం మొదలుపెట్టాడు. ప్రపంచకప్ ఆడాలన్న లక్ష్యంతో ఉన్న అతడికి 2019 ఐపీఎల్ ఓ వరమే అయింది. అద్భుత ఫామ్‌తో సిరీస్ ఆసాంతం అదరగొట్టిన అతడు.. ఇంగ్లాండ్‌కూ టికెట్ సంపాదించాడు. అక్కడా దంచేస్తున్నాడు. ఆరు మ్యాచ్‌ల్లో రెండు సెంచరీలు 89.40 సగటుతో 447 పరుగులు చేశాడు. అన్నింటికన్నా ముఖ్యంగా అభిమానుల మనసులు గెలిచాడు.

## అండర్ ఆర్మ్‌తో ఏసేస్తున్నారు..!

బంతిని అలా పైకి ఎగరేసి సరైన సమయంలో గాల్లోకి ఎగిరి బలమైన షాట్‌తో ప్రత్యర్థి కోర్టులోకి పంపిస్తారు.! టెన్నిస్‌లో సాధారణంగా సర్వీస్ తీరు ఇలాగే ఉంటుంది. కానీ.. ఈ మధ్య సంప్రదాయేతర సర్వీస్ దర్శనమిస్తోంది. ఆటగాళ్లు సర్వీస్ చేసేముందు రాకెట్‌ను పట్టుకుని కాస్త కిందకు వంగుతారు.. బంతిని పైకి వేస్తారనుకుంటే.. దాన్ని అలాగే రాకెట్‌తో అవతలి కోర్టులోకి పంపి ప్రత్యర్థిని బోల్తా కొట్టిస్తున్నారు. బ్యాడ్మింటన్‌లో ఎక్కువగా కనిపించే దీన్నే అండర్ ఆర్మ్ సర్వీస్ అంటారు.

**అసలేంటీ సర్వీస్..:**

టెన్నిస్‌లో అండర్ ఆర్మ్ సర్వీస్ కొత్తేం కాదు. అయితే ఇంతగా ప్రచారం కావడానికి కారణం ఆస్ట్రేలియా వివాదాస్పద ఆటగాడు నిక్ కిర్గియోస్. అకాపుల్కో ఏటీపీ 500 టెన్నిస్ టోర్నీలో నాదల్‌తో మ్యాచ్‌లో భిన్నమైన సర్వీస్‌తో అతడు ఏస్ వేశాడు. ఆ తర్వాత అతడిని చాలా మంది అనుసరించారు. ఎప్పుడూ లేని విధంగా ఈ ఏడాది ఎక్కువ మంది ఆటగాళ్లు అండర్ ఆర్మ్ సర్వీస్ చేస్తున్నారు. ప్రత్యర్థి బేస్‌లైన్ వద్ద ఉన్నప్పుడు అండర్ ఆర్మ్ సర్వీస్ చేయడం ద్వారా బంతి అతడికి చేరకుండానే రెండోసారి నేలకు తాకుతుంది. అతికష్టంపై అతడు అందుకున్నా బలమైన షాట్‌తో ప్రత్యర్థి పాయింటు రాబట్టొచ్చు. ఇన్నాళ్లు అనైతికంగా భావించే ఈ సర్వీస్‌ను ఇప్పుడు ఆయుధంగా ప్రయోగిస్తున్నారు.



**ఇలా చేయొచ్చా..**

అండర్ ఆర్మ్ సర్వీస్ నిబంధనలకు విరుద్ధమేం కాదు. రాకెట్‌ను తాకిన తర్వాత బంతి మరేదాన్ని తాకకుండా అవతలి కోర్టులో పడిందా లేదా అన్నదే ముఖ్యం. బంతిని కింద నుంచి సర్వ్ చేశారా.. పై నుంచి చేశారా అన్నది అనవసరం. అయాచిత లబ్ధిని చేకూర్చే అండర్ ఆర్మ్ సర్వీస్ నైతికంగా తప్పన్నది టెన్నిస్ పండితుల అభిప్రాయం. ఐతే.. ఫెదరర్ లాంటి వాళ్లు దీన్ని సమర్థిస్తున్నారు.

**తప్పేంటి..**

"అండర్ ఆర్మ్ కచ్చితంగా మంచి వ్యూహం. ప్రత్యర్థి బేస్‌లైన్ వద్ద ఉన్నప్పుడు ఇలాంటివి ప్రయత్నించొచ్చు. కాకపోతే ఎక్కువగా ప్రాక్టీస్ చేయం. పెద్ద మ్యాచ్‌ల్లో విజయవంతంగా అండర్ ఆర్మ్ సర్వ్ చేయడం తేలికేం కాదు"

**- రోజర్ ఫెదరర్**

**చాంగ్ గెలిచాడిలా..**

అమెరికా ఆటగాడు మైకెల్ చాంగ్ 30 ఏళ్ల క్రితమే గ్రాండ్‌స్లామ్ టోర్నీలో అండర్ ఆర్మ్ సర్వీస్‌ను ప్రయోగించాడు. 1989 ఫ్రెంచ్ ఓపెన్‌లో అండర్ ఆర్మ్ సర్వ్‌తో అందరినీ ఆశ్చర్యపరిచిన అతడు.. అప్పుడు ప్రపంచ నంబర్‌వన్ ఇవాన్ లెండిల్‌కు షాకివ్వడమే కాదు.. ఆ తర్వాత టైటిల్‌ను ఎగరేసుకుపోయాడు. హోరాహోరీగా సాగిన నాలుగో రౌండ్లో తీవ్రంగా అలసిపోయిన చాంగ్ ఐదో సెట్లో 2-1తో ఆధిక్యంలో ఉన్న దశలో మ్యాచ్ నుంచి వైదొలుగుదామనుకున్నాడట. ఆ విషయం అంపైర్‌కు చెప్పేందుకు సైడ్ లైన్ దగ్గరకు వెళ్లిన అతడు మనసు మార్చుకుని మళ్లీ సర్వీస్ చేసేందుకు వచ్చాడు. నీరసించిన అతడు బలమైన సర్వీస్ చేయలేక.. అండర్ ఆర్మ్‌తో లెండిల్‌కు షాకిచ్చాడు. ఆ తర్వాత అన్ని గేమ్‌లు చాంగ్‌వే.

---

**సచిన్ తెందుల్కర్ రికార్డుల్లో అతడి భాగస్వామ్యం లేకపోలేదు!
విరాట్ కోహ్లి అత్యుత్తమ బ్యాటింగ్ వెనుక అతడి నైపుణ్యం తక్కువేమీ కాదు!
రోహిత్‌శర్మ సెంచరీల మాటున అతడి కృషి లేకపోలేదు!
అతడేమీ కోచ్ కాదు.. మార్గనిర్దేశకుడు కాదు.. విశ్లేషకుడూ కాదు!
కానీ అగ్రశ్రేణి బ్యాట్స్‌మెన్ దగ్గర నుంచి.. జూనియర్ క్రికెటర్ దాకా అతడి దగ్గరికి రావాల్సిందే. అతడి చేతిలో పడిన తర్వాతే ఆ బ్యాట్ నుంచి పరుగుల ప్రవాహం మొదలవ్వాల్సిందే. క్రికెటర్ల ఫుట్‌వర్క్, శైలికి తగ్గట్లు బ్యాట్‌లలో మార్పులు చేస్తూ.. బ్యాట్స్‌మెన్ విజయాల్లో కీలకపాత్ర పోషిస్తున్న బ్యాట్ డాక్టర్.. రామ్ భండారి!**



## హలో డాక్టర్.. బ్యాటు బరువాయె!

బెంగళూరు ఉత్తరహళ్లిలోని ఓ చిన్న సందులో ఉంటుంది భండారి ఇల్లు. ఆ సందులోకి కారు రావడం కూడా కష్టమే. కానీ అతడి వినియోగదార్లు మాత్రం సచిన్, ద్రవిడ్, గంగూలీ, సెహ్వాగ్, ధోని, కోహ్లి, రైనా, గంభీర్, హేడెన్, పాంటింగ్, గేల్, చందర్‌పాల్, లూక్ రైట్, పొలార్డ్! ఇలా చెప్పుకుంటూ పోతే జాబితా మరింత పెద్దదవుతుంది. ఫామ్‌లో లేకపోయినా.. పరుగులు చేయలేపోతున్నా.. బ్యాట్స్‌మన్‌కు గుర్తొచ్చేది భండారీనే. మామూలుగా జబ్బులకు వైద్యులు మందులిస్తారు. రామ్ భండారి బ్యాట్‌లకు ఇస్తాడు. అందుకే అతడిని బ్యాట్ డాక్టర్ అంటారు. అలా ఎంతో మంది బ్యాట్స్‌మెన్ సమస్యల్ని తీర్చాడు బ్యాట్ డాక్టర్ భండారి.

### ఇదీ నేపథ్యం

1979లో పదో తరగతి ఫెయిలయ్యాక బిహార్ నుంచి బెంగళూరు వలస వచ్చాడు భండారి. బ్యాట్ల రిపేరు కంటే ముందు 3, 4 సినిమాల్లో స్టంట్ సహాయకుడిగా పనిచేశాడు. పొట్టకూటి కోసం ఇతర పనులు కూడా చేశాడు. ఐతే ఏదీ కలిసి రాకపోవడంతో తాత దగ్గర నేర్చుకున్న వడ్రంగి పని అతడికి ఉపాధి కల్పించింది. ఓ క్రీడా పరికాల దుకాణంలో బ్యాట్లకు మెరుగులు దిద్దే వడ్రంగి పని మొదలుపెట్టాడు. తొలుత జూనియర్ క్రికెటర్ల బ్యాట్లను రిపేరు చేశాడు. భండారి పనితీరు బాగుండటంతో రంజీ ట్రోఫీ క్రికెటర్ల ద్వారా రాహుల్ ద్రవిడ్ వరకు విషయం వెళ్లింది. భండారి పనితీరుపై ద్రవిడ్ సైతం సంతృప్తి చెందడంతో అతడి దశ తిరిగింది. సచిన్, గంగూలీలకు భండారీని పరిచయం చేశాడు ద్రవిడ్. ప్రస్తుతం ధోని, విరాట్ కోహ్లి, క్రిస్ గేల్, పొలార్డ్‌తో సహా అగ్రశ్రేణి ఆటగాళ్లంతా భండారీ దగ్గరే బ్యాట్లు రిపేరు చేయించుకుంటున్నారు.

### ఏం చేస్తాడు?

పరుగులు రాబట్టలేక ఇబ్బంది పడుతున్న బ్యాట్స్‌మెన్ బ్యాట్లకు మార్పులు చేయడం ద్వారా వారి సమస్యను తీరుస్తాడు భండారి. కొందరు బరువైన బ్యాట్‌లు వాడతారు. మరికొందరు తక్కువ బరువున్న బ్యాట్‌లు ఉపయోగిస్తారు. ఫుట్‌వర్క్.. బ్యాటింగ్ శైలి ప్రకారం ఎంత బరువున్న బ్యాట్ వాడాలో భండారి సూచిస్తాడు. టెన్నిస్ ఎల్బో గాయం తర్వాత బ్యాట్ బరువును 1350 గ్రాముల నుంచి 1250 గ్రాములకు తగ్గించాలని సచిన్‌కు సూచించింది భండారీనే. ద్రవిడ్, సెహ్వాగ్‌లు తక్కువ బరువున్న బ్యాట్ వాడతారు. కోహ్లి వాడే బ్యాట్ హ్యాండిల్ గుండ్రంగా కాకుండా వలయాకారం (ఓవల్)లో ఉండటానికి భండారీనే కారణం. ప్రపంచకప్‌లో రోహిత్‌శర్మ, క్రిస్ గేల్ ఉపయోగిస్తున్న బ్యాట్‌లకూ భండారీ మరమ్మతులు చేశాడు.



### కోహ్లి బ్యాట్‌కూ డాక్టరే

అండర్-19 ఆటగాడిగా జాతీయ క్రికెట్ అకాడమీలో ఉన్నప్పట్నుంచి కోహ్లితో భండారీకి పరిచయం ఉంది. అప్పుడే తొలిసారిగా భండారీని కోహ్లి కలిశాడు. కోహ్లి ఫుట్‌వర్క్, బ్యాటింగ్ శైలికి అనుగుణంగా అతడి బ్యాటు బరువును 1150 గ్రాములకు తగ్గించాడు. అంతర్జాతీయ క్రికెట్లో అతి తక్కువ బరువున్న బ్యాట్‌లు వాడేవాళ్లలో కోహ్లి ఒకడు. బ్యాట్ హ్యాండిల్ కూడా సన్నగా ఉంటుంది. కోహ్లి టెక్నిక్ ప్రకారం అలాంటి బ్యాట్‌తో పుస్తకంలోని ప్రతి షాట్ ఆడొచ్చు.

### ఆదాయం అంతంతే

అంతర్జాతీయ క్రికెటర్ల బ్యాట్‌లు భండారీ వర్క్ షాపునకు వరుస కడుతున్నా.. అతడు మాత్రం పేదరికంలోనే ఉన్నాడు. "క్రికెటర్లను నేనెప్పుడూ డబ్బులు అడగలేదు. ఇష్టంతో చేసే పని ఇది. వాళ్లు ఇష్టంగా ఎంతిచ్చినా తీసుకుంటా. అంతర్జాతీయ ఆటగాళ్లు తమ బ్యాట్ రిపేర్ చేసుకుంటే రూ.600 నుంచి రూ.800 ఇస్తారు. 30 ఏళ్లుగా ఈ పని చేస్తున్నా. బ్యాట్ రిపేరు చెబితే వచ్చేది కాదు. ప్రాక్టీస్ ద్వారానే నైపుణ్యం పెంచుకోవచ్చు. చిన్నప్పుడు గల్లీ క్రికెట్ ఆడటం నాకు కలిసొచ్చింది. ఆటపై అవగాహన ఉండటంతో ఈ పనిని సమర్థంగా చేయగలుగుతున్నా. నా చిన్న కుమారుడు దశరథ్ కొన్నేళ్లుగా ఈ పని చేస్తున్నాడు. ఎంత ఎక్కువ పనిచేస్తే అంత నైపుణ్యం వస్తుందని దశరథ్‌కు చెప్తుంటా"నని భండారి తెలిపాడు.

# ఈనాడు సినిమా

# గతం చెబుతోంది కొత్త కథ

**చిత్రసీమ దృష్టి ఎప్పుడూ కొత్త కథలపైనే. ప్రేక్షకుడికి సరికొత్త వినోదాలను అందిస్తేనే తమ సినిమాలకి ఆదరణ లభిస్తుందన్నది దర్శకనిర్మాతలు నమ్మే మూల సూత్రం. అందుకోసం ఆధునికత ఉట్టిపడే కథాంశాల్ని ఎంచుకొని కసరత్తులు చేస్తుంటారు. అలాంటి కథలు పొరుగు భాషల్లో కనిపించినా సరే వాటిని వెంటనే కొనేసి రీమేక్‌గా తెరకెక్కిస్తుంటారు. అయితే సరికొత్తగా వినోదం పంచడానికి కొత్త కథలే అవసరం లేదని, పాత కథల్ని కూడా కొత్తగా చెప్పి మెప్పించొచ్చని మన దర్శకులు నిరూపిస్తున్నారు. వర్తమానం, భవిష్యత్తు నుంచే కాకుండా... గతం నుంచీ కొత్తగా కథలు వండుతున్నారు. నిన్నటి కథలతో రూపు దిద్దుకొంటున్న చిత్రాలు ప్రస్తుతం సెట్స్‌పై చాలానే కనిపిస్తున్నాయి.**


చిరంజీవి

పురాణాలు వల్లించడం, చరిత్ర తిరగేయడం తెలుగు చిత్రసీమకి కొత్తేమీ కాదు. తొలినాళ్లలో సినిమాలకి కథా వస్తువులు మన పురాణాలే. ఆ తర్వాత చరిత్ర పని పట్టారు. రాజులు, రాజ్యాల కథలతో సినిమాలు చేశారు. క్రమంగా సినిమా కథ వర్తమానానికి అద్దం పట్టింది. నవతరం ప్రేక్షకుడిని మెప్పించాలంటే నేటి కథలు చెప్పాల్సిందే అనే పరిస్థితి వచ్చింది. దాంతో కథలు క్రమంగా మూస బాట పట్టాయి. ఇక తెరపైకి కొత్త కథలు రావా? మన దగ్గర కొత్త కథలు లేవా? అనే చర్చ జరిగిన ప్రతిసారీ దర్శకులు గతంలోకి తొంగి చూశారు. పాత కథల్ని కొత్తగా చెప్పి విజయాల్ని అందుకున్నారు. 'అన్నమయ్య', 'శ్రీరామరాజ్యం', 'శ్రీరామదాసు', 'రాజన్న', 'కంచె', 'గౌతమిపుత్ర శాతకర్ణి', 'రుద్రమదేవి', 'ఘాజీ' తదితర చిత్రాలు ఆ కోవకి చెందినవే. 'బాహుబలి', 'రంగస్థలం' చిత్రాల తర్వాత దర్శకులు గతాన్ని చూసే కోణం మారిపోయింది. చారిత్రక గాథల్ని ఆధునిక సాంకేతిక హంగులతో భారీస్థాయిలో తీయడం... రెండు మూడు దశాబ్దాల కిందటి కథల్ని ఎంచుకొంటే... ఆ వాతావరణాన్ని పక్కాగా తెరపై ఆవిష్కరించి అందులోకి ప్రేక్షకుడిని తీసుకెళ్లడం ఇప్పుడొక ట్రెండ్‌గా మారిపోయింది.

చిరంజీవి కథానాయకుడిగా నటిస్తున్న 'సైరా నరసింహారెడ్డి' చారిత్రక గాథతో తెరకెక్కుతోంది. స్వాతంత్ర్య పోరాటం నేపథ్యంలో, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవితం ఆధారంగా రూపొందుతున్న చిత్రమిది. విజువల్ ఎఫెక్ట్స్‌కి పెద్దపీట వేస్తూ, బ్రిటిష్ కాలం నాటి వాతావరణాన్ని కళ్లకి కడుతూ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. 'బాహుబలి' తర్వాత మళ్లీ ఆ స్థాయి విజువల్ ఎఫెక్ట్స్‌తో రూపుదిద్దుకొంటున్న చిత్రమిది. సురేందర్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. చిరు తనయుడు రామ్‌చరణ్, ఎన్టీఆర్ కథానాయకులుగా నటిస్తున్న 'ఆర్ ఆర్ ఆర్' కూడా చారిత్రక అంశాలతో ముడిపడిన కథతో తెరకెక్కుతున్నదే. 'బాహుబలి' చిత్రాల తర్వాత ఎస్.ఎస్.రాజమౌళి తెరకెక్కిస్తున్న చిత్రమిది. కొమరం భీమ్, అల్లూరి సీతారామరాజు పాత్రల్లో ఎన్టీఆర్, చరణ్ నటిస్తున్నారు. కథానాయకుడు రానా 'హిరణ్యకశ్యప' పేరుతో పురాణాన్ని వల్లెవేయబోతున్నారు. రూ.200 కోట్ల వ్యయంతో గుణశేఖర్ తెరకెక్కించనున్నారు. రానా కథా నాయకుడిగా తెరకెక్కబోతున్న 'విరాటపర్వం' కూడా గతాన్ని గుర్తు చేసేదే. ఎమర్జన్సీ కాలం నాటి కథతో వేణు ఊడుగుల తెరకెక్కిస్తున్న చిత్రమిది.


రాజశేఖర్


ఎన్టీఆర్

ప్రభాస్ కథానాయకుడిగా రాధాకృష్ణ కుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రేమకథ కూడా కొన్ని దశాబ్దాల కిందటి కథతో తెరకెక్కుతున్నట్టు సమాచారం. ఆ సినిమాకి 'జాన్' అనే పేరు ప్రచారంలో ఉంది. రాజశేఖర్ కథానాయకుడిగా నటిస్తున్న 'కల్కి' 1980ల నాటి కథతో తెరకెక్కింది. యువ దర్శకుడు ప్రశాంత్ వర్మ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. నవతరం దర్శకులు కూడా చారిత్రక కథలపై ఉత్సాహం ప్రదర్శిస్తుండడం విశేషం. అందుకోసం పరిశోధనలు చేయడానికీ వెనకాడటం లేదు. ఇదివరకు తెలుగు సినిమాల్లో గతం అంటే ఫ్లాష్‌బ్యాకే. అప్పట్లో ఇలా జరిగిందంటూ కొన్ని సన్నివేశాల్లో పాత కథని చెప్పేవారు. కానీ ఇప్పుడు సినిమా కథ మొత్తం గతం చుట్టూనే తిరుగుతోంది. నడిచొచ్చిన దారిని, మరిచిపోయిన రోజుల్ని మరోసారి గుర్తు చేస్తూ ప్రేక్షకులకూ కొత్త అనుభూతి పంచుతున్నారు. శుక్రవారం విడుదలైన 'మల్లేశం' కథ కూడా నిన్నటి తెలంగాణ గ్రామీణ సంస్కృతికి అద్దం పట్టింది.


రామ్‌చరణ్


ప్రభాస్


రానా

## పాతాలో... గుణపాఠాలో

"అందరిలాగే నేనూ తప్పులు చేశా. కానీ వాటిని పునరావృతం కానీయలేదు. ప్రతి తప్పు నుంచీ ఎంతో కొంత నేర్చుకొన్నా" అంటోంది సమంత. త్వరలోనే 'ఓ బేబీ'తో సందడి చేయబోతున్న ఆమె, పాత్రల ఎంపికలో ఇటీవల మరిన్ని జాగ్రత్తలు తీసుకున్నానని చెబుతోంది. మీ విజయాల వెనక ప్రధాన కారణమేంటని అడిగితే... "నా అందం, నా శ్రమ.. ఈ రెండూ కాదు" అని చెప్పింది. "నాకంటే అందమైన అమ్మాయిలు, నాకంటే ఎక్కువగా కష్టపడే నాయికలు చిత్రసీమలో చాలా మందే ఉన్నారు. కథానాయికగా నా ప్రయాణం విజయవంతమైందంటే అది నా కథల ఎంపిక విధానంతోనే అని నమ్ముతుంటా. కథల విషయంలో నేనూ తప్పులు చేశా. కానీ వాటితో నాకెదురైన అనుభవాల్ని మరిచిపోలేదు. వాటిని పాఠాలంటారో, గుణపాఠాలంటారో నాకు తెలియదు. ఇతరుల్ని కూడా గమనించి వాళ్ల నుంచి స్ఫూర్తి పొందా. అవన్నీ నా విజయానికి కారణాలుగా భావిస్తుంటా" అని చెప్పింది సమంత.


సమంత

## 'కల్కి'తో పోలిక లేదు

"'కల్కి' చిత్ర కథ తనదే అంటూ కార్తికేయ అనే రచయిత ఫిర్యాదు చేయడంతో ఆయన రాసిన స్క్రిప్టునీ, 'కల్కి' సినిమా స్క్రిప్టునీ చదివాక రెండింటి మధ్య ఎలాంటి పోలిక కనిపించలేద"న్నారు కథా హక్కుల వేదిక కన్వీనర్ బీవీఎస్ రవి. రాజశేఖర్ కథానాయకుడిగా ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో తెరకెక్కిన 'కల్కి' ఈ నెల 28న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఇంతలో ఈ కథ విషయంలో వివాదం మొదలైంది. కార్తికేయ రచయితల సంఘానికి ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై తెలుగు చలన చిత్ర దర్శకుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటైన కథా హక్కుల వేదిక కన్వీనర్ బీవీఎస్ రవి స్పందించారు. "చట్టబద్ధత ఏమీ లేకపోయినా... కథల విషయంలో సమస్యల్ని పరిష్కరించడమే లక్ష్యంగా ఏర్పాటైన సంస్థ కథా హక్కుల వేదిక. ట్రైలర్లు చూసి తమ కథ అంటూ వచ్చేవాళ్లు చాలామందే ఉంటారు. వాళ్ల కథని, సినిమా కథని పరిశీలించి రెండింటి మధ్య సంబంధం ఉందో లేదో చెబుతుంటాం. కొన్ని కథల మధ్య సారూప్యతలు కనిపిస్తుంటాయి. ఫిర్యాదు చేసిన వ్యక్తి కథే అయితే అతనికి తగిన పారితోషికం, అందుకు సంబంధించి పేరు వచ్చేలా చూస్తున్నాం. మేం తీసుకున్న నిర్ణయం నచ్చకపోతే కోర్టుకు వెళ్లొచ్చనీ చెబుతుంటాం. 'కల్కి' విషయంలో కార్తికేయ మాకు ఫిర్యాదు చేశారు. కానీ ఆయన రాసిన కథకి, 'కల్కి' స్క్రిప్టుకి పోలిక లేకపోవడంతో మేం అదే విషయాన్ని చెప్పాం" అని బీవీఎస్ రవి ఓ ప్రకటనలో తెలిపారు.

## ఈసారైనా 'అవతార్'ను దాటేస్తారా!

"అవతార్ రికార్డును 'అవెంజర్స్' బద్దలు కొట్టగలరా లేదా' అంటూ 'అవెంజర్స్:ఎండ్‌గేమ్' విడుదలకు ముందు చర్చ వినిపించింది. భారీ అంచనాలతో వచ్చిన 'ఎండ్‌గేమ్', అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా 'అవతార్' పేరిట ఉన్న రికార్డును (2.788 బిలియన్ డాలర్లు) బద్దలుకొట్టడం ఖాయమని ట్రేడ్ విశ్లేషకులు ఊహించారు. అది సాధ్యమే అనిపించేలా తొలి వారంలో అనూహ్యమైన ప్రేక్షకాదరణతో, భారీ వసూళ్లతో ఈ సినిమా బాక్సాఫీసు వద్ద దూసుకెళ్లింది. ఆ తర్వాత విడుదలైన చిత్రాల నుంచి ఎదురైన పోటీతో వసూళ్లు నెమ్మదిస్తూ వచ్చాయి. చివరకు 2.744 బిలియన్ డాలర్లు సాధించింది. దీంతో 'అవతార్' కన్నా 44 మిలియన్ డాలర్లు వెనకపడింది. అయితే 'ఎండ్‌గేమ్'ను మరోసారి ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మార్వెల్ సంస్థ తాజాగా నిర్ణయించింది. అందులో ఓ డిలీటెడ్ సీన్‌ను జోడించినట్లు తెలిపింది. ఈ నెల 28న 'ఎండ్‌గేమ్'ను విడుదల చేయనుంది. ఈ రీ రిలీజ్ ద్వారా అయినా 'అవతార్' వసూళ్లను అధిగమిస్తుందేమో చూడాలి.


'అవెంజర్స్: ఎండ్‌గేమ్'

## 'గులాబో..' సిత్రం సూడరో!


'గులాబో సితాబో'లో అమితాబ్ బచ్చన్

అమితాబ్ బచ్చన్‌కు వయసు పెరుగుతున్నా విభిన్న పాత్రల్లో కనిపించాలన్న తృష్ణ ఏమాత్రం తగ్గడం లేదు. తాజాగా ఆయన నటిస్తున్న 'గులాబో సితాబో' చిత్రమే అందుకు నిదర్శనం. ఇందులో అమితాబ్ ఇంతవరకూ చేయని ఓ సరికొత్త పాత్రలో కనిపిస్తూ నవ్వులు పూయించనున్నారట. దానికి సంబంధించిన లుక్ బయటికొచ్చింది. అందులో నెరిసిన గుబురు గడ్డం, కళ్లజోడుతో, తలచుట్టూ గుడ్డ కప్పుకుని, వదులుగా ఉండే చొక్కాతో వృద్ధాప్య ఛాయలు ఎక్కువగా ఉన్న పాత్రలో కనిపిస్తున్నారు అమితాబ్. ఆయన గెటప్‌కు నెటిజన్ల నుంచి అనూహ్య స్పందన వస్తోంది. ప్రముఖ దర్శకుడు సూజిత్ సర్కార్ తెరకెక్కిస్తున్న ఈ కుటుంబ హాస్య చిత్రంలో అమితాబ్‌తో పాటు ఆయుష్మాన్ ఖురానా నటిస్తున్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్‌లో ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు.


పాయల్ రాజ్‌పుత్

## రెండో అరుంధతి

పాయల్ రాజ్‌పుత్ ప్రధాన పాత్రలో తెరకెక్కనున్న చిత్రం 'అరుంధతి-2'. నిర్మాత కోటి తూముల మాట్లాడుతూ "విశ్వజనీనమైన కథ ఇది. హిందీ, తమిళ చిత్ర పరిశ్రమలకి చెందిన ప్రముఖ తారలు నటిస్తున్నారు. ప్రి విజువలైజేషన్, విజువల్ ఎఫెక్ట్స్ పనులు జరుగుతున్నాయి. తన పాత్ర కోసం పాయల్ గుర్రపుస్వారీ, కత్తి సాములకి సంబంధించి హాలీవుడ్ నిపుణుల సమక్షంలో శిక్షణ తీసుకొంటోంది. త్వరలోనే చిత్రీకరణ ప్రారంభిస్తాం. దర్శకుడు, ఇతర సాంకేతిక బృందం, నటీనటుల వివరాల్ని త్వరలోనే ప్రకటిస్తామ"న్నారు.

## గుర్రంపై సవారి

నందు, ప్రియాంక జంటగా నటించిన చిత్రం 'సవారి'. సాహిత్ మోత్కూరి దర్శకుడు. సంతోష్ మోత్కూరి, నిషాంక్ రెడ్డి కుడితి నిర్మాతలు. గుర్రం నేపథ్యంలో సాగే చిత్రమిది. నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఇటీవల ప్రచార చిత్రాన్ని విడుదల చేశారు. "కొత్త తరం రొమాంటిక్ చిత్రమిది. సాహిత్ ఈ చిత్రాన్ని సహజత్వం ఉట్టిపడే కథ, కథనాలతో తెరకెక్కించారు. త్వరలోనే విడుదల తేదీ ప్రకటిస్తామ"ని తెలిపాయి చిత్ర వర్గాలు. శ్రీకాంత్‌రెడ్డి గంటా, మ్యాడీ, జీవన్, శివ తదితరులు నటించారు. సంగీతం: శేఖర్ చంద్ర, ఛాయాగ్రహణం: మోనిశ్ భూపతిరాజు.


ప్రియాంక, నందు

# వసుంధర

నాకు ముప్ఫై ఏళ్లు. తెల్లగా ఉంటా. నా మెడ, ముఖం మీద పులిపిర్లు వచ్చాయి. మెడపై కాస్త ఎక్కువగా ఉన్నాయి. బ్యూటీపార్లర్‌లో వీటిని తొలగించుకోవడం మంచిదేనా? ఒకవేళ అలా తీయించుకుంటే మళ్లీ వస్తాయా? అసలు పులిపిర్లు ఎందుకు వస్తాయి... అది ఏమైనా సమస్యా? - ఓ సోదరి

## పులిపిర్లు పోగొట్టేదెలా?

డియర్ వసుంధర

డా॥ శైలజ సూరపనేని
కాస్మెటిక్ స్కిన్‌కేర్ ఫిజీషియన్

పులిపిర్లనే స్కిన్ ట్యాగ్స్ అని అంటారు. ఇవి చిన్నగా, మెత్తగా, చిన్న చిన్న బొడిపెల్లా ఉంటాయి. చర్మ రంగులోనే ఉంటాయి. స్కిన్ గ్రోత్ ఎక్కువగా ఉండటం వల్ల పులిపిర్లు వస్తాయి. ఇవి క్యాన్సర్‌కి సంకేతం కాదు, హానికరం అంతకన్నా కాదు కాబట్టి భయపడాల్సిన అవసరంలేదు. ఇవి సాధారణంగా కనురెప్పలు, మెడ, చేతుల కింద, ముఖం, అరుదుగా శరీర రహస్య భాగాల్లోనూ కనిపిస్తాయి. ఇవి కొందరిలో ఒకటి, రెండు ఉంటే మరికొందరిలో వందల్లో ఉంటాయి. ప్రతి ఒక్కరికీ జీవితంలో ఒక్కసారైనా ఇవి వచ్చే అవకాశం ఉంది. సాధారణంగా మధ్యవయసు వారిలో మొదలై అరవై ఏళ్లవరకూ పులిపిర్లు కనిపిస్తాయి. లావుగా ఉండేవారిలో ఈ సమస్య ఎక్కువగా ఉంటుంది. ఈ పులిపిర్లు కొన్నిసార్లు వాటంతట అవే రాలిపోతాయి. వీటిని వైద్య పరిభాషలో ఫైబ్రోఎపిటోలియల్ పాలిప్స్ అని అంటారు. ఇవి ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందే అవకాశం ఉండదు. వీటికి సరైన కారణాలను ఇంకా గుర్తించలేదు. గర్భం దాల్చినప్పుడు జరిగే హార్మోన్ల మార్పులతోనూ ఈ పులిపిర్లు కనిపిస్తాయి. వారసత్వంగానూ కొందరిలో వస్తాయి. కొందరు వీటిని తొలగించడానికి ఇంట్లో నాటు పద్ధతులను ఉపయోగించడం, టీట్రీఆయిల్, డెర్మాసిల్‌క్రీమ్, వార్ట్‌రిమూవల్ క్రీమ్‌లను వాడటం చేస్తుంటారు. అవేవీ పనిచేయవు సరికదా! ఈ ప్రయత్నాల వల్ల ఇన్‌ఫెక్షన్లు వచ్చే అవకాశాలు ఎక్కువ. మార్కెట్‌లో దొరికే ఏ క్రీములూ వీటిని తొలగించలేవు. పులిపిర్లు ఇబ్బందిపెడుతున్నాయని అనుకున్నప్పుడు వైద్యులు స్నిప్పింగ్, రేడియో ఫ్రీక్వెన్సీ, క్రయో ఫ్రీజింగ్, స్ట్రాంగిలేషన్, బర్నింగ్ వంటి విధానాల ద్వారా వీటిని సురక్షితంగా తొలగిస్తారు.

– మీ సందేహాలను vasubeauty@eenadu.net కు పంపించగలరు.



చేతి వాచీ ఒకప్పుడు అవసరం... ఇప్పుడు ముంజేతికి ముచ్చటగా ఒదిగిపోయే ఆభరణం. అలాంటి వాచీలను అందించే దేశీయ బ్రాండ్ అంటే ఆ తరానికి టైటన్... ఈ తరానికి ఫాస్ట్రాక్ గుర్తొస్తాయి. అంతటి పేరున్న ఈ బ్రాండెడ్ గడియారాల వెనక రేవతీ కాంత్ కృషి ఎంతో. పిన్నల నుంచీ పెద్దల వరకూ ఆకట్టుకునేలా వాచీలను డిజైన్ చేస్తోన్న టైటన్ సంస్థ చీఫ్ డిజైనర్. పురుషాధిక్య రంగంలో సాధారణ ఉద్యోగినిగా చేరి వాచీల డిజైనర్‌గా ఎదిగిన ఆమె ప్రస్థానమిది.

## చేతివాచీ... చెక్కుతుందామె

టైటన్‌తో నా అనుబంధం ఈనాటిది కాదు. సరిగ్గా ఇరవై తొమ్మిదేళ్ల క్రితం నా ఉద్యోగ జీవితం ఇక్కడే మొదలైంది. మాది తమిళనాడులోని తిరుచిరాపల్లి. అమ్మానాన్నలు ఉన్నత విద్యావంతులు. నేను 1988లో తిరుచిరాపల్లిలోని భారతీయార్ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ చేశా. ఏడాదిపాటు ప్రయత్నాలు చేశాక టాటా సంస్థ టైటన్‌లో మార్కెటింగ్ రిసెర్చ్ విభాగంలో ఉద్యోగం వచ్చింది. నా పనితీరు నచ్చడంతో ఐదేళ్లు తిరిగేసరికి ఈ సంస్థ మార్కెటింగ్ హెడ్‌గా పదోన్నతి అందుకున్నా. ఆ సమయంలో టైటన్‌కి మనదేశంలోనే కాస్తో కూస్తో పేరుంది తప్ప విదేశాల్లో మార్కెట్ లేదు. అప్పటికి అంతర్జాతీయ మార్కెట్‌లో స్విస్, జపనీస్ బ్రాండ్లు రాజ్యమేలుతున్నాయి. ఆ పరిస్థితుల్లో ఇండియన్ బ్రాండ్‌ను అంతర్జాతీయ మార్కెట్‌లో నిలబెట్టే బాధ్యతను యాజమాన్యం నా మీద పెట్టింది. ఈ క్రమంలో పశ్చిమాసియా, ఆఫ్రికా దుబాయ్, సౌదీ అరేబియా వంటి దేశాలకు తరచూ వెళ్లాల్సి వచ్చేది.

### సమావేశాలకు బుర్ఖాతో...

మార్కెటింగ్ హెడ్‌గా పదోన్నతి పొందేనాటికి ఆ రంగంలో పురుషులదే హవా. విదేశాలకు ఒంటరిగా వెళ్లి రావడం చూసి చాలామంది ఆశ్చర్యపోయేవారు. సౌదీ అరేబియాలో మహిళలకి నిబంధనలు ఎక్కువ. నాకు వీసా రావడం చాలా కష్టమైంది. సౌదీ షేక్‌లు ఆడవాళ్లు తమతో కలిసి పనిచేయడం, సమావేశంలో కూర్చోవడానికి ఇష్టపడేవారు కాదు. నేను అక్కడికి వెళ్లినప్పుడు బుర్ఖా వేసుకుని నా పనులు చూసుకొని వచ్చేదాన్ని. తరచూ విదేశాలకు వెళ్లి రావడం వల్ల నాకు చాలా విషయాలు అర్థమయ్యాయి. అప్పటికి మా సంస్థకు ప్రత్యేక డిజైనింగ్ విభాగం లేదు. వాటిని రూపొందించేవారికి, జనాల్లోకి తీసుకెళ్లే మార్కెటింగ్ విభాగానికీ అసలు సమన్వయం ఉండేది కాదు. నేను స్వయంగా మార్కెట్‌లోకి వెళ్లాకే నాకు ఆ విషయం అర్థమైంది. డెవలపింగ్ టీమ్‌కి అందుబాటులో ఉంటూ వినియోగదారుల అభిరుచులు, వారి అవసరాలు తెలుసుకుని సలహాలు, సూచనలు ఇచ్చేదాన్ని. ఆ బృందం వాటిని ఆచరణలో పెట్టేది. పదేళ్లలో టైటన్‌ను ఒమన్‌లో నంబర్‌వన్‌గా, దుబాయ్, బహ్రెయిన్‌లో టాప్ మూడో స్థానంలో నిలబెట్టడంలో కీలక పాత్ర పోషించా. ఇతర దేశాల మార్కెట్‌లోనూ టైటన్‌కు ఆదరణ లభించింది. నేనూ వాచీలను డిజైన్ చేయగలనని అనిపించింది. ఆ తరువాత...

### డిజైనింగ్ విభాగంలోకి...

సంస్థ యాజమాన్యానికి నా మనసులో మాట చెప్పా. అప్పుడే టైటన్ నగల సంస్థ తనిష్క్ ప్రారంభమైంది. గడియారాలు, నగల డిజైనింగ్ బృందంలో పనిచేసే అవకాశం కల్పించింది సంస్థ. నేను వెళ్లేనాటికి తనిష్క్‌లోకి ఖరీదైన నగలే అందుబాటులో ఉండేవి. వాటి ధర అధికం కావడంతో తనిష్క్ సామాన్యులకు కాస్త దూరంగా ఉందనే చెప్పాలి. ఓ మహిళగా ఆలోచిస్తే నేను తక్కువ బరువు ఉన్నవీ, స్టైలిష్‌గా కనిపించే సింపుల్ ఆభరణాలు కోరుకుంటా. అధ్యయనం చేస్తే చాలామంది అదే చెప్పారు. తనిష్క్‌కి వచ్చి ఏమీ తీసుకోకుండా తిరిగి వెళ్లేవారి అభిప్రాయాలూ తీసుకున్నా. ఆ తరువాతే ఆధునిక మహిళల కోసం తక్కువ కేరట్స్‌లో తేలికపాటి ఆభరణాలు తయారుచేశాం. 'మియా' పేరుతో అందించిన ఈ నగలు ఉద్యోగినులు, సామాన్య మహిళల్ని ఆకర్షించాయి. పురుషులకు ఆభరణాలు ఏముంటాయని అనుకుంటారు. వారికోసమూ బంగారు బటన్లు, క్లాసీ లుక్ ఉండే ఉంగరాలు, బ్రేస్‌లెట్లు, యువతకోసం సింగిల్ స్టడ్స్ డిజైన్ 'అవిర్' కలెక్షన్ అందించా. చాలా తక్కువ కాలంలోనే నేను రూపొందించిన నగలకు ఆదరణ పెరిగింది. తనిష్క్ ఇండియాలోనే టాప్ మూడో నగల సంస్థగా నిలిచింది.

### గడియారాల వైపు...

క్రమంగా నా పూర్తి సమయం గడియారాలకు కేటాయించా. అప్పటికి నేను శిక్షణ తీసుకున్న డిజైనర్‌ని కాదు. మొదటి రెండేళ్లు చాలా కష్టపడ్డా. తోటి డిజైనర్లని గమనించేదాన్ని. వాళ్లెవరూ వినియోగదారుల అభిరుచి గురించి ఆలోచించకుండా తమ నైపుణ్యాలకు అనుగుణంగా పని చేస్తున్నారని తెలుసుకున్నా. నేనే బయటకు వెళ్లి రకరకాల వయసుల వారి అభిరుచులు, వాచీల విషయంలో అవసరాలు తెలుసుకున్నా. ఆ ప్రకారం వాచీలను డిజైన్‌చేయించా. అలా రూపొందించిందే టైటన్ రాగా. మహిళల కోసం ప్రత్యేక బ్రాండ్ అనేది నిజంగా అప్పుడు సాహసమే అయినా... విజయం సాధించా. ప్రాంతాలు, స్థానికుల అభిరుచుల్ని బట్టి గడియారాలను డిజైన్ చేసి అందిస్తున్నాం. ఉత్తర భారతదేశంలో ముఖ్యంగా దిల్లీలో ఆడంబరం ఎక్కువ కోరుకుంటారు. మహిళలూ మగవారి వాచీల వంటివే ఇష్టపడుతుంటారు. ముంబయి వాసులు క్లాసిక్, ఫార్మల్ లుక్ కోరుకుంటారు. దక్షిణ భారతదేశంలో సంప్రదాయ డిజైన్లు ఇష్టపడుతుంటారు. బెంగళూరు కాస్మోపాలిటన్ సిటీ. అక్కడ ఉండేవారు టెక్నాలజీతో పోటీ పడుతుంటారు. స్మార్ట్ వాచీలపై ఆసక్తి చూపుతారు. ఇవన్నీ నేను స్వయంగా వెళ్లి అధ్యయనం చేయడం వల్ల తెలిశాయి. ఆ ప్రకారమే డిజైనింగ్‌లో మార్పులు చేశాం. ఫాస్ట్రాక్ వాచీలకూ ఎంతో ఆదరణ లభించింది. వాటినీ డిజిటలైజ్ చేయడంతో యువతను ఆకట్టుకుంది. నా పనితీరు యాజమాన్యానికి సంతృప్తికరంగా ఉండటంతో ఈ మధ్యనే సంస్థ చీఫ్ డిజైనింగ్ ఆఫీసర్‌గా పదోన్నతి ఇచ్చింది. సింగిల్ బ్రాండ్‌గా మొదలైన టైటన్ మల్టీబ్రాండెడ్ సంస్థగా మారడంలో కీలక పాత్ర పోషించినందుకు గర్వంగా ఉంది. ఎప్పటికప్పుడు నన్ను అప్‌డేట్ చేసుకుంటూ వినియోగదారుల అవసరాలు, సౌకర్యం మేరకు డిజైన్ చేయడం వల్లనే నేను విజయం సాధిస్తున్నానని నమ్ముతా.

> చాలామంది టైటన్ రాగా ప్రయోగం ఫలిస్తుందా అని విమర్శించారు. ఆధునిక దుస్తులు, సామాజిక పరిస్థితుల నేపథ్యంలో గాజు, బ్రేస్‌లెట్, కంకణం మాదిరి ఆభరణంలా రూపొందించాం. సాధారణ బెల్టుతోపాటు, వెండి, బంగారం పూతతోనూ తక్కువ ధరలో తయారుచేశాం. క్రమంగా అవి మహిళలు మెచ్చే ఆభరణాల జాబితాలోకి వెళ్లిపోయాయి.



- వడ్డె పద్మ

## పంటినొప్పికి బొప్పాయి

**బొప్పాయి పండును క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల అందంతోపాటు, ఆరోగ్యమూ సొంతమవుతుంది. దీన్ని కేవలం పండుగానే కాకుండా స్మూథీ, సలాడ్, పరాఠా, హల్వా... ఇలా పలు పదార్థాల తయారీలో వాడొచ్చు.**

- ఈ పండులో ఉండే సహజ పీచు రక్తపోటును నియంత్రిస్తుంది. గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. రోగ నిరోధకశక్తిని పెంచి... అనారోగ్యాలు, ఇన్‌ఫెక్షన్లు దాడి చేయకుండా చూస్తుంది.



- బొప్పాయిలో పీచు ఎక్కువ. కొద్దిగా తీసుకున్నా పొట్ట నిండిన భావన కలుగుతుంది. రోజూ తీసుకుంటే బరువు నియంత్రణలో ఉంటుంది. మలబద్ధకం సమస్య ఉన్నా అదుపులోకి వస్తుంది. దీన్నుంచి అందే కెలోరీలూ తక్కువే. ఈ పండు రోజూ తింటే కొలెస్ట్రాల్ స్థాయులు తగ్గుతాయంటారు నిపుణులు.
- దీంట్లో ఉండే పీచు, విటమిన్-సి, యాంటీఆక్సిడెంట్లు రక్తనాళాల్లో కొవ్వు చేరకుండా అడ్డుకుంటాయి.
- మధుమేహం ఉన్నవారు దీన్ని నిరభ్యంతరంగా తీసుకోవచ్చు. ఇందులో చక్కెరశాతం తక్కువగా ఉండటమే కారణం.
- బొప్పాయి పండు పంటి నొప్పినీ తగ్గిస్తుంది. కీళ్ల నొప్పుల బారిన పడకుండా కాపాడుతుంది. ఆహారం సరిగ్గా జీర్ణమయ్యేలా చూస్తుంది. బొప్పాయిలోని పోషకాలు క్యాన్సర్ కణాలను నిరోధిస్తాయి.
- ఈ పండు నుంచి విటమిన్ ఎ ఎక్కువ మోతాదులో అందుతుంది. దీన్ని తరచూ తీసుకుంటే కంటి సమస్యలు ఎదురుకావు. దీన్ని తినడం వల్ల ఒత్తిడీ అదుపులో ఉంటుందని చెబుతున్నాయి అధ్యయనాలు.
- ఇందులోని సి, ఈ విటమిన్లు, యాంటీఆక్సిడెంట్లు.. వార్ధక్యపు ఛాయల్ని నియంత్రిస్తాయి. గర్భిణులు దీన్ని తినకూడదంటారు వైద్యులు.

## బంగారం వెండి

21న ముగింపు-క్రితం

| తమిళనాడు (రూ. లలో) | | |
|---|---|---|
| ఆర్నమెంట్ (గ్రా) | 3,237 | 3,213 |
| వెండి (గ్రా) | 41.00 | 41.30 |



| | హైదరాబాద్ | | విజయవాడ | | ప్రొద్దుటూరు | | రాజమహేంద్రవరం | | విశాఖపట్నం | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| బంగారం(24 క్యా) | 34,930 | 34,740 | 35,060 | 34,770 | 33,900 | 34,200 | 35,150 | 34,710 | 34,800 | 34,500 |
| ఆర్నమెంట్ | 32,620 | 32,450 | 32,500 | 32,200 | 31,210 | 31,750 | 32,370 | 32,120 | 32,360 | 32,080 |
| వెండి(కిలో) | 38,930 | 39,108 | 39,400 | 39,300 | 38,200 | 38,800 | 39,100 | 39,000 | 39,500 | 39,500 |

### నజరానా

కిందపడిన గాజు పెంకులు పూర్తిగా తొలగించాలంటే... ఒక కాటన్ వస్త్రాన్ని నీటితో తడిపి దాంతో ఆ ప్రాంతాన్ని తుడిచేయాలి. మొత్తం గాజు పెంకులు వస్త్రానికి అతుక్కుంటాయి. తరువాత దాన్ని పారేయాలి.



## పూల పోట్లీల సోయగం

ప్రత్యేక సందర్భాల్లో ఎంచుకునే పోట్లీ బ్యాగులు సాధారణంగా పూసలు, అద్దాలు, చమ్కీలు పొదిగినవే ఉంటాయి. అవే ఇప్పుడు కొత్త సొగసులు అద్దుకుని నయా డిజైన్లలో సందడి చేస్తున్నాయి. విరబూసిన పూలు, అందమైన ఆకారాల మేళవింపుతో అన్ని సందర్భాలకు వాడుకునేలా అందుబాటులోకి వచ్చేశాయి. దుస్తులకు మ్యాచింగ్‌గా... అటు సంప్రదాయానికి, ఇటు ఫ్యాషన్‌కు తగ్గట్లుగా ఆకట్టుకుంటున్నాయి.















## ఆ రోజుల్లో అతి శుభ్రత

**నెలసరి సమయంలో తీసుకునే కొన్ని జాగ్రత్తలు... అనారోగ్యాల బారిన పడకుండా కాపాడతాయి. అవేంటంటే...**



- ఆ సమయంలో ఉపయోగించే న్యాప్‌కిన్లను తరచూ మారుస్తుండాలి. కొందరు మహిళలకు ఒకట్రెండు రోజులు అధిక రక్తస్రావం అవుతుంది. అలాంటివారు ప్రతి నాలుగు గంటలకోసారి న్యాప్‌కిన్ మార్చాలి. ఎవరైనా సరే... ఎనిమిది గంటల కంటే ఎక్కువ సమయం ఒకేదాన్ని ఉపయోగించకూడదు. దీన్ని నిర్లక్ష్యం చేస్తే రకరకాల ఇన్‌ఫెక్షన్లు వచ్చే ప్రమాదం ఉంటుంది.
- కొంతమంది మహిళలు రీయూజబుల్ న్యాప్‌కిన్లను వాడుతుంటారు. వాడిన ప్రతిసారి వీటిని బాగా శుభ్రం చేయాలి. అప్పుడే అందులో ఉండే హానికారక సూక్ష్మక్రిములు తొలగిపోతాయి. ఇన్‌ఫెక్షన్లు దరి చేరవు. ఆ న్యాప్‌కిన్ ప్యాకెట్‌పై ఇచ్చిన సూచనలను సరిగ్గా పాటించాలి. వాటిని ఎంతకాలం వాడమని చెబితే అన్ని రోజులు మాత్రమే ఉపయోగించాలి.
- ప్యాడ్‌ని మార్చిన ప్రతిసారి వ్యక్తిగత శుభ్రత అవసరం. గోరువెచ్చటి నీరు, గాఢత తక్కువగా ఉండే సబ్బును ఉపయోగించాలి.
- అధిక రక్తస్రావం అయ్యే కొందరు మహిళలు ఒకేసారి రెండు న్యాప్‌కిన్లను ఉపయోగిస్తుంటారు. ఇది మంచి పద్ధతి కాదు. దానివల్ల వెజైనల్ ఇన్‌ఫెక్షన్లు వచ్చే అవకాశాలు ఎక్కువ.
- కేవలం న్యాప్‌కిన్లే కాదు... సౌకర్యంగా ఉండే పరిశుభ్రమైన లోదుస్తుల్ని ఎంచుకోవడమూ ముఖ్యమే. బిగుతుగా ఉండేవాటి జోలికి పోకూడదు.

**పని ప్రదేశంలో ఎన్నో మానవ మృగాలుంటాయి. వారి నుంచి ఎదురయ్యే వేధింపులను ఎక్కడ ఫిర్యాదు చేయాలో తెలియక కుమిలిపోయే మహిళలు ఎంతో మంది. బయటపడితే ఎక్కడ పరువు పోతుందోననే భయం. ఉద్యోగం మానేస్తే బతుకు భారం అవుతుందన్న ఆందోళన. ఇటువంటి వేదనను అనుభవించే వనితల కోసమే 'వాయిసెస్' పేరుతో యాప్ రూపొందించింది సోనాలీ సిద్ధ. ఇందులో ఫిర్యాదు చేస్తే నేరుగా పోలీసు అధికారులకే సమాచారం వెళ్తుంది. ఆ విశేషాలేంటంటే...**




## బాధితులకు వాయిసెస్

పని ప్రదేశాల్లో మహిళలు ఎదుర్కొంటున్న లైంగిక వేధింపులను ఎటువంటి భయం లేకుండా బయట పెట్టడానికి ఈ 'వాయిసెస్' వేదికగా నిలుస్తుందని అంటోంది సోనాలి. 'గతంలో ఒక స్త్రీ తాను పనిచేసే చోట అనుభవించిన మానసిక వేదనను 'మీ-టూ' ఉద్యమం ద్వారా ఎన్నో ఏళ్ల తరువాత బయట పెట్టింది. ఇది నన్ను దిగ్భ్రాంతికి గురి చేసింది. కార్యాలయాల్లో ఇటువంటి అవమానాలు, వేధింపులు ఎదుర్కొన్న మహిళలెందరో ఈ ఉద్యమం ద్వారా ధైర్యంగా ఫిర్యాదు చేశారు. ఇంకా ఎంతోమంది మహిళలు వేధింపులకు గురై సరైన వేదిక లేక ఇప్పటికీ తమ సమస్యలను బయటపెట్టలేకపోతున్నారు. వారి కోసమే ఏదైనా చేయాలనుకున్నా. ఈ ఆలోచన నుంచి పుట్టిందే 'వాయిసెస్'. ఈ యాప్ ద్వారా వేధింపులకు గురైన మహిళలు నిర్భయంగా తమకు జరిగిన అన్యాయాన్ని చెప్పుకోవచ్చు. ఎవరైనా దీన్ని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. బాధితుల నుంచి వచ్చే ఫిర్యాదులు డిజిటల్ ఇండియా థీం ద్వారా 'ఈ గవర్నమెంట్' విభాగానికి, కేబినెట్ మంత్రులకు, రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు చేరతాయి. ఇది మహిళలకు రక్షణగా పనిచేస్తుంది...' అని చెబుతుంది సోనాలి. గణితం, కంప్యూటర్ సైన్సు ప్రధాన సబ్జెక్టులుగా డిగ్రీ పూర్తిచేసిన ఆమె ఆ తరువాత పుణె విశ్వవిద్యాలయంలో చదివి ఓ సంస్థలో ఉద్యోగం చేసింది. ఉద్యోగ రీత్యా 14 ఏళ్ల పాటు అమెరికాలో గడిపింది. ఆ తరువాత భారత్‌కు తిరిగి వచ్చింది. ఇక్కడికి వచ్చిన ఆమె మహిళలపై వేధింపులు అరికట్టడానికి ఏదైనా చేయాలని ఈ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది.

### ఇందులో ఏం ఉంటాయంటే...

- ఉద్యోగినుల సమస్యలపై పోరాడే సామాజిక సేవాసంస్థల వివరాలు ఈ యాప్‌లో ఉంటాయి.
- తమ లాగే వేధింపులకు గురైన వారితో మనోభావాలు పంచుకునే అవకాశం, సమస్యలకు పరిష్కార మార్గాన్ని పొందే వెసులుబాటు ఇందులో ఉంటుంది.
- ఉన్నతాధికారులు ఈ యాప్‌తో అనుసంధానమై ఉంటారు. ఇందులో వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంటారు.

### ఎలా పనిచేస్తుందంటే...




- స్మార్ట్‌ఫోన్‌లో ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని పేరు నమోదు చేసుకోవాలి.
- ఇందులో ఉండే ఫోన్‌బుక్‌లో హెరాజ్‌మెంట్, డిస్క్రిమినేషన్, ఐడియాస్, ఫీడ్‌బ్యాక్ హాట్‌లైన్స్, సర్వేలు, మానవ వనరుల విభాగం, సీఈవో తదితర అంశాలుంటాయి. వీటిలో అవసరం అయిన దాన్ని ఎంచుకొని బాధితురాలు ఫిర్యాదు చేయాలి. ఫొటో, ప్రాంతం, ధ్రువపత్రం, ఆడియో లేదా వీడియోను జత చేయాల్సి ఉంటుంది.
- బాధితుల సమాచారం యాప్‌నకు అనుసంధానమై ఉన్న అధికారుల కార్యాలయాలకు చేరుతుంది. ఫిర్యాదుదారు వివరాలు గోప్యంగా ఉంచుతారు.
- ఇందులో బాధితురాలు తనకు కావాల్సిన సమాచారం తెలుసుకోవచ్చు. తన గోడు వివరించొచ్చు. అధికారులూ బాధితురాలిని ప్రశ్నించొచ్చు.
- దీని ద్వారా ఉద్యోగినులకు అవసరమైతే చట్టపరమైన చేయూత, కౌన్సెలింగ్ వంటి సౌకర్యాలు కల్పిస్తారు. ఎప్పుడైనా, ఎక్కడి నుంచైనా ఈ యాప్‌ను ఉపయోగించొచ్చు. దీనివల్ల ఎలాంటి ఇబ్బందీ ఉండదంటుంది సోనాలి.

# ఈతరం



## 'చాయ్' చమక్కులే చూడరా భాయ్!

ఉపాధి దొరక్క శరణార్థులు పడుతున్న ఇబ్బందులు లండన్‌లో స్థిరపడ్డ భారతీయుడు ప్రణవ్ చోప్రాను కదిలించాయి. వారి కోసం 'చాయ్‌గరమ్' స్ట్రీట్‌స్టార్టప్‌ను ప్రారంభించి భారతీయ తేనీటి రుచులను పరిచయం చేస్తున్నాడు. ఇందులో పనిచేయడానికి ఇంగ్లిష్‌లో మాట్లాడలేని, ఎలాంటి నైపుణ్యాలు లేని శరణార్థులను తీసుకుంటున్నాడు. వారు తమ నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు సాయం చేస్తున్నాడు. ఇందులో పనిచేసిన చాలామంది లండన్‌లో ఉద్యోగాలు పొందుతున్నారు. 'చాయ్‌గరమ్'తో ఇటు రుచులు, అటు ఉపాధి అందిస్తూ ప్రణవ్ ప్రశంసలందుకుంటున్నాడు.

## ఆమె జ్ఞాపకాలతోనే నా ప్రయాణం

సీఎంఏ చివరి సంవత్సరం శిక్షణ కోసం విజయవాడలోని ఒక కోచింగ్ సెంటర్‌లో జాయినయ్యాను. ఒకరోజు మధ్యాహ్నం క్లాసు ముగించుకుని వస్తుంటే మొదటిసారిగా సాహితిని చూశాను. ఇంతకుముందు ఎన్నడూలేని అనుభూతి కలిగింది. ఆమె ఎంతోకాలం నుంచి తెలిసిన ఆప్తురాలిలా అనిపించింది. తను నా జూనియరని తెలిసింది. అప్పటినుంచి రోజూ తను కాలేజీకి వెళ్లేటప్పుడు, వచ్చేటప్పుడు అనుసరిస్తూ ఉండేవాడిని. స్నేహితులంతా నీ మనసులో మాట చెప్పమని ప్రోత్సహించేవారు. కానీ తెలియని బిడియం, ఎందుకిలా వెంట పడుతున్నావని ఎక్కడ నిలదీస్తుందోననే భయంతో నా ఇష్టాన్ని చెప్పలేకపోయాను. పరీక్షలు పూర్తైన తర్వాత.. మీ అమ్మాయిని పెళ్లి చేసుకుంటానని తన తల్లిదండ్రులను అడగాలని ఆ క్షణంలోనే గట్టిగా నిర్ణయించుకున్నా. కష్టపడి చదివి పరీక్షలు పాసై మద్రాస్ స్టాండర్డ్ ఛార్టర్డ్ బ్యాంకులో ఉద్యోగం సంపాదించాను. ఇదంతా జరగడానికి రెండేళ్లు పట్టినా తనను మరచిపోలేదు. ఉద్యోగంలో చేరిన రెండు నెలల తర్వాత తనను వెతుక్కుంటూ విజయవాడ వెళ్లాను. తను హైదరాబాద్‌లో ఉంటుందని తెలిసి వెతికినా ప్రయోజనం లేకపోయింది. ఇంతలో సహోద్యోగి మల్లీశ్వరి పరిచయమైంది. మాటల సందర్భంలో మల్లీశ్వరి, సాహితితో కలిసి చదువుకుందని తెలిసింది. నా ఆనందానికి అడ్డులేకుండా పోయింది. ఆమె నుంచి చిరునామా తీసుకొని, వెంటనే ఉద్యోగానికి రెండు రోజులు సెలవుపెట్టి తన కోసం వెళ్లాను. వాళ్ల ఇంటికి వెళుతున్నప్పుడు... ఎలా పరిచయం చేసుకోవాలి.. తన తల్లిదండ్రులను పెళ్లికి ఎలా ఒప్పించాలని ఆలోచిస్తూనే చిక్కడపల్లిలోని వాళ్లింటికి వెళ్లి తలుపుతట్టాను. తలుపు తీసిన పెద్దాయనకు నన్ను నేను పరిచయం చేసుకున్నాను.




సాహితితో కలిసి చదువుకున్నానని చెప్పాను. ఆ తర్వాత మెల్లగా సాహితిని ప్రేమించానని, నాతో పెళ్లికి అంగీకరించమని వేడుకున్నాను. ఆయన కళ్లలో నీళ్లు తిరిగాయి. సాహితి వాళ్ల అమ్మగారిని పిలిచి ఇద్దరూ బాధపడటం మొదలుపెట్టారు. ఏం జరుగుతుందో నాకేమీ అర్థంకాలేదు. "అమ్మా, ప్రేమించడం తప్పయితే నన్ను క్షమించండి. నా మనసులో మాట చెప్పానుగానీ మిమ్మల్ని బాధపెట్టే ఉద్దేశం నాకు లేదు" అన్నాను. వాళ్లు అతికష్టం మీద తమాయించుకుని "సాహితి ఇకలేదయ్యా" అన్నారు. నాకంతా అయోమయంగా ఉండి నోటమాట రాక అలా చూస్తూ ఉండిపోయా. "సాహితీ విజయవాడలో ఉన్నప్పుడే ఒకబ్బాయిని ప్రేమించింది. అతడు కాదనడంతో ఆ బాధను తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుంది" అన్నారు. నాకు కన్నీరాగలేదు. ఇక అక్కడ ఉండలేక వెంటనే బయలుదేరాను. ఆమె జ్ఞాపకాల్లోంచి బయటపడటం అసాధ్యమనిపించింది. నాలుగేళ్లు చెన్నైలో ఉద్యోగం చేసినా ఆమెను మరచిపోలేకపోయాను. తాగుడికి అలవాటు పడ్డాను. నా పరిస్థితిని చూసి బాధపడ్డ మిత్రులు ఎంతో ప్రయత్నించి చెన్నై నుంచి నన్ను ఖతర్ పంపారు. ఇకనైనా సాహితిని మరచిపోయి కొత్త జీవితాన్ని ప్రారంభించమని చెప్పారు. మరచిపోవడానికి తను సంఘటన కాదు... మధుర జ్ఞాపకం. ఆమె ఆలోచనలే నా ప్రాణం. వాటితోనే నా ప్రయాణం.

– చక్రవర్తి

## వయసు 29... అవార్డులు 127

**వయసు 29..**
**ఏడేళ్లలో తీసిన షార్ట్‌ఫిల్మ్స్ సంఖ్య 85**
**అందుకున్న నేషనల్, ఇంటర్నేషనల్ అవార్డులు 127**
**ఇదంతా ఎవరి గురించీ అంటారా? దర్శకుడు అన్షుల్ సిన్హా ప్రస్థానమిది. తీసిన లఘుచిత్రాలన్నీ సమాజ హితం కోరేవే కావడం... ఈ యువకుడిలోని సామాజిక బాధ్యతకు నిదర్శనం. ఇంత చిన్న వయస్సులో అంత పెద్ద బాధ్యత ఎందుకు ఎత్తుకున్నారని అడిగితే... 'ఈతరం'తో ఎన్నో విషయాలు చెప్పుకొచ్చాడు.**



### లఘుచిత్రమే.. గురుతర బాధ్యత

అన్షుల్ సిన్హా తెరకెక్కించిన 'వాటర్‌మెన్' చిత్రం నిడివి ఒక్క నిమిషమే. ఇందులో నీటిని కాపాడుకోవాలనే చక్కని మెసేజ్ ఉంది. జలం ఎలా వృథా చేస్తున్నామో కళ్లకు కట్టినట్లు చూపుతుందీ చిత్రం. ఒక మనిషి కుళాయిని నోట్లో పెట్టుకొని ఇంటికి వచ్చి నీళ్లు అందిస్తుంటాడు. ఎంతో దూరం నుంచి నీళ్లు మన ఇంటికి చేరుతున్న విషయాన్ని చెప్పడానికి అతను ఎక్కడో నదీ తీరం నుంచి పరిగెత్తుకుంటూ వస్తాడు. ఇంట్లో పాత్రలు కడిగేటప్పుడు.. షేవింగ్ చేసుకొనేటప్పుడు నీటిని వదిలేసి... మనుషుల చేస్తున్న వృథాను కళ్లకు కడతాడు. ఆ తర్వాత రోజు వాటర్‌మెన్ ఇంటికి రాడు. దీంతో వాళ్లు ఇబ్బంది పడతారు. దీన్ని క్లుప్తంగా చూపించడంలో సిన్హా విజయం సాధించాడు. అమెరికాలో నిర్వహించిన పోటీలో పబ్లిక్ సర్వీస్ అనౌన్స్‌మెంట్ కేటగిరీలో వాటర్‌మాన్‌కి రెండో బహుమతి వచ్చింది. ఈ లఘుచిత్రానికి మొత్తం 8 ఇంటర్నేషనల్ అవార్డులు వచ్చాయి.

గతేడాది మిట్టి.. బ్యాక్ టు రూట్స్ అనే రెండుగంటల సినిమా హిందీలో రూపొందించాడు. రైతుల ఆత్మహత్యలకు కారణాలేంటి? అనే విషయాలను ప్రాతలతో చెప్పించాడు. టెడెక్స్ హైదరాబాద్‌వాళ్లు సినిమా మేకింగ్‌కు సపోర్టు ఇచ్చారు. ఇది క్రౌడ్ ఫండింగ్ మూవీ. వ్యవసాయ శాస్త్రవేత్త జి.వి.రామాంజనేయులు ఈ సినిమాకు మార్గదర్శకుడు. అమెరికా, జర్మనీ, గ్రీసులతో పాటు తెలంగాణ, పంజాబ్, మహారాష్ట్రతో కలిపి 110 చోట్ల ఈ చిత్రాన్ని ప్రదర్శించారు. శేఖర్‌కమ్ముల లాంటి దర్శకులు ఈ సినిమాను మెచ్చుకున్నారు. దీనికి వచ్చిన సొమ్మును ఆత్మహత్యలు చేసుకున్న రైతు కుటుంబాలకు పంచారు.

2012లో మలక్‌పేట్‌లోని ఓ అంధుల పాఠశాలకు వెళ్లాను. అక్కడ మూడు కంప్యూటర్లున్నాయి. వాటిని పక్కనపడేశారు. ఎందుకని అడిగితే.. కరెంటులేదు, మదర్‌బోర్డు పోయిందని అక్కడి ప్రిన్సిపల్ చెప్పారు. దీంతో వెంటనే 'బ్లైండ్ స్కూల్' అనే షార్ట్‌ఫిల్మ్‌ను ఫోన్‌తో తీశా. సోషల్‌మీడియాలో షేర్ చేశా. మంచి స్పందన వచ్చింది. మూడునెలల్లో దాతలు ఆ స్కూల్‌కి పన్నెండు కంప్యూటర్లు ఇచ్చారు. దీంతో వీడియో రూపంలో చెబితే ప్రభావం ఉంటుందనుకున్నా. ఆ తర్వాత అనాథ శరణాలయానికి వెళ్లి ఓ వీడియో తీస్తే.. అక్కడ తప్పిపోయిన పిల్లవాడు వాళ్ల తల్లిదండ్రులకు దొరికాడు. అనాథపిల్లలపై చిత్రం చేస్తే వాళ్ల బాగోగులు చూడటానికి దాతలు వచ్చారు. వీడియోలను మంచి దారిలో ఉపయోగించి అద్భుతాలు సృష్టించొచ్చు అనిపించింది. అప్పటి నుంచి అదే బాటలో సాగుతున్నా.

### నా చిత్రాలన్నీ రోడ్‌షోలే

మొదటిసారిగా 'మై చాకొలేట్ కవర్' అనే షార్ట్‌ఫిల్మ్‌కి 21 అవార్డులొచ్చాయి. పనిచేస్తోంటే టెక్నికల్‌గా కాస్త మెరుగయ్యా. మత సామరస్యంపై 'లపెట్' అనే షార్ట్‌ఫిల్మ్‌ను 2013లో తీస్తే దానికి కాలిఫోర్నియోలో ఇంటర్నేషనల్ అవార్డు వచ్చింది. మెయిల్ వస్తే.. అది అబద్ధమేమోనని ఐదురోజులు పట్టించుకోలేదు. తర్వాత వాళ్లు ఫోన్ చేశారు. డబ్బు పంపారు. అవార్డును కొరియర్ చేశారు(నవ్వులు). నాకు ఇలా వచ్చిన అవార్డు డబ్బులను తదుపరి సినిమాకే ఉపయోగిస్తాను. అనాథ శవాలకు అంతిమ దహనం చేసిన సామాజిక కార్యకర్త, సత్యహరిచ్చంద్ర ఫౌండేషన్ స్థాపకుడు రాజేశ్వరరావు జీవితంపై 'ద గేట్ వే టు హెవన్' షార్ట్‌ఫిల్మ్‌ను రూపొందించా. ఈ చిత్రానికి 11 ఇంటర్నేషనల్ నామినేషన్లు వచ్చాయి. 65 దేశాలు పాల్గొన్న యూకే ఫెస్టివల్‌లో మూడో బహుమతి సాధించింది. 50 అవార్డులు వచ్చాక అన్నపూర్ణ ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ ఫిల్మ్‌మీడియా నన్ను పిలిచి ఉచితంగా శిక్షణ ఇచ్చింది. కుంటలు కాపాడాలి, ఫ్యాక్టరీల వ్యర్థాలు, బయోమెడికల్ వ్యర్థాలు, ఎలక్ట్రానిక్ వ్యర్థాలు, మహిళా సాధికారత, మతతత్వంపై లఘుచిత్రాలు రూపొందించా. వాటర్‌మ్యాన్, మిట్టి.. బ్యాక్ టు రూట్స్ దాకా అన్నీ సామాజిక చిత్రాలే చేశా. ఇప్పటివరకూ వీటిని రిలీజ్ చేయలేదు. రోడ్‌షోల్లో ప్రదర్శించి, అవార్డులకు పంపా.

### భారత క్రికెట్ జట్టులో ఆడాలనుకున్నా...

ముంబైలో పుట్టిపెరిగాను. పదిహేనేళ్ల తర్వాత మానాన్న హైదరాబాద్‌కి రావటంతో మేం ఇక్కడి వచ్చేశాం. క్రికెట్‌లో బాగా ఆడి రాష్ట్రస్థాయి క్రికెట్ ఆటగాడినయ్యా. క్రికెట్ ఆడటానికి వెళ్లినపుడు ఓ సంఘటన జరిగింది. నా స్నేహితుడిని కొడుతుంటే అతన్ని ఆపటానికి వెళ్లా. అక్కడ పొలిటికల్ బ్యాక్‌గ్రౌండ్ ఉండే కుర్రోడు.. నువ్వెందుకొచ్చావని అడిగాడు. స్నేహితుడ్ని అని చెప్పా. రాజకీయబలంతో నన్ను స్టేషన్‌లో రెండు రోజులు ఉంచారు. పోలీసులు కొడితే ఎనిమిది రోజులు బెడ్‌మీద ఉన్నా. ముంబై లీగ్ క్రికెట్ కార్డును క్యాన్సిల్ చేశారు. నా కల క్రికెట్ ప్లేయర్ కావటం.. అదీ దేశానికి ఆడటం. అది దూరం కావటంతో ఆర్నెళ్లు డిప్రెషన్‌లోకి వెళ్లా. మానాన్న నన్ను బయటికి తీసుకొచ్చాడు. ఆయన బ్యాంక్ ఉద్యోగంతో పాటు ఫ్రీలాన్స్ జర్నలిస్టుగా పనిచేసేవారు. రాత్రిపూట నొప్పులకు తట్టుకోలేకుంటే మానాన్న నాకు కాళ్లు పట్టేవారు. స్ఫూర్తివంతమైన కథలు చెబుతూ.. నాలో చైతన్యం నింపేవారు. ఇలా ఉంటే కుదరదని హైదరాబాద్‌లో ఉండే అమ్మ(అధ్యాపకురాలు), అన్నయ్య దగ్గరికి పంపించి.. ఎంబీఏలో చేరమన్నారు. అలా ఎంబీఏ చేశా. ఆ తర్వాత షార్ట్‌ఫిల్మ్ దర్శకుడిగా యూటర్న్ తీసుకున్నా. 'మెక్‌గఫిన్ ఫ్రేమ్స్' అనే స్టార్టప్‌ను ప్రారంభించా. మేం సామాజిక చిత్రాలే చేస్తాం. దేశం తరఫున క్రికెట్ ఆడి జెర్సీ వేసుకోవాలనే ఆశ.. షార్ట్‌ఫిల్మ్స్‌తో ఇండియా తరఫున అవార్డు అందుకోవటంతో అది తీరుతోంది.

### చంపేస్తామన్నారు

"అవయవాలను అమ్ముకునే మాఫియాపై 'ద గేట్ వే ఆఫ్ హెవెన్' లో చూపించాను. మాఫియా నుంచి ఫోన్లు వచ్చాయి. చంపేస్తామన్నారు. మూడుకోట్లు ఇస్తాం.. సినిమా మాకు ఇచ్చేయమన్నారు. నేను భయపడలేదు. మీడియాలో నా ఫొటోలు రావటంతో వాళ్లు తగ్గారు. ఈ సమయంలో అమ్మా, నాన్న ఎంతో ధైర్యం చెప్పి ప్రోత్సహించారు. సామాజిక కార్యకర్త రాజేశ్వరరావును నా లఘుచిత్రంతో తెలంగాణ రాష్ట్రం గుర్తించింది. ఇటీవల తీసిన మిట్టి.. సినిమా చూసి రైతులెంతో ఆనందపడ్డారు. ఇలాంటివే నన్ను నడిపిస్తున్నాయి.

## 'యా..హూ'పర్స్



నైట్ ప్యాంట్లు అయిపోయాయి. లోయర్లు ఎప్పుడో వాడేశాం. జగిన్స్ బోరుకొట్టేశాయి. షార్ట్స్ వేసుకొని అన్ని చోట్లకు వెళ్లలేం. మరి ఈ రొటీన్ ప్యాంట్లు వేసుకోవడం తప్పదా?



'నో...నో... సే గుడ్ బాయ్ టు నార్మల్, బోరింగ్ ప్యాంట్స్' అంటూ ఊరిస్తోంది ఫ్యాషన్ ప్రపంచం. అటు స్టైల్, ఇటు కంఫర్ట్‌ను దృష్టిలో ఉంచుకొని హూపర్స్ ప్యాంట్లను మార్కెట్లోకి తెచ్చారు డిజైనర్లు. యువతను ఆకట్టుకునే రంగులతో వీటిని రూపొందించారు. డ్యూయల్ కలర్డ్, చెక్ మిక్స్, మిలటరీ, రఫ్, హార్డ్ లుక్‌లో హూపర్స్‌ని అందుబాటులోకి తెచ్చారు. మడమల వద్ద ఎలాస్టిక్ రింగ్‌తో, బాగా లూజుగా ఉంటూ ఇవి యువతను కట్టిపడేస్తున్నాయి. ఫార్మల్‌గా కాకుండా మిగతా అన్ని సందర్భాల్లోనూ ఇవి మిమ్మల్ని ప్రత్యేకంగా నిలుపుతాయని డిజైనర్లు చెబుతున్నారు. అమ్మాయిలు, అబ్బాయిలు ఇద్దరికీ సరిపోయేలా ఉండటంతో యువత వీటిపై ఎక్కువ మక్కువ చూపుతున్నారు. వీటిపైకి తగిన టీషర్ట్ వేసుకొని, క్యాజువల్, స్పోర్ట్స్ షూ వేసుకుంటే అదిరిపోయే లుక్ సొంతమవుతుంది. **ధర :** రూ.1200 నుంచి రూ.2000.





## విజువల్ కళ్యాణ్

# కార్టూన్స్ చూసి.. యానిమేషన్ చేసి..



**చిన్నప్పుడు కార్టూన్స్ చూశాడు. కాస్త పెద్దయ్యాక వీడియోగేమ్స్ ఆడాడు. పెరిగి పెద్దయ్యాక యానిమేషన్ చిత్రాలు తీసే స్థాయికి ఎదిగాడు. యానిమేషన్ రంగంలో ఆస్కార్‌కు నామినేషన్ పొందాడు హైదరాబాద్‌కు చెందిన కళ్యాణ్ సూర. ఆసక్తి, కష్టపడేతత్వం... ఉంటే చాలు అనుకున్న లక్ష్యం చేరడం పెద్ద కష్టమేమి కాదని నిరూపించిన యువకుడు కళ్యాణ్ శ్రీకాకుళంలో పుట్టాడు. హైదరాబాద్‌లో పెరిగాడు. హిమాయత్‌నగర్‌లో సెయింట్‌పాల్స్ స్కూల్‌లో పదో తరగతి వరకు చదివాడు. బిట్స్ పిలానీలో కంప్యూటర్ సైన్స్ చదువుతూనే ఫిల్మ్ మేకింగ్‌లో శిక్షణ తీసుకున్నాడు. కళాశాలలోని క్రియేటివ్ ఆర్ట్స్ సొసైటీ యాక్టివిటీ క్లబ్‌కు అధ్యక్షుడై ప్రతిభ చూపాడు.**

"భారత్‌లో సైన్స్ ఫిక్షన్ సినిమాలు పెద్దగా లేవు. టాలీవుడ్, హాలీవుడ్ సంస్కృతులను మేళవించేలా సినిమాలు రూపొందించే ఆలోచనలో ఉన్నా. ఈ రెండు సంస్కృతుల వ్యత్యాసంపై ప్రస్తుతం అధ్యయనం చేస్తున్నా."

### ఆసుపత్రి మంచంపై నుంచే ఇంటర్వ్యూకి..

కాలిఫోర్నియాకు చెందిన 'డ్రీమ్‌వర్క్స్ యానిమేషన్' సంస్థ బిట్స్‌లో ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్ కోసం దరఖాస్తులు ఆహ్వానించింది. కళ్యాణ్ ఆ అవకాశాన్ని ఎలాగైనా సద్వినియోగం చేసుకోవాలనుకున్నాడు. యానిమేషన్‌కు సంబంధించిన సాఫ్ట్‌వేర్లపై శిక్షణ తీసుకునేందుకు సిద్ధమయ్యాడు. అందుకు రూ.2లక్షలు అవుతుందనడంతో వెనకడుగు వేయక తప్పలేదు. తపన ఉన్నప్పుడు ఎలాంటి పరిస్థితులు మనల్ని ఆపలేవు. శిక్షణకు ఆర్థిక పరిస్థితి అనుకూలించకపోయినా... యూట్యూబ్‌లోని వీడియోల్ని చూస్తూ 20 వరకు సాఫ్ట్‌వేర్లను అధ్యయనం చేశాడు. ఇంతలో జీవితంలో చిన్న కుదుపు. ప్రమాదవశాత్తు కాలికి దెబ్బ తగలడంతో ఆసుపత్రి పాలయ్యాడు. నెలన్నరపాటు బెడ్‌పైనే గడపాల్సి వచ్చినా కుంగిపోలేదు. ప్రత్యేక అనుమతి తీసుకొని బెడ్‌పై నుంచే ఆన్‌లైన్‌లో ఇంటర్వ్యూకు హాజరయ్యాడు. బిట్స్‌లో సుమారు 400 మంది ఇంటర్న్‌షిప్ కోసం దరఖాస్తులు చేస్తే ఒక్కడే ఎంపికయ్యాడు. 2012లో అమెరికా నుంచి ఆహ్వానం అందడంతో అక్కడికి వెళ్లి శిక్షణ పొందాడు. తొలి ఆరు నెలలు శిక్షణ ఇచ్చిన సంస్థ నిర్వాహకులు.. బెంగళూరులోని తమ శాఖకు టెక్నికల్ డైరెక్టర్‌గా ఉద్యోగం ఇచ్చారు. అలా మొదటిసారి ప్రతిభను నిరూపించుకునేలా అతడి చేతికి ఓ ప్రాజెక్టు వచ్చింది. 'హౌ టు ట్రెయిన్ యువర్ డ్రాగన్-2' అనే కంప్యూటర్ యానిమేటెడ్ యాక్షన్ ఫాంటసీ ఫిల్మ్‌కు గ్రాఫిక్స్‌లో సహకారం అందించాడు. ఆ ఫిల్మ్ 2014లో 'అన్ని అవార్డ్స్' విభాగంలో ఆస్కార్‌కు నామినేట్ అయింది. 'మిస్టర్ పీబాడీ అండ్ షెర్మన్', 'పెంగ్విన్స్ ఆఫ్ మెడగాస్కర్' సినిమాల కోసం సుమారు 600 మంది బృందానికి టెక్నికల్ డైరెక్టర్‌గా పనిచేశాడు.

### ఆస్కార్ విజేత మార్గదర్శకత్వంలో ప్రయాణం

అమెరికాలో కథారచన, దర్శకత్వం, విజువల్ ఎఫెక్ట్స్, సౌండ్ డిజైనింగ్ వంటి ఆర్ట్స్‌పై శిక్షణ ఇవ్వడంలో ప్రఖ్యాత ఫిల్మ్ స్కూల్ 'యూనివర్సిటీ ఆఫ్ సౌత్‌రెన్ కాలిఫోర్నియా(యూఎస్‌సీ)'కు కళ్యాణ్ దరఖాస్తు చేశాడు. 2015 జనవరిలో అక్కడికెళ్లి హాలీవుడ్ ప్రయాణం మొదలుపెట్టాడు. ఆస్కార్ విజేత 'మైక్ ఫింక్' యూఎస్‌సీ ఫిల్మ్ విభాగం హెడ్‌గా ఉండటంతో కళ్యాణ్‌లోని ప్రతిభ వెల్లివిరిసింది. ఆ ప్రతిష్ఠాత్మక యూనివర్సిటీలో విజువల్ ఎఫెక్ట్స్ సొసైటీ విభాగానికి అధ్యక్షుడిగా పనిచేసే అవకాశం దక్కడం అతడి పనితనానికి నిదర్శనంగా నిలిచే అంశం. ఈ నాలుగేళ్ల కాలంలో 20 షార్ట్స్ స్క్రిప్ట్స్, 3 ఫీచర్ ఫిల్మ్స్, 6 లఘుచిత్రాలకు దర్శకత్వం వహించడంతోపాటు 12 చిత్రాలకు విజువల్ ఎఫెక్ట్స్ సూపర్‌వైజర్‌గా పనిచేశాడు.

– మల్యాల సత్యం, ఈనాడు, హైదరాబాద్

## ఆచార్య జయశంకర్‌కు నివాళులు

ఈనాడు, హైదరాబాద్: తెరాస సిద్ధాంతకర్త ఆచార్య జయశంకర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఆయనకు ప్రజాప్రతినిధులు, ఉద్యోగ సంఘాల నేతలు, ప్రజలు నివాళులర్పించారు. తెలంగాణభవన్‌లో తెరాస నేతలు, టీఎన్జీవో కార్యాలయంలో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ఐకాస అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కారెం రవీందర్‌రెడ్డి, మమతలు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, నిజామాబాద్ మాజీ ఎంపీ కల్వకుంట్ల కవితలు ట్విటర్‌లో జయశంకర్ సార్‌ను స్మరించుకున్నారు.

## లిఫ్ట్‌లో చిక్కుకున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

### బయటకు తీసిన సిబ్బంది

కాళేశ్వరం, న్యూస్‌టుడే: కాళేశ్వర ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవం నాడు చిన్న అపశ్రుతి చోటుచేసుకుంది. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి జగదీశ్ రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలసి శుక్రవారం రాత్రి కన్నెపల్లి పంపు హౌస్ సందర్శనకు వచ్చారు. వారితోపాటు జయశంకర్ భూపాలపల్లి ఆర్డీవో వెంకటాచారి, మహదేవపూర్ తహసీల్దార్ విజయానందం, గ్రావిటీ కెనాల్ సంస్థ ఎండీ నిశాంత్‌తో పాటు మరో 10 మంది కలిసి లిఫ్ట్‌లో పంపుల కింది భాగానికి దిగారు. తిరుగు ప్రయాణంలో గ్రౌండ్ ఫ్లోర్ నుంచి మొదటి అంతస్తులోకి రాగానే లిఫ్ట్ పనిచేయలేదు. చాలా సేపటి వరకు లిఫ్ట్ తలుపులు తెరుచుకోకపోవడంతో అక్కడ ఉన్న కార్మికులు సంస్థ ప్రతినిధులకు సమాచారం అందించారు. వెంటనే మేఘా ఇన్‌ఫ్రా సిబ్బంది, పోలీసులు వచ్చి కింది లిఫ్ట్ భాగాన్ని పగులగొట్టారు. అందులోంచి ఒక్కొక్కరిని బయటకు తీసి నిచ్చెనల ద్వారా పైకి పంపించారు. చివరగా మంత్రి జగదీశ్‌రెడ్డిని బయటకు రప్పించారు. మంత్రి, కుటుంబ సభ్యులు, అధికారులు సురక్షితంగా బయటపడ్డారు. సామర్థ్యానికి మించి ఎక్కడంతోనే ఘటన చోటుచేసుకున్నట్లు సాంకేతికనిపుణులు పేర్కొన్నారు.

## ప్రమాద బాధితులను ఆదుకున్న మంత్రి మహమూద్ అలీ

ఈనాడు, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి వెళ్లి వస్తున్న రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ మార్గమధ్యంలో రోడ్డు ప్రమాద బాధితులను ఆదుకున్నారు. అన్నారం నుంచి మంత్రి వస్తుండగా.. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం అలుగునూరు వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. వెంటనే ఆయన తమ వాహనాన్ని, కాన్వాయ్‌ని ఆపారు. ప్రమాద బాధితులను, మృతదేహాలను వెంటనే ఆసుపత్రికి తరలించాలని పోలీసులను ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు క్షతగాత్రులను పోలీసు వాహనాల్లో తీసుకువెళ్లారు.

## నేడు తెరాస కార్యాలయాల నమూనా ఖరారు

ఈనాడు, హైదరాబాద్: ఈ నెల 24న 32 జిల్లాల్లో తెరాస జిల్లా కార్యాలయాలను నిర్మించనుండగా వాటి నమూనాలను ముఖ్యమంత్రి కేసీఆర్ శనివారం ఖరారు చేయనున్నారు.

## ఫిర్యాదులపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయరేం?

### పోలీసుల తీరుపై హైకోర్టు అసంతృప్తి

ఈనాడు, హైదరాబాద్: పౌరులు నేరుగా ఇచ్చేవాటితో పాటు రిజిస్టర్డ్ పోస్టు ద్వారా అందించే ఫిర్యాదులపై ప్రాథమిక సమాచార నివేదికలు (ఎఫ్ఐఆర్‌లు) నమోదు కాకపోవడంపై హైకోర్టు అసంతృప్తి వ్యక్తంచేసింది. అలా ఫిర్యాదులను తిరస్కరించిన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించినా స్పందించని ఎస్పీ తీరు సరికాదని వ్యాఖ్యానించింది. భూముల్లోకి అక్రమంగా చొరబడిన కొంతమందిపై ఫిర్యాదుచేసినా ఠాణాలో కేసు నమోదుచేయకపోవడంపై కొత్తగూడెం జిల్లా మణుగూరుకు చెందిన కె.లక్ష్మీపతిరాజు పిటిషన్ దాఖలుచేశారు. దీనిపై జస్టిస్ ఎ. రాజశేఖర్‌రెడ్డి విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ- రిజిస్టర్డ్ పోస్టు ద్వారా పంపినప్పటికీ మణుగూరు డీఎస్పీ, ఎస్‌హెచ్‌వోలు తీసుకోకుండా వెనక్కి పంపారని, ఎస్పీకి ఫిర్యాదు చేసినా ఫలితం లేదని పేర్కొన్నారు. వెంటనే ఎఫ్ఐఆర్ నమోదుచేసి, బాధ్యులైన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకొని, ఆ మేరకు నివేదిక సమర్పించాలని న్యాయమూర్తి ఆదేశించారు. దీనిపై శుక్రవారం మరోసారి విచారణకు రాగా, ఎఫ్ఐఆర్ నమోదుచేశామని ప్రభుత్వ న్యాయవాది మల్లారెడ్డి తెలిపారు. ఆ అధికారులపై ఏం చర్యలు తీసుకున్నారన్నదానిపై సమాచారం లేదని, కొంత గడువు ఇవ్వాలని అభ్యర్థించారు. దీనికి అనుమతించిన న్యాయమూర్తి.. విచారణను ఈ నెల 25వ తేదీకి వాయిదా వేస్తూ, అధికారులపై ఏం చర్యలు తీసుకున్నారో అప్పుడు చెప్పాలన్నారు.

## తితిదే ఛైర్మన్‌గా వై.వి.సుబ్బారెడ్డి

### నేడు శ్రీవారి ఆలయంలో ప్రమాణ స్వీకారం



ఈనాడు, అమరావతి, తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల, తిరుపతి దేవస్థానం ధర్మకర్తల మండలి ఛైర్మన్‌గా వై.వి.సుబ్బారెడ్డి నియమిస్తూ ఏపీ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. అంతకుముందు ప్రస్తుత తితిదే బోర్డును రద్దుచేస్తూ మరో ఉత్తర్వు జారీ అయింది. తెలంగాణలోని కాళేశ్వరం ప్రాజెక్టును జాతికి అంకితం చేసే కార్యక్రమంలో పాల్గొనేందుకు బయలుదేరే ముందు ముఖ్యమంత్రి జగన్.. సుబ్బారెడ్డి నియామకానికి సంబంధించిన పత్రాలపై సంతకం చేశారు. నియామక ఉత్తర్వులను ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మన్మోహన్‌సింగ్ తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్‌కు ఫ్యాక్స్ ద్వారా పంపారు. ఈ క్రమంలో శనివారం ఉదయం 11గంటలకు శ్రీవారి సన్నిధిలో ప్రమాణ స్వీకార కార్యక్రమానికి తితిదే ఏర్పాట్లు చేస్తోంది. సుబ్బారెడ్డితో తితిదే ఈవో ప్రమాణం చేయించనున్నారు. తితిదే ఛైర్మన్ పదవికి పుట్టా సుధాకర్‌యాదవ్ ఇటీవల చేసిన రాజీనామాను గురువారం రాష్ట్రప్రభుత్వం ఆమోదిస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

## టీఎస్ఆర్టీసీ విలీనం హామీని నెరవేర్చాలి

### కార్మిక నేతల డిమాండ్

బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే: టీఎస్ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని, సిబ్బందికి కేంద్ర ఉద్యోగులతో సమానంగా వేతనాలు చెల్లిస్తామని గతంలో ఇచ్చిన హామీలను సీఎం కేసీఆర్ నిలబెట్టుకోవాలని జాతీయ మజ్దూర్ యూనియన్‌కు చెందిన తెలంగాణ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి కె.హనుమంతు ముదిరాజ్ కోరారు. యూనియన్ ద్వితీయ వార్షికోత్సవాన్ని శుక్రవారం వీఎస్టీ రోడ్డులోని రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ఏపీఎస్ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని ఆంధ్రప్రదేశ్ సీఎం జగన్ ఇటీవల ప్రకటించడాన్ని గుర్తుచేశారు. విధినిర్వహణలో మృతిచెందే కార్మికులకు రూ.25 లక్షల వంతున పరిహారం చెల్లించాలని; ఒప్పంద, పొరుగుసేవల ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని విజ్ఞప్తిచేశారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు టి. సుధాకర్ ప్రసంగిస్తూ, టీఎస్ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలంటూ ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు అన్ని డిపోల ఎదుట నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. వాటికి సంబంధించిన గోడపత్రికను సభలో విడుదల చేశారు. యూనియన్ రాష్ట్ర కార్యదర్శులు మూర్తి, ఆర్ ఎన్ రావు, అరుణ, సంయుక్త కార్యదర్శులు స్వాములయ్య, ఈఎన్ సాగర్, నర్సయ్య, కోశాధికారి డీఎస్ రావు పాల్గొన్నారు.

## విత్తన నాణ్యత అత్యంత కీలకం

### వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి

ఈనాడు, హైదరాబాద్: పంటల సాగులో విత్తన నాణ్యతకే ప్రాధాన్యం ఉంటుందని, రైతులకు తగిన ప్రమాణాలతో కూడిన వాటినే అందించాలని వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి అన్నారు. సులభమైన, తక్కువ ఖర్చు గల పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తేవడం అవసరమని శుక్రవారం హైటెక్స్‌లో ఏర్పాటైన సదస్సులో పేర్కొన్నారు. పాశ్చాత్య దేశాల్లో అనుసరిస్తున్న నానో సాంకేతికత వంటివాటిని మనదేశంలోనూ వాడుకలోకి తేవాలన్నారు. ప్రధానంగా విత్తన నాణ్యత పెంపునకు సంబంధించిన 'ఇండో-జర్మన్' ప్రాజెక్టు అమలు వ్యవధిని మరో మూడేళ్లు పొడిగించినట్లు చెప్పారు. అంతర్జాతీయ నిపుణుల అభిప్రాయాలు, అనుభవాలు రాష్ట్ర విత్తన రంగానికి మేలు చేస్తాయని వ్యవసాయ కమిషనర్ రాహుల్ బొజ్జా, విత్తన ధ్రువీకరణ సంస్థ సంచాలకుడు కేశవులు తెలిపారు.

# తెదేపా ఎంపీల విలీనానికి ఆమోదం

- రాజ్యసభ వెబ్‌సైట్‌లో ఆ నలుగురి పేర్లు భాజపా జాబితాలోకి
- తెదేపా సభ్యుల సంఖ్య రెండుకు కుదింపు
- అన్ని అంశాలూ రాజ్యాంగబద్ధంగానే ఉన్నాయని రాజ్యసభ వర్గాల స్పష్టీకరణ

ఈనాడు - దిల్లీ

నలుగురు తెదేపా ఎంపీల విలీనానికి రాజ్యసభ ఆమోదముద్ర వేసింది. దీనిపై అధికారికంగా ఎలాంటి ఉత్తర్వులు జారీచేయకపోయినా రాజ్యసభ వెబ్‌సైట్‌లో మాత్రం సుజనాచౌదరి, సీఎంరమేష్, టీజీవెంకటేష్, గరికపాటి మోహన్‌రావుల పేర్లను భాజపా జాబితాలోకి చేర్చారు. అలాగే తెదేపా సభ్యుల కింద కనకమేడల రవీంద్రకుమార్, తోట సీతారామలక్ష్మిలను మాత్రమే చూపారు. విలీనంపై రాజ్యసభ అధ్యక్షుడు వెంకయ్యనాయుడు ఎలాంటి ఉత్తర్వులు జారీచేయకపోయినా ఆ సభ్యుల విలీనం పూర్తయినట్లేనని రాజ్యసభ వర్గాలు ధ్రువీకరించాయి. విలీనాన్ని సవాల్ చేస్తూ తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ శుక్రవారం వెంకయ్యనాయుడుకి ఇచ్చిన ఫిర్యాదుకు విలువలేదని, అందులో వారు లేవనెత్తిన అంశాల్లో పసలేదని అధికారవర్గాలు పేర్కొన్నాయి. పార్టీ విలీనం సంస్థాగతంగా జరగాలని, సభ్యులను సభలవారీగా కాకుండా పార్లమెంటరీపార్టీ మొత్తంగా చూడాలన్న తెదేపా నేతల వాదన చట్టప్రకారం చెల్లదని స్పష్టంచేశాయి. సంస్థాగత విలీనం కేంద్ర ఎన్నికల సంఘం పరిధిలోకి వస్తుందే తప్ప, స్పీకర్ పరిధిలోకి రాదన్న విషయాన్ని తెదేపా నేతలు విస్మరించినట్లు పేర్కొన్నాయి. సభ్యుల ఫిరాయింపు, విలీనం మాత్రమే సభాధ్యక్షుడి పరిధిలోకి వస్తుందని, అదికూడా సభ్యులను సభలవారీగా చూడాలి తప్పితే పార్లమెంటరీ పార్టీవారీగా చూడకూడదని 10వ షెడ్యూల్‌లోని నిబంధనలు స్పష్టంగా చెబుతున్నాయని అధికారవర్గాలు వెల్లడించాయి.



దిల్లీలో శుక్రవారం ప్రధాని మోదీతో భేటీ అయిన ఎంపీలు టీజీ వెంకటేశ్, సుజనా చౌదరి, సీఎం రమేశ్. చిత్రంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్ రెడ్డి

పదో షెడ్యూల్‌లో నిబంధనల ప్రకారం 'సభ' అంటే పార్లమెంటు ఉభయసభల్లో ఏదో ఒకటని, అసెంబ్లీ అంటే అక్కడి శాసనసభ, మండలిల్లో ఒకటి వస్తుందని ఉదహరించాయి. అందువల్ల ఇక్కడ రాజ్యసభ సభ్యుల్లో మూడింట రెండువంతుల మంది భాజపాలో విలీనం కావాలని తీర్మానంచేసి నిబంధనల ప్రకారం ఒకటి తాము విలీనం కాబోయే పార్టీకి ఇచ్చి వారి అనుమతి కోరారని, అందుకు సదరు పార్టీకూడా అంగీకరిస్తూ సభాధ్యక్షుడికి లేఖ ఇచ్చినందున విలీనం అయినట్లేనని పేర్కొన్నాయి. పదోషెడ్యూల్‌లోని పేరా4(2) కింద సంబంధించి లెజిస్లేచర్ పార్టీలోని మూడింట రెండువంతుల మంది సభ్యులు మరోపార్టీలో విలీనం కావాలని భావిస్తే విలీనమయినట్లే లెక్కని స్పష్టంగా ఉందని ఉదహరించాయి.

### సంస్థాగత వివాదాలేమీ లేవు

ఇక్కడ భాజపాలో విలీనం కావడానికి ముందుకొచ్చిన సభ్యులు తమదే నిజమైన తెలుగుదేశం, తమకే సైకిల్‌గుర్తుకావాలి లాంటి డిమాండ్లేమీ పెట్టలేదని, ప్రధానమంత్రి మోదీ నాయకత్వం నచ్చి తాము అందులో విలీనం కావాలనుకుంటున్నామని మాత్రమే చెప్పారు కాబట్టి ఇక్కడ సంస్థాగత వివాదాలేమీ లేవని పేర్కొన్నాయి. ఒకవేళ ఎన్నికల గుర్తుకు సంబంధించిన వివాదాలేమైనా ఉంటే అవి ఎన్నికల సంఘం పరిధిలోకి వస్తాయి తప్పితే సభాధ్యక్షుల పరిధిలోకి రావని వివరించాయి. పార్టీలో చీలికలతో సభాధ్యక్షుడికి సంబంధంలేదని, సభ్యుల ఫిరాయింపులు, విలీనం అంశాలు పదో షెడ్యూల్ నిబంధనల ప్రకారం ఉన్నాయా? లేదా? అన్నది చూడటంవరకే పరిమితం అని అధికారవర్గాలు ఉదహరించాయి. రాజ్యసభ సచివాలయం అన్నింటినీ పరిశీలించి ఆ పరిణామక్రమం అంతా పదో షెడ్యూల్‌లోని 4వ పేరా కింద ఉన్న నిబంధనల ప్రకారమే ఉన్నట్లు చెప్పడంతో ఆ విషయాన్ని సంబంధిత పార్టీలకు సమాచారం అందించి, అందుకు అనుగుణంగా వెబ్‌సైట్‌లో సభ్యుల పేర్లను మార్చినట్లు చెప్పాయి. నిబంధనల ప్రకారం నలుగురి నుంచి తాజాగా ఫామ్-3 తీసుకున్న తర్వాతే వారిని భాజపా జాబితాలో చూపినట్లు పేర్కొన్నాయి. అన్ని విషయాలనూ పూర్తి రాజ్యాంగ నిబంధనలతో సరిపోల్చుకున్న తర్వాత, అన్నీ నిబంధనల ప్రకారమే ఉన్నట్లు నిర్ధారించుకున్న తర్వాతే తుది ఆమోదముద్ర వేసినట్లు స్పష్టంచేశాయి. దీనిపై సభలో సభాధ్యక్షుడు అధికారికంగా ప్రకటించడం, బులిటెన్ విడుదలచేసే సంప్రదాయాలు గతం నుంచీ ఎప్పుడూ లేవని, అందువల్ల ఇప్పుడుకూడా అదే సంప్రదాయాన్ని అనుసరించాలని నిర్ణయించినట్లుపేర్కొన్నాయి.

### విలీనాన్ని వ్యతిరేకిస్తూ ఫిర్యాదు ఇవ్వటం కుదరదు

ఒకవేళ తెదేపా నేతలు ఫిర్యాదు ఇవ్వాలనుకుంటే ఫిరాయింపుల నిరోధక చట్టం కింద ఇవ్వొచ్చు తప్పితే, విలీనాన్ని వ్యతిరేకిస్తూ ఇవ్వడం కుదరని స్పష్టం చేశాయి. శరద్‌యాదవ్‌పై ఫిరాయింపుల నిరోధక చట్టం కింద చర్య తీసుకున్న అంశాన్ని ఈ విలీనంతో పోల్చడానికి వీల్లేదన్నాయి. అక్కడ ఒక వ్యక్తి పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు పిటిషన్ ఫైల్‌కావడంతో అక్కడ 10వ షెడ్యూల్‌లోని నిబంధనల ప్రకారం విచారణ చేపట్టి నిర్ణయం వెలువరించినట్లు చెప్పాయి. ఇక్కడ అధికారికంగా రెండింట మూడోవంతుమంది సభ్యులు నిబంధనల ప్రకారం విలీనాన్ని కోరారని, అందుకు అవతలి పార్టీ కూడా అంగీకరించి సమ్మతి పత్రం అందజేసినందున అది ఫిరాయింపుల కిందికి రాదని పేర్కొన్నాయి.

### ప్రధానితో సుజనా బృందం భేటీ

ఈనాడు, దిల్లీ : భాజపాలో విలీనం అయిన తెదేపా ఎంపీలు సుజనాచౌదరి, సీఎంరమేష్, టీజీవెంకటేష్‌లు శుక్రవారం ఉదయం పార్లమెంటులో ప్రధానమంత్రి నరేంద్రమోదీని ఆయన కార్యాలయంలో కలిశారు. సుమారు 25 నిమిషాలపాటు ఆయనతో మాట్లాడారు. మోదీ నాయకత్వంపైన నమ్మకంతో తాము భాజపాలో చేరిన విషయాన్ని వారు ఆయన దృష్టికి తెచ్చారు. వారి నిర్ణయాన్ని ప్రధాని స్వాగతించారు. "గతంలో మీరు మంత్రిగా ఎన్డీయేలో కొనసాగాలన్న భావనతో ఉన్నప్పటికీ పార్టీ నిర్ణయం కారణంగా ఉండలేకపోయారు.. ఇప్పుడు మళ్లీ స్వీయ నిర్ణయం తీసుకొని భాజపాలో చేరడం సముచిత నిర్ణయం. ఇప్పుడు మళ్లీ మనం అందరం కలిసి పని చేద్దాం.." అని ప్రధాని వారికి భరోసా ఇచ్చినట్లు సమాచారం.

# ఆ నలుగురిపై అనర్హత వేటు వేయండి

- రాజ్యసభ ఛైర్మన్ వెంకయ్యనాయుడుకు తెదేపా ఎంపీల వినతిపత్రం

ఈనాడు, దిల్లీ: తెదేపాను వీడి భాజపాలో చేరిన నలుగురు ఎంపీలపై అనర్హత వేటు వేయాలని ఉపరాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ వెంకయ్యనాయుడుకి తెదేపా ఎంపీలు విజ్ఞప్తి చేశారు. శుక్రవారమిక్కడ ఉపరాష్ట్రపతి నివాసంలో వెంకయ్యనాయుడితో తెదేపా ఎంపీలు గల్లా జయదేవ్, రామ్మోహన్‌నాయుడు, కేశినేనినాని, రవీంద్రకుమార్, తోట సీతారామలక్ష్మిలు భేటీ అయ్యారు. తమకు సమాచారం లేకుండా పార్లమెంటరీ పార్టీ సమావేశం నిర్వహించుకున్నామని నలుగురు ఎంపీలు ప్రకటించారని వారు ఆరోపించారు. పార్టీ విలీన ప్రక్రియ అనేది ఎన్నికల కమిషన్ పరిధిలోకి వస్తుందని తెలిపారు. వీలైనంత త్వరగా నలుగురు ఎంపీలపై చర్యలు తీసుకోవాలని కోరారు. చట్ట ప్రకారం పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటానని వారికి వెంకయ్యనాయుడు హామీ ఇచ్చారు. అనంతరం తెదేపా పార్లమెంటరీ పార్టీ నేత గల్లా జయదేవ్ మీడియాతో మాట్లాడుతూ.. తెదేపా రాజ్యసభ పార్టీ భాజపాలో విలీనం చేస్తున్నట్లు నలుగురు ఎంపీలు లేఖ ఇచ్చిన నేపథ్యంలో ఛైర్మన్ వెంకయ్యనాయుడును కలిశామన్నారు. 10వ షెడ్యూలు పేరా 4 పాయింట్ 2 అనేది పార్టీ విలీనానికి సంబంధించినది కాదన్నారు. విలీనం అనేది సంస్థాగతంగా జరగాలని స్పష్టంచేశారు. రాజ్యసభ ఫ్లోర్ లీడర్‌గా కనకమేడల రవీంద్రకుమార్, ఉపనేతగా తోట సీతారామలక్ష్మిలను నియమించినట్లు ఛైర్మన్‌కు మరో లేఖ ఇచ్చామని తెలిపారు. ఈ నియామకాలకు సంబంధించి పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి, రాజ్యసభాపక్ష నేత తావర్ చంద్ గెహ్లోత్‌లకు కూడా తెదేపాపా నేత గల్లా జయదేవ్ లేఖలు ఇచ్చారు.



వెంకయ్యనాయుడికి వినతిపత్రం సమర్పిస్తున్న తెదేపా ఎంపీలు రామ్మోహన్‌నాయుడు, జయదేవ్, సీతారామలక్ష్మి, రవీంద్ర కుమార్, కేశినేని నాని

## తెదేపా ఎంపీల విలీనం దారుణం: కాంగ్రెస్

ఈనాడు, దిల్లీ: పార్టీ ఫిరాయింపుల ద్వారా రాజ్యసభలో మెజార్టీని పెంచుకోవడానికి భాజపా నాయకత్వం కుట్రలు పన్నుతోందని కాంగ్రెస్ అధికార ప్రతినిధి రణ్‌దీప్ సూర్జేవాలా ఆరోపించారు. తెదేపా రాజ్యసభ సభ్యులను విలీనం పేరుతో భాజపాలో కలిపేసుకోవడం రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. రాజ్యాంగ నిబంధనలు, విలువలను కాపాడటానికే 2019 సార్వత్రిక ఎన్నికల్లో దేశ ప్రజలు భాజపాకు ఓటేశారని, కానీ ఆ పార్టీ అందుకు పూర్తి విరుద్ధమైన పంథాలో వెళ్తోందని ఆరోపించారు. భాజపా ప్రోత్సహిస్తున్న ఫిరాయింపుల సంస్కృతి ఆందోళనకరంగా ఉందన్నారు. ఇది గర్హనీయమని, రాజ్యాంగం, ప్రజాస్వామ్యాన్ని హత్య చేయడమేనని ధ్వజమెత్తారు. దేశవ్యాప్తంగా ప్రతిపక్షాల్లో ఫిరాయింపులను ప్రోత్సహించిన ఉదంతాలంటూ ఓ జాబితాను విడుదల చేశారు.

## ఎర్రమంజిల్ ప్యాలెస్‌ను పడగొట్టొద్దు

### సీఎంకు నవాబు ఫక్రుల్ ముల్క్ వారసుల లేఖ

ఈనాడు, హైదరాబాద్ : రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని ఎర్రమంజిల్ ప్యాలెస్‌ను పడగొట్టొద్దని, చారిత్రక కట్టడాన్ని సంరక్షించాలని ముఖ్యమంత్రి కేసీఆర్‌కు నవాబు ఫక్రుల్ ముల్క్ వారసులు విజ్ఞప్తి చేశారు. ఈ ప్యాలెస్‌ను నిజాం హయాంలో నవాబు ఫక్రుల్ నిర్మించారని.. అందమైన ఈ కట్టడం హైదరాబాద్ చరిత్ర, సంస్కృతిలో భాగమై వారసత్వ సంపదగా నిలిచిందని సీఎంకు రాసిన లేఖలో పేర్కొన్నారు. దేశం బ్రిటిష్ పాలనలో ఉన్న సమయంలో వైస్రాయ్ సహా పలువురు బ్రిటిష్ ఉన్నతాధికారులు ఈ ప్యాలెస్‌ను సందర్శించారని గుర్తుచేశారు. అంతర్జాతీయ నగరాలైన సింగపూర్, దుబాయి, కౌలాలంపూర్‌లలో వారసత్వ భవనాలను సంరక్షిస్తున్నారని వివరించారు. ఎర్రమంజిల్ ప్యాలెస్‌ను కూల్చి రాష్ట్ర ప్రభుత్వం అక్కడ శాసనసభ, మండలి, సెంట్రల్‌హాల్‌ను నిర్మిస్తుందని వచ్చిన వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. తమ విన్నపాన్ని సానుభూతితో పరిశీలించి చారిత్రక ప్రాధాన్యత ఉన్న ఎర్రమంజిల్ ప్యాలెస్‌ను యథాతథంగా ఉంచాలని ఫక్రుల్ ముల్క్ వారసుల అసోసియేషన్ సెక్రటరీ, ప్రముఖ షూటర్ నవాబు షఫత్ అలీఖాన్ విజ్ఞప్తి చేశారు. సీఎంకు రాసిన లేఖను శుక్రవారం విడుదల చేశారు.

# కాళేశ్వరానికి జాతీయ హోదా ఇవ్వాలి

- తెలంగాణలో 32 జిల్లాలను వెనుకబడిన ప్రాంతాల జాబితాలో చేర్చండి
- ప్రభుత్వ పెట్టుబడులు పెంచాలి
- బడ్జెట్ సన్నాహక సమావేశంలో సీఎం కేసీఆర్ ప్రసంగ పాఠం

ఈనాడు, దిల్లీ: "తెలంగాణకు జీవధార, వరప్రదాయిని కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలి. ఈ బడ్జెట్‌లోనే నిధులు కేటాయించాలి. రాష్ట్రంలోని 32 జిల్లాలను వెనుకబడిన జిల్లాల జాబితాలో చేర్చాలి" అని తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ కేంద్రానికి విన్నవించారు. కేంద్ర బడ్జెట్ తయారీకి సంబంధించి రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో దిల్లీలో శుక్రవారం బడ్జెట్ సన్నాహక సమావేశం నిర్వహించారు. కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఆధ్వర్యంలో ఏర్పాటైన సమావేశానికి ముఖ్యమంత్రి, ఆర్థికమంత్రి అయిన కేసీఆర్ కాళేశ్వరం ప్రారంభోత్సవం నేపథ్యంలో హాజరుకాలేదు. ముఖ్యమంత్రి తరఫున రాష్ట్ర ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు సమావేశానికి హాజరయ్యారు. దేశ, రాష్ట్ర ఆర్థిక పరిస్థితులపై ముఖ్యమంత్రి ప్రసంగపాఠాన్ని ఆయన సమర్పించారు. వివరాలిలా ఉన్నాయి.

"జాతీయ ప్రభుత్వరంగ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణ సవ్యంగా సాగేందుకు జాతీయ పెట్టుబడుల నిధిని 2015లో ఏర్పాటు చేశారు. కానీ ప్రభుత్వ రంగ బ్యాంకులు, బీమా సంస్థల్లో పెట్టుబడులకు తిరిగి ఆ నిధులనే మళ్లించడంతో దాని ధ్యేయం నెరవేరలేదు. అందువల్ల 2019-20 బడ్జెట్‌లో రిజర్వు బ్యాంకు ద్వారా జరిగే ప్రొసీడింగ్స్‌ను జాతీయ పెట్టుబడుల నిధికే అప్పగించి ప్రభుత్వ పెట్టుబడులు పెంచాలి. అలా చేస్తే అది ఆర్థిక పురోభివృద్ధికి దోహదమవుతుంది. జాతీయ పెట్టుబడి నిధిలో ప్రకటించిన సొమ్ముకు గరిష్ఠ పరిమితి విధించి దశల వారీగా నల్లధనం బయటకు తేవాలి. రాష్ట్ర ప్రభుత్వాలకు తక్కువ ధర చెల్లించి ప్రభుత్వరంగ సంస్థలకు భారీగా భూములు సేకరించారు. ఆ భూములను ఆర్థిక పరిపుష్టికి వాడుకోవాలి. ఆ కార్యక్రమాలు కేంద్ర, రాష్ట్ర భాగస్వామ్యంతో నిర్వహించాలి. తక్కువ పన్ను వసూలు చేసేలా మరిన్ని పన్ను మినహాయింపు పథకాలు అమలు చేయాలి. రాష్ట్రాల పరిధిలోని అంశాలకు ప్రస్తుత రెవెన్యూ ఆదాయంలో 20 శాతంగా ఉన్న కేటాయింపులను తగ్గించి వాటిని రాష్ట్రాలకు పంచి తద్వారా స్థానికంగా రెవెన్యూ పెట్టుబడులు పెరిగేలా చర్యలు తీసుకోవాలి.

### మరింత భూమి సాగులోకి తేవాలి

దేశంలో 40 కోట్ల ఎకరాల సాగు భూమి ఉంటే కేవలం 5.5 కోట్ల ఎకరాలు మాత్రమే సాగవుతోంది. 70 వేల టీఎంసీల జలవనరులుంటే కేవలం 40 వేల టీఎంసీలే వినియోగించుకుంటున్నాం. వ్యవసాయ రంగం పుంజుకోవడానికి అందుబాటులో ఉన్న వనరులను పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవాలి. ఉపాధి హామీ పథకాన్ని సాగు రంగానికి అనుసంధానించాలి. జాతీయ అవసరాలు, సహకార సమాఖ్య స్ఫూర్తితో కేంద్రం మా సూచనలు పరిగణనలోకి తీసుకుంటుందనేఆశాభావం వ్యక్తం చేస్తున్నాం.

### మా వినతులివే..

సమైక్యాంధ్ర పాలనలో సాగునీటి ప్రాజెక్టుల రంగంలో తెలంగాణకు తీరని అన్యాయం జరిగింది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి రూ.88 వేల కోట్లు వ్యయమవుతోంది. వీటిలో అధికభాగం కాళేశ్వరం కార్పొరేషన్ ద్వారా సమీకరించిన అప్పులే.. దీనికి జాతీయ హోదా ఇచ్చి ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి. నీతిఆయోగ్ సిఫార్సుల మేరకు మిషన్ భగీరథ, మిషన్ కాకతీయలకు నిధులు ఇవ్వాలి. రాష్ట్రంలో 32 జిల్లాలను వెనుకబడిన జిల్లాల జాబితాలో చేర్చి వాటి అభివృద్ధికి సంబంధించి ఒక్కోదానికి రూ.50 కోట్ల చొప్పున కేటాయించాలి. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం-2014 ప్రకారం ఉక్కు కర్మాగారం ఏర్పాటు చేయాల్సి ఉన్నా ఆ హామీ నెరవేరలేదు. ఈ ప్రక్రియను వేగవంతం చేయాలి." అని తన ప్రసంగపాఠంలో ముఖ్యమంత్రి కేసీఆర్ పేర్కొన్నారు.

# ప్రాజెక్టుపై శ్వేతపత్రం విడుదల చేయాలి

- కాళేశ్వరం నిర్మాణంలో భాజపా పాత్ర కీలకం
- అక్రమ కేసులు, దాడులను సహించం
- పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్

ఈనాడు, దిల్లీ : కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో కేంద్ర అనుమతులు, మహారాష్ట్ర నుంచి సహకారం అందించడంలో భాజపా పాత్ర మరువలేనిదని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ పేర్కొన్నారు. ప్రాజెక్టు నిర్మాణంలో తెరాస ఘనత ఎంతో భాజపాదీ అంతేనన్నారు. కాళేశ్వరం అంచనాలను రూ.30 వేల కోట్ల నుంచి రూ.80 వేల కోట్లకు పెంచారని.. పూర్తయ్యే నాటికి అది ఎంతకు చేరుతుందో తెలియదన్నారు. దీనికి సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదికను(డీపీఆర్) వెబ్‌సైట్‌లో పెట్టాలని.. వ్యయంపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం దిల్లీలో లక్ష్మణ్ విలేకరులతో మాట్లాడారు. తెరాస కుటుంబ పాలన, నియంతృత్వ పోకడలపై భాజపా కార్యనిర్వాహక అధ్యక్షుడు జె.పి.నడ్డాకు వివరించామని తెలిపారు. రాష్ట్రంలో ప్రధానమంత్రి క్రిషి సంచాయ్ యోజన కింద 11 ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం నిధులు ఇచ్చిందని చెప్పారు. తెలంగాణలో జాతీయ రహదారులు, పెండింగ్ రైల్వే ప్రాజెక్టులు, ఇతర అభివృద్ధి పథకాలకు మరిన్ని నిధులు విడుదలయ్యేలా కేంద్ర మంత్రులకు సూచించాలని నడ్డాను కోరినట్లు లక్ష్మణ్ వివరించారు. రాష్ట్రంలో భాజపా ఎదుగుదలను ఓర్వలేకే ఓ కార్యకర్తను హత్య చేశారని.. అక్రమ కేసులు, దాడులను సహించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఎమ్మెల్యే రాజాసింగ్‌పై పోలీసుల దాడిని ఖండిస్తున్నట్లు చెప్పారు. రాజాసింగ్‌పై దాడి కేసులో తొలి వీడియోను పోలీసులు విడుదల చేయాలని, తప్పుడు ప్రచారాలు చేయొద్దని సూచించారు.

### అటవీ పరిశోధన కేంద్రానికి నిధులు మంజూరు చేయండి..

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బహదూర్‌పల్లిలోని అటవీ పరిశోధన కేంద్రానికి పెద్ద మొత్తంలో నిధులు కేటాయించాలని కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి ప్రకాశ్ జావడేకర్‌కు లక్ష్మణ్ నేతృత్వంలోని భాజపా బృందం విజ్ఞప్తి చేసింది. వంద ఎకరాల విస్తీర్ణంలోని కేంద్రంలో మంచి పరిశోధనశాల, నిపుణులైన శాస్త్రవేత్తలు ఉన్నారని వివరించారు. బృందంలో ఎమ్మెల్యే రాజాసింగ్, ఎమ్మెల్సీ రామచంద్రరావు, నేతలు ఇంద్రసేనారెడ్డి, వెదిరె శ్రీరాం, సుహాసినిరెడ్డి, మల్లారెడ్డి, ఆకుల విజయ తదితరులున్నారు.

## తెరాస ప్రభుత్వం దౌర్జన్యాలకు పాల్పడుతోంది

- భాజపా జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడికి రాజాసింగ్ ఫిర్యాదు

గోషామహల్, న్యూస్‌టుడే: తెరాస సర్కారు రజాకర్ల పాలనను తలపిస్తోందని భాజపా ఎమ్మెల్యే రాజాసింగ్‌లోధ్.. ఆ పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు జేపీ నడ్డాకు శుక్రవారం దిల్లీలో ఫిర్యాదు చేశారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలు రాణి అవంతీభాయి విగ్రహ పునఃప్రతిష్ఠ సందర్భంగా హైదరాబాద్ పోలీసులు తమపై లాఠీఛార్జి జరిపి తీవ్రంగా గాయపరిచారని, ప్రశ్నిస్తే అక్రమంగా కేసులు బనాయించారని పేర్కొన్నారు. తెలంగాణలో భాజపా నేతలు, కార్యకర్తలపై అక్రమంగా బనాయిస్తున్న కేసుల విషయంలో జోక్యం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కె. లక్ష్మణ్, నగర అధ్యక్షుడు రామచంద్రరావు, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, చింతా సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.



భాజపా జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు జేపీ నడ్డాకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే రాజాసింగ్‌లోధ్. చిత్రంలో లక్ష్మణ్ తదితరులు

## తెలంగాణలో మిగిలేది తెరాస, భాజపాయే: మురళీధర్‌రావు

ఈనాడు, హైదరాబాద్ : తెలంగాణపై భాజపా జాతీయనాయకత్వం ప్రత్యేకదృష్టి సారించిందని.. రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు వేగంగా మారిపోతాయని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు పేర్కొన్నారు. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోనూ రానున్న రెండేళ్లలో భాజపా నిజమైన ప్రతిపక్షంగా ఎదుగుతుందని జోస్యం చెప్పారు. కమలదళంలో చేరేందుకు కాంగ్రెస్, తెదేపాలకు చెందిన చాలా మంది నేతలు సంప్రదింపులు జరుపుతున్నారని.. రాష్ట్రంలో ఇక తెరాస, భాజపాలే ప్రధాన ప్రత్యర్థులుగా ఉంటాయని ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మురళీధర్‌రావు విలేకరులతో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై బహిరంగ చర్చకు రావాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గోదావరి జలాల సద్వినియోగం, ప్రాజెక్టు నిర్మాణానికి భాజపా తొలినుంచీ అనుకూలమన్నారు. అయితే ప్రాజెక్టు అంచనా వ్యయం భారీగా ఎలా పెరిగింది.. సాగు విస్తీర్ణం, ప్రజల్లో కల్పిస్తున్న భ్రమలపై తెరాస ప్రభుత్వం వివరణ ఇవ్వాలని ఆయన డిమాండ్‌చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు కేంద్రం నుంచి అత్యంత వేగంగా వచ్చిన అనుమతులు, అందిన సహకారంపై సీఎం కేసీఆర్ నాటి మంత్రి హరీశ్‌రావును అడిగి తెలుసుకోవాలని సూచించారు. తెదేపా రాజ్యసభ సభ్యుల్ని భాజపాలో చేర్చుకోవడాన్ని విలేకరులు ప్రస్తావించగా.. చట్టం ప్రకారమే విలీనం జరిగిందన్నారు. పార్టీలో చేరుతున్నవారికి కేసులు,దర్యాప్తుల నుంచి ఉపశమనం ఉండదని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఇతర పార్టీల నేతలు ఎంతమంది చేరినా భాజపా డీఎన్ఏ మారదన్నారు.

సెన్సెక్స్ ▼ 407 **39194**

నిఫ్టీ ▼ 108 **11724**

డోజోన్స్ 26792 ▲ 38

నాస్‌డాక్ 8037 ▼ 14

అమెరికా కాలమానం ప్రకారం శుక్రవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).

రూపాయి 69.58 ▼ 14 పైసలు (ఒక అమెరికా డాలరుకు)

ముడి చమురు 65.25 ▲ (బ్రెంట్ ధర డాలర్లలో)



| ఘనం (+) | | | గ్రహణం (-) | | |
|---|---|---|---|---|---|
| నిఫ్టీ | 21న | మార్పు% | నిఫ్టీ | 21న | మార్పు% |
| UPL | 890.10 | 2.28 | YES BANK | 109.60 | -4.32 |
| TECH MAHINDRA | 740.45 | 2.05 | MARUTI SUZUKI | 6417.25 | -3.02 |
| INDIABULLS HSG | 612.00 | 2.04 | HDFC | 2140.80 | -2.66 |
| HINDALCO | 197.65 | 1.72 | COAL INDIA | 254.25 | -2.34 |
| SBI | 349.40 | 1.23 | HERO MOTOCORP | 2606.00 | -2.24 |
| INDUSIND BANK | 1448.65 | 0.91 | HUL | 1766.65 | -2.13 |
| ULTRATECH CEM | 4595.15 | 0.42 | SUN PHARMA | 382.80 | -1.97 |

### విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)



| కరెన్సీ | కొనుగోలు | అమ్మకం | | | |
|---|---|---|---|---|---|
| అమెరికా డాలరు | 63.43 | 73.55 | బ్రహెయిన్ దీనార్ | 171.69 | 196.44 |
| పౌండ్ స్టెర్లింగ్ | 80.63 | 93.50 | కువైట్ దీనార్ | 189.86 | 236.03 |
| యూరో | 71.67 | 83.13 | ఒమన్ రియాల్ | 168.00 | 192.45 |
| జపనీస్ యెన్/100 | 59.23 | 68.68 | సౌదీ రియాల్ | 16.86 | 19.99 |
| ఆస్ట్రేలియా డాలరు | 43.93 | 50.83 | యూఏఈ దిర్హమ్ | 17.26 | 20.18 |
| సింగపూర్ డాలరు | 46.80 | 55.44 | మలేషియా రింగిట్ | 14.97 | 18.40 |
| థాయ్ బాత్/100 | 205.82 | 246.09 | చైనీస్ యువాన్ | 7.19 | 11.66 |




## మహీంద్రా ఏఎంసీలో 49% వాటా విక్రయం

### కెనడా సంస్థ చేతికి

**ముంబయి:** తమ అనుబంధ సంస్థ ఆస్తుల నిర్వహణ కంపెనీ 'మహీంద్రా ఏఎంసీ'లో 49 శాతం వాటాను కెనడా సేవల గ్రూప్ మాన్యులైఫ్‌కు 35 మిలియన్ డాలర్ల (సుమారు రూ.245 కోట్ల)కు విక్రయించేందుకు మహీంద్రా ఫైనాన్స్ ఒప్పందం చేసుకుంది. శతాబ్దానికి పైగా సేవలందిస్తున్న మాన్యులైఫ్ సంస్థ, మహీంద్రా ట్రస్టీ కంపెనీలో కూడా 49 శాతం వాటాను లక్ష డాలర్లకు కొనుగోలు చేయనుంది. ఈ విక్రయం తరవాత సంయుక్త సంస్థలో మహీంద్రా ఫైనాన్స్‌కు 51 శాతం వాటా ఉంటుంది. మాన్యులైఫ్‌కు చెందిన సింగపూర్ విభాగం ఈ కొనుగోలు ప్రక్రియ చేపడుతోంది. మ్యూచువల్‌ఫండ్ వ్యాపారాన్ని మరింత విస్తరించేందుకు, వాటా విక్రయం దోహద పడుతుందని మహీంద్రా ఫైనాన్స్ వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ రమేశ్ అయ్యర్ పేర్కొన్నారు. ఆస్తుల నిర్వహణ నిపుణులతో పాటు అంతర్జాతీయ నిర్వహణ ప్రమాణాలు కూడా మాన్యులైఫ్ వల్ల లభిస్తాయని మహీంద్రా ఏఎంసీ ఎండీ అశుతోశ్ బిష్ణోయ్ తెలిపారు.

## న్యూల్యాండ్ లేబొరేటరీస్‌కూ యూఎస్ఎఫ్‌డీఏ ఇబ్బందులు

**ఈనాడు, హైదరాబాద్:** న్యూల్యాండ్ లేబొరేటరీస్‌కు కూడా అమెరికా ఔషధ నియంత్రణ సంస్థ (యూఎస్ఎఫ్‌డీఏ) నుంచి అభ్యంతరాలు ఎదురయ్యాయి. ఈ సంస్థకు చెందిన హైదరాబాద్‌లోని బొంతపల్లి యూనిట్-1 ను యూఎస్ఎఫ్‌డీఏ బృందం ఈ నెల 17 నుంచి 21 వరకూ తనిఖీ చేసింది. 5 అభ్యంతరాలను లేవనెత్తి 'ఫామ్ 483' జారీ చేసింది. ఈ విషయాన్ని న్యూల్యాండ్ లేబొరేటరీస్ వెల్లడించింది. ఈ అభ్యంతరాలపై దిద్దుబాటు చర్యలు ప్రారంభించినట్లు పేర్కొంది. త్వరగానే దీనికి పరిష్కారాన్ని కనుగొంటామని కంపెనీ యాజమాన్యం ఆశాభావం వ్యక్తం చేసింది. ఈ పరిణామంతో కంపెనీ షేరు బీఎస్ఈలో 3% పతనమై రూ.521.25 వద్ద ముగిసింది.

# మా దారి నష్టాలదారి!

● ప్రధాన సూచీలకు భిన్నంగా వాహన విడిభాగాల షేర్ల ప్రదర్శన ● ఈ ఏడాదిలో 30 శాతానికి పైగా పతనం

● ముున్ముందూ ఇదే ధోరణి! ● ద్రవ్యకొరత పరిష్కారమైతేనే పుంజుకునే అవకాశం

**పెద్ద కంపెనీలకు ప్రాతినిధ్యం వహించే సెన్సెక్స్, నిఫ్టీ సూచీలు ఆకట్టుకున్నాయి. కొత్త శిఖరాలనూ అధిరోహించి అలరించాయి.**

**మధ్య, చిన్న తరహా కంపెనీలుండే మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు రాణించకపోయినా.. పెద్దగా నష్టాలనైతే చవిచూడ లేదు.**

**అయితే.. మిగతావాటిది ఒక దారి మాది మరో దారి అన్నట్లు వాహన విడిభాగాల షేర్లు భారీగా నష్టాలను మూటకట్టుకున్నాయి. ప్రస్తుత సంవత్సరంలో ఇప్పటికే 30 శాతానికి పైగా పతనమయ్యాయి. అయితే ముున్ముందూ ఇదే పరిస్థితి కొనసాగొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తుండటం మరింత ఆందోళన కలిగించే విషయం.**



ఏడాదికాలంగా వాహన విడిభాగాల షేర్లు మదుపర్లకు భారీగా నష్టాలు తెచ్చిపెట్టాయి. కొన్నైతే ఏకంగా 60 శాతం వరకు పతనమయ్యాయి. జేబీఎం ఆటో, సెట్కో ఆటోమేటివ్, ప్రికాల్, జై భారత్ మారుతీ, జీఎన్ఏ యాక్సెల్స్, మదర్‌సన్ సుమి సిస్టమ్స్, జమ్నా ఆటో ఇండస్ట్రీస్, రికో ఆటో ఇండస్ట్రీస్ లాంటి షేర్లు ఇందులో ఉన్నాయి. ముఖ్యంగా ఆర్థిక వ్యవస్థ వృద్ధి నెమ్మదించడం వాహన పరిశ్రమపై ప్రతికూల ప్రభావం పడింది. 2019 మేలో దిగ్గజ కంపెనీల అమ్మకాలు తగ్గడం కూడా వాహన విడిభాగాల కంపెనీల లాభదాయకత తగ్గేందుకు పరోక్షంగా కారణమైంది. దీంతో ఈ కంపెనీల షేర్లు తీవ్ర అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే ఈ ధోరణి ముున్ముందు కూడా కొనసాగుతుందని, వాహన విడిభాగాల షేర్ల విషయంలో అప్రమత్తత అవసరమని విశ్లేషకులు జాగ్రత్త చెబుతున్నారు.

### పడేశాయి ఇవే..

వాహన విడిభాగాల కంపెనీల షేర్లకు ప్రధానంగా ఈకింది అంశాలు దోహదం చేశాయి.

✦ వ్యవస్థలో ద్రవ్య కొరత నెలకొనడం. ముఖ్యంగా ఎన్‌బీఎఫ్‌సీల్లో ఈ పరిస్థితి తీవ్రంగా ఉండటం వాహన రంగ గిరాకీపై ప్రతికూల ప్రభావం చూపింది.

✦ బీమా వ్యయాలు, ఇంధన ధరలు పెరగడం

✦ అమ్మకాలు గిరాకీ గణనీయ స్థాయిలో పడిపోవడం.. డీలర్ల వద్ద వాహనాల నిల్వలు పేరుకొనిపోయాయి. దీంతో వాహన తయారీ కంపెనీలు తమ ఉత్పత్తిని నిలిపివేస్తున్నాయి. ఈ పరిణామం కూడా వాహన విడిభాగాల షేర్ల సెంటిమెంటును దెబ్బతీశాయి.

### కష్టాల్లోనే పరిశ్రమ..

వాహన పరిశ్రమ ఇంకా కష్టాల్లోంచి బయటపడలేదనే మాట విశ్లేషకుల నుంచి వినిపిస్తోంది. వాహనాలు తయారీ చేసే కంపెనీలే కాదు విడిభాగాలు తయారీ చేసే సంస్థలకు కూడా ఇబ్బందులు కొనసాగుతూనే ఉన్నాయన్నది వారి. భావన. బీఎస్-4 నుంచి బీఎస్-6 నిబంధనలకు మారడం, ఎలక్ట్రిక్ వాహనాలు, విడిభాగాలపై ప్రభుత్వం విధానాలు రానున్న రోజుల్లో వాహన పరిశ్రమ వృద్ధికి ప్రతిబంధకంగా మారొచ్చని అభిప్రాయపడుతున్నారు. అదే పరిశ్రమకు సానుకూలాంశాలూ లేకపోలేదు. సానుకూల వర్షపాతం, గ్రామీణ ప్రాంతాల్లో ఆదాయాలు మెరుగుపడటం, వ్యవస్థలో నిధుల కొరత సమస్య తీరడం లాంటివి చోటుచేసుకుంటే తిరిగి వాహన పరిశ్రమ కళకళలాడేందుకు అవకాశం ఉంటుంది.

**ఆ విధానం వచ్చే వరకు ఆగండి:** విద్యుత్ వాహనాలు, వాటికి సంబంధించి విడిభాగాలపై ప్రభుత్వం ఓ విధానాన్ని తీసుకొని వచ్చే వరకు ఈ రంగాల షేర్లపై అస్పష్టత అనేది కొనసాగుతూనే ఉంటుందని విశ్లేషకులు భావిస్తున్నారు. అప్పటివరకు వీటి విషయంలో వేచిచూచే ధోరణి అవలంబించడం మేలని సూచిస్తున్నారు. వరుసగా మూడు పరపతి విధాన సమీక్షల్లో ఆర్‌బీఐ కీలక రేట్లను తగ్గించడం ఓ విధంగా వాహన రంగంలో ఉత్తేజం నింపే పరిణామమని అంటున్నారు. అయితే వ్యవస్థలో నిధుల కొరత నెలకొన్న తరుణంలో బ్యాంకులు ఆర్‌బీఐ వరుస రేట్ల కోత ప్రయోజనాన్ని ఎప్పుడు ఎంతమేర బదిలీ చేస్తాయనే విషయంపైనే ఇది ఆధారపడిఉందని విశ్లేషిస్తున్నారు.

## విదేశీ మారకపు నిల్వల్లో స్వల్ప క్షీణత

**ముంబయి:** జూన్ 14తో ముగిసిన వారానికి విదేశీ మారకపు నిల్వలు 1.358 బిలియన్ డాలర్లు తగ్గి 422.2 బిలియన్ డాలర్లకు పరిమిత మయ్యాయి. విదేశీ కరెన్సీ ఆస్తులు 1.353 బి.డా. తగ్గి 394.44 బి.డా.కు పరిమితం అవ్వడమే ఇందుకు కారణమని ఆర్‌బీఐ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. నిల్వలను డాలర్లలోనే ప్రకటించినా, ఇతర విదేశీ కరెన్సీలైన యూరో, పౌండ్, యెన్ వంటి ఆస్తుల విలువలు కూడా ఇందులో కలిపే ఉంటాయి. పసిడి నిల్వలు స్థిరంగా 22.958 బి.డా. మేర ఉన్నాయి. అంతర్జాతీయ ద్రవ్య నిధిలో ప్రత్యేక ఉపసంహరణ హక్కులు లక్ష డాలర్లు తగ్గి 1.449 బి.డా.కు పరిమితం అయ్యాయి. 2018 ఏప్రిల్ 13తో ముగిసిన వారంలో ఈ నిల్వలు చారిత్రాత్మక గరిష్ఠస్థాయి 426.028 బి.డా.కు చేరాయి.

## ఆర్‌బీఐ విధాన మార్పుతో మరిన్ని రేట్ల కోతలు

### నొమురా అంచనా

**ముంబయి:** ఆర్‌బీఐ పరపతి విధాన మార్పుతో భవిష్యత్‌లో మరిన్ని కీలక రేట్ల కోతలు ఉండొచ్చని జపాన్ బ్రోకరేజీ సంస్థ నొమురా అంచనా వేసింది. పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) గత సమావేశ నిర్ణయాలు ఇందుకు సంకేతాలు ఇచ్చాయని అభిప్రాయపడింది. ఈ నెల 6న జరిగిన పరపతి విధాన సమీక్ష ధోరణిని 'సర్దుబాటు'కు మార్చామని, భవిష్యత్ కీలక రేట్ల పెంపు ఉండకపోవచ్చని ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ తెలిపారు. పరపతి విధానంపై దాస్ వివరణ 'సాంకేతిక నిర్వచనం'గా ఉందని నొమురా వెల్లడించింది. ఆర్థిక వ్యవస్థ పరిస్థితులు మరిన్ని రేట్ల కోతలకు అవకాశం కలిగిస్తున్నాయని, ఎంపీసీ సభ్యులు దీన్ని పూర్తిగా సూచించారని పేర్కొంది. ఆగస్టు పరపతి విధాన సమీక్షలో ఎంపీసీ సభ్యులు మరో రేట్ల కోతకు అనుకూలంగా ఉండొచ్చని తెలిపింది. డిప్యూటీ గవర్నర్ విరాల్ ఆచార్య, మరో సభ్యుడు చేతన్ ఘటేలు మాత్రమే రేట్ల కోతకు వ్యతిరేకంగా ఉన్నారని చెప్పుకొచ్చింది.

# జోరుకు కళ్లెం

● అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతల ప్రభావం

● వాహన, ఇంధన షేర్లు డీలా

**సమీక్ష**

**మూ**డు రోజుల వరుస లాభాలకు అడ్డుకట్ట పడింది. అమెరికా, ఇరాన్‌ల మధ్య ఉద్రిక్తతలు పెరగడంతో అంతర్జాతీయ సెంటిమెంట్‌పై ప్రతికూల ప్రభావం పడింది. ఈ నేపథ్యంలో చమురు ధరలు ఊపందుకున్నాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి బలహీనపడటం ఇందుకు తోడైంది. ముఖ్యంగా వాహన, ఇంధన, టెలికాం షేర్లకు అమ్మకాలు వెల్లువెత్తాయి. రుతుపవనాలు జాప్యం కావడం కూడా మదుపర్లను కలవరపెట్టింది. . ఇక వారం ప్రాతిపదికన చూస్తే.. సెన్సెక్స్ 257.58 పాయింట్లు, నిఫ్టీ 99.20 పాయింట్లు చొప్పున నష్టాలు చవిచూశాయి. మదుపర్ల సంపద రూ.83,464 కోట్లు తగ్గి రూ.150.47 లక్షల కోట్లకు చేరింది. ఆసియా మార్కెట్లు బలహీనంగా ముగియగా, ఐరోపా సూచీలు లాభాల్లో ట్రేడయ్యాయి.

సెన్సెక్స్ ఉదయం 39,608.25 పాయింట్ల వద్ద స్తబ్దుగా ప్రారంభమైంది. అమ్మకాలు వెల్లువెత్తడంతో రోజులో ఎక్కువ భాగం నష్టాల్లో కదలాడిన సూచీ.. ఇంట్రాడేలో 39,121.30 పాయింట్ల వద్ద కనిష్ఠానికి పడిపోయింది. చివరకు 407.14 పాయింట్ల నష్టంతో 39,194.49 వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ సైతం 107.65 పాయింట్లు కోల్పోయి 11,724.10 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 11,705.10- 11,827.95 పాయింట్ల మధ్య కదలాడింది.

✦ శ్రీకాకుళం జిల్లాలోని ఒక యూనిట్‌కు అమెరికా ఔషధ నియంత్రణ సంస్థ యూఎస్ఎఫ్‌డీఏ హెచ్చరిక లేఖ జారీ చేయడంతో అరబిందో ఫార్మా షేర్లు కుదేలయ్యాయి. ఇంట్రాడేలో 7.68 శాతం కుప్పకూలిన షేరు.. రూ.578.75 వద్ద కనిష్ఠానికి చేరింది. చివరకు 3.92 శాతం నష్టంతో రూ.602.35 వద్ద ముగిసింది.

✦ ఇక జెట్ ఎయిర్‌వేస్ షేరు జోరు కొనసాగించింది. శుక్రవారం బలహీనంగా ప్రారంభమైన షేరు.. ఇంట్రాడేలో రూ.39.10 వద్ద కనిష్ఠానికి పడిపోయింది. అనంతరం బలంగా పుంజుకుని రూ.79.75 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరకు 13.20 శాతం లాభంతో రూ.72.45 వద్ద ముగిసింది.

సెన్సెక్స్ 30 షేర్లలో 25 నష్టాలు చవిచూశాయి. యెస్ బ్యాంక్ 4.36%, మారుతీ సుజుకీ 3.39%, హెచ్‌డీఎఫ్‌సీ 2.63%, కోల్ ఇండియా 2.27%, హీరో మోటోకార్ప్ 2.17%, హిందుస్థాన్ యునిలీవర్ 2.04%, సన్‌ఫార్మా 2%, కోటక్ మహీంద్రా బ్యాంక్ 1.84%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.36%, టీసీఎస్ 1.27% చొప్పున డీలాపడ్డాయి.

# 100 నగరాలకు ప్రీమియం సైకిళ్లు

● విస్తరణ యత్నాల్లో ట్రెక్

**ఈనాడు, హైదరాబాద్:** అమెరికాకు చెందిన అగ్రశ్రేణి సైకిల్ బ్రాండ్ అయిన 'ట్రెక్' మనదేశంలో బహుముఖంగా విస్తరించే యత్నాలు చేస్తోంది. ప్రీమియం సైకిళ్లను మాత్రమే విక్రయించే ఈ సంస్థ ప్రస్తుతం దేశవ్యాప్తంగా 40 నగరాల్లో విక్రయ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. వచ్చే రెండు మూడేళ్ల వ్యవధిలో 100 నగరాలకు విక్రయాలను విస్తరించాలనేది తమ లక్ష్యమని ట్రెక్ బైస్కిల్ ఇండియా కంట్రీ మేనేజర్ నవ్‌నీత్ బంకా ఇక్కడ వెల్లడించారు. మనదేశంలో ప్రీమియం సైకిళ్లకు ఇటీవలి కాలంలో మార్కెట్ పెరుగుతోంది. ఏటా 35,000 వరకూ ప్రీమియం సైకిళ్ల విక్రయాలు నమోదవుతున్నాయి. రూ.30,000 లేదా ఆపైన ధర పలికే సైకిళ్లను ప్రీమియం సైకిళ్లుగా పరిగణిస్తారు. ఈ విభాగంలో ఏటా 20 శాతం చొప్పున విక్రయాలు పెరుగుతున్నట్లు నవ్‌నీత్ పేర్కొన్నారు. ప్రీమియం సైకిళ్ల బ్రాండ్లు మనదేశంలో పది వరకూ ఉన్నప్పటికీ నేరుగా తన అనుబంధ కంపెనీ ద్వారా విక్రయాలు సాగిస్తున్న సంస్థ ట్రెక్ ఒక్కటే. దీనికి యూఎస్‌తో పాటు జర్మనీ, చైనా తదితర దేశాల్లో యూనిట్లు ఉన్నాయి. ఒక్కో సైకిల్ ధర రూ.30,000 నుంచి రూ.20 లక్షల వరకూ ఉన్నట్లు ఆయన వెల్లడించారు. దాదాపు నలభై రకాల మోడళ్లను తాము తయారు చేస్తున్నామని అన్నారు. ప్రీమియం సైకిళ్లకు హైదరాబాద్ నగరం అయిదో అతిపెద్ద మార్కెట్‌గా ఉన్నట్లు తెలిపారు. మొదటి నాలుగు స్థానాల్లో దిల్లీ, ముంబయి, బెంగళూరు, చెన్నై నగరాలు ఉన్నాయి. దక్షిణాదిలో మదురై, కోయంబత్తూర్ తదితర నగరాలకు విస్తరించే సన్నాహాల్లో ఉన్నామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం విజయవాడ, విశాఖపట్నం నగరాల్లో విక్రయాలు సాగిస్తున్నట్లు వివరించారు. భారత్‌లో తయారీ చేపట్టే అవకాశం ఉందా? అనే ప్రశ్నకు ప్రస్తుతం అటువంటి ఆలోచన లేదని బదులిచ్చారు. ప్రధానంగా తమ బ్రాండును వినియోగదార్లకు దగ్గరగా తీసుకువెళ్లటం, దేశవ్యాప్తంగా పంపిణీ కార్యకలాపాలను విస్తరించటంపై ప్రస్తుతం దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. క్రీడాకారులు, సైక్లింగ్‌పై ఆసక్తి ఉన్నవారే కాకుండా వ్యాయామం/ దేహదారుఢ్యంపై ఆసక్తి ఉన్నవారు కూడా ఈ సైకిళ్లను కొనుగోలు చేస్తున్నట్లు హైదరాబాద్‌లో 'ట్రెక్' ఫ్రాంఛైజీ నిర్వహిస్తున్న శిల్పా షా పేర్కొన్నారు.



నవ్‌నీత్ బంకా

# ఎతిహాద్ డిమాండ్లు సాధ్యం కానందునే..

● దివాలా స్మృతిని ఆశ్రయించాం

● స్టాక్ ఎక్స్ఛేంజీలకు ఎస్‌బీఐ వివరణ

**ముంబయి:** జెట్ ఎయిర్‌వేస్‌ను కొనుగోలు చేసేందుకు ఎతిహాద్ ఎయిర్‌వేస్ విధించిన షరతుల అమలు సాధ్యం కానందునే, దివాలా స్మృతిని ఆశ్రయించాలని బ్యాంకర్లు నిర్ణయించినట్లు స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) వెల్లడించింది. ఓపెన్ ఆఫర్ నుంచి మినహాయింపు కల్పించాలని, వివిధ విమానాశ్రయాల్లో జెట్‌కు ఇచ్చిన సమయాలు (స్లాట్స్) తమకు కచ్చితంగా ఇవ్వాలని ఎతిహాద్ కోరిందని, ఆ షరతులను అమలు పరిచే వీలు ఆర్థిక సంస్థలుగా తమకు లేదని ఎస్‌బీఐ ఛైర్మన్ రజనీశ్ కుమార్ ఇక్కడ చెప్పారు. అందువల్లే జెట్‌ను దివాలా స్మృతి కింద పరిష్కరించాలని ఆ సంస్థకు రుణాలిచ్చిన 26 మంది బ్యాంకర్ల బృందం అభ్యర్థించినట్లు తెలిపారు. పరిష్కారం కనుగొనేందుకే జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ)ని జెట్‌కు రుణాలిచ్చిన సంస్థలు ఆశ్రయించాయని, ఆస్తుల విక్రయానికీ అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. నిర్వహణ నష్టాలతో జెట్ ఎయిర్‌వేస్ ఆర్థిక స్థితి బలహీనంగా ఉన్నందున, ఏడాది కాలంగా సానుకూల పరిష్కారం కోసం బ్యాంకర్లు ప్రయత్నిస్తూనే వచ్చారని, శుక్రవారం స్టాక్ ఎక్స్ఛేంజీలకు ఇచ్చిన సమాచారంలో ఎస్‌బీఐ తెలిపింది.

# అరబిందో ఫార్మాకు అమెరికా హెచ్చరిక

● పైడిభీమవరం యూనిట్-11లో అభ్యంతరాలు

● 4 శాతం పడిన షేరు

**ఈనాడు, హైదరాబాద్:** అరబిందో ఫార్మాకు అమెరికా ఔషధ నియంత్రణ సంస్థ (యూఎస్ఎఫ్‌డీఏ) నుంచి 'హెచ్చరిక లేఖ' అందింది. శ్రీకాకుళం జిల్లా పైడిభీమవరంలోని యూనిట్-11ను ఈ ఏడాది ఫిబ్రవరిలో యూఎస్ఎఫ్‌డీఏ ప్రతినిధి బృందం తనిఖీ చేసింది. ఆ సందర్భంగా గుర్తించిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకొని తాజాగా 'హెచ్చరిక లేఖ' జారీ చేసింది. ఈ నెల 20వ తేదీన ఈ లేఖ జారీ అయినట్లు కంపెనీ వెల్లడించింది. గత నెలలో అరబిందో ఫార్మాకు చెందిన హైదరాబాద్ శివార్లలోని యూనిట్లలో కూడా కొన్ని అభ్యంతరాలను గమనించి యూఎస్ఎఫ్‌డీఏ, ఆ యూనిట్ల విషయంలో ఓఏఐ (అఫీషియల్లీ యాక్షన్ ఇనిషియేటెడ్) తరగతిలో పెడుతున్నట్లు స్పష్టం చేసిన విషయం విదితమే. అది పరిష్కారం కాకుండానే శ్రీకాకుళం జిల్లాలోని యూనిట్‌కు 'హెచ్చరిక లేఖ' జారీ కావటం అరబిందో ఫార్మాను ఇబ్బంది పెట్టే పరిణామమని మార్కెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

తాజాగా జారీ అయిన 'హెచ్చరిక లేఖ' వల్ల పైడిభీమవరం యూనిట్-11లో తయారయ్యే ఔషధాలను పూర్తి స్థాయిలో ఎగుమతి చేయలేకపోవచ్చని తెలుస్తోంది. కంపెనీ మాత్రం ఇక్కడ తమ వ్యాపార కార్యకలాపాలకు వచ్చిన ఇబ్బందేమీ లేదని స్పష్టం చేస్తోంది. ప్రస్తుత అభ్యంతరాల విషయంలో యూఎస్ఎఫ్‌డీఏకు సంతృప్తికరమైన సమాధానం ఇచ్చేందుకు సిద్ధపడుతున్నట్లు పేర్కొంది. ఇక్కడ తయారు చేస్తున్న ఔషధాలను ఇతర యూనిట్ల నుంచి ఎగుమతి చేసే అవకాశం ఉన్నట్లు, ఆ దిశగా కంపెనీ సన్నాహాలు చేస్తుందని అంచనా వేస్తున్నారు. తాజా పరిణామాల నేపథ్యంలో స్టాక్ ఎక్స్ఛేంజీల్లో అరబిందో షేరుకు తీవ్రమైన అమ్మకాల ఒత్తిడి ఎదురైంది. బీఎస్ఈలో శుక్రవారం దాదాపు 4% పడిపోయి రూ.602.35 వద్ద ముగిసింది.

### 21న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)

(100కు రూపాయలలో)



కోడిగుడ్లు

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 413 | వరంగల్ | 416 |
| చిల్లరగా(ఒక గుడ్డు) | 4.75 | విశాఖపట్నం | 427 |
| బెంగళూరు | 445 | చెన్నై | 470 |
| 22వ తేదీకి | | చిత్తూరు | 463 |
| విజయవాడ/గోదావరి | 420 | నమక్కల్ | 450 |

## ఎన్ఎస్ఈ

**శుక్రవారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం** (వరుసగా)

### నిఫ్టీ 50

ADANI PORT & 402.00 (401.20) 4710025
ASIAN PAINTS 1383.00 (1392.05) 1242165
AXIS BANK LT 771.05 (771.40) 12610688
BAJAJ AUTO L 2875.55 (2897.30) 529699
BAJAJ FINANC 3565.85 (3582.55) 1058266
BAJAJ FINSER 8392.45 (8417.85) 230915
BHARTI AIRTE 343.80 (348.55) 9584254
BHARTI INFRA 275.35 (279.05) 2133362
BPCL 380.00 (385.20) 5393974
BRITANNIA 2826.70 (2834.05) 363700
CIPLA 551.55 (551.30) 1534007
COAL INDIA L 254.25 (260.35) 20185830
DR. REDDYS 2551.55 (2564.80) 579138
EICHER MOTOR 19719.20 (19793.15) 54662
GAIL 311.60 (311.15) 5984422
GRASIM IND 897.75 (900.80) 1827826
HCL TECH 1076.25 (1087.35) 2347555
HDFC 2140.80 (2199.25) 7764514
HDFC BANK 2414.20 (2426.35) 3312565
HERO MOTOCOR 2606.00 (2665.70) 903440
HINDALCO IND 197.65 (194.30) 7596593
HINDUSTAN UN 1766.65 (1805.05) 2512357
ICICI BANK 430.80 (433.40) 13909654
INDIABULLS H 612.00 (599.75) 38708216
INDIAN OIL 153.85 (156.75) 12256650
INDUSINDBANK 1448.65 (1435.60) 4913512
INFOSYS LTD 750.20 (754.90) 13200318
ITC 274.25 (277.00) 18595809
JSW STEEL LT 267.15 (269.25) 6144176
KOTAK MAHIND 1489.80 (1518.35) 1214842
LARSEN & TOU 1539.75 (1557.10) 3028524
M&M 627.45 (627.15) 2713987
MARUTI SUZIK 6417.25 (6616.75) 1345890
NTPC LTD 134.55 (134.55) 9456244
ONGC 170.95 (172.00) 11402911
POWER GRID C 199.90 (200.95) 9338314
RELIANCE IND 1279.50 (1296.75) 10623098
SBI 349.40 (345.15) 24749090
SUN PHARMA 382.80 (390.50) 5389874
TATA CONSULT 2249.85 (2277.95) 3871804
TATA MOTORS 158.90 (159.25) 23304207
TATA STEEL L 497.65 (501.00) 6126246
TECH MAHINDR 740.45 (725.55) 7280809
TITAN IND 1292.35 (1306.60) 2640376
ULTRATECH 4595.15 (4576.05) 643439
UPL LIMITED 890.10 (870.25) 12447297
VEDANTA LIMI 172.40 (172.00) 10322918
WIPRO 285.85 (286.95) 6477258
YES BANK LTD 109.60 (114.55) 106421502
ZEE ENTERTAI 345.65 (351.70) 9443466

### నిఫ్టీ నెక్స్ట్ 50

ABB 1559.05 (1566.95) 109088
ACC 1532.45 (1539.75) 507105
AMBUJA CEMEN 212.85 (213.70) 4181731
ASHOK LEYLAN 86.50 (87.80) 18399090
AUROBIND PHA 602.45 (627.15) 7444855
AVENUE SUPER 1320.45 (1336.15) 375704
BAJAJ HOLDIN 3633.40 (3606.85) 69388
BANDHAN BANK 530.75 (535.85) 556231
BANK OFBAROD 118.05 (118.50) 19336018
BHEL 71.40 (70.80) 11601602
BIOCON LTD 249.55 (253.20) 1982582
BOSCH LTD 16466.40 (16591.70) 28819
CADILA HEALT 235.05 (242.55) 2472209
COLGATE PALM 1130.55 (1139.75) 357511
CONTAINER 553.40 (545.60) 1096693
DABUR INDIA 392.60 (387.80) 2511877
DIVIS LAB 1545.75 (1603.00) 1014804
DLF LIMITED 177.55 (181.35) 10517709
GENERAL INS 205.90 (207.10) 59336
GODREJ CONSU 669.40 (667.65) 1349988
HAVELLS INDI 786.15 (785.75) 1056822
HDFC AMC LIM 1872.25 (1821.20) 218815
HDFC STAND L 438.15 (440.45) 978609
HINDUSTAN ZI 230.75 (233.85) 1616854
HPCL 291.90 (292.65) 5154257
ICICI LOMBAR 1155.55 (1163.00) 467493
IDEA CELLULR 12.15 (11.90) 71979075
INTERGLOBE A 1552.10 (1582.25) 1821382
L&TFIN.HOLD 114.20 (113.50) 8040794
LUPIN 712.80 (713.95) 1844959
MARICO LIMIT 369.30 (367.00) 2543721
MCDOWELL 551.90 (541.60) 2726318
MOTHERSON 126.50 (127.85) 10573696
MRF 54922.40 (54921.70) 3125
NHPC LTD 25.20 (24.80) 3650890
NMDC LTD 111.25 (108.45) 6290349
ORACLE FIN S 3098.65 (3243.90) 86195
P&G HYG&HEAL 10765.25 (10787.60) 3032
PAGE INDUSTR 20887.45 (20607.60) 62797
PETRONET LNG 241.55 (236.80) 2710791
PIDILITE IND 1233.00 (1251.65) 744514
PIRAMAL ENTE 1890.20 (1880.40) 2161931
SAIL 50.05 (49.60) 24418643
SBI LIFE INS 699.95 (698.45) 3605899
SHREE CEMENT 21154.40 (21199.55) 35961
SHRIRAM TRAN 1098.40 (1094.60) 2451896
SIEMENS 1240.15 (1272.25) 471965
THE NEW INDI 148.70 (151.55) 42492
UNITED BREWE 1350.65 (1347.50) 352085

## బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

ADITYA SPIN 3.75 (3.61) 40
ALPHAGEO 423 (408.85) 24504
AMAR RAJA BA 607.75 (610.50) 23009
ANDHRA BANK 22.55 (23.20) 79346
ANDHRA CEMEN 4.05 (4.02) 15896
ANDHRA PAPER 424.45 (424.80) 4899
ANDHRA PETRO 55.05 (54) 28622
ANDHRA SUGAR 324.05 (319.35) 3048
ANJANI PORTL 165.65 (161.25) 2956
ASTRA MICROW 87.30 (88.35) 9886
AUROBINDO PH 602.35 (626.90) 447423
AVANTEL SOFT 238.95 (233.50) 395
AVANTI FEEDS 364.30 (362.30) 24650
AVON ORG 2.47 (2.36) 11075
BALAJI AMIN 375.60 (372.55) 2340
BARTRONICS 3.61 (3.62) 5196
BHAGIRA CHEM 470.65 (490.55) 14022
BHAGYA NAG 24.60 (24.50) 299
BN RATHI SEC 18.70 (18.85) 9211
BRILLIANT SE 0.97 (1) 18382
CAMBRIDGE TE 32.80 (32.50) 3397
CIL SECURI 12.47 (13.75) 461
CONT COFFEE 249.05 (256.15) 1292
COROMAN FERT 410.05 (405.40) 3137
CUBEX TUB 11.43 (11.88) 1884
CYBERMATE 1.91 (1.89) 9454
CYIENT LIMIT 564.75 (560.50) 5357
DECCAN CEMEN 391.55 (391.50) 466
DIVI'S LAB 1547.05 (1601.65) 16741
DIVYA GRANIT 75.90 (74.75) 298
DR REDDY 2549.95 (2565.40) 24031
FOUR SOFT 27.90 (26.90) 300
GATI CORPN 65.35 (59.75) 269543
GAYATRI PROJ 157.90 (159.30) 3195
GMR INFRASTR 15.40 (15.30) 398557
GOLDST INFRA 188.80 (190.35) 8664
GOLDSTONE EN 9 (9.57) 9125
GRANULES (I) 93.20 (93.90) 35044
GSS AMERICA 99.80 (99.95) 28182
GVK POWER 6.35 (6.04) 354740
HBL NIFE POW 23.25 (23.05) 3929
HERITAGE FOO 404.50 (415.25) 238
HIL LTD 1541.70 (1542) 130
HIND FLUROCA 10.21 (10.74) 543
IDL INDUSTRS 271.80 (262.10) 140
ILFS ENGINEE 5.74 (5.50) 5376
IVRCL INFRAS 0.70 (0.67) 30605
JEEVAN SCIEN 25.25 (26.65) 692
KAKATIYA CEM 172.30 (175.80) 4036
KAKATIYA TEX 3.50 (3.37) 100
KALLAM SPG 12.80 (13.10) 95882
KAVERI SEED 472.05 (451.90) 54207
KCP LTD 85 (85.90) 1549
KERNEX MICRO 27.15 (27.10) 5691
KNR CONSTRUC 282.80 (283.35) 1928
LANCO INDUS 164.70 (166.50) 8931
LAURUS LABS 332.05 (331.90) 4852
LOKESH MACH 42.35 (43.80) 2286
MADHUCON PRO 6.12 (6.44) 5817
MEDINOVA DIA 15 (14.43) 1250
MEGA SOFT 7.08 (7.21) 8310
MIC ELECTRON 0.78 (0.77) 35305
MOLD-TEK.TEC 53.40 (52.85) 412
MOLDTK PLA 240.50 (241.65) 924
MSR INDIA LT 9.56 (9.72) 1937
NAGARJAGRICH 29.75 (29.70) 2109
NATCO PHARMA 538.60 (532) 21866
NAVA BH VENT 95.30 (95.95) 921
NCC 99.60 (99.25) 491611
NCL IND 133.30 (137.80) 441
NEHA INTER 1.48 (1.41) 8492
NETTLINX 35.75 (33.95) 3376
NEULAND LAB 521.25 (537.85) 2748
NIHAR INFO 9.50 (9.50) 500
NILE 259.35 (244.60) 593
NORTHGATE TE 0.37 (0.38) 4165
OIL COUNTRY 6.80 (6.19) 17738
PENNER IND 33.70 (34) 4512
PHYTOCHEM I 25.05 (24.15) 741
PIONEER DIST 120.05 (118.55) 823
PITTI LAMIN 47.20 (46.40) 1842
POKARNA 143 (142.05) 3751
PRAJAY ENGS 7.70 (7.90) 125
PREMIER EXPL 190.60 (190) 706
PRISM CEMENT 91.75 (92.10) 14963
PRUDENTL PHA 3.54 (3.62) 78858
RAASI REFRAC 5.30 (5.06) 50
RAGSAN PETRO 85.20 (85.15) 90
RAIN INDUSTR 97.80 (99) 62074
RAM INFORMAT 38.95 (35.05) 458
REG.CERAMIC 2.45 (2.37) 31201
SAGAR CEM 612.40 (615) 46
SAMKRG PIST 135.75 (139.30) 3311
SAMPRE NUTRI 14.15 (14.15) 530
SATVAH. ISPA 6.98 (6.86) 16
SMS PHARMA 55 (53.85) 1188
SOUTH BIO TE 0.92 (0.93) 6232
SREE RAYAL A 30 (29.90) 86508
SRINIVASA SH 26.70 (27.50) 758
STARCHIK SP 53.30 (54) 1113
STEEL EXCHAN 12.05 (12.25) 157
SUJANA UNIVE 0.26 (0.25) 1000
SURANA TELE 3.60 (3.42) 583
SURYALAKSH.C 23.70 (25.25) 300
SURYALATA SP 150 (151.70) 230
SUVEN PHARMA 270.20 (271.90) 27041
TAJ GVK HOTE 183.60 (180.50) 832
TANLA 67.20 (64) 125417
TERA SOFTWAR 35.75 (35.95) 2773
TRANS BIOTEK 3.29 (3.39) 5229
TRENDY KNIT 0.20 (0.19) 4
VAMSHI RUBB 20.20 (21.25) 151
VBC FERRO 36.85 (35.15) 60
VICEROY HOTE 1.83 (1.80) 6155
VIJAY TEXTIL 20 (19.95) 1165
VIMTA LABS 175.40 (165.90) 1799
VISAKA IND 377.50 (382.70) 3221
VISTA PHARMA 13.90 (14.45) 9453
VIVIMED LABS 16.95 (17.05) 73870
VJIL CONSULT 40 (40) 3100
VST INDUS 3457.70 (3450) 74
XL TELENE 0.73 (0.76) 5040
YBRANT DIGIT 4.86 (5.11) 17014
ZENOTECH LAB 15.15 (15.90) 20896
ZENTECH 71.20 (71.25) 6480

Eenadu epaper

**ఈనాడు ఇంటర్వ్యూ**

ఇండియన్ బ్యాంక్ ఎండీ, సీఈఓ

## పద్మజ చుండూరు



'దేశంలో పెద్ద బ్యాంకుల ఏర్పాటు అవసరమే. అదే సమయంలో చిన్న, మధ్య తరహా బ్యాంకులూ ఉండాల్సిందే. ఖాతాదారుల నమ్మకం. . అభిమానమే మాకు బలం. ఇతర బ్యాంకులతో పోల్చి చూస్తే గత కొన్నేళ్లుగా స్థిరంగా వృద్ధి సాధిస్తున్నాం. నిరర్థక ఆస్తులను తగ్గించుకుంటూ, లాభదాయకతను పెంచే దిశగా ఉద్యోగులందరినీ బ్యాంకులో భాగస్వాములను చేశాం. డిజిటల్ లావాదేవీలపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నాం' అంటూ వివరించారు ఇండియన్ బ్యాంక్ ఎండీ, సీఈఓ పద్మజ చుండూరు. డిపాజిట్ల సమీకరణలో ఎదురవుతున్న పోటీవల్ల రుణాల వడ్డీ రేట్లు అనుకున్నంత మేరకు తగ్గడం లేదంటున్న ఆమెతో 'ఈనాడు' జరిపిన ముఖాముఖి వివరాలు...

# ప్రతి శాఖా లాభాల్లోనే..

ఈనాడు - హైదరాబాద్

- ఇది మేము పెట్టుకున్న నియమం
- ఖాతాదారుల నమ్మకమే మా బలం
- తెలుగు రాష్ట్రాలు ఓ ప్రధాన మార్కెట్
- ఏటీఎంలను తగ్గించం.. పెంచుతాం
- పెద్ద బ్యాంకుల ఏర్పాటు అవసరం
- అవసరమైతే ఇతర బ్యాంకుల విలీనాలు

**? గత ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో ఇండియన్ బ్యాంక్ దాదాపు రూ.190 కోట్ల నికర నష్టాన్ని నమోదు చేసింది. బ్యాంకు లాభాలు దెబ్బతినడానికి కారణాలను ఎలా విశ్లేషిస్తారు**

నిజానికి ఇండియన్ బ్యాంక్ ఎప్పుడూ లాభాల్లో ఉన్న బ్యాంకే. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లోనే గత ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో నష్టం కనిపించింది. నిర్వహణ లాభం రూ.2,800 కోట్లు ఉన్న విషయం ఇక్కడ ప్రస్తావించాలి. ఆర్‌బీఐ నిబంధనల మేరకు కొన్ని మొండి బాకీల కోసం కేటాయింపులు చేయాల్సి రావడంతోనే నష్టం కనిపించింది. ముఖ్యంగా ఒక ఖాతాకు పెద్ద మొత్తంలో కేటాయింపులు చేయాల్సి వచ్చింది. 2018-19 ఆర్థిక సంవత్సరం మొత్తాన్ని చూస్తే.. రూ.322 కోట్ల నికర లాభాన్ని ఆర్జించిన సంగతి ఇక్కడ గమనించాలి. అంతకు క్రితం ఏడాదితో పోలిస్తే కూడా నికర లాభం తగ్గడానికి కారణం కూడా.. 2017-18 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రాని బాకీలకు కొన్ని కేటాయింపులు చేయడమే. బ్యాంకు పనితీరు, ఇతర అంశాల పరంగా ఎంతో సమర్థంగా ఉంది. గత నాలుగైదేళ్లుగా స్థిరంగా 15-16శాతం వృద్ధి సాధిస్తున్నాం.

**? ప్రస్తుతం బ్యాంకుకు రావాల్సిన మొండి బాకీల పరిస్థితి ఏమిటి? కొత్త బాకీలు పెరగకుండా ఏం చర్యలు తీసుకుంటున్నారు**

గత ఆర్థిక సంవత్సరం చివరి వరకూ చూస్తే.. బ్యాంకుకు స్థూల ఎన్‌పీఏలు 3.11శాతం, నికర ఎన్‌పీఏలు 3.75శాతం దాకా ఉన్నాయి. గత నాలుగేళ్లతో పోలిస్తే ఇది చాలా తక్కువే. ముఖ్యంగా మా బ్యాంకు రుణ పుస్తకాల్లో 40శాతం వరకూ కార్పొరేట్ రుణాలున్నాయి. వీటి నుంచి ఎన్‌పీఏలు రాకుండా జాగ్రత్త తీసుకుంటున్నాం. కొన్ని రుణాలపై ఎన్‌సీఎల్‌టీలో కేసులున్నాయి. గత ఏడాదిలో రూ.1,000 కోట్ల వరకూ ఇలా ఆగిపోయాయి. కార్పొరేట్ రుణాల కోసం ప్రత్యేకంగా ముంబయి, చెన్నై, దిల్లీలో శాఖలు ఏర్పాటు చేసి, దరఖాస్తుల పరిశీలన, రుణాల జారీలాంటివి అక్కడి నుంచే పర్యవేక్షిస్తున్నాం. ప్రతి బ్యాంకు శాఖా లాభాల్లోనే కొనసాగాలనేది మాకు మేము పెట్టుకున్న నియమం. రాని బాకీలను ఈ ఏడాదిలో రూ.2,000-2,500 కోట్ల వరకూ వసూలు చేయాలనేది మా లక్ష్యం.

**? నిధుల సమీకరణలో భాగంగా రూ.7,000 కోట్ల ఫాలోఆన్ పబ్లిక్ ఆఫర్ (ఎఫ్‌పీఓ)కు వెళ్లనున్నట్లు ప్రకటించారు కదా? ఇది ఎప్పుడు రావచ్చు**

బ్యాంకుకు అవసరమైనప్పుడు నిధుల సమీకరణ కోసం రూ.7,000 కోట్లను సేకరించేందుకు బోర్డు అనుమతి ఉంది. కానీ, ఇప్పటికిప్పుడు బ్యాంకుకు నిధుల అవసరం లేదు. మూలధనం కావాల్సినంతగా ఉంది. కాబట్టి, ఇబ్బంది లేదు. ప్రభుత్వం నుంచి మూలధన నిధులు కూడా అడగలేదు. నిజంగా నిధుల అవసరం ఉండి, మార్కెట్ పరిస్థితులు బాగుంటే ఎఫ్‌పీఓకి వస్తాం. ఇది ఒకేసారా.. దశలవారీగానా అన్నది ఇంకా నిర్ణయించుకోలేదు.

**? ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో మీ బ్యాంకు ఉనికి ఎలా ఉంది? విస్తరణ ప్రణాళికలు ఏమైనా ఉన్నాయా**

తమిళనాడు తర్వాత మాకు అత్యంత ప్రధానమైన మార్కెట్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలోనే ఉంది. ఇక్కడ మాకు 406 శాఖలు ఉన్నాయి. మా మొత్తం రుణాల్లో ఇక్కడి నుంచి 15శాతం అంటే రూ.26,000 కోట్ల వరకూ ఉన్నాయి. డిపాజిట్లు కూడా అధికంగానే ఉన్నాయి. ఈ అనుబంధాన్ని ఇంకా ముందుకు తీసుకెళ్లాలనే ఆలోచన ఉంది. నేను ఇక్కడ పలు ప్రాంతాల్లో పనిచేసిన నేపథ్యంలో ఎక్కడ ఎలాంటి అవకాశాలుంటాయనే అంశంపై పట్టు ఉంది. దీని ఆధారంగా ఇండియన్ బ్యాంకును ఇక్కడ విస్తరించేందుకు ఆలోచిస్తున్నాం. రెండు రాష్ట్రాల్లోనూ పలు ప్రభుత్వ ప్రాజెక్టులకు మేము నిధులు ఇచ్చాం. ప్రభుత్వ పథకాల నగదు బదిలీ సేవలనూ అందిస్తున్నాం. పలు ప్రముఖ దేవాలయాలతోనూ ఒప్పందాలు కుదుర్చుకుంటున్నాం. అవకాశాలను బట్టి, బ్యాంకు శాఖలను ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. గ్రామీణ ప్రాంతాల్లో విస్తరించడం ద్వారా వ్యవసాయ రుణాలు, స్వయం సహాయక బృందాలకు ఇచ్చే రుణాలను పెంచుతాం.

**? రెపో రేటు తగ్గించిన వెంటనే రుణాల వడ్డీ రేట్లు తగ్గడం లేదనే విమర్శల బ్యాంకులపైన వస్తున్నాయి? వీటికి మీ సమాధానం**

**ఇతర బ్యాంకుల గురించి నేను చెప్పలేను. కానీ, ఆర్‌బీఐ రెపో రేటు తగ్గించిన ప్రతిసారీ కొంత మేరకు ఆ ప్రయోజనాన్ని మేము బదిలీ చేస్తున్నాం. డిపాజిట్ల విషయంలో పోటీ పెరిగింది. దీంతో అవి కాస్త ఖరీదయ్యాయి. ఈ నేపథ్యంలోనే కొన్నిసార్లు బ్యాంకులు వడ్డీ రేట్ల బదిలీని పూర్తిస్థాయిలో చేయలేకపోతున్నాయని చెప్పొచ్చు.**

**? నగదు కొరత సమస్య ఇంకా వెన్నాడుతోందా**

ప్రస్తుతం వ్యవస్థలో నగదు కొరత అంతగా లేదు. ఎన్నికలు ముగిశాక నగదు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంది. ఎంతోకొంత ఇబ్బందులున్నా.. మరో మూడు నెలల్లో ఈ సమస్య తీరిపోతుందని నా అభిప్రాయం.

**? దేశంలో పెద్ద బ్యాంకుల ఏర్పాటు కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇది ఆర్థిక వ్యవస్థకు ఎంత మేరకు లాభం అని అనుకుంటున్నారు? ఇండియన్ బ్యాంక్ పరిస్థితి ఏమిటి**

దేశంలో పెద్ద బ్యాంకుల ఏర్పాటు ఇప్పుడు చాలా అవసరం. ప్రపంచంలోని ఆరు పెద్ద బ్యాంకులు చైనాలోనే ఉన్నాయి. అంతర్జాతీయంగా పోటీ పడే సత్తా మన బ్యాంకులకు రావాలి. పెద్ద బ్యాంకులతోపాటు మధ్య, చిన్న స్థాయి బ్యాంకులూ ఆర్థిక వ్యవస్థలో అవసరమే. ప్రస్తుతం మా బ్యాంకు పటిష్ఠంగా ఉంది. మా గుర్తింపును మేము కాపాడుకుంటాం. ప్రభుత్వం నిర్ణయిస్తే చిన్న బ్యాంకులను విలీనం చేసుకునేందుకు సిద్ధంగానే ఉన్నాం.

**? డిజిటల్ లావాదేవీలపైన ఎలాంటి దృష్టి పెట్టారు**

డిజిటల్ లావాదేవీలపైనా మేము ప్రత్యేక దృష్టి సారించాం. గత మూడేళ్లుగా మా మొబైల్ బ్యాంకింగ్ లావాదేవీలు నాలుగు రెట్లకు పైగా పెరిగాయి. ఖాతాదారు నేరుగా శాఖకు వచ్చి, లావాదేవీని నిర్వహిస్తే.. బ్యాంకుకు రూ.52 వరకూ ఖర్చవుతుంది. అదే ఏటీఎం నుంచి రూ.20 వరకూ, డిజిటల్ లావాదేవీ అయితే రూ.2 వరకూ వ్యయమవుతుంది. అందుకే, డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించి, బ్యాంకు వ్యయాలు తగ్గించుకునేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నాం. తాజాగా ఆర్‌బీఐ కూడా వీటి ఛార్జీలను తొలగించడంతో ఇవి మరింత విస్తృతంగా ప్రజల్లోకి వెళ్తాయని అనుకోవచ్చు.

**? ప్రస్తుతం చాలా బ్యాంకులు ఏటీఎంల సంఖ్యను తగ్గిస్తున్నాయి? మీ మాటేమిటి. డిజిటల్ లావాదేవీల విషయమై మీ బ్యాంకు ఎలాంటి చర్యలు తీసుకుంటోంది.**

**నిజానికి డిజిటల్ బ్యాంకింగ్ ప్రారంభమయ్యేదే ఏటీఎం కార్డు నుంచి. బ్యాంకులు డిజిటల్ సేవలను పెంచాలంటే.. ఏటీఎంల సంఖ్య ఏమాత్రం తగ్గించకూడదనేది నా అభిప్రాయం. ఏటీఎంల నుంచి అనేక డిజిటల్ సేవలను అందించేందుకు వీలుంది. అందుకే, మా ఏటీఎంల సంఖ్య తగ్గించడంలాంటి చర్యలేమీ తీసుకోలేదు. వీటిని మరింత పెంచేందుకు ప్రయత్నిస్తున్నాం. తెలుగు రాష్ట్రాల్లో కూడా మా ఏటీఎంల సంఖ్యను అధికం చేసే అవకాశాలను పరిశీలిస్తాం.**

---

## జీఎస్‌టీ రిజిస్ట్రేషన్‌కు 'ఆధార్'నూ వాడొచ్చు

- మల్టీప్లెక్స్ థియేటర్లకు ఇ-టికెట్ల విధానం తప్పనిసరి
- విద్యుత్ వాహనాల రేట్ల కోత అంశం కమిటీకి
- జీఎస్‌టీ మండలి నిర్ణయాలు



దిల్లీ

**జీ**ఎస్‌టీ రిజిస్ట్రేషన్ కోసం సమర్పించే ధ్రువీకరణ పత్రాల్లో 'ఆధార్'ను కూడా ఉపయోగించేందుకు జీఎస్‌టీ మండలి అనుమతినిచ్చింది. అలాగే యాంటీ ప్రాఫిటీరింగ్ అథారిటీ కాలపరిమితిని రెండేళ్ల పాటు పొడిగించింది. అంటే 2021 నవంబరు వరకు ఇది కొనసాగుతుందన్నమాట. మరోవైపు విద్యుత్ వాహనాలు, వాటి ఛార్జర్లపై జీఎస్‌టీ రేటును తగ్గించే అంశాన్ని అధికారుల కమిటీకి సిఫారసు చేసింది. శుక్రవారం జరిగిన తన 35వ సమావేశంలో పైవిధమైన నిర్ణయాలను జీఎస్‌టీ మండలి తీసుకుంది. కేంద్ర ఆర్థికమంత్రిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన నిర్మలా సీతారామన్ ఆధ్వర్యంలో ఇదే మొట్టమొదటి జీఎస్‌టీ సమావేశం కావడం గమనార్హం. 'జీఎస్‌టీ నిబంధనల సరళీకరణ, జీఎస్‌టీ రేట్ల హేతుబద్ధీకరణ, మరిన్ని వస్తువులను జీఎస్‌టీ పరిధిలోకి తేవడం లాంటి అంశాలపై జీఎస్‌టీ మండలి మరింత కసరత్తు చేయాల్సి ఉంద'ని సీతారామన్ అభిప్రాయపడినట్లు ఆర్థిక శాఖ ఓ ట్వీట్ చేసింది. అలాగే జీఎస్‌టీ మండలిని సమాఖ్య వ్యవస్థకు ఓ అత్యుత్తమ ఉదాహరణగా తీర్చిదిద్దడంలో మాజీ ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఎంతో కీలక పాత్ర పోషించారని జీఎస్‌టీ మండలి ప్రశంసించింది. ఆయన కృషిని అభినందిస్తూ ఓ తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. మరోవైపు సమావేశానంతరం రెవెన్యూ కార్యదర్శి ఎ.బి.పాండే విలేకర్లతో మాట్లాడుతూ జీఎస్‌టీ రిటర్న్‌లకు సంబంధించి కొత్త విధానాన్ని 2020 జనవరి 1 నుంచి పూర్తిస్థాయిలో అమల్లోకి తెస్తామని తెలిపారు. ఈ సమావేశంలో జీఎస్‌టీ మండలి ఆమోదించిన ప్రతిపాదనలు, నిర్ణయాల వివరాలు ఇలా..

- ✦ వ్యాపారులు జీఎస్‌టీ రేట్ల కోత ప్రయోజనాన్ని వినియోగదారులకు బదిలీ చేయకుండా ఆ లాభాన్ని వారి జేబుల్లోనే వేసుకుంటే.. అలా ఆర్జించిన లాభంపై 10 శాతం జరిమానా విధించాలనే ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. ప్రస్తుతమున్న నిబంధన ప్రకారమైతే ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడిన వారికి గరిష్ఠంగా రూ.25,000 వరకు జరిమానా విధించొచ్చు.
- ✦ 2017-18 ఆర్థిక సంవత్సరానికి వార్షిక జీఎస్‌టీ రిటర్న్‌ల దాఖలు గడువును రెండు నెలలు పొడిగించింది. 2019, ఆగస్టు 30 వరకు దాఖలు చేసుకునే వీలు కల్పించింది.
- ✦ 2020 జనవరి 1 నుంచి ప్రయోగాత్మక పద్ధతిలో ఎలక్ట్రానిక్ రశీదుల విధానాన్ని అమల్లోకి తెచ్చేందుకు జీఎస్‌టీ మండలి ఆమోదం తెలిపింది. ఈ ప్రతిపాదనలో భాగంగా భాగంగా రూ.50 కోట్లకు మించి టర్నోవరు ఉన్న సంస్థలు బీ2బీ విక్రయాలకు ప్రభుత్వ పోర్టల్ నుంచి ఎలక్ట్రానిక్ రశీదులను తీసుకోవాల్సి ఉంటుంది.
- ✦ జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ ఉన్న మల్టీప్లెక్స్ థియేటర్లకు ఇ-టికెట్ల విధానాన్ని తప్పనిసరి చేసింది.
- ✦ లాటరీలపై జీఎస్‌టీ రేట్ల అంశంపై అటార్నీ జనరల్ అభిప్రాయాన్ని తీసుకోవాలని నిర్ణయం తీసుకుంది. 'జీఎస్‌టీ విధానంలో దేశమంతటా ఒకటే పన్ను రేటు ఉండాలి. అయితే లాటరీలకు రెండు రకాల పన్ను రేట్లు విధిస్తున్నారు. అందువల్ల ఆర్టికల్ 340పై స్పష్టత ఆధారంగా దీనిపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంద'ని నిర్మలా సీతారామన్ చెప్పారు.




దిల్లీలో జరిగిన 35వ జీఎస్‌టీ మండలి సమావేశంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఆర్థిక శాఖ సహాయ మంత్రి అనురాగ్ ఠాకూర్, రెవెన్యూ కార్యదర్శి అజయ్ భూషణ్

---

## వీసాలకు పరిమితి.. వదంతే

- హెచ్-1బీపై అమెరికా విదేశాంగ శాఖ
- వర్కర్ వీసా కార్యక్రమం కొనసాగుతుంది

**వాషింగ్టన్:** 'స్థానికంగానే డేటా నిల్వ చేయాలంటూ విదేశీ కంపెనీలపై ఒత్తిడి తెస్తున్న దేశాలకు, హెచ్-1బీ వీసాల్లో 10-15 శాతమే జారీచేయాలనే ప్రతిపాదనను అమెరికా పరిశీలిస్తోంది' అన్నది వదంతేనని తేలిపోయింది. డేటా నిల్వపై సంప్రదింపులకు, వీసా పరిమితి ప్రణాళికలకు సంబంధం లేదని అమెరికా విదేశాంగ శాఖ ప్రతినిధి స్పష్టం చేశారు. ప్రస్తుతం జరుగుతున్న ప్రచారానికి, ట్రంప్ ప్రభుత్వం పరిశీలిస్తున్న వర్కర్ వీసా కార్యక్రమానికి సంబంధం లేదని పేర్కొన్నారు. విదేశీ సైద్ధాంతిక, సాంకేతిక నిపుణులను నియమించుకునేందుకు అమెరికా కంపెనీలకు హెచ్-1బీ వీసా వీలు కల్పిస్తుంది. వలసేతర వీసాగా వీటిని వ్యవహరిస్తుంటారు. అమెరికన్లకే ఉద్యోగావకాశాలు పెంచేందుకు ట్రంప్ ప్రభుత్వం కృషి చేస్తోందని, ఇందులో భాగంగా అమెరికాకు అత్యుత్తమ నిపుణులను మాత్రమే ఆహ్వానించేలా వర్కర్ వీసా పథకాన్ని రూపొందించిందని, ఇందులో హెచ్-1బీ కూడా భాగమే అవుతుందని సదరు అధికారి తెలిపారు. 'ఈ పథకం కింద ఏ ఒక్క దేశాన్నో లక్ష్యంగా చేసుకోవడం లేదు. దీనికి, డేటా స్థానికంగా నిల్వ ఉంచాలని ఒత్తిడి తెస్తున్న భారత్‌తో సంప్రదింపులకు సంబంధం లేదు. డేటా నిల్వకు సరిహద్దులు ఉండరాదనేలా చర్చలు జరుపుతున్నాం' అని వివరించారు.




### అదనపు పెట్టుబడులు అవసరమవుతాయ్

అంతర్జాతీయ కంపెనీలు డేటాను తమకు అనువైన దేశంలోని గ్లోబల్ సర్వర్లలో నిల్వ ఉంచుతుంటాయి. మన దేశం కోరుతున్నట్లు స్థానికంగానే డేటా నిల్వ చేయాలంటే, అదనపు పెట్టుబడులు పెట్టాల్సి వస్తుంది. డేటా స్థానికంగా నిల్వ ఉంటే పర్యవేక్షణ సులభం కావడంతో పాటు ఏదైనా అంశంలో విచారణకూ వీలవుతుందన్నది మన ప్రభుత్వ ఆలోచన.

### భిన్న వాదనలు

ప్రస్తుత చట్టాల ప్రకారం ప్రభుత్వం భారత్‌కు వీసాలు పరిమితం చేయలేదని ఇమిగ్రేషన్ అటార్నీ సైరస్ మెహతా పేర్కొన్నారు. హెచ్-1బీ వీసాలపై దేశాల వారీ పరిమితులు విధించాలంటే, అమెరికా కాంగ్రెస్‌లో ఆమోదం పొందాల్సి ఉంది. వేర్వేరు పార్టీలకు ఆధిపత్యం ఉన్న నేపథ్యంలో, ఈ సవరణకు రెండు చట్ట సభల్లో ఆమోదం పొందడం కష్టమేనని విశ్లేషించారు. అధ్యక్షుడిగా ట్రంప్ తన కార్యనిర్వాహక అధికారాలు వినియోగించి, ఇలాంటి సవరణ విధానాన్ని జారీ చేసే వీలుందని క్లాస్కో ఇమిగ్రేషన్ లా పార్ట్‌నర్స్ వ్యవస్థాపక సభ్యులు విలియం స్టాక్ పేర్కొన్నారు.

### ఇదీ జరిగింది

అమెరికన్లకే ఉద్యోగావకాశాలు కల్పించేలా రెండేళ్ల క్రితం 'బై అమెరికన్, హైర్ అమెరికన్' విధానానికి ట్రంప్ ఆమోదముద్ర వేశారు. అమెరికన్లకు అధిక అవకాశాలు, వేతనాలు కల్పించడం దీని ముఖ్య ఉద్దేశం. అమెరికా వలస విధానాలను మరింత కట్టుదిట్టం చేసే నిబంధనలూ పొందుపరచారు. దీని కిందే హెచ్-1బీ వీసాలను కూడా అత్యున్నత నిపుణులకే ఇచ్చేలా, అధిక వేతనం పొందేవారికి మాత్రమే జారీచేసేలా మార్గదర్శకాలు రూపొందించాలని హోంశాఖకు సూచించింది.

---

### 2 వారాల్లో ప్రణాళిక ఇవ్వండి

విద్యుత్ వాహనాలపై కంపెనీలను కోరిన నీతి ఆయోగ్

**దిల్లీ:** 2025 గడువును దృష్టిలో పెట్టుకుని అన్ని సంప్రదాయ వాహనాలను విద్యుత్ వాహనాలు(ఈవీ)గా మార్చే ప్రణాళికను రెండు వారాల్లోగా సమర్పించాలని ద్విచక్ర, త్రిచక్ర వాహన తయారీదార్లను నీతి ఆయోగ్ కోరింది. కాలుష్య సమస్యలను పరిష్కరించే చర్యలను తీసుకోకపోతే కోర్టులు రంగంలోకి దిగుతాయని శుక్రవారం అంకుర విద్యుత్ వాహన తయారీదార్లతో జరిగిన సమావేశంలో నీతి ఆయోగ్ హెచ్చరించింది. ఈ సమావేశంలో బజాజ్ ఆటో ఎండీ రాజీవ్ బజాజ్, టీవీఎస్ మోటార్ సహ ఛైర్మన్ వేణు శ్రీనివాసన్, హోండా మోటార్‌సైకిల్ ప్రెసిడెంట్, సీఈఓ మినోరు కతోలతో పాటు సియామ్ డైరెక్టర్ జనరల్ విష్ణుమాథుర్, ఏసీఎమ్ఏ డైరెక్టర్ జనరల్ విన్నీ మెహతా తదితరులు పాల్గొన్నారు. బజాజ్ ఆటో, హీరో మోటోకార్ప్, హెచ్ఎమ్ఎస్ఐ, టీవీఎస్‌లు ఒక వైపు.. ఈవీలకు త్వరగా మారాలని కోరుకుంటున్న రెవోల్ట్ ఇంటెలికార్ప్, ఆథర్ ఎనర్జీ, కైనటిక్ గ్రీన్ ఎనర్జీ, పవర్ సొల్యూషన్స్, టార్క్ మోటార్స్ వంటివి మరో వైపు చేరి.. పరిశ్రమను రెండు వర్గాలుగా మార్చాయని విశ్వసనీయ వర్గాలు అంటున్నారు.

---

## లంచావతార.. వాల్‌మార్ట్




**బ్రెజిల్‌లో.. ఒక వ్యక్తి ద్వారా ప్రభుత్వ అనుమతులన్నీ చాలా త్వరగా చక్కబెట్టింది.**

**భారత్‌లో.. స్థానిక వ్యాపార భాగస్వామి ద్వారా అనుమతులను పొందింది.**

**చైనాలో.. స్థానిక భూస్వామికి డబ్బులు పంపి ప్రభుత్వంతో అతనికున్న పరిచయాల ద్వారా పనులు పూర్తి చేసుకుంది.**

**మెక్సికోలో.. ప్రభుత్వంలోని కొన్ని వర్గాలకు కార్లు, కంప్యూటర్లు ఇచ్చి పని నడిపించుకుంది.**

**ఇదీ దశాబ్దకాలంలో వాల్‌మార్ట్ వివిధ దేశాల్లో ఎత్తిన లంచావతరాలు. విచిత్రం ఏమిటంటే ఈ తప్పులన్నీ పరిష్కార మార్గంగా భారీ స్థాయిలో అపరాధ రుసుము కట్టడానికి కూడా ఆ కంపెనీ సంసిద్ధతను వ్యక్తం చేసింది.**

**వా**ల్‌మార్ట్ పేరు తెలియనివారుండరు. ప్రపంచ వ్యాప్తంగా రిటైల్ స్టోర్లను, టోకు వ్యాపారాలను నిర్వహిస్తూ బిలియన్ డాలర్లలో లాభాలు పొందుతుందీ కంపెనీ. అయితే లాభాల యావలో పడి. . నిబంధనలకు నీళ్లు వదలింది. దశాబ్ద కాలంగా ఆయా దేశాల్లోని ప్రభుత్వ అధికారులకు మధ్యవర్తుల(బ్రోకర్లు) ద్వారా భారీ స్థాయిలో లంచాలు ఇచ్చి కొత్త స్టోర్లకు అనుమతులు వేగంగా పొందుతూ వచ్చిందని అమెరికా ప్రభుత్వ న్యాయవాదులు, మార్కెట్ నియంత్రణాధికారులు ఒక సెటిల్‌మెంట్ ఒప్పందంలో పేర్కొన్నారు.

### నేరం అంగీకరించింది..

**ఏ**డేళ్ల పాటు కొనసాగిన దర్యాప్తులో కంపెనీలో ఎక్కడా అంతర్గత నియంత్రణలేదన్న సంగతి తేటతెల్లమైంది. వాల్‌మార్ట్‌కు చెందిన బ్రెజిల్ అనుబంధ కంపెనీ నేరానికి పాల్పడ్డట్లు అంగీకరిస్తూ.. పిటిషన్ పెట్టుకుంది. దీంతో అపరాధ రుసుము కింద 282.7 మిలియన్ డాలర్ల(దాదాపు రూ.2000 కోట్లు)ను కట్టాలని గురువారం సెక్యూరిటీ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్(ఎస్ఈసీ) ఆదేశించింది. అందుకు సైతం వాల్‌మార్ట్ అంగీకరించింది. అమెరికా కంపెనీలు విదేశీ అధికారులకు లంచాలు ఇవ్వడం అక్కడి విదేశీ అవినీతి ప్రక్రియల చట్టం కింద నేరం. 'అంతర్జాతీయంగా వేగంగా విస్తరించడం ద్వారా వాల్‌మార్ట్ లాభాలను పొందింది. అయితే లంచాల విషయంలో సరైన చర్యలు తీసుకోలేకపోయింద'ని అసిస్టెంట్ అటార్నీ జనరల్ బ్రెయిన్ ఎ. బెన్‌కోవిస్కి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్ఈసీ ఛార్జీల కింద 144 మిలియన్ డాలర్లకు పైగా; డిపార్ట్‌మెంట్ ఆఫ్ జస్టిస్(డీఓజే) విధించిన క్రిమినల్ ఛార్జీల కింద 138 మిలియన్ డాలర్లను.. అంటే మొత్తం 282 మిలియన్ డాలర్లకు పైగా కట్టడానికి వాల్‌మార్ట్ అంగీకరించిందని ఎస్ఈసీ తెలిపింది.

### నేరం ఇలా బయట పడింది..

**మె**క్సికోలోని అధికారులకు వాల్‌మార్ట్ అనుమానాస్పద చెల్లింపులు చేసిందని ఏడేళ్ల కిందట న్యూయార్క్ టైమ్స్ ఒక కథనాన్ని ప్రచురించింది. ఆ విషయాలను కంపెనీ ప్రధాన కార్యాలయంలో తెలియకుండా వారు ప్రయత్నించారు. ఆ విషయం అక్కడకు వెళ్లినా.. అంతర్గత దర్యాప్తు వ్యవస్థను అనునయించగలిగారు. ఆ తర్వాతే డీఓజే, ఎస్ఈసీలు సంయుక్తంగా దర్యాప్తు చేపట్టాయి. సమస్య మూలాలను వెతికిపట్టుకోవడానికి కంపెనీ లాయర్లపై, దర్యాప్తు అధికార్లపై దాదాపు 900 మిలియన్ డాలర్లు ఖర్చుపెట్టింది. కాగా, ప్రభుత్వ ప్రాసిక్యూటర్లు, నియంత్రణాధికార సంస్థలు కోరిన 600 మిలియన్ డాలర్ల కంటే తక్కువ అపరాధ రుసుమును ఇపుడు వాల్‌మార్ట్ చెల్లించనుంది. ఒబామా ప్రభుత్వం చివరి రోజుల్లో సెటిల్‌మెంట్ ఒప్పందంపై చర్చలు జరిగినట్లు గత నవంబరులో 'ద టైమ్స్' వెల్లడించింది. అయితే ట్రంప్ గద్దెనెక్కాక తక్కువ అపరాధ రుసుము చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకోగలిగింది. జులై 2000 నుంచి ఏప్రిల్ 2011 వరకు వివిధ దేశాల ప్రభుత్వ అనుమతులు పొందడానికి మధ్యవర్తులకు మిలియన్ల కొద్దీ డాలర్లను చెల్లించినట్లు ఎస్ఈసీ తెలిపింది.

- అనుమతుల కోసం అడ్డదారులు
- మెక్సికో మొదలు భారత్ దాకా అదే విధానం
- 282 మిలియన్ డాలర్ల అపరాధ రుసుము
- కొరడా ఝుళిపించిన అమెరికా కోర్టులు
- అంగీకరించిన రిటైల్ దిగ్గజం

### పుస్తకాల్లో ఇలా చూపించారు..

**బ్రె**జిల్‌లో ప్రభుత్వ అనుమతులను చిటికెలో చేయించగల ఒక వ్యక్తి(జెనీ అని ముద్దు పేరు)కి చాలా చెల్లింపులు చేసినట్లు దర్యాప్తులో తేలింది. బిల్డింగ్ అనుమతుల ప్రక్రియను త్వరలో ముగించడానికి ఆ వ్యక్తికి దఫాకు 4 లక్షల డాలర్లు చెల్లించేవారట. ఆ వ్యక్తి ప్రభుత్వ ఉద్యోగి అన్న అనుమానాలున్నాయి. ఇక భారత్‌లో ఇలా చెల్లించే లంచాలకు 'వృత్తిపరమైన ఫీజులు'గా తన ఖాతాల్లో చూపేది. జులై 2011లో భారత్‌లో ఒక ఉద్యోగి ప్రభుత్వ అధికారులకు ఇలా లంచాలు ఇస్తున్నట్లు వాల్‌మార్ట్‌కు తెలిసినా.. ఎటువంటి చర్యలూ తీసుకోలేదు.

### చర్యలు తీసుకున్నాం: వాల్‌మార్ట్

**గ**త ఏడేళ్ల దర్యాప్తులో కంపెనీ అవినీతి వ్యతిరేక చర్యలను మెరుగుపరచామని.. ఆవిషయాన్ని ప్రభుత్వ నియంత్రణాధికారులు గుర్తించారని వాల్‌మార్ట్ పేర్కొంది. కార్యకలాపాలు నిర్వహిస్తున్న ప్రతి చోటా విలువలను పాటిస్తామని వాల్‌మార్ట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ డగ్ మెక్‌మిలన్ పేర్కొన్నారు. మరో పక్క, నవంబరు 2017లోనే ఎస్ఈసీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ జస్టిస్‌లకు అపరాధరుసుము కట్టడానికి 283 మిలియన్ డాలర్లను కేటాయించామని.. అందువల్ల ఈ ప్రభావం ఆర్థిక ఫలితాలపై పడదని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది.

## అయిదేళ్లపాటు ఆమోదం పొందని బిల్లులు మురిగిపోయినట్లే!

### రాజ్యసభ ఛైర్మన్ వెంకయ్యనాయుడి అభిప్రాయం

**దిల్లీ:** రాజ్యసభలో ఏదైనా బిల్లు అయిదేళ్ల పాటు ఆమోదం పొందకుండా ఉంటే అది మురిగిపోయినట్టుగా పరిగణించాలని ఛైర్మన్ ఎం. వెంకయ్య నాయుడు సూచించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రాజ్యసభలో మొత్తం 33 బిల్లులు పెండింగ్‌లో ఉండగా అందులో మూడు గత 20 ఏళ్లుగా ఆమోదం పొందలేదని తెలిపారు. భారత వైద్య మండలి (సవరణ బిల్లు)-1987 అయితే గత 32 ఏళ్లుగా పెండింగ్‌లో ఉందని చెప్పారు. మరో ఆరు బిల్లులు 10-20 ఏళ్లుగా, ఇంకో 14 బిల్లులు 5-10 ఏళ్లుగా ఆమోదానికి ఎదురు చూస్తున్నాయని చెప్పారు. రాజ్యాంగ నిబంధన ప్రకారం ఓ బిల్లు తొలుత లోక్‌సభ ఆమోదం పొంది.. అనంతరం రాజ్యసభ పరిశీలనలో ఉండి.. ఈ లోగా లోక్‌సభ రద్దయితే ఆ బిల్లు మురిగిపోతుంది. అదే రాజ్యసభలో ముందు ప్రవేశపెడితే లోక్‌సభ రద్దయినా దాన్ని పెండింగ్‌లో ఉన్నట్టు పరిగణిస్తారు. ఆ బిల్లుపై తర్వాతి లోక్‌సభ చర్చ జరపాల్సి ఉంటుంది. నిబంధనల్లో ఉన్న ఈ తేడాను తొలగించాలని, దీనిపై విస్తృతంగా చర్చ జరగాలని వెంకయ్య నాయుడు సూచించారు. సుదీర్ఘకాలంపాటు బిల్లులు ఆమోదం పొందకుండా ఉండడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని అన్నారు. ముమ్మారు తలాక్ బిల్లును గత లోక్‌సభ ఆమోదించినా, రాజ్యసభలో పరిశీలన దశలోనే ఉండిపోయింది. ఈ లోగా లోక్‌సభ పదవీ కాలం పూర్తవడంతో అది మురిగిపోయింది. దాంతో మళ్లీ లోక్‌సభలో ప్రవేశపెట్టాల్సి వచ్చింది.

## ఆపరేషన్ బందర్

### బాలాకోట్‌పై వైమానిక దాడులకు సంకేతనామం

**దిల్లీ:** పాకిస్థాన్‌లోని బాలాకోట్‌లో 'జైష్ ఎ మహ్మద్' ఉగ్రవాద సంస్థకు చెందిన స్థావరాలపై ఫిబ్రవరి 26న విరుచుకుపడిన భారత సైనిక దళాలు ఆ ఆపరేషన్‌కు సంకేతనామాలు వినియోగించాయి. వేకువజామున మిరాజ్ -2000 యుద్ధవిమానాలతో విరుచుకుపడిన భారత వైమానిక దళం (ఐఏఎఫ్) "ఆపరేషన్ బందర్(కోతి)" అని పేరు పెట్టింది. అదే సమయంలో పాకిస్థాన్ ఎలాంటి దుస్సాహసానికి ఒడిగట్టినా తిప్పికొట్టడానికిగాను సరిహద్దుల వెంబడి మన సైన్యం భద్రతను బలోపేతం చేసింది. అత్యున్నతమైన కార్యాచరణ అప్రమత్తతను ప్రకటించింది. దీనికి "ఆపరేషన్ జఫ్రాన్(కుంకుమ పువ్వు)" అనే సంకేతనామం పెట్టింది. భారతీయ నావికాదళం మాత్రం ఎలాంటి సంకేతనామం పెట్టలేదు. "ట్రోపెక్స్ 2019" పేరిట యుద్ధ నౌకలు, జలాంతర్గాములతో అప్పటికే ఉత్తర అరేబియా సముద్రంలో సైనిక విన్యాసాలు నిర్వహిస్తోంది. పాక్ ఎలాంటి దుస్సాహసానికి ఒడిగట్టినా దీటైన జవాబివ్వడానికి విన్యాసాలను పక్కనపెట్టి నౌకలను, జలాంతర్గాములను యుద్ధానికి సన్నద్ధం చేసింది.

## అమెరికాలో తుపాను బీభత్సం

- ఇద్దరి మృతి
- అనేక రాష్ట్రాల్లో నిలిచిపోయిన విద్యుత్ సరఫరా

**అట్లాంటా:** అమెరికాలోని దక్షిణాది రాష్ట్రాలను తుపాను కుదిపేస్తోంది. ఫలితంగా ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో లక్షల మంది ఇబ్బంది పడుతున్నారు. స్థానిక కాలమానం ప్రకారం బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకూ టెక్సాస్ నుంచి అలబామా వరకూ అనేక చోట్ల గాలుల తీవ్రతకు విద్యుత్ లైన్లపైన, భవనాలపై చెట్లు కూలిపడ్డాయి. గురువారం మధ్యాహ్నం నుంచి జార్జియా, ఉత్తర కరోలైనా, దక్షిణ కరోలైనా, వర్జీనియా రాష్ట్రాల్లోనూ అనేక చోట్ల ఇదే పరిస్థితి నెలకొంది. గంటకు 137 కిలోమీటర్ల వేగంతో వీచిన పెనుగాలుల వల్ల టెక్సాస్‌లోని గ్రీన్‌విల్ నగరంలో అనేక ఇళ్ల పైకప్పులు ఎగిరిపోయాయి. మిసోరీ నదీ పరివాహక ప్రాంతంలో వరద ముప్పు పొంచి ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఒహైయోలో భారీ వర్షాల వల్ల కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో హైవేలపై రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. వరదల వల్ల రైల్వే స్టేషన్లు జలమయమయ్యాయి. దీంతో ఫిలడెల్ఫియా, న్యూజెర్సీ మధ్య సర్వీసులు నిలిచిపోయాయి. డెలవేర్ నది అనేక చోట్ల కట్టలు తెంచుకొని ప్రవహిస్తోంది. దీంతో సమీపంలోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

## డీమ్డ్ వర్సిటీల్లో కౌన్సెలింగ్ గడువు పొడిగింపునకు సుప్రీంకోర్టు నిరాకరణ

**దిల్లీ:** డీమ్డ్ యూనివర్సిటీలు, ప్రైవేట్ కళాశాలల్లో ఖాళీగా మిగిలిపోయిన పీజీ వైద్య సీట్ల భర్తీ కోసం కౌన్సెలింగ్ గడువును పొడిగించేందుకు సుప్రీంకోర్టు శుక్రవారం నిరాకరించింది. సీట్లు ఖాళీగా ఉన్నాయనే కారణంతో గడువును పొడిగించడం, భర్తీకి మరింత అవకాశం కల్పించడం సమంజసం కాదని న్యాయస్థానం పేర్కొంది. గడువు పొడిగింపు కోరుతూ డీమ్డ్ వర్సిటీలు, ప్రైవేట్ కళాశాలలతో కూడిన ఎడ్యుకేషన్ ప్రమోషన్ సొసైటీ ఆఫ్ ఇండియా దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ దీపక్‌గుప్తా, జస్టిస్ సూర్యకాంత్‌లతో కూడిన ధర్మాసనం కొట్టివేసింది. షెడ్యూల్‌ను తప్పకుండా అనుసరించాల్సిందేనని పేర్కొంది. షెడ్యూల్‌ను కాదని అనుమతులు, పొడిగింపును ప్రసాదిస్తే వివాదాలకు తావిచ్చినట్లవుతుందని వ్యాఖ్యానించింది. డీమ్డ్‌వర్సిటీలు, ప్రైవేట్ కళాశాలల్లో 603 సీట్ల వరకూ ఖాళీగా మిగిలాయి.

## 'విశాఖపట్నం' యుద్ధనౌకలో అగ్నిప్రమాదం

**ముంబయి:** నిర్మాణంలో ఉన్న నౌకాదళ యుద్ధనౌకలో జరిగిన అగ్నిప్రమాదంలో ఒకరు మృతి చెందారు. ముంబయిలోని మజ్గావ్ డాక్‌యార్డ్‌లో నిర్మాణంలో ఉన్న 'విశాఖపట్నం' యుద్ధనౌకలో శుక్రవారం సాయంత్రం 5.44 గంటలకు అగ్నిప్రమాదం సంభవించిందని, నౌకలోని రెండో డెక్‌లో మంటలు చెలరేగాయని అగ్నిమాపక అధికారి రహంగ్డలే తెలిపారు. మంటలు.. రెండు, మూడో డెక్‌లకే పరిమితమయ్యాయని, నౌకలో పొగ వ్యాపించిందని చెప్పారు. ఈ దుర్ఘటనలో బజేంద్రకుమార్(23) అనే వ్యక్తి మరణించినట్లు అధికారులు తెలిపారు.

# ఇరాన్‌పైకి యుద్ధ విమానాలు

- దాడులకు సిద్ధపడిన అమెరికా
- తొలుత అనుమతించిన ట్రంప్
- 150 మంది మరణించే అవకాశం ఉందని తెలిసి ఉపసంహరణ



**వాషింగ్టన్:** అమెరికా-ఇరాన్ మధ్య క్రమంగా ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. ఇరాన్‌పై అమెరికా క్షిపణి దాడులకు సిద్ధపడి చివరిక్షణంలో నిర్ణయాన్ని ఉపసంహరించుకుంది. ఆకాశంలోకి దూసుకెళ్లిన యుద్ధ విమానాలు.. ట్రంప్ ఇప్పుడు వద్దులే అనడంతో వెనక్కు తిరిగి వచ్చాయి. ఇరాన్ అణు కార్యకలాపాలను కట్టడి చేయడానికి ఉద్దేశించిన ఒప్పందం నుంచి అమెరికా ఏకపక్షంగా వైదొలిగిన నాటి నుంచి రెండు దేశాల మధ్య సంబంధాలు క్షీణిస్తూ వచ్చాయి. ఇటీవల ఉద్రిక్తతలు భగ్గుమన్నాయి. గల్ఫ్ ప్రాంతంలో రెండు చమురు ట్యాంకర్లపై దాడి జరిగింది. దీనికి ఇరానే కారణమంటూ అమెరికా ఆరోపించింది. ఇలాంటి పరిస్థితుల నడుమ అమెరికా నౌకాదళానికి చెందిన ఆర్‌క్యూ-4 గ్లోబల్ హాక్ డ్రోన్‌ను ఇరాన్‌కు చెందిన రివల్యూషనరీ గార్డ్ దళం ఒక క్షిపణితో గురువారం కూల్చివేసింది. సదరు లోహ విహంగం తమ గగనతలంలోకి చొరబడిందని ఇరాన్ ఆరోపిస్తోంది. ఈ వాదనను అమెరికా ఖండించింది. కూల్చివేత సమయానికి తమ డ్రోన్ ఇరాన్‌కు 34 కిలోమీటర్ల దూరంలో ఉందని తెలిపింది. ఇది చాలా ఖరీదైన డ్రోన్. ఒక్కోటి 12 కోట్ల డాలర్లు పలుకుతోంది. డ్రోన్‌ను కూల్చివేసి ఇరాన్ చాలా తప్పు చేసిందని ట్రంప్ అదే రోజు వ్యాఖ్యానించారు.

ఈ నేపథ్యంలో ఇరాన్‌పై క్షిపణితో దాడి చేయాలని అమెరికా నిర్ణయించిందని, ఆ తర్వాత దాన్ని విరమించుకుందని 'ద న్యూయార్క్ టైమ్స్' పత్రిక పేర్కొంది. ట్రంప్ కూడా ఈ కథనాన్ని ధ్రువీకరించారు. "దాడికి పది నిమిషాల ముందు ఆ ప్రయత్నాన్ని నిలిపివేశాను. ఆ దాడి వల్ల ఎంత మంది చనిపోతారని అడిగా. 150 మంది ప్రాణాలు కోల్పోతారని ఓ జనరల్ నాకు చెప్పారు. మానవరహిత డ్రోన్ కూల్చివేతకు ఇంత తీవ్ర ప్రతిచర్య తగదన్న ఉద్దేశంతో దాడిని ఆపించా. నేనేమీ హడావుడి పడటంలేదు. మా సైన్యం పునరుత్తేజం పొంది ఉంది. దాడికి సర్వ సన్నద్ధంగా ఉంది" అని పేర్కొన్నారు. ఆ దేశంపై ఆర్థిక ఆంక్షలను పెంచుతున్నట్లు తెలిపారు.

'ద న్యూయార్క్ టైమ్స్' కథనం ప్రకారం.. ఇరాన్‌లోని మూడు ప్రదేశాలపై దాడికి వ్యూహరచన జరిగింది. స్థానిక కాలమానం ప్రకారం గురువారం రాత్రి 7 గంటల సమయంలో నిర్దేశిత లక్ష్యాలపై దాడులు జరుగుతాయని అమెరికా సైనిక, దౌత్య వర్గాలు భావించాయి. ఇరాన్‌కు చెందిన రాడార్ కేంద్రాలు, క్షిపణి విభాగాలపై పరిమిత స్థాయిలో విరుచుకుపడాలనుకున్నట్లు అమెరికా ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. 'యుద్ధ విమానాలు గాల్లోకి లేచాయి. యుద్ధనౌకలు నిర్దిష్ట ప్రదేశానికి చేరుకున్నాయి. ఇంతలోకి 'ఆపేయండి' అంటూ ఆదేశాలు రావడంతో క్షిపణి ప్రయోగాలు జరగలేదు." అని ఆ అధికారి తెలిపారు.

### విమాన సర్వీసులపై ప్రభావం

**తాజా** ఉద్రిక్తతల ప్రభావం విమాన సర్వీసులపై పడింది. ఈ క్రమంలో హోర్ముజ్ జలసంధి మీదుగా వెళ్లే విమానాలను శుక్రవారం పలు విమానయాన సంస్థలు రద్దు చేశాయి. ఇందులో బ్రిటిష్ ఎయిర్‌వేస్, క్వాంటాస్, సింగపూర్ ఎయిర్‌లైన్స్ వంటివి ఉన్నాయి. అమెరికాలో రిజిస్టరైన విమానాలు పర్షియన్ గల్ఫ్, గల్ఫ్ ఆఫ్ ఒమన్ మీదుగా కార్యకలాపాలు సాగించడాన్ని నిషేధిస్తూ అమెరికా ఎఫ్ఏఏ నోటీసు జారీ చేసిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. జర్మనీకి చెందిన లుఫ్తాన్సా, డచ్ సంస్థ కేఎల్ఎం కూడా ఇదే తరహా నిర్ణయాల్ని తీసుకున్నాయి. అమెరికాకు చెందిన యునైటెడ్ ఎయిర్‌లైన్స్ న్యూయార్క్ నుంచి ముంబయికి విమాన సర్వీసులను రద్దు చేసింది.

### *చమురు ట్యాంకర్లకు భారత నౌకాదళ రక్షణ*

అమెరికా, ఇరాన్ మధ్య సైనిక ఘర్షణకు అవకాశమున్న నేపథ్యంలో పర్షియన్ గల్ఫ్ ప్రాంతం గుండా ప్రయాణించే భారత చమురు ట్యాంకర్లకు రక్షణ కల్పించాలని మన నౌకాదళం నిర్ణయించింది. ఈ మేరకు ఆ నౌకల్లో నేవీ అధికారులు, సిబ్బంది మోహరిస్తారు.



ఇరాన్ కూల్చివేసిన అమెరికా డ్రోన్ శకలం

### ఉల్లంఘనపై ఆధారాలు: ఇరాన్

**అ**మెరికా డ్రోన్ తమ గగనతలాన్ని ఉల్లంఘించినట్లు తిరుగులేని ఆధారాలు ఉన్నాయని ఇరాన్ శుక్రవారం ప్రకటించింది. ఆ లోహ విహంగంపైకి క్షిపణిని ప్రయోగించడానికి ముందు పదేపదే హెచ్చరికలు జారీ చేశామని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ అధిపతి జనరల్ అమీర్ అలీ హాజీజాదే పేర్కొన్నారు. తమ సరిహద్దులను ఎట్టి పరిస్థితుల్లోనూ రక్షించుకుంటామని ఇరాన్ ప్రభుత్వం స్పష్టం చేసింది.

## యోగాపై రాహుల్‌గాంధీ ట్వీట్ వివాదాస్పదం

**దిల్లీ:** ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధాని మోదీ ప్రభుత్వాన్ని ఉద్దేశిస్తూ రాహుల్‌గాంధీ శుక్రవారం ట్వీట్ చేసిన ఫొటోలు వివాదాస్పదమయ్యాయి. ఆర్మీ శునకాల యూనిట్, వాటి శిక్షకులు యోగాసనాలు వేస్తున్న ఫొటోలను ట్వీట్ చేసిన ఆయన.. "కొత్త భారతదేశం" అని శీర్షిక పెట్టారు. సైనికదళాలను రాహుల్‌గాంధీ అవమానించారని, యోగా దినోత్సవాన్ని ఎద్దేవా చేశారని అమిత్‌షా ఆరోపించారు. ఈ ఫొటోలపై పలువురు నెటిజన్లూ అభ్యంతరాలు వ్యక్తం చేశారు.

### *'అలాంటి వారికి యోగాతో ఉపయోగం'*

**తిరువనంతపురం:** రాష్ట్రపతి ప్రసంగం సందర్భంగా సెల్‌ఫోన్ చూసిన రాహుల్‌గాంధీ వైఖరిని భాజపా జాతీయ ప్రధాన కార్యదర్శి రాంమాధవ్ విమర్శించారు. చిన్నపిల్లల స్వభావం ఉన్నవారికి యోగా ఎంతో మంచిదని సలహా ఇచ్చారు. "తరగతి గదిలో ఉపాధ్యాయుడు పాఠాలు బోధిస్తున్నప్పుడు ధ్యాస పెట్టడం కష్టమవుతూ ఉంటుంది. మీరేం ఆందోళన పడకండి. పాఠశాలలోనే కాదు, పార్లమెంటులోనూ చిన్నపిల్లలు ఉన్నారు. రాష్ట్రపతి ప్రసంగిస్తుంటే సందేశాలు, వీడియోలు చూస్తుంటారు" అని ఎద్దేవా చేశారు.

# ఇక ఆదాయపు పన్ను సంస్కరణలు

- కసరత్తు చేస్తున్న మోదీ సర్కారు

**ఈనాడు, దిల్లీ:** ఆదాయపు పన్ను వంటి ప్రత్యక్ష పన్నుల విధానంలో సంస్కరణలు తీసుకురావడంపై మోదీ ప్రభుత్వం దృష్టి సారించింది. వస్తు-సేవల పన్ను (జీఎస్టీ) రూపంలో పరోక్ష పన్నుల్లో మార్పులు తీసుకొచ్చినందున దానికి కొనసాగింపుగా ప్రత్యక్ష పన్నులనూ ప్రక్షాళన చేయనుంది. ఆదాయపు పన్ను చట్టంలో మార్పులు చేయడంపై ఇప్పటికే కసరత్తు ప్రారంభమయింది. జులై అయిదో తేదీన ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఈ విషయాన్ని ప్రస్తావించే అవకాశం ఉంది. ఆదాయపు పన్నులో సంస్కరణలు తీసుకొచ్చే అంశంపై సూచనలు ఇచ్చేందుకు 2017 నవంబరులోనే కార్యాచరణ బృందం ఏర్పాటయింది. దేశ ఆర్థిక అవసరాలు, అంతర్జాతీయ పద్ధతులను పరిగణనలోకి తీసుకొని ఆదాయపు పన్ను చట్టంలో తగిన సవరణలు చేయడానికి ఈ బృందం సూచనలు ఇవ్వాల్సి ఉంది. ఇది జులై 31న తుది నివేదిక సమర్పించే అవకాశం ఉంది. దీనిపై అన్ని రాజకీయ పార్టీలు, వివిధ భాగస్వాములతో చర్చించిన తరువాత తుది నిర్ణయం తీసుకుంటారు. చట్టంలో మార్పులు చేసే ప్రక్రియ ఈ ఏడాది చివర్లో ప్రారంభమవుతుంది.

### పన్ను పరిమితి పెంపు?

రానున్న బడ్జెట్‌లో ఆదాయపు పన్ను పరిమితిని పెంచే అవకాశాలు ఉన్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం వార్షికాదాయం రూ.2.5 లక్షల వరకు ఎలాంటి పన్నూ లేదు. ఈ పరిమితిని రూ.3 లక్షల వరకు పెంచే అవకాశం ఉంది. ప్రతి పన్ను చెల్లింపుదారుకూ కనీసం రూ.2,500 మిగిలేలా రాయితీలు ఉంటాయని ఓ అధికారి తెలిపారు.

## నీతిఆయోగ్ మాజీ సీఈవో ప్రాసిక్యూషన్‌కు అనుమతి కోరిన సీవీసీ

**దిల్లీ:** అవినీతి వ్యవహారానికి సంబంధించిన ఓ కేసులో కొందరు ప్రస్తుత, విశ్రాంత ఉన్నతాధికారులను ప్రాసిక్యూట్ చేసేందుకు కేంద్ర విజిలెన్స్ కమిషన్ (సీవీసీ).. ఆర్థిక, సిబ్బంది వ్యవహారాల మంత్రిత్వశాఖల అనుమతి కోరింది. ఐఎన్ఎక్స్ మీడియా ప్రమేయం ఉన్న ఈ కేసులో నీతి ఆయోగ్ మాజీ సీఈవో సింధుశ్రీ ఖుల్లార్; సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మాజీ కార్యదర్శి అనూప్ కె.పూజారీ; హిమాచల్‌ప్రదేశ్ ముఖ్య కార్యదర్శి ప్రబోధ్ సక్సేనా; ఆర్థిక వ్యవహారాల విభాగం మాజీ అండర్ సెక్రటరీ రవీంద్ర ప్రసాద్‌లను ప్రాసిక్యూట్ చేయడానికి అనుమతి కోరినట్లు అధికారులు తెలిపారు. ఐఎన్ఎక్స్ మీడియా రూ.305 కోట్ల విదేశీ నిధులు తీసుకునేందుకు విదేశీ పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు అనుమతించిన వ్యవహారంలో అక్రమాలు జరిగినట్లు గతంలో ఈ కేసు నమోదైంది. ఇప్పటికే సీబీఐ, ఈడీలు దర్యాప్తు చేస్తున్నాయి.

## ఐర్లాండ్‌లో భారతీయ కుటుంబంపై జాతి వివక్ష వ్యాఖ్యలు

**లండన్:** ఐర్లాండ్‌కు మూడురోజుల విహారయాత్ర నిమిత్తం వెళ్లిన ఓ భారతీయ కుటుంబం జాతివివక్షకు సంబంధించిన వేధింపులకు గురైంది. ప్రసూన్ భట్టాచార్జీ ఆయన తల్లిదండ్రులు ఓ స్థానిక రైలులో బెల్‌ఫాస్ట్ నుంచి డబ్లిన్ వెళుతుండగా... తోటి ప్రయాణికుడొకరు శరీరం రంగు, భాషయాసపై వ్యాఖ్యలు చేస్తూ వేధించినట్లు 'ఐరిష్ టైమ్స్' పేర్కొంది.

# లోక్‌సభలో తొలి బిల్లు తలాక్‌పైనే

- ప్రవేశపెట్టిన న్యాయమంత్రి
- వ్యతిరేకించిన విపక్షాలు

దిల్లీ

**ము**మ్మారు తలాక్‌ను నిషేధం బిల్లును ప్రవేశపెట్టడం ద్వారా నూతన లోక్‌సభ శుక్రవారం చట్టాలను రూపొందించే కార్యక్రమాన్ని ప్రారంభించింది. ప్రతిపక్షాల తీవ్ర అభ్యంతరాల నడుమ దీనిపై చర్చ ఆరంభమయింది. తలాక్‌పై గత లోక్‌సభలో పెట్టిన బిల్లు మురిగిపోవడంతో న్యాయ శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ తాజాగా ఈ బిల్లును ప్రవేశపెట్టారు. ముస్లిం మహిళల (వివాహ హక్కుల పరిరక్షణ) బిల్లు-2019 పేరుతో దీన్ని సభ ముందు ఉంచారు. ప్రస్తుతం అమల్లో ఉన్న అత్యవసర ఆదేశాల్లో (ఆర్డినెన్స్)ని అంశాలనే ఇందులో పొందుపరిచారు. ఈ బిల్లును ప్రవేశపెట్టాలా వద్దా అన్నదానిపై తొలుత ఓటింగ్ జరగాలని ఎంఐఎం సభ్యుడు అసదుద్దీన్ ఒవైసీ పట్టుపట్టారు. ఓటింగ్ జరగగా బిల్లు ప్రవేశపెట్టాలని 186 మంది, వద్దని 74 మంది అభిప్రాయపడ్డారు. మంత్రి రవిశంకర్ ప్రసాద్ మాట్లాడుతూ ఈ బిల్లు మతానికి సంబంధించినది కాదని, మహిళలకు న్యాయం చేయడం కోసం ఉద్దేశించిందని తెలిపారు.

### *ఒకే తరహా చట్టం ఉండాలి*

కాంగ్రెస్ సభ్యుడు శశి థరూర్ మాట్లాడుతూ తాను ముమ్మారు తలాక్ విధానాన్ని వ్యతిరేకిస్తానని, కానీ ఈ బిల్లును సమర్థించబోనని చెప్పారు. ఈ బిల్లులో సివిల్, క్రిమినల్ శిక్షలు రెండూ ఉన్నాయని, అలా ఉండడం పద్ధతి కాదని అన్నారు. భార్యలను విడిచిపెట్టడం అన్ని మతాల్లోనూ ఉందని, కానీ ఒక్క ముస్లింల కోసమే చట్టం తీసుకురావడం తగదని శశిథరూర్ పేర్కొన్నారు. భార్యలను విడిచిపెట్టే వారిపై చర్యలు తీసుకునే విషయంలో అందరికీ ఒకే తరహా చట్టం ఉండాలని ఆయన సూచించారు. ఒవైసీ మాట్లాడుతూ ముస్లిం మహిళలపై భారతీయ జనతా పార్టీ అభిమానం చూపిస్తోందని, కానీ శబరిమల ఆలయానికి హిందూ మహిళలు వెళ్లేందుకు అనుమతించడం లేదని ఆరోపించారు. తలాక్ చెప్పే ముస్లిం పురుషులకు మూడేళ్ల జైలు శిక్ష విధిస్తుండగా, ఇలాంటి నేరం చేసే ఇతర మతాలవారికి ఏడాది శిక్షతో సరిపెడుతోందని విమర్శించారు. ఆర్ఎస్పీ సభ్యుడు ఎన్.కె.ప్రేమచంద్రన్ కూడా ఈ బిల్లును వ్యతిరేకించారు.

### *హోమియోపతి మండలి బిల్లు ప్రతిపాదన*

హోమియోపతి కేంద్ర మండలి (సవరణ) బిల్లు-2019ను ఆయుష్ శాఖ మంత్రి శ్రీపాద యశో నాయక్ తరఫున ఆరోగ్యశాఖ మంత్రి హర్షవర్ధన్ లోక్‌సభలో ప్రవేశపెట్టారు. హోమియోపతి మండలి పునర్వ్యవస్థీకరణ గడువును ఏడాది నుంచి రెండేళ్లకు పెంచాలని ఇందులో ప్రతిపాదించారు.

### మీలో మీరు మాట్లాడుకోవద్దు

**కేం**ద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్ ప్రసంగిస్తున్న సమయంలో కాంగ్రెస్ సభ్యులు ఒకరితో మరొకరు మాట్లాడుతుండడాన్ని గమనించిన స్పీకర్ ఓం బిర్లా అలా చేయవద్దని సూచించారు. అయితే వారు పట్టించుకోకపోవడంతో తొలుత శశి థరూర్, ఆ తరువాత అధీర్ రంజన్ చౌధరి పేర్లను ప్రస్తావించి మీలో మీరు మాట్లాడుకోవడాన్ని ఆపాలని అన్నారు. ఇందుకు ప్రతిపక్ష సభ్యులు అభ్యంతరం తెలిపి 'ఇదేమీ ప్రాథమిక పాఠశాల' కాదు అని వ్యాఖ్యానించారు. 'మేమూ ఎన్నికయిన సభ్యులమే' అని అన్నారు.

### చెట్ల పెంపకంపై తొలి ప్రశ్న

**ప్ర**స్తుత లోక్‌సభలో తొలి ప్రశ్న అడిగే అవకాశం ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన భాజపా ఎంపీ కౌశల్ కిశోర్‌కు లభించింది. ఆయన చెట్ల పెంపకంపై ప్రశ్న వేశారు. అయితే ఆయన ప్రధాని, ఇతర మంత్రులను పొగడడం ప్రారంభించడంతో సంక్షిప్తంగా ప్రశ్న అడగాలని స్పీకర్ బిర్లా ఆయనకు సూచించారు. తరువాత అజయ్ మిశ్ర తేని దాదాపుగా ఇదే అంశంపై ప్రశ్న వేశారు. ఉపన్యాసం మాదిరిగా చాలా విషయాలను చెప్పడంతో సూటిగా ప్రశ్న అడగాలని స్పీకర్ సూచించారు.

## మన్మోహన్ సేవలను ప్రశంసించిన రాజ్యసభ



**దిల్లీ:** మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ సేవలను రాజ్యసభ ప్రశంసించింది. శుక్రవారం రాజ్యసభ సమావేశాల తొలి రోజున ఛైర్మన్ వెంకయ్య నాయుడు మాట్లాడుతూ ప్రముఖ పార్లమెంటేరియన్, విశిష్ట ఆర్థిక శాస్త్రవేత్త అయిన మన్మోహన్ సభ గౌరవాన్ని పెంచారని కొనియాడారు. 1991 నుంచి 2019 వరకు వరుసగా అయిదు దఫాలు ఆయన రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికయ్యారు. వరుసగా రెండుసార్లు ప్రధానిగా పనిచేశారు. ఈ నెల 15న మన్మోహన్ రాజ్యసభ పదవీకాలం ముగిసింది.

### *ఇక సహకార వ్యవసాయం..*

దేశంలో రైతులు బృందాలుగా ఏర్పడి ఇక సహకార వ్యవసాయాన్ని చేసుకోవచ్చని కేంద్ర ప్రభుత్వం శుక్రవారం రాజ్యసభకు తెలిపింది. ఈ తరహా సాగును ప్రోత్సహించేందుకు చట్టం చేసి. . రాష్ట్రాలకు పంపించినట్లు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ సహాయ మంత్రి పురుషోత్తమ్ రూపాలా తెలిపారు. ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడుతూ కొత్త చట్టం ప్రకారం రైతులు కలిసికట్టుగా ఎంఓయూలు కుదుర్చుకుని వ్యవసాయ ఉత్పాదక సంస్థల(ఎఫ్‌పీఓ)ను ఏర్పాటు చేసుకోవచ్చని వివరించారు.

## పంత్‌కు న్యాయం జరిగింది

జాక్వెస్ కలిస్

**న్యూ**జిలాండ్ చేతిలో ఓటమి దక్షిణాఫ్రికా మద్దతుదారులకు తీవ్ర నిరాశ కలిగించి ఉండొచ్చు. కానీ ఆటలో గెలుపోటములు సహజమే అనే విషయం గుర్తుంచుకోవాలి. గతంలో దక్షిణాఫ్రికా జట్టు గొప్ప విజయాలు సాధించింది. వాటితో పాటు కొన్ని ఓటములు కూడా ఉన్నాయి. ప్రపంచకప్‌లో మా జట్టుకు ఎప్పుడూ నిరాశ ఎదురవుతూనే ఉంది. కానీ మాకు సమయం వస్తుంది. భవిష్యత్ తరాలు ప్రపంచకప్‌లో అద్భుత ప్రదర్శన చేస్తాయి. కివీస్‌తో మ్యాచ్‌లో ఓ దశలో దక్షిణాఫ్రికాకు పైచేయి సాధించే అవకాశం వచ్చింది. కానీ ఓ క్యాచ్, రనౌట్ అవకాశాన్ని వదులుకోవడం, కేన్ విలియమ్సన్ వికెట్ కోసం సమీక్ష కోరకపోవడం దెబ్బతీసింది. తాహిర్ బౌలింగ్‌లో విలియమ్సన్ బ్యాట్‌ను ముద్దాడిన బంతి వికెట్‌కీపర్ చేతుల్లో పడింది. ఏదైతేనేం.. మ్యాచ్‌లో జట్టు ప్రదర్శన సరిపోలేదు. అత్యుత్తమంగా రాణించిన నాలుగు జట్లే సెమీస్ చేరతాయి. ఒకవేళ టీమ్‌ఇండియా, ఇంగ్లాండ్ సెమీస్‌లో ఎదురుకాకపోతే అవి ఏయే జట్లతో తలపడతాయోనని ఆసక్తిగా ఉంది. కోహ్లి సేన అద్భుతంగా ఆడుతోంది. కీలక మ్యాచ్‌ల్లో రోహిత్ ఎప్పుడూ చెలరేగుతాడు. గాయం కారణంగా ధావన్ ప్రపంచకప్‌కు దూరం కావడం దురదృష్టకరం. మరోవైపు పంత్‌కు న్యాయం జరిగిందనే చెప్పాలి. ఎందుకంటే అతనికి ఎంతో నైపుణ్యం ఉంది. పెద్ద టోర్నీల్లో నిరూపించుకొనే అవకాశం అతనికి ఇవ్వాలి. కనీసం రెండు విజయాలైనా సాధిస్తుందనుకున్న అఫ్గాన్ జట్టు నిరాశపరుస్తోంది.






## చాంపియన్స్

### ప్రణతికి కాంస్యం



**దిల్లీ:** సీనియర్ ఆసియా ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్ (మంగోలియా) ఛాంపియన్‌షిప్‌లో ప్రణతి నాయక్ కాంస్యం గెలుచుకుంది. అర్హత పోటీల్లో ఆరో స్థానంలో నిలిచి వాల్ట్ ఫైనల్‌కు వచ్చిన ప్రణతి.. 13.384 స్కోరుతో మూడో స్థానాన్ని సాధించింది. యు లిమిన్ (చైనా, 14.350) స్వర్ణం, సకాగూచి (జపాన్, 13.584) రజతం నెగ్గారు.

## తొలి కూత హైదరాబాద్‌లో

### పీకేఎల్- 7 తొలి మ్యాచ్‌లో టైటాన్స్ × ముంబా

**ముంబయి:** ప్రొ కబడ్డీ లీగ్ ఏడో సీజన్ హైదరాబాద్‌లో షురూ కానుంది. వచ్చే నెల 20న మ్యాచ్‌లు మొదలుకానున్నాయి. తొలి మ్యాచ్‌లో యు ముంబాతో తెలుగు టైటాన్స్ తలపడనుంది. మొత్తం 12 జట్లు పోటీపడే ఈ లీగ్‌లో తొలి ఆరు స్థానాల్లో నిలిచిన జట్లు ప్లేఆఫ్ చేరతాయి. ఫైనల్ అక్టోబర్ 19న జరగనుంది.

### ఆసియా స్నూకర్ ఛాంప్ పంకజ్ అడ్వాణీ

**దిల్లీ:** భారత స్టార్ క్యూయిస్ట్ పంకజ్ అడ్వాణీ ఆసియా స్నూకర్ ఛాంపియన్‌షిప్ విజేతగా నిలిచాడు. ఫైనల్లో అడ్వాణీ 6-3తో థన్వాత్ తిరపొంగ్‌ప్యాయ్‌బూన్‌పై విజయం సాధించాడు.






## టీమ్‌ఇండియానే అత్యుత్తమం

జెఫ్ థాంప్సన్

**ప్ర**స్తుత టీమ్‌ఇండియా 2003 ప్రపంచకప్ విజేత ఆస్ట్రేలియాను తలపిస్తోంది. ప్రతి ఒక్కరికీ ప్రత్యామ్నాయం ఉండగా.. ఏ ఆటగాడినీ వద్దనుకునే పరిస్థితి లేదు. అప్పట్లో పాంటింగ్ పఠించిన మంత్రమిదే. పటిష్టమైన రిజర్వ్ బెంచ్ కలిగిన భారత్ లక్ష్యాన్ని చేరుకోవచ్చు. అఫ్గానిస్థాన్‌తో పోరు కోహ్లి సేనకు నల్లేరుపై నడకే. పాకిస్థాన్‌తో మ్యాచ్‌కు ధావన్ దూరమైనప్పుడు ఆందోళన చెందారు. రాహుల్ ప్రదర్శన తర్వాత ఓపెనింగ్‌పై నెలకొన్న సందేహాలన్నీ పటాపంచలయ్యాయి. క్రికెట్ ప్రమాణాల ప్రకారం ప్రపంచకప్‌లో మిగతా జట్ల కంటే టీమ్‌ఇండియానే అత్యుత్తమం. ధావన్ స్థానంలో వచ్చిన రిషబ్ పంత్ అద్భుతమైన బ్యాట్స్‌మన్. మొదట్నుంచీ జట్టులో ఉండాల్సిన ఆటగాడు. జాదవ్ లేదా విజయ్ శంకర్ స్థానంలో పంత్.. భువనేశ్వర్ స్థానంలో షమి తుదిజట్టులోకి రావడం ఖాయం. వెస్టిండీస్, ఇంగ్లాండ్‌లతో మ్యాచ్‌ల నేపథ్యంలో మ్యాచ్ ఫిట్‌నెస్ కోసం పంత్‌ను తప్పక ఆడిస్తారు.

## అగ్రస్థానంపై భారత్ కన్ను

హర్ష భోగ్లే

**ప్ర**పంచకప్‌లో ఒకరోజు ముందే 2 పాయింట్లు పోయినట్లేనని అనుకునే పరిస్థితి ఉండొద్దు. ఇప్పుడు అఫ్గానిస్థాన్‌ది అదే పరిస్థితి. టీమ్‌ఇండియా అత్యంత దుర్భేద్యంగా ఉండటమే ఇందుకు కారణం. అఫ్గాన్ క్రికెట్‌కు నేను వీరాభిమానిని. వాళ్లక్కడ ఆనందంగా ఉన్నారో లేదో తెలియదు. గతంలో అఫ్గాన్ ఆస్వాదించిన ఆట ఇది కాదు. ఇంతకుముందు క్రికెట్ అంటే అఫ్గాన్‌కు సంబరం. ఇప్పుడు భారంగా తయారైంది. త్వరలోనే ఆ భావన పోతుంది. మిడిలార్డర్‌లో ఇప్పటిదాకా ఎక్కువ అవకాశాలు రాని వాళ్లకు చాన్స్ ఇవ్వడం ముఖ్యం. కేదార్ జాదవ్, విజయ్ శంకర్‌లు పరుగులు రాబడుతుంటే చూడాలని ఉంది. ధోని కూడా. అఫ్గాన్ స్పిన్నర్ల నుంచి సవాల్ ఎదురవ్వొచ్చు. అలాంటి బౌలర్లపై పరుగులు సాధిస్తే గొప్పగా అనిపిస్తుంది. షమి మంచి స్పెల్స్ వేయాలని కోరుకుంటున్నా. తొలి మ్యాచ్ నుంచే అతడు ఆడతాడని అనుకున్నా. కానీ భువనేశ్వర్ అద్భుతంగా బౌలింగ్ చేశాడు. ఇప్పుడు షమి వంతు. భువి రాకతో షమి మళ్లీ రిజర్వ్ బెంచ్‌కు వెళ్లినా భారత బౌలింగ్ పటిష్టంగా తయారవుతుంది. నాకౌట్‌కు అర్హత నుంచి పాయింట్ల పట్టికలో అగ్రస్థానంవైపు టీమ్‌ఇండియా దృష్టి మళ్లింది. సంకేతాలు సానుకూలంగానే ఉన్నాయి. ప్రత్యర్థులపై టీమ్‌ఇండియా సాధికార విజయాలు సాధించింది. సౌథాంప్టన్‌లో ఎండ కాస్తుంది. వికెట్‌పై తేమ ఉండకపోవచ్చు.




## యోగానుయోధులు


రాంచీలోని ప్రభాత్ తారా మైదానంలో శుక్రవారం యోగాసనాలు వేస్తున్న ప్రధాని మోదీ


ముంబయిలో ఐఎన్ఎస్ విరాట్ విమాన వాహక నౌకపై ఆసనాలు వేస్తున్న నౌకాదళ అధికారులు, క్యాడెట్లు


హిమాలయ పర్వత శ్రేణుల్లో యోగా చేస్తున్న భారత సైనిక సిబ్బంది


లండన్‌లోని ప్రఖ్యాత 'లండన్ ఐ'పై యోగా చేస్తున్న ఔత్సాహికులు

# యోగమేవ జయతే

- జీవితంలో యోగాను అంతర్భాగం చేద్దాం
- ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు
- ప్రపంచవ్యాప్తంగా ఘనంగా యోగా దినోత్సవం

దిల్లీ/రాంచీ

ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ నుంచి భారత పార్లమెంటు వరకు, బీజింగ్ నుంచి రాంచీ వరకు మైదానాలు, పార్కులతో పాటు హిమాలయాల శిఖరాలు.. సముద్రపు అలలు కూడా యోగ వేడుకలకు వేదికలయ్యాయి. దేశాధినేతలు మొదలు సామాన్య ప్రజల వరకు లక్షల మంది యోగాసనాలు వేశారు. వివిధ దేశాల రాజధానులు మొదలు నగరాలు, పట్టణాలు, మారుమూల గ్రామాల్లోనూ శుక్రవారం ఐదో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మనదేశంలో ప్రధాన కార్యక్రమం ఝార్ఖండ్ రాజధాని రాంచీలోని ప్రభాత్ తారా మైదానంలో ఉత్సాహ భరితంగా జరిగింది. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వం వహించిన ఈ కార్యక్రమంలో 40 వేల మంది పాల్గొన్నారు. దైనందిన జీవితంలో యోగాను అంతర్భాగం చేసుకోవాలని ప్రజలకు ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. యోగాను నగరాల నుంచి గిరిజనులు నివసించే మారుమూల తండాల వరకూ తీసుకెళ్లేందుకు కృషి చేయాలన్నారు. కులాలు, మతాలు, విశ్వాసాలు, స్త్రీపురుష తారతమ్యాలకు యోగా అతీతమైందని, అందరూ సాధన చేసి సంపూర్ణ ఆరోగ్యవంతులు కావాలని ఆకాంక్షించారు. యోగా దినోత్సవంలో పాల్గొన్న వివిధ దేశాల నేతలకు ప్రధాని మోదీ కృతజ్ఞతలు తెలిపారు. దక్షిణ కొరియా అధ్యక్షుడు మూన్ జే ఇన్, శ్రీలంక అధ్యక్షుడు మైత్రిపాల సిరిసేన, నేపాల్ ప్రధాని కె.పి.శర్మ ఓలిల సందేశాలకు ట్విటర్ ద్వారా ప్రతిస్పందించారు. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమానికి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ హాజరయ్యారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా హరియాణాలోని రోహ్‌తక్‌లో, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ దిల్లీలోని రాజ్‌పథ్‌లో, భాజపా కార్యనిర్వాహక అధ్యక్షుడు జె.పి.నడ్డా దీన్ దయాల్ ఉపాధ్యాయ మార్గ్‌లోని పార్టీ ప్రధాన కార్యాలయం ఎదురుగా ఉన్న పార్కులో, రవాణా మంత్రి నితిన్ గడ్కరీ నాగ్‌పుర్‌లో నిర్వహించిన యోగా వేడుకల్లో భాగస్వాములయ్యారు. విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్.జయ్‌శంకర్ దిల్లీలోని ప్రవాసి భారతీయ కేంద్రంలో వివిధ దేశాలకు చెందిన రాయబారులు, దౌత్య అధికారులతో కలిసి యోగాసనాలు వేశారు. పార్లమెంట్ భవనంలో నిర్వహించిన వేడుకకు లోక్‌సభ సభాపతి ఓం బిర్లా నేతృత్వం వహించారు. బిహార్ రాజధాని పట్నాలో గవర్నర్ లాల్జీ టండన్ నేతృత్వంలో జరిగిన కార్యక్రమానికి ఆ రాష్ట్ర సీఎం, జేడీయూ అధ్యక్షుడు నీతీశ్ కుమార్ ఎప్పటిమాదిరిగానే గైర్హాజరయ్యారు.

### యూఎన్ జనరల్ అసెంబ్లీ హాలులో

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఐక్యరాజ్యసమితిలో ఘనంగా నిర్వహించారు. సమితి అధికారులు, వివిధ దేశాల దౌత్యాధికారులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. యూఎన్ డిప్యూటీ సెక్రెటరీ జనరల్ అమినా మహమ్మద్ యోగా విశిష్టతను వివరించారు. జనరల్ అసెంబ్లీ హాలు లోపల యోగా దినోత్సవాన్ని నిర్వహించటం ఇదే ప్రథమం. విదేశాల్లోని భారత రాయబారులు, దౌత్యాధికారుల ఆధ్వర్యంలో యోగా వేడుకలు జరిగాయి.

### చైనా-భారత్ సైనికులు కలిసి ఆసనాలు

యోగా దినోత్సవం చైనా, భారత సైనికులను ఒక్క చోటుకు చేర్చింది. భారత్-చైనా తూర్పు సరిహద్దుల్లో సిక్కింలోని నాథులా, అరుణాచల్‌ప్రదేశ్‌లోని బుమ్లా, వాచా-దామైలో నిర్వహించిన యోగా కార్యక్రమంలో చైనా ఆర్మీ బృందాలు, పౌరులు ఉత్సాహంగా పాల్గొన్నారు. హిమాలయ పర్వత సానువుల్లో భారత సైనికులు యోగా చాపలు పరచుకొని విభిన్నమైన కసరత్తులు చేశారు.

### తేలియాడే వేదికపై సద్గురు జగ్గివాసుదేవ్..

భారత నేవీలోనీ అండమాన్, నికోబర్ కమాండ్‌కు చెందిన సిబ్బంది, వారి కుటుంబ సభ్యుల కోసం అండమాన్‌లోని తేలియాడే డాక్ వేదికగా ఈశా ఫౌండేషన్ వ్యవస్థాపకులు జగ్గివాసుదేవ్ యోగాసనాలు చేశారు.

### పాఠ్య ప్రణాళికలో యోగా చేర్చాలి: ఉపరాష్ట్రపతి

జీవనశైలిలో తీవ్ర మార్పులు చోటుచేసుకొని, సాంక్రమికేతర వ్యాధులు విస్తరిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ యోగా సాధన చేయాల్సిన అవసరం ఉందని ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు తెలిపారు. పాఠశాలల పాఠ్యప్రణాళికల్లో యోగా చేర్చాలని సూచించారు. దిల్లీలోని చారిత్రక ఎర్రకోటలో జరిగిన యోగా వేడుకల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆసనాలు వేశారు. యోగా దినోత్సవంలో పాల్గొన్న ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడిని ఉద్దేశించి 'సహజసిద్ధమైన ఉత్సాహానికి ఆయన నిదర్శనం" అని ప్రశంసిస్తూ ప్రధాని మోదీ ట్వీట్ చేశారు.


సంస్కృతీ భవన్‌లో యోగసాధన చేస్తున్న గవర్నర్ దంపతులు

## విద్యా సంస్థల్లో యోగా తరగతులు!

### రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడతా: గవర్నర్

పంజాగుట్ట, బన్సీలాల్‌పేట్, న్యూస్‌టుడే: పాఠశాలలు, కళాశాలలు సహా అన్ని విద్యా సంస్థలో యోగా తరగతులు నిర్వహించాల్సిన అవసరం ఉందని గవర్నర్ నరసింహన్ అభిప్రాయపడ్డారు. శుక్రవారం రాజ్‌భవన్ సమీపంలోని సంస్కృతీ భవన్‌లో నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవంలో గవర్నర్ పాల్గొన్నారు. రోజూ కొంత సమయం యోగాకు కేటాయిస్తే వైద్యుడి వద్దకు వెళ్లాల్సిన అవసరం ఉండదన్నారు. విద్యా సంస్థల్లో యోగా తరగతులు నిర్వహించే విషయమై ప్రభుత్వంతో మాట్లాడతానని వెల్లడించారు. కార్యక్రమానికి హాజరైన గవర్నర్ దంపతులు యోగ సాధన చేశారు. మాజీ డీజీపీ ఏకే.మహంతి పాల్గొన్నారు.


మణుగూరు ఓసీ-2లో జరిగిన యోగ సాధనలో సింగరేణి కార్మికులు

## 1.27 లక్షల మందితో సామూహిక యోగా

సింగరేణి సంస్థ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించింది. శుక్రవారం 11 ప్రాంతాల్లోని గనులు, శాఖలు, క్రీడా మైదానాల్లో జరిగిన కార్యక్రమాల్లో 1,27,437 మంది యోగ సాధకులను భాగస్వాములను చేసింది. 2016లో 60 వేల మందితో నిర్వహించి లిమ్కాబుక్ ఆఫ్ వరల్డ్ రికార్డును నమోదు చేసిన సంస్థ, గతేడు 1.26 లక్షల మంది ఆ క్రతువులో పాల్గొనేలా కృషి చేసింది. ఈ దఫా గత రికార్డును అధిగమించామని, ఇందులో సంస్థ కార్మికులు, ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారని నిర్వాహకులు వెల్లడించారు.

– న్యూస్‌టుడే, కొత్తగూడెం(సింగరేణి)


యోగ సాధనలో భాజపా నేతలు రామచందర్‌రావు, మురళీధర్‌రావు, లక్ష్మణ్, ఇంద్రసేనారెడ్డి, చింతల రామచంద్రారెడ్డి తదితరులు

## యోగా జీవన విధానం కావాలి

బన్సీలాల్‌పేట్, న్యూస్‌టుడే: యోగా దిన చర్యలో భాగం కావాలని, జీవన విధానంగా మారాలని పలువురు ప్రముఖులు సూచించారు. శుక్రవారం నెక్లెస్‌రోడ్డు సంజీవయ్య పార్కులో జైభారత్ ఫౌండేషన్, తెలంగాణ యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. భాజపా జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్, ఎమ్మెల్సీ రామచందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తదితరులు హాజరయ్యారు. లక్ష్మణ్ మాట్లాడుతూ.ప్రధాని మోదీ చొరవతో కుల,మతాలు, ప్రాంతాలకతీతంగా ప్రపంచ వ్యాప్తంగా జూన్ 21న తేదీని యోగా దినోత్సవంగా పాటిస్తున్నారన్నారు.

# ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఈడబ్ల్యూఎస్ కోటా

- 10 శాతం రిజర్వేషన్లకు ఉత్తర్వులు
- సీట్ల పెంపులో లెక్క పాటించని ఎంసీఐ
- గాంధీ, కాకతీయ మినహా మిగతాచోట్ల 25 శాతం కన్నా తక్కువ కేటాయింపు
- ఈఎస్ఐ, నల్గొండ, సూర్యాపేట కళాశాలలకు నిరాకరణ

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్, బీడీఎస్ వైద్య విద్య ప్రవేశాల్లో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు (ఈడబ్ల్యూఎస్) 10 శాతం రిజర్వేషన్ కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు తెలంగాణ మెడికల్, దంత వైద్య కళాశాలల ప్రవేశాల నిబంధనల్ని సవరిస్తూ శుక్రవారం వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎ.శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. 2019 నుంచి రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్య, దంత వైద్య కళాశాలల్లో 10 శాతం రిజర్వేషన్ లభిస్తుంది. వైద్య కళాశాలల్లో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు అమలు చేసేందుకు వీలుగా నిబంధనలు సవరించాలంటూ కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రభుత్వానికి లేఖ రాశారు. 10 శాతం రిజర్వేషన్ అమలుకు అంగీకరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ప్రభుత్వ కళాశాలల్లో ఈడబ్ల్యూఎస్ కోటా కింద ప్రత్యేకంగా మంజూరు చేసిన సీట్లలో రిజర్వేషన్ వర్తిస్తుందని పేర్కొంది. రిజర్వేషన్ పొందాలంటే ముందుగా అభ్యర్థులు రాష్ట్రప్రభుత్వం నుంచి ఈడబ్ల్యూఎస్ ధ్రువీకరణ పత్రం తీసుకోవాలి. ఈ పత్రాన్ని అధికారులు పరిశీలించి అనుమతిస్తేనే రిజర్వేషన్ వర్తిస్తుంది.

### ఈడబ్ల్యూఎస్ కోటాలో 190 సీట్లు

ఆర్థికంగా వెనుకబడిన వర్గాల కోటా కింద సీట్ల పెంపునకు ప్రభుత్వం 8 కళాశాలల్ని భారతీయ వైద్యమండలి (ఎంసీఐ)కి పంపింది. ఉస్మానియా వైద్యకళాశాలలో ఇప్పటికే 250 సీట్లు ఉన్నందున.. ఎంసీఐ నిబంధనల ప్రకారం ఈడబ్ల్యూఎస్ కోటాకు సీట్లు పెంచేందుకు అవకాశం లేదు. దీంతో ఈ కళాశాల మినహా మిగతా వాటిని పంపిస్తే కొత్తగా ఏర్పాటు చేయనున్న నల్గొండ, సూర్యాపేట కళాశాలలకు ఈడబ్ల్యూఎస్ కోటా కింద సీట్లు పెంపునకు అనుమతి నిరాకరించింది. మిగతా ఆరు కళాశాలల్లో 10 శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు 25 శాతం చొప్పున అదనంగా సీట్లు మంజూరు చేయాల్సి ఉంది. ఎంసీఐ ఆ మేరకు సీట్లు ఇవ్వలేదు. ఉదాహరణకు మహబూబ్‌నగర్ వైద్య కళాశాలను తీసుకుంటే అక్కడ 150 సీట్లు ఉన్నాయి. 25 శాతం చొప్పున పెంచితే 37 నుంచి 38 సీట్లు లభించాలి. కేవలం 25 సీట్లతో సరిపెట్టింది. నిజామాబాద్, సిద్దిపేట, ఆదిలాబాద్ కళాశాలలదీ ఇదే పరిస్థితి. హైదరాబాద్ ఈఎస్ఐ కళాశాలలో ఈడబ్ల్యూఎస్ కోటా కింద అదనపు సీట్లు ఇవ్వలేదు. ప్రభుత్వ అంచనాల మేరకు దాదాపు 300 సీట్లు వస్తాయని భావిస్తే 190 సీట్లు లభించాయి. దీనిపై తెలంగాణ వైద్యశాఖ అత్యవసరంగా సమావేశమైంది. నల్గొండ, సూర్యాపేట కళాశాలల్లోనూ సీట్లు పెంచాలని, నిబంధనల ప్రకారం 25 శాతం ఇవ్వాలని కేంద్రానికి, ఎంసీఐకి లేఖ రాయాలని నిర్ణయించింది.

**కళాశాలల వారీగా పెరిగిన సీట్లు**

| కళాశాల | ప్రస్తుతం | పెంచినవి | మొత్తం సీట్లు |
|---|---|---|---|
| గాంధీ వైద్య కళాశాల | 200 | 50 | 250 |
| ప్రభుత్వ వైద్య కళాశాల మహబూబ్‌నగర్ | 150 | 25 | 175 |
| ప్రభుత్వ వైద్య కళాశాల నిజామాబాద్ | 100 | 20 | 120 |
| ప్రభుత్వ వైద్య కళాశాల సిద్దిపేట | 150 | 25 | 175 |
| కాకతీయ వైద్య కళాశాల వరంగల్ | 200 | 50 | 250 |
| రిమ్స్, ఆదిలాబాద్ | 100 | 20 | 120 |

### 250 సీట్ల జాబితాలో గాంధీ, కాకతీయ కళాశాలలు

రాష్ట్రంలో 250 సీట్లున్న కళాశాలల జాబితాలో గాంధీ, కాకతీయ వైద్యకళాశాలలు చేరాయి. ఇప్పటి వరకు ఉస్మానియాలో మాత్రమే 250 సీట్లు ఉండేవి. గాంధీ, కాకతీయలో 200 చొప్పున సీట్లు ఉంటే... తాజాగా పెరిగిన సీట్లతో 250 సీట్లున్న కళాశాలల జాబితాలో గాంధీ, కాకతీయ వైద్యకళాశాలలు చేరాయి.


శుక్రవారం దిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగిన కార్యక్రమంలో 'సిరి ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం' హిందీ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యానాయుడు. చిత్రంలో డాక్టర్ ఖాదర్‌వలి, రైతునేస్తం ఫౌండేషన్ ఛైర్మన్ యడ్లపల్లి వేంకటేశ్వరరావు

## 1 నుంచి గ్రూప్-2 మౌఖిక పరీక్షలు

- 1:2 నిష్పత్తిలో జాబితా.. 2064 మందికి చోటు
- షెడ్యూల్ ప్రకటించిన టీఎస్‌పీఎస్సీ

ఈనాడు, హైదరాబాద్: గ్రూప్-2 మౌఖిక పరీక్షల షెడ్యూల్‌ను టీఎస్‌పీఎస్సీ ప్రకటించింది. జులై 1 నుంచి పరీక్షలు నిర్వహించనున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు ఇంటర్వ్యూలకు 1:2 నిష్పత్తిలో ప్రాథమికంగా ఎంపికైన అభ్యర్థుల జాబితా, ఇంటర్వ్యూ ప్రణాళికను వెబ్‌సైట్లో పొందుపరిచింది. ఈ జాబితాలో 2064 మందికి చోటు దక్కింది. ఇంటర్వ్యూలకు అభ్యర్థులను జంబ్లింగ్ పద్ధతిలో, విడతల వారీగా ఎంపిక చేస్తామని కమిషన్ తెలిపింది. ఇంటర్వ్యూ షెడ్యూలు కోసం అభ్యర్థులు తమ వెబ్‌సైట్‌ను సందర్శించాలని పేర్కొంది. ప్రతివారం ఉదయం, మధ్యాహ్నం కలిపి సగటున 288 మందికి పరీక్షలు జరుగుతాయి. వారంలో ఆరురోజుల పాటు రోజుకి 48 మంది చొప్పున అభ్యర్థులను పిలుస్తారు. ఇంటర్వ్యూలకు హాజరు కావాల్సిన అభ్యర్థుల వివరాలను వారం ముందుగా కమిషన్ ప్రకటించనుంది. గ్రూప్-2 కింద 1032 పోస్టులకు టీఎస్‌పీఎస్సీ ప్రకటన వెలువరించి, 2016లో రాతపరీక్షలు నిర్వహించింది. ఆరునెలల్లోనే రాతపరీక్ష ఫలితాలను వెలువరించినప్పటికీ...జవాబు పత్రాల దిద్దుబాటుపై న్యాయ వివాదాలు తలెత్తాయి. ఇటీవల అవి తొలగిపోయాయి.

## ఆన్‌లైన్ ప్రవేశాలకు సీజీజీ వెనుకడుగు

- సంప్రదింపులు జరుపుతున్న విద్యాశాఖ
- అంగీకరించకుంటే గ్లోబరీనాకే బాధ్యత

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని జూనియర్ కళాశాలల్లో ఈ విద్యా సంవత్సరం ఇంటర్ ప్రవేశాల నమోదును ఆన్‌లైన్ చేసే ప్రక్రియపై సీజీజీ చేతులెత్తేసింది. తమ వద్ద తగినంత మంది సిబ్బంది లేరని ఆ సంస్థ ఇంటర్‌బోర్డుకు తేల్చిచెప్పింది. అయితే సీజీజీని ఒప్పించేందుకు ప్రభుత్వ స్థాయిలో ప్రయత్నాలు సాగుతున్నాయి. విద్యాశాఖ కార్యదర్శి సైతం రంగంలోకి దిగినట్లు తెలిసింది. అయినా ఆ సంస్థ అంగీకరించకుంటే ఆ బాధ్యతను గ్లోబరీనా టెక్నాలజీస్‌కు అప్పగించే అవకాశం కనిపిస్తోంది. కళాశాలల్లో ప్రవేశాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియను గతేడాది వరకు సీజీజీ చేపట్టింది. పోయిన ఏడాదే గ్లోబరీనాకు ఇవ్వాలని ఇంటర్‌బోర్డు నిర్ణయించినా.. సమస్యలు తలెత్తే అవకాశం ఉందని చివరి నిమిషంలో మళ్లీ సీజీజీ ద్వారానే చేశారు. ఆ తర్వాత రుసుముల స్వీకరణ, హాల్‌టికెట్ల జారీ, ఫలితాల ప్రక్రియలను మాత్రం గ్లోబరీనా చేపట్టింది. తాజాగా సీజీజీ వెనుకడుగు వేయడంతో ఉన్నతాధికారులతో మాట్లాడి ఒప్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. దీనిపై రెండు మూడు రోజుల్లో స్పష్టత రానుంది. ఈ విషయంపై ఇంటర్‌బోర్డు కార్యదర్శి అశోక్‌ను ఫోన్‌లో వివరణ కోరేందుకు యత్నించగా.. ఆయన స్పందించలేదు. గ్లోబరీనా సీఈఓ రాజును సంప్రదించగా.. తమకు ఇప్పటివరకు ఇవ్వలేదన్నారు.

## ఎక్కడి విద్యార్థులు అక్కడే

### బీటెక్ ఫుడ్ టెక్నాలజీలో చేరేవారికి ఊరట

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ ఎంసెట్ ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ ద్వారా..బీటెక్ ఫుడ్ టెక్నాలజీ కోర్సులో చేరే ఇంటర్ ఎంపీసీ విద్యార్థులకు ఈసారి ఊరట లభించింది. ఈ విద్యాసంవత్సరం నుంచి ఏ రాష్ట్ర విద్యార్థులు ఆ రాష్ట్రంలోని కళాశాలల్లోనే చదువుకోవచ్చు. దీనికి ఎంసెట్ ప్రవేశాల కమిటీ సైతం ఆమోదం తెలిపింది. ఉమ్మడి రాష్ట్రంలో వ్యవసాయ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఏపీలోని బాపట్ల, పులివెందుల, తెలంగాణకు చెందిన సంగారెడ్డి, నిజామాబాద్ జిల్లా రుద్రూరులలో వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాలలున్నాయి. వాటిల్లో బీటెక్ ఫుడ్ టెక్నాలజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. అవి రాష్ట్ర విద్యాసంస్థలుగా ఉండటంతో, విభజన నేపథ్యంలో ఇరు రాష్ట్రాలవారు సీట్లను పంచుకోవాల్సి వచ్చింది. బాపట్లలో 13, పులివెందులలో 9 సీట్లను తెలంగాణవారికి కేటాయించారు. వీటిని రాష్ట్ర ఎంసెట్ కౌన్సెలింగ్ ద్వారా భర్తీచేసేవారు. అదేవిధంగా సంగారెడ్డి, రుద్రూరులలో 22 సీట్లను ఏపీకి ఉద్దేశించారు. వాటిని ఏపీ ఎంసెట్ ద్వారా ఆ రాష్ట్ర విద్యార్థులకు కేటాయిస్తున్నారు. ఇబ్బందులు ఎదురవడంతో గుంటూరులోని ఎన్జీ రంగా వర్సిటీ, హైదరాబాద్‌లో ఉన్న జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరస్పరం చర్చించుకుని; ఏ రాష్ట్రంలోని సీట్లను ఆ రాష్ట్ర విద్యార్థులతోనే భర్తీచేయాలన్న నిర్ణయానికి వచ్చాయి. అదే సమాచారాన్ని ఎంసెట్ ప్రవేశాల కమిటీలకు అందించాయి. దీంతో ఎక్కడి విద్యార్థులు అక్కడే ప్రవేశాలు పొందనున్నారని సాంకేతిక విద్యాశాఖ అధికారులు 'ఈనాడు'కు వెల్లడించారు.

## వైద్యవిద్య ప్రవేశాలకు ప్రకటన విడుదల

### నేటి నుంచి 28 వరకు రిజిస్ట్రేషన్

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం శుక్రవారం ప్రవేశప్రకటన విడుదల చేసింది. శనివారం(ఈ నెల 22వ తేదీ) ఉదయం 8 గంటల నుంచి 28వ తేదీ సాయంత్రం 4 గంటలవరకు https://tsmedadm.tsche.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. ఆగస్టు 1 నుంచి తరగతులు ప్రారంభించేలా కార్యాచరణ రూపొందించింది. ప్రవేశాల కోసం రిజిస్ట్రేషన్ సమయంలో జనరల్, బీసీ అభ్యర్థులు రూ.3500, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.2900 చొప్పున రుసుంను ఆన్‌లైన్లో చెల్లించాలని తెలిపింది. రిజిస్ట్రేషన్ కోసం ఇంటర్నెట్ ఎక్స్‌ప్లోరర్ 11 వర్షన్ వినియోగించాల్సి ఉంటుంది. దరఖాస్తు గడువు ముగిసిన రోజు (28వ తేదీ రాత్రి)నే ప్రాథమిక మెరిట్ జాబితాను ప్రకటిస్తామని వెల్లడించింది. ధ్రువీకరణ పత్రాల పరిశీలన 29 నుంచి మొదలు పెట్టనుంది. అయితే అఖిల భారత కోటా కింద తొలివిడత ప్రవేశాల గడువు జులై 3వ తేదీగా ఉంది. ఆ లోగా విద్యార్థులకు తెలంగాణ కళాశాలల్లో ప్రవేశాలకు ధ్రువీకరణ పత్రాల పరిశీలన ముగియాల్సి ఉంది. లేకుంటే ఇక్కడి కోటా కింద సీట్లు పొందేందుకు ఇబ్బందులు ఎదురవుతాయి. ఈ నేపథ్యంలో అఖిల భారత కోటా కింద ప్రవేశాలు పొందిన విద్యార్థులకు ప్రత్యేకంగా ఈ నెల 29, 30 తేదీల్లో ధ్రువీకరణ పత్రాల పరిశీలన నిర్వహించాలని యూనివర్సిటీ భావిస్తోంది. ఆ తరువాత మిగతా అభ్యర్థులకు పరిశీలన పూర్తిచేయనుంది. ఇది పూర్తయిన తరువాత తెలంగాణ కోటా కింద తుది మెరిట్ జాబితాను యూనివర్సిటీ ప్రకటిస్తుంది. జాబితా ప్రకారం కౌన్సెలింగ్ నిర్వహించి ప్రవేశాలు పూర్తి చేస్తుంది. రిజిస్ట్రేషన్ దరఖాస్తు సమయంలో సమస్యలు ఎదురైతే 9502001583, 8466924522 నంబర్లలో, నిబంధనలకు సంబంధించిన సమస్యలుంటే ఉదయం 10-6 గంటల మధ్య 9490585796, 8500646769 నంబర్లలో సంప్రదించాలని యూనివర్సిటీ తెలిపింది.

# త్వరపడితేనే కోరుకున్న ఎంసెట్ స్లాట్

- గంటకొక స్లాట్‌గా గుర్తింపు
- ప్రతి దాంట్లో 30 నుంచి 70 మంది ధ్రువపత్రాల పరిశీలన
- రాష్ట్రంలో 35 సహాయ కేంద్రాలు

ఈనాడు, హైదరాబాద్: ఎంసెట్ ధ్రువపత్రాల పరిశీలనకు స్లాట్ బుకింగ్ విధానం ఉంది కదాని తీరిగ్గా బుక్ చేసుకోవాలనుకుంటే మీరు కోరుకున్న రోజు, వీలున్న సమయంలో అవకాశముండదు. ఒక స్లాట్‌లో కేవలం 30 నుంచి గరిష్ఠంగా 70 మందికే ధ్రువపత్రాల పరిశీలన జరుగుతున్న నేపథ్యంలో ముందుగా రిజిస్టర్ చేసుకుంటేనే కోరుకున్న సమయానికి వెళ్లి కౌన్సెలింగ్ ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చని ఎంసెట్ ప్రవేశాల అధికారులు స్పష్టం చేస్తున్నారు. రాష్ట్రంలో ఈ నెల 24వ తేదీ నుంచి ఎంసెట్ కౌన్సెలింగ్ ప్రారంభం అవుతున్న నేపథ్యంలో తొలిసారిగా ఎంసెట్‌లో ధ్రువపత్రాల పరిశీలనకు స్లాట్ బుకింగ్ విధానాన్ని అమలు చేస్తున్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కౌన్సెలింగ్ జరుపుతారు. రోజును ఎనిమిది స్లాట్‌లుగా విభజించారు. ప్రతి గంట ఒక స్లాట్‌గా గుర్తిస్తారు. ఆ స్లాట్‌లో ఆ సహాయ కేంద్రంలో పనిచేసే సిబ్బంది సంఖ్యను బట్టి 30 నుంచి 70 మంది ధ్రువపత్రాల పరిశీలన మాత్రమే చేస్తారు. విద్యార్థులు మొదట తేదీ, అనంతరం సమయం(స్లాట్) ఎంచుకోవాలి. ఆ రోజు, ఆ స్లాట్‌లో ధ్రువపత్రాల పరిశీలనకు అవకాశం ఉంటే ఆకుపచ్చ రంగు కనిపిస్తుంది. రాష్ట్ర వ్యాప్తంగా ధ్రువపత్రాల పరిశీలనకు 35 సహాయ కేంద్రాలు(హెల్ప్ లైన్) ఏర్పాటు చేస్తున్నారు.

### స్థానిక, స్థానికేతర కోసమే...

ధ్రువపత్రాల పరిశీలనకు ముందే ప్రాథమిక సమాచారాన్ని వెబ్‌సైట్ ద్వారా భర్తీచేయాలి. ఆ సందర్భంగా రిజర్వేషన్ ఉంటే కుల ధ్రువీకరణ పత్రం సంఖ్యను, బోధనా రుసుములకు అర్హులైతే ఆదాయ ధ్రువపత్రం సంఖ్యను నమోదు చేయాలి. ఇక ధ్రువపత్రాల పరిశీలనలో స్థానికులా?...స్థానికేతురులా? అన్నది గుర్తించేందుకు 7సంవత్సరాల విద్య ఎక్కడ చదివారో(స్టడీ సర్టిఫికెట్/బోనఫైడ్ సర్టిఫికెట్)పరిశీలిస్తారు. 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు...7 సంవత్సరాల్లో తెలంగాణలో నాలుగేళ్లు చదివితే స్థానిక కోటా కింద సీట్లు పొందేందుకు అర్హులవుతారు.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Private Limited, and printed at Eenadu Press, Alugunoor, Karimnagar - 505 527, Telangana. Cell: 99590 21802, 99590 21803 RNI No. 52793/92, Regd. No. G/RN/KAR/48/2018-20 Eenadu, Karimnagar. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10.00

Eenadu epaper